S.V. UNIVERSITY ORIENTAL SERIES — No. 9

సాధారణ సంపాదకులు : డాక్టర్ ఎస్. శంకరనారాయణన్

శ్రీ

తిరుప్పాణాళ్వార్లు

హరిజన వైష్ణవభక్తుడు రచించిన

అమలనాదిపిరాన్‌కు

శ్రీ వేదాంతదేశికులు రచించిన

మునివాహనభోగము నకు

తెలుగు అనువాదం

ఉపోద్ఘాతం

ప్రొఫెసర్ ఎమ్. శాంతప్ప
ఉపకులపతి, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం

ఆరంభవాక్యాలు

ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి

అనువాదం

ఎ. వి. శ్రీనివాసాచార్యులు

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధనాలయం

తిరుపతి

S.V. UNIVERSITY ORIENTAL SERIES — No. 9

సాధారణ సంపాదకులు : డాక్టర్ ఎస్. శంకరనారాయణన్

శ్రీ

తిరుప్పాణాళ్వార్లు

హరిజన వైష్ణవభక్తుడు రచించిన

అమలనాదిపిరాన్‌కు

శ్రీ వేదాంతదేశికులు రచించిన

మునివాహనభోగము నకు

తెలుగు అనువాదం

ఉపోద్ఘాతం

ప్రొఫెసర్ ఎమ్. శాంతప్ప

ఉపకులపతి, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం

ఆరంభవాక్యాలు

ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి

అనువాదం

ఎ. వి. శ్రీనివాసాచార్యులు

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధనాలయం

తిరుపతి

S.V. UNIVERSITY ORIENTAL SERIES — No. 9

General Editor : Dr. S. SANKARANARAYANAN

AMALANĀDIPIRĀN HYMN

BY

SRI

TIRUPPANĀLVĀR

(HARIJAN VAIṢṆAVA SAINT)

With Commentary

MUNIVĀHANA BHOGAM

BY

SRI VEDANTADESIKA

A TELUGU TRANSLATION

With

INTRODUCTION

BY

Prof. M. SANTAPPA

Vice-Chancellor, S.V. University

ĀRAMBHAVĀKYĀLU

BY

Prof. KOTTA SATCHIDANANDA MURTY

TRANSLATOR

A. V. SRINIVASACHARYULU

SRI VENKATESWARA UNIVERSITY

ORIENTAL RESEARCH INSTITUTE, TIRUPATI

Copies : 500

Printed at :

S.V.U. PRESS, TIRUPATI

PREFACE

I am happy to place before the scholars of Andhra Pradesh the first Telugu translation of the Tamil Hymn of Tiruppāṇāḻvār along with Śrī Vēdānta Dēśika's commentary thereon. Regarding the Āḻvār the Śrivaiṣṇava tradition tells us this :

Tiruppāṇāḻvār was born in an ancient Pāṇa community of singers in the city Uṟaiyūru near Śrīraṅgam Tiruchirapalli Dist. Tamilnadu). The then prevailing social custom did not permit the Pāṇa community to enjoy the privilege of setting foot in Śrīraṅgam, the city of God. Hence, Tiruppāṇāḻvār was daily singing the glory of the Lord Śrīranganātha from the southern bank of the Kāveri. His devotion to the Lord was so vast so deep, and so sincere as to move the Lord Śrīraṅganātha Himself. Therefore, the Lord ordered, His temple priest, a sage - the tradition gives this sage a name Lokasārangamuni – to carry on his own shoulders Tiruppāṇāḻvār from the Kāveri river to the sanctum sanctorum of the Śrīraṅgam temple. The temple priest obeyed the Lord's order fully. On reaching the sanctum of the temple the Āḻvār observed the Lord, got enchanted with His physical beauty, experienced a spiritual ecstasy and poured out ten devotion saturated verses describing vividly the beauty of the Lord of Śrīraṅgam *(Araṅgattu Ammān)* from His feet to head. When he finished his last verse the Āḻvār became absorbed at the very feet of the Lord Himself.

The Āḻvār's real personal name is not known. Because he belonged to the Pāṇa community he is known as the Tiruppāṇ-Āḻvār. Because a sage *(muni)* carried him on his own shoulders, this Āḻvār is known as Munivāhana.

Śrī Rāmānujācharya's direct desciple Tiruvaraṅgattu Amudanār was first to give a list of twelve Vaishṇava saints who bear the title Āḻvār. His work *Rāmānuja nūṟṟantādi* (*c.* 1125 A D.) claims the approval of Śrī Rāmānuja himself. According to this work Tiruppāṇāḻvār is the fourth in the order of the Vaiṣṇava saints and he follows the First three Āḻvārs, the ***Mudalāḻvārs*** viz., Poygai, Pūtam and Pey Āḻvārs. A latest resercher

on the chronology of the Āḻvārs assigns Tiruppāṇāḻvār to *c* 600 A D, and attributes the Āḻvārs colloquialism to the Pāṇa community to which the Āḻvār belonged.

If the above date for the Āḻvār and the above mentioned tradition are correct then Tiruppāṇāḻvār may be viewed to be the first famous Vaiṣṇava saints to hail from the Coḻa country and in his Āḻvār's Hymn we perhaps have the earliest specimen, or one of the earliest specimens of that form of the Indian devotional literature which goes by the name *Pādādikeśānta-varṇana-stotra* "Hymn describing the beauty of the Lord from feet to head." This beautiful hymn of the Āḻvār had attracted some exhaustive commentaries. Among them the one by Śrī Vedānta Dēśika (1268-1369 A D.), the *Kavitārkikasimha*, "the lion among the poets and logicians", is considered to be highly scholarly.

But both this unique hymn of Tiruppāṇāḻvār and its scholarly commentary by Vedānta-Deśika had remained all these years closed books to the common people of Andhra Pradesh. With the view to help the men of Andhra Pradesh in understanding and appreciating both these works the Sri Venkateswara University Oriental Research Institute, on the advice of the Vice-Chancellor of the Sri Venkateswara University chalked out a programme of translating these works into Telugu and to publish them. This job has been entrusted to the Telugu scholar Sri A.V. Srinivasacharyulu, the senior most Research Assistant of the Institute. I am happy to note that he has successfully completed the job with a sense of dedication. My hearty congratulations to him.

Prof. K. Satchidananda Murthy, the former Vice-Chancellor of the S. V. University, at whose instance the present project has been undertaken, has written a scholarly introduction to this book. For this favour I am beholden to him. I thank from my heart Prof. M. Santappa, the present dynamic Vice-Chancellor of the S.V. University for sanctioning the necessary fund for printing this work, and for adorning this book with his introduction. My thanks are also due to the authorities and the staff of the S V.U. Press for neatly printing this book

S. SANKARANARAYANAN
24-8-1979.

ఉపోద్ఘాతము

ప్రొఫెసర్ ఎమ్. శాంతప్ప
ఉపకులపతి
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయము
తిరుపతి

నేను ఉపకులపతిగా చేరిన తర్వాత నా అధీనంలోని అన్నిసంస్థలను తనిఖీ చేస్తూ వచ్చాను. ఒకరోజు ఈ ప్రాచ్యపరిశోధనాలయానికి వచ్చినాను. పరిశీలించినాను. విశ్వవిద్యాలయంలోని అన్నిసంస్థలు ఒకఎత్తు. ఈ ప్రాచ్యపరిశోధనాలయం ఒకఎత్తు. దేశంలో విద్యను బోధించేకళాశాలలు ఎన్నోవేలున్నాయి. కాని ఇటువంటి ప్రాచ్యపరిశోధనాలయాలు వ్రేళ్లమీద లెక్కింపతగినన్నే ఉన్నాయి. ఇందులో పరిశ్రమించి పనిచేయడంకూడా అంతతేలికైన పనికాదు. దీనిగొప్పతనం అటువంటిది. ఇది మన ప్రాచీనభారతీయసంస్కృతికి సంబంధించిన, సాహిత్యానికి సంబంధించిన గ్రంథాలను పరిశోధించి ప్రకటించే సంస్థకావడమే దీనికున్నవిశేషం.

ఇందులో పనిచేసిన మహాపురుషులు శ్రీమాన్ డా॥ కె. వి. రంగస్వామి అయ్యంగార్ జగత్ప్రసిద్ధ చరిత్రవేత్త, శ్రీమాన్ ఎమ్. కృష్ణమాచార్యులు సంస్కృతసాహిత్యసమీక్ష రచించి భారతదేశానికి కీర్తి తెచ్చినవారు. శ్రీమాన్ పి.వి. రామానుజస్వామి ఈయన అష్టవిధప్రాకృతాలు కరతలామలకంగా నేర్చిన ప్రాకృతఖని. శ్రీ ఎ. అయ్యాస్వామిశాస్త్రి చైనాభాషలోని త్రిపిటకాలను పుకిసి పుచ్చుకొన్నవారు, శ్రీ మానవల్లి రామకృష్ణకవి (ఎమ్.ఆర్.కవి) ప్రపంచ ప్రసిద్ధ సంగీత నాట్య సంస్కృతసారస్వతవేత్త, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి చరిత్రనూ ఆంధ్రసారస్వతాన్ని తుదముట్ట పరిశీలించి తెలుగుమరుగులు ప్రకటించి నూతన సిద్ధాంతముల వెలయించినవారు, శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ సంగీతసాహిత్యాలను ఆపాతమధురంగా అభ్యసించి లోకానికి అందించిన మహామనీషి. శ్రీమాన్ రొంపిచెర్ల పార్థసారథి భట్టాచార్యులు శైవవైష్ణవాగమాలను ఆమూలాగ్రంగా అభ్యసించి, అందరికి అందించిన ఆగమనిధి, శ్రీ టి. పి. పళనియప్పపిళ్లై. వీరిని తెలియని తమిళులు లేరు, ప్రసిద్ధ తమిళపండితులు, శ్రీ ఎన్. సుబ్రహ్మణ్యశాస్త్రి — అన్నిభారతీయభాషలను, ఫ్రెంచి, జర్మనీభాషలను

నేర్చిన బహుభాషావేత్త, శ్రీ రవీంద్రనాథటాగూరుగారిచే ప్రస్తుతింపబడినవారు. శ్రీమాన్ డి. టి. తాతాచార్య, శ్రీమాన్ కె. సి. వరదాచార్య – వేదాంతానికి వీరు పెట్టింది భిక్ష. శ్రీపార్థసారథి భట్టాచార్యులు, శ్రీ తాతాచార్యులు "భారతదేశ రాష్ట్రపతి బహుమతి గ్రహించినవారు". దిగ్దంతులవంటి ఇట్టి ప్రసిద్ధపండితులతో వెలుగొందినసంస్థ ఇది. వీళ్లంతా వెళ్లినారు.

దీనివైభవం తగ్గిందని నాముందున్న ఉపాధ్యక్షులు ఈసంస్థను ఆ మహోన్నతస్థితికి తీసుకొని రావాలని ప్రయత్నించి, కొంతవరకు కృతకృత్యులైనారు. పూర్తిగా కాలేక పోయినారు. పూర్వస్థితికి తీసుకొనివస్తే మన దేశంలోనేకాక ఇతరదేశాలలోకూడా ఈసంస్థకు ముందున్న కీర్తిప్రతిష్ఠలు రాగలవనే నమ్మకం నాకు కలిగింది. అందుకని దీని రూపురేఖలు తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నాను. తప్పక పూర్వస్థితికి తీసుకొని రాగలమనే నమ్మకంఉందినాకు.

నాకుతోచిన కొన్నిసూచనలు సూచిస్తున్నాను. ఈ విధంగా ఈసంస్థ పరిశోధన సాగిస్తే దీనికీర్తిప్రతిష్ఠలు చిరకాలం నిలుస్తాయి,

1. ఈప్రాచ్యపరిశోధనాసంస్థలో కొన్నివేల తాళపత్రగ్రంథాలున్నాయి. ఉన్నగ్రంథాల్లో ఒకదాన్నితీసి, సాఫుప్రతివ్రాసి ప్రకటించడం పరిశోధన కాదు, పరిశోధనాసంస్థ చేయవలసిన పనికాదది. ఒకకవి రచించినగ్రంథాన్ని ప్రకటింపదలచినప్పుడు ఆ కవికిగాని. ఆ గ్రంథానికిగాని లోకంలోఉన్న స్థానం ఏమిః అది ఎంత వరకు లోకానికి ఉపయోగిస్తుంది? అది ప్రకటించడంచేత లోకానికి తెలిసే క్రొత్తవిషయా లేవి? అనే అంశాలను పరిశీలించి ఆ తర్వాత ఆ గ్రంథాన్ని పరిష్కరణకు తీసుకోవడం మొదటిది.

2. ప్రాచీనతాళపత్రగ్రంథాలలో ఎన్నింటిలోనో రసాయనికశాస్త్రాన్ని గూర్చి, భూగర్భశాస్త్రాన్నిగూర్చి, ఆర్థికశాస్త్రాన్నిగూర్చి ఇంకా ఎన్నో ఇతర విషయాలనుగూర్చి చెప్పబడిఉంది, ఆ విషయాలన్నీ ఆయాగ్రంథాలలో ఆనాటి పరిస్థితులను అనుసరించి వ్రాసిఉండవచ్చు. ఈనాడు మనకు పరీక్షించడానికి అవసరమైన ఎన్నోరకాల ప్రయోగశాలలు (లేబరేటరీలు) ఉన్నాయి. ప్రాచీన గ్రంథాలలోని విషయాలను స్వీకరించి, ప్రయోగశాలలో ఆయావిషయాలను పరీక్షించి, అందులోని సత్యాసత్యాలను నిర్ణయించి, లోకానికి తెలుపడం రెండవది.

3. ఒక శతాబ్దంలో రచించిన గ్రంథాలను ఎంపికచేసుకొని, ఆగ్రంథాలలో పేర్కొన్న ఆనాటి రాజకీయ. ఆర్థిక, సాంఘికపరిస్థితులను వివరిస్తూ, అందులో ఆనాటికవులు ప్రతిఫలింపజేసిన క్రొత్తవిషయాలు వివరిస్తూ గ్రంథాలు రచిస్తే దేశానికి ఉపయోగకరంగా ఉంటుంది, ఇట్లా అన్నిశతాబ్దాలకూ సంబంధించి ప్రకటించడం శ్రేష్ఠం. ఇది మూడవది.

4. కవులచరిత్రలూ, జీవితచరిత్రలూ, రాజులచరిత్రలూ, సంస్థానాల చరిత్రలూ, నాడులచరిత్రలూ, క్రొత్త క్రొత్తవి సేకరించి, పరిశోధించి, అనవసరమైన చర్చలేకుండా ప్రకటిస్తే దేశానికి ఉపకారకంగా ఉంటుంది. ఇది నాల్గవది.

ఇటువంటి పద్ధతులను అనుసరించి, ఈ ప్రాచ్యపరిశోధనాలయంవారు గ్రంథాలు పరిష్కరించి, ప్రకటిస్తే దేశానికి ఎంతో మేలు కలుగుతుంది. లేకపోతే "డబ్బున్నది కాబట్టి ఏదో గ్రంథం అచ్చువేసినాము" అని అనిపించుకొన్నట్లవుతుంది.

శ్రీ తిరుప్పాణాళ్వార్ల గ్రంథానికి ఉపోద్ఘాతం వ్రాయమని శ్రీమాన్ శ్రీనివాసాచార్యులు నన్ను కోరినారు. నాకు — ఈసంస్థమీదఉన్న ఆదరంతో నేనీ విషయాలువ్రాస్తున్నాను.

ఈ గ్రంథంలో ఇద్దరు మహాపురుషుల చరిత్రలున్నాయి. అందులో మొదటిది శ్రీ తిరుప్పాణాళ్వార్లది. తిరుప్పాణాళ్వార్లు హరిజనకుటుంబంలో పుట్టినవాడు. అయినా ఈయన ఎవరివద్దా విద్యనభ్యసించలేదు. గొప్పవాడనిపించుకొన్నాడు. ఈ గొప్పతనమంతా శ్రీరంగనాథుని కృపాకటాక్షంవల్లనే కలిగిందన్నాడు.

ఇక రెండవది — పరమవైదికశిఖామణి — వైష్ణవాగ్రేసరుడు — సర్వతంత్రస్వతంత్రబిరుదాంకితుడు — కవితార్కికకేసరి అయిన శ్రీ వేదాంతదేశికులది. హరిజనుడైన తిరుప్పాణాళ్వార్ల పదిపాశురాలకు "మునివాహనభోగ" మనే విపులమైన వ్యాఖ్యను రచించినా డీయన. ఇంకా "మనవాడైన శ్రీ తిరుప్పాణాళ్వార్ల శ్రీపాదాలను ఆశ్రయిస్తాను. ఇతని రచనలన్నీ ప్రాచీనవేదరహస్యాలు" అన్నాడు ఈ వేదాంతదేశికులు. ఎందుకన్నాడు? రచించింది పదిపాశురాలేఅయినా ఎవరి

వద్ద విద్యనభ్యసించకపోయినా ఏవేదాన్నీ ఏపురాణాన్నీ ఏధర్మశాస్త్రాన్నీ పఠిం
పోయినా తిరుప్పాణాళ్వార్ల రచనల్లో పైవానిలోని విషయాలన్నీ ఉన్నా
మచ్చుకు కొన్ని చూపుతున్నాను.

2 వ పాశురంలో త్రివిక్రమావతారాన్ని వర్ణించినాడు తిరుప్పాణాళ్వా

ఇది ఋగ్వేదం —

అతో దేవా అవన్తు నో యతో విష్ణుర్విచక్రమే
పృథివ్యాః సప్త ధామభిః ॥ । అష్ట 2 అధ్యా 7 వర్గం 22 సూక్తం 16 వ మంత్ర

ఇదం విష్ణుర్వి చక్రమే త్రేధా ని దధే పదమ్
సమూళ్హమస్య పాంసురే॥ 1— 2— 7— 22— 17

త్రీణి పదా వి చక్రమే విష్ణుర్గోపా అదాభ్యః
అతో ధర్మాణి ధారయన్॥ 1— 2— 7— 22— 18

సూక్తాలకు అనువాదం అనిపిస్తుంది.

4 వ పాశురంలో శ్రీరామావతారాన్ని వర్ణిస్తూ అంబులపొదినీ అందులో
పదునైన బాణాలను వర్ణించినాడు.

ఇది ఋగ్వేదం—

ని సర్వసేన ఇషుధీరసక్త
సమర్యో గా అజతి యస్య వష్టి ।
చోష్కూయమాణ ఇన్ద్ర భూరి వామం
మా పణిర్భూరస్మదధి ప్రవృద్ధ॥ 1— 3— 1— 33— 3.

సూక్తానికి అనువాదంగా తోస్తుంది.

8 వ పాశురంలో నరసింహావతారం వర్ణించినాడు.

ఇది ఋగ్వేదం—

అష్టౌ వ్యఖ్యత్ కకుభః పృథివ్యాః
త్రీ ధన్వ యోజనా సప్త సిన్ధూన్
హిరణ్యాక్షః సవితా దేవ ఆ గాత్
దధద్రత్నా దాశుషే వార్యాణి॥ 1—3—7—35—8.

సూక్తానికి అనువాదమేమో ననిపిస్తుంది.

ఇట్లా ఉదహరిస్తూపోతే ఎన్నో విషయాలున్నాయి ఉదహరించవలసినవి.

ప్రసిద్ధులైన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీమాన్ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగార్ల వద్ద పనిచేసిన పరిశోధకవిద్వాంసులు శ్రీమాన్ ఎ. వి. శ్రీనివాసాచార్యులు శ్రీ తిరుప్పాణాళ్వార్లు రచించిన "అమలనాదిపిరాన్" అనే మహోత్కృష్టమైన పదిపాశురాలకూ— పై పాశురాలకు శ్రీ వేదాంతదేశికులు రచించిన "మునివాహనభోగము" అనే విపులమైనవ్యాఖ్యకూ— ఈరెండింటికీ అందరికీ అందుబాటులో ఉండేటట్లు తేటతెలుగు వచనరచన చేసినారు. అంతేకాకుండా శ్రీ తిరుప్పాణాళ్వార్ల, శ్రీ వేదాంతదేశికుల జీవితచరిత్రలనుగూడ చక్కగా వివరించినారు. ఇటువంటి చక్కటిగ్రంథాలను మరికొన్నింటిని ప్రకటించి, ఈ సంస్థకు శ్రీ ఆచార్యులు సేవ చేస్తారని ఆశిస్తున్నాను.

"భగవత్జ్ఞానం కలిగినతర్వాత ఇతరులు సంసారసాగరంలో పడమన్నా పడకుండా శ్రీ మహావిష్ణువును ఎవడు శరణు పొందుతున్నాడో వాడు సత్పురుషుడు. శ్రీ మహావిష్ణువును శరణుపొందనివాడు పశువుతో సమానుడు. ఇంకా, ఎవరు ఆత్మజ్ఞానాన్ని కలిగి, పరబ్రహ్మస్వరూపాన్ని తెలుసుకొంటాడో వాడే సరియైన బ్రాహ్మణుడు, ఆత్మజ్ఞానం లేకుండా పరబ్రహ్మజ్ఞానాన్ని పొందనివాడు రాక్షసుడు" అనే "సమోహే వా య ఆశత నరస్తోకస్య సనితౌ విప్రాసో వా ధియాయవః" ఋగ్వేదం 1—1—16—8—6 లో పేర్కొనబడిన సత్పురుషుడు— ఆత్మజ్ఞాని— సద్బ్రాహ్మణుడు శ్రీ తిరుప్పాణాళ్వార్లు.

15—12—1979

తిరుపతి

ఆరంభవాక్యాలు

ప్రొఫెసర్. కె. సచ్చిదానందమూర్తి
ఆంధ్ర విశ్వవిద్యాలయం, వాల్తేరు

భారతీయ మత ఇతిహాసంలో ఆళ్వారులది ప్రముఖస్థానం. వైష్ణవభక్తికి వారే స్పష్టమైన ఉద్గమస్థానాలు. "భక్తి ద్రావిడంలో పుట్టింది, కర్ణాటకంలో వృద్ధి చెందింది, మహారాష్ట్రంలో అక్కడక్కడా చోటుచేసుకొని; గుర్జరంలో పాఖండులచే ఖండింపబడి దుర్బలమై జీర్ణత్వాన్ని చెందింది. కాని తిరిగి బృందా వనానికి చేరి నవీనమై సురూపిణి, యౌవని అయింది''. ("ఉత్పన్నా ద్రావిడే సాహం వృద్ధిం కర్ణాటకే గతా"— — — ఇత్యాది, శ్రీమద్భాగవతమాహాత్మ్యం I. 48-50.‡) ద్రావిడంలో వాసుదేవభక్తులు హెచ్చుగాను, తక్కినచోట్ల క్వచిత్తుగాను ఉండేవారని భాగవతం (V. 39-41) కూడా వక్కాణించింది. ఈ భక్తిచరిత్రనే "ద్రావిడంలో ఉత్పత్తి అయినభక్తిని ఉత్తరానికి రామానందులు తేగా, కబీర్ దాన్ని ఏడుద్వీపాల్లో తొమ్మిదిఖండాల్లో ప్రకటించాడు," ("భక్తీ ద్రావిడ్ ఊపజీ, లాయే రామానంద్"— — — —) అనే హిందీ ఉక్తి సమర్థిస్తుంది. ఫిల్లియోజా భాగవత, తన్మాహాత్మ్యాల కాలాలను గూర్చి వ్రాసిన ఒక వ్యాసంలో వాస్తవంగా భక్తిచరిత్ర ఇదేనని చూపాడు; (J. Filliozat, Indological Studies, American Oriental Society, New Haven, Conn., 1962, pp. 70-7) ఉత్తరభారతంలో రామానందులు, వారి శిష్యులు తీసుకొచ్చిన మహావిప్లవానికి; శ్రీమద్భాగవత కర్తకు (9 వ లేక 10 వ శతాబ్ద ప్రారంభంలో వ్రాయబడి ఉంటుంది)* ప్రేరణ ఇవ్వటానికి; తద్ద్వారా† చైతన్యాదులు పూర్వభారతంలో నిర్వహించిన ఉద్యమానికి; కర్ణాటక మహారాష్ట్రాలలో పారిన భక్తి ప్రవాహానికి: ఆళ్వారులు కొంతకారకులు. "జాతిని పంక్తిని ఎవరూ అడక్కండి! ఎవరు హరిని భజిస్తారో వారు హరికి చెందిన వారు

---

‡ పద్మపురాణమ్, ఉత్తరఖండమ్.

* కె.ఏ. నీలకంఠశాస్త్రి అభిప్రాయం.

† చైతన్యులకు, మధ్వ వల్లభ, నింబార్కాదులకు ముఖ్యంగా స్ఫూర్తినిచ్చింది భాగవతమే.

అవుతారు," "జాతి పాంతి పూఛై నాహి కోయీ, హరి కో భజై సో హరి కో హోయ్") అని రామానందులు; "జాతి, పంక్తి, కులం అన్నీ ఊడ్చుకు పోయినయ్ రామనామంయొక్క రంగులో" ("జాతి పాంతి కుల్ సబ్ గయే, రామ్ నామ్ కే రంగ్") అని రజ్జబ్ జీ అనగల్గినారంటే – దానికి ఆళ్వారుల బోధలు, జీవితాలు కొంతవరకు అవకాశం కల్పించినయి. తుకారాం ఇత్యాది పండరిభక్తులు విఠల్‌నాథుని ప్రతిమారాధనం ద్వారా సిద్ధి పొందటానికి కూడా దారి చూపింది ఆళ్వారులు. టి.ఏ. గోపీనాథరావు, ఎస్.ఎన్. దాసుగుప్త, ఎస్. వైయపురి పిళ్లైలు – ఆళ్వారులకాలం క్రీ.శ. 700 నుండి 800 వరకుగా భావించారు, కె.ఏ. నీలకంఠశాస్త్రి మొదటి ముగ్గురు ఆళ్వారులు క్రీ.శ. 5 వ లేక 6 వ శతాబ్దానికి తరవాతివారు కారని, చివరి ఆళ్వారులు (నమ్మాళ్వార్; మధురకవులు) క్రీ.శ. 850 తర్వాతకూడా చాలా సంవత్సరాలు జీవించి ఉండ వచ్చని తలచారు. వీటిలో మొదటిదే సరైన అభిప్రాయంగా నాకు తోస్తుంది. ఆనాటి రాజకీయ, ఆర్థిక, సాంఘిక వ్యవస్థ, అప్పుడు ప్రచారంలో ఉన్న భావాలు విశ్వాసాలు ఎంతవరకు ఆళ్వారులను ప్రభావితం చేసినయి, వీరు సమకాలికుల్నీ, తరువాతి తరాలవారిని ఏవిధంగా ఎంతవరకు ప్రభావితం చేశారు అని పరి శోధన సక్రమంగా విమర్శతోచేస్తే అది మన మతభావాల చరిత్రను History of religious idea కొంత ముందుకు తీసుకుపోతుంది.

బ్రాహ్మణ, క్షత్రియ, శూద్ర, పంచమాది కులాలకు చెందిన ఆళ్వార్లు – భగవత్కృప అట్లా ఉంచి – ఏకారణాల వలన భక్తులైనారు; వారి బోధలకు జీవితాలకు; ఒకప్రక్క వారి బోధలకు మరొకప్రక్క పాంచరాత్ర వైఖానస ఆగమాలలోని, గీతా విష్ణుపురాణ భాగవతాది గ్రంథాలలోని వైష్ణవానికి గల సామ్యాలు భేదాలు; వారి సిద్ధాంత – అభిప్రాయాలను విశ్లేషించి అవి సంప్ర దాయం, తర్కం, అనుభవం, విశ్వాసం – వీటిలో దేనిపై ఎంతవరకు ఆధార పడి ఉన్నాయి; ఒక్కొక్క ఆళ్వారుని కులం వృత్తి ఆయన ఉపదేశాలమీద చూపిన ప్రభావం, ఈ 12 గురి ఉపదేశాలలో సిద్ధాంతరీత్యా ప్రాముఖ్యత (emphasis) రీత్యా ఉన్న పరస్పర భేదాలు; వారి జీవిత – సందేశాల పట్ల సమాజంలోని వివిధవర్గాల బౌద్ధిక భౌతిక ప్రతిక్రియలు (Reactions); యామున రామానుజ వేదాంతదేశిక లోకాచార్యాదులు ఆళ్వారుల వారి జీవిత విధానాల లోని ఉపదేశాలలోని ఏయే అంశాలు నిజంగా స్వీకరించారు ఏవి వదులుతున్నా

మనకుండానే విడిచారు. ఎందువలన అట్లాచేశారు? ఇవన్నీ కూలంకష పరిశోధనను కోరుతున్న విషయాలు.

II

భారతీయ అభారతీయ మత–సంప్రదాయాలలో ఎక్కువవాటిలో మూర్తిపూజ లేక విగ్రహారాధనకు కనీసం సిద్ధాంతరీత్యా తక్కువస్థానం ఇవ్వబడింది. కొన్నిటిలో అది తీవ్రంగా ఖండింపబడింది. దాన్ని అంగీకరించిన ఎక్కువమంది కూడా మూర్తిని లేక విగ్రహాన్ని ఈశ్వరుని ప్రతీకంగా (Symbol) వాఙ్మనోతీతుని లేక సకలకల్యాణ గుణాభిరాముని ధ్యానించటానికి వీలైన ఆలంబనగా, మందబుద్ధిగలవారి కుపయోగపడే చిహ్నంగామాత్రమే, దాన్ని సమర్థించారు. రాళ్లతో, లోహాలతో చేసిన బొమ్మలను హిందువులు సాక్షాత్తు దేవుళ్లనుగా కొలుస్తారు, అని వారిని క్రైస్తవ; ఇస్లాం మతాలవారూ హేతువాదులూ పరిహసించి నప్పుడు, గుళ్లో బొమ్మే సాక్షాత్తు దేవుడని హిందువులలో మరీ మూర్ఖులు తప్ప ఎవరూ నమ్మరని. అదికేవలం అపరిచ్ఛిన్నుణ్ణి సూచించే గురుతు, మనస్సును నిలుకడ చేసుకోవటానికి సాధనమాత్రం, అని హిందూసమర్థకులు (Apologists) వాదిస్తారు ఆగమాలు, ఆళ్వార్లు ఇట్టి సమర్థనను ఒప్పుకోరు. ఏమిటి వారి సిద్ధాంతం?

మట్టి, లోహం, రాళ్లతో చేసిన ప్రతిమల్లో విధిప్రకారం మంత్రసహితంగా పరమేశ్వరుడు ప్రతిష్ఠించ బడినప్పుడు, ఆయన వాటిలోని కవతరించి, భక్తుల సౌలభ్యంకొరకు, వారి ధ్యానానికి ఆస్పదుడు కావటానికి, వాటిని అనుప్రాణితం చేసి వాటిలో ఉంటాడు. అప్పుడాప్రతిమలు అప్రాకృతాలై షాడ్గుణ్యం కలిగి ఉంటయి. (విష్వక్సేన సంహితాదులు) మానసిక, యాజ్ఞిక ఆరాధనల కంటే వీటి ఆరాధన శ్రేష్ఠం: ఎందుకంటే, పూలతో పూజ చేస్తున్నప్పుడు మనస్సు, నేత్రాలు కూడా ఆనందిస్తయి. (భృగుసంహిత, క్రియాధికారం) జప, హోమ, ధ్యానాల కంటే అర్చన శ్రేష్ఠం, అని మరీచిసంహిత (విమానార్చనకల్పం) కూడా స్పష్టం చేసింది, (ఇది "ఉత్తమో బ్రహ్మసద్భావో......బహిఃపూజా

అధమాధమా'' ఇత్యాది కొన్ని అన్యతంత్రోక్త వ్యాఖ్యానాలకు† పూర్తి విరుద్ధం
ఇట్టి వాక్యాలే నేటి ఎక్కువమంది హిందూమేధావులకు ప్రియాలు.) భ్రూమధ్య
లోనో హృత్కమలంలోనో జ్యోతిని చూడటం, విష్ణునో శివునో మనసా రూ
కల్పన చేసి ధ్యానించటం — ప్రతిమను పూలతో పూజించటంకంటే ఏవిధంగాన
శ్రేష్ఠం కాకపోగా బహిఃపూజే వాటికంటే శ్రేష్ఠమని ఈ ఆగమాల సిద్ధాంతం
పోతే అవి నిర్విశేషవస్తువును గూర్చి ప్రమాణమే లేదంటాయి; విధిమంత్రసహి
తంగా ప్రతిష్ఠించబడిన ప్రతిమను (బేరం — బింబం — ప్రతిమకు పర్యాయపదాలు
అర్చారూపం లేక అర్చావతారం అంటారు. ఇది శాశ్వతఅవతారం, 1 వైకు
ఠంలో ఉండే సూక్ష్మమైన షాడ్గుణ్యవిగ్రహమగు వాసుదేవాఖ్య పరబ్రహ్మముతోను
2 ఆయనయొక్క స్వేచ్ఛా విగ్రహరూపాలు జీవమనోహంకారతత్త్వాల అధిష్ఠ
తారులు అగు వ్యూహంతోను, 3 రామకృష్ణాదిప్రాదుర్భావాల సమూహమగు వి
వంతోను, 4 సమస్తప్రాణులలోని అంతర్యామితోను, 5 అర్చావతారం సమా
మైంది. ఈ 5 రూపాల్లోను భగవంతుడు సంపూర్ణంగా అభివ్యక్తుడని, ఒ
దానిలో ఎక్కువ, ఒకదానిలో తక్కువగా లేడని, దివ్యదేశాలన్నింటిలో ఉం
ప్రతిమల్లోను భగవంతుడు పూర్ణరూపంగా అవస్థితుడని, ముఖ్యంగా తిరుమంగై
ఆళ్వారు నొక్కిచెప్పాడు. ఈ 5 రూపాల్లోను లక్ష్మీసమేతంగా నారాయణ
డున్నాడని, అన్నిరూపాల్లోను ఆయన సృష్టిస్థితిలయాలు చేస్తూ, మోక్షప్రదాన
చేస్తున్నాడని, ఆయన ఆనందం ఈ రూపాలద్వారా పొంగి పొరలుతుందని, వీటిలో
ఏదీ ఎక్కువ తక్కువ కాదని, జ్ఞానాదిగుణాలు అన్నిట్లో ఉన్నవని, అన్నీ
సాత్త్వికమని, అందుచే అర్చారూపాలన్ని లక్కనరూపాలతో అభిన్నమ
వైకుంఠంలోని శ్రీమన్నారాయణునికి అర్చారూపానికి ఏమాత్రం భేద
లేదని, అర్చావతారాన్ని అర్చనధ్యానాలు చేసినప్పుడు వాటికి పలికేది శ్రీమన్నా
యణుడేనని, ఆళ్వారులందరికి శిరోమణిన్ని కృష్ణతృష్ణాతత్త్వమనిన్ని చెప్పబడి
నమ్మాళ్వార్లు చెప్పారు. (తిరువాయ్‌మొళి III. 6) పరమపదంలోని ప్రభు
తిరుమలలో నుంచుని, సముద్రంలో పడుకుని, అవతారాలలో నానాలీలలుచేస్తూ
అన్నివస్తువుల్లోనూ తన మనస్సులోనూ కూడా గూఢంగా ఉన్నాడని, ఆయ
మరొకచోట చెప్పారు. (తిరువాయ్‌మొళి VI. 9. 5) శరణాగతరక్షకుడు, వైకుం

† ఇది మహానిర్వాణ తంత్రంలోని వాక్యం. ఈ తంత్రం మ దేశంపై పాశ్చాత
ప్రభావం పడిన అనంతరం వ్రాయబడింది. చాలా మందిచే ప్రాచీనమని వి
సింప బడింది.

ప్రదాత, నాకొరకు స్వయంగా తిరుక్కుండపురంలో వేంచేసియున్నాడని నమ్మాళ్వారు సమాధిలో ఉండగా చెప్పారు. ఆయనదృష్టిలో మోక్షప్రదాత అగు వైకుంఠంలోని విష్ణువునకు, ఆ ఊరిలోని దేవాలయంలో పూజింపబడుతున్న ప్రతిమకు ఎట్టిభేదం లేదని దీనివలన స్పష్టం. అయితే, ప్రతిదివ్యదేశంలోని ప్రతిమను — అర్చారూపాన్ని — గురించి ఆయన అభిప్రాయం ఇదే. అర్చారూపాల కైంకర్యం చేస్తూ, భగవన్మహిమ గానం చేస్తూ, ఇహలోకంలోనే జీవితం ఎంతకాలమైనా గడపటం, స్వర్గవాసంకంటేనూ, వైకుంఠవాసంకంటేనూ ఏమీ తక్కువకాదని, నమ్మాళ్వార్లు (తిరువాయ్‌మొళి VIII. 10-4), తొండరడిప్పొడిఆళ్వార్, వేదాంతదేశికులు (వరదరాజపంచాశత్, 49), అన్నారు. తిరువాయ్‌మొళి ముఖ్యంగా వర్ణించేది అర్చావతారాన్నే నని ఆచార్యహృదయం చెప్పింది; మరి తిరువాయ్‌మొళి దాక్షిణాత్యరహస్యవాద (Southern Mysticism) సర్వస్వం. అమలనాదిపిరాన్ వర్ణించేదీ దాన్నే.

పరబ్రహ్మరూపం అతీతమైంది. నిత్యసూరులకు తప్ప ఇతర జీవులకు అందదు. వ్యూహాన్ని దాదాపు ముక్తులైన బ్రహ్మాదులు మాత్రమే అనుభవించగలుగుతారు. అవతారాలకు సమకాలికులుగా ఉండే అదృష్టం అందరికీ పట్టదు. అంతర్యామిని సాక్షాత్కారం చేసుకునేయోగ్యత అందరికీ లేదు. అందుచేత, శ్రీరంగంలోని రంగనాథుడు తిరుమలలోని వేంకటేశ్వరుడు ఇత్యాది అర్చారూపాలే అందరికీ ఎల్లప్పుడు అందుబాటులో ఉన్నయ్. (చూ. భృగుసంహిత) భగవంతుడు ఇటువంటి ప్రతిమల్లోకి వేంచేసి, వాటిని సజీవాలుగాచేసి భక్తసులభుడైనాడు. తన సర్వజ్ఞత్వ, సర్వశక్తిమత్త్వాదులను మరుగుపరచి, ఇట్లా పూజారుల అధీనంలోనికొచ్చాడు. తన అనంతత్వ ఈశ్వరత్వాలకు భంగంలేకుండా భక్తులకు తన సాన్నిధ్యం ఒసగటానికి ఇలా సావధికరూపంలోనికి ప్రవేశించాడు. అర్చారూపం కల్పితమూకాదు, ప్రతీకమూ (Symbol) కాదు; సాక్షాత్తు అది భగవంతుడే. అర్చారూపాలను చూడడం సాక్షాత్తు భగవంతుణ్ణి దర్శించటమే. నేత్రానందంకొలిపే విష్ణువిగ్రహాల ఆరాధన, యజనం, ధ్యానంచేయటంచేత బ్రహ్మభిన్నంకాని రూపంలోనికే ప్రవేశించి, సమస్తపాపాలనుండి పరిహారం చెందవచ్చుని, విష్ణుధర్మోత్తరం (103—16.) వాక్రుచ్చింది. అన్నికాలాల్లో భక్తులకు లభ్యమైంది అర్చ. పరాన్ని ఆరాధించటం పరలోకపునీళ్లతో దాహం తీర్చుకోవడంవంటిది. వ్యూహం క్షీరసముద్రంవంటిది. అవతారాలు ఎప్పుడో

వచ్చి కొద్దికాలం దేశాన్నంతా ముంచే వరదలవంటివి. అంతర్యామి భూగర్భ లోని నీటివంటిది, కాళ్ల కిందే ఉన్నా తాగటానికి వీలులేనిది. ఇక అర్చారూప తటాకంవంటిది, ఎవరికైనా ఎప్పుడైనా దాహం తీర్చుకోను వీలైనది. (శ్రీవచ భూషణమ్ I. 39.) అర్చావతారం ఇంద్రియమనస్సులకు గోచరం, అందుచే భ పుట్టిస్తుంది, ఇహలోకంలోనే కైంకర్యానికి అవకాశం ఇస్తుంది. (పరలోకంల నిత్యసూరులు చేసేది అదే.) అర్చారూపం సౌలభ్యానికి పరాకాష్ఠ. భూమి దూరంగా ఉన్న సముద్రంవంటిది పరబ్రహ్మం, గర్జిస్తున్న తరంగాలుగల సమ ద్రంవంటిది వ్యూహం, ప్రగాఢసముద్రంవంటిది అంతర్యామి, ప్రశాంతసముద్ర వంటిది అర్చావతారం. వేదం పరాన్నిగురించి, పాంచరాత్రం వ్యూహాన్నిగురించి మనుస్మృత్యాదులు అంతర్యామి నిగూర్చి, ఇతిహాసాలు అవతారా నుగురించి, తిరు వాయ్మొళి అర్చారూపాన్నిగూర్చి – చెప్పుతుంది. పరవ్యూహాదులన్నిట్లో ఉన్నట్లు, వేదంలో ఉన్నదే పాంచరాత్రాదులన్నిట్లో ఉంది. ఇట్లా అర్చారూపమే శ్రేష్ఠమైన ప్రమేయం (మేయ శరణం), ఉత్తమప్రమాణం (మా శరణం) పరవ్యూహాదులలో ఉన్న దుర్లభత్వాది లోపాలు లేనిది అర్చారూపం. (ఆచార హృదయం, ఈటు†) ఆళ్వారులు ప్రపత్తిచేసింది అర్చారూపానికే. (ముముక్షుప్ప 139; శ్రీవచనభూషణం I. 35) నాలాయిరంలోఉన్నవి తమ ఎదుట ప్రత్యక్షం ఉన్న శిలా దారు*తామ్రాదులు ఉపాదానాలుగా గల అర్చారూపాలను అనుభవించి వారి హృదయోద్గారాలే.

పరవ్యూహాదు లయిదింటిలోను సకలకల్యాణగుణాలు పూర్తిగా ఉన్నాయి ఆళ్వారులు పరత్వాదులు కరతలామలకంగా గలవారు, అనిర్దోషమగు సుజ్ఞాన కలవారు; అయినా వారు ప్రాప్యత్వం అతిశయంగా ఉన్న అర్చారూపాలనే ప్రప చేశారు. సౌలభ్యవాత్సల్యాలు పరరూపంలోనూ ఉన్నయి, అయితే అది తనత పరమసామ్యం చెందినవారికి (పరమంసామ్యం ఉపైతి దివ్యం – గీతా) ప్రత్య మయ్యేదికాబట్టి, పగటిదీపంవలె మందప్రకాశంగా ఉంటుంది; అర్చారూపం నీ

---

† తిరువాయ్మొళిపై టీక.

* మహాతార్కికుడైన ఉదయనాచార్యులు "జగన్నాథస్వామీ యనపథగామీ భవతు మే" అని ఆక్రోశించింది పూరిలోని అర్చారూపాన్ని చూడటానికే శివానందలహరికారుడు "సేవే శ్రీగిరి మల్లికార్జున మహాలింగం శివాలింగితం" అన్నది శ్రీశైలంలో ప్రత్యక్షంగా విరాజిల్లుతున్న శిలావిగ్రహాన్నిగురించే.

స్థితిలో ఉన్న సంసారులకు దర్శనం ఇచ్చేది కాబట్టి చీకటిగదిలో దీపంవలె ఎక్కువ కాంతి కలిగి ఉంటుంది. అవాప్తసర్వకామత్వస్థితిని వదలి, ధూపదీపనస్తునైవేద్యాదులకు అర్చకులపై ఆధారపడవలసిన దీనస్థితిలోనికి వచ్చినట్టిది అర్చారూపం; ఈ సౌలభ్యానికి సమ్మోహితులమై దానికి శరణు జొచ్చకపోయినా సంసారులమైన మనలను అర్చారూపం వదలదు. శాస్త్రాలు ఎంత చెప్పినా భగవద్విషయంలో రుచికలగని జీవులకు, తన సౌందర్యాదులను చూపించి, వారిమనస్సుల నాకర్షించి, తనపట్ల ఉన్న వైముఖ్యాన్ని తొలగించి, తనను చూచినకళ్లను ఇంక ఎటూతిప్పటానికి వీలులేకుండా చేయగలిగినట్టిది అర్చారూపం. సంసారికి తన విలక్షణత్వాన్ని చూపి, తన నిత్యానందంపై రుచి పుట్టించి, అతడు సంసారాన్ని త్యజించి స్వప్రాప్త్యర్థం తన్నే సాధనంగా పరిగ్రహించి సాధ్యం లభించటానికి, తాను ఉన్నచోటికొచ్చి కైంకర్యం చేసేవరకు వదలక అర్చారూపం అతనికి భోగ్యంగా ఉంటుంది; అందుచేత ఉపేయంగాకూడా ఉంటుంది అర్చారూపానికి మూడురకాలవారు ప్రపన్నులు: 1 దాన్ని చూడగానే భక్తిపారవశ్యంచే కాళ్లు తడబడి, కళ్లు చెదరి, మనస్సు చలించి, ఇంద్రియాలు శిథిలంకాగా, ఇంకేమి చేయలేక వేరే గతిలేనివారై భగవంతునికి భరసమర్పణం చేసిన ఆళ్వారులు. వారి చిత్తాలను భగవచ్ఛరీర సౌందర్యం (ప్రతిమయొక్క అందం) అపహరించి తనలో లగ్నం చేసుకోవటం చేత, వేరే విషయాల్లో వారిచిత్తాలు లగ్నం కావు. 2 అన్యోపాయాలు అనుష్ఠించటానికి కావలసిన జ్ఞానాదులు ఉన్నా, అవి స్వరూపవిరుద్ధాలని వాటినివదలి, భగవత్స్వరూపయదార్థజ్ఞానంచేత వేరే గతిలేనివారై, భగవంతునికి భరన్యాసం చేసిన ఆచార్యులు. భగవత్కృపవలన వీరికి విషయాంతరాలలో రుచి ఉండదు. 3 అన్యోపాయాలేవీ అనుష్ఠించటానికి కావలసిన జ్ఞానాదులులేక భగవద్విషయంలో భరన్యాసం చేసిన సామాన్యులు. వీరికి పూర్వుల ఆచరణ ఆదర్శంకాగా, దాన్ని అనుసరించకపోతే అనర్థం కలుగుతుందనే భయంచేత ఇతరవిషయాల్లో రుచి ఉండదు. (ఈ పేరాలోని విషయం శ్రీవచనభూషణం I. 34–7, 38, 40, 41–3 నుండి సంగృహీతం).

ఇంత వ్రాయటానికి కారణం: ఆళ్వారుల అనుభవ విలక్షణత్వం విశదపరచటానికి. అది ఎట్టిది? శ్రీరంగం, కాంచి, తిరుమల ఇత్యాది దివ్యదేశాలలోని రంగనాథ, వరదరాజ, వేంకటేశ్వరాది భగవత్ప్రతిమల – అర్చారూపాల – సౌందర్యం వారి చక్షువులను మనస్సులను కొల్లగొట్టగా, ఆనందాతిశయంతో సమస్త

అన్యవిషయాల్లో అనాసక్తులై మాధుర్య* లేక వాత్సల్యాదు†లలో ఏదో ఒక భావంచే ఉద్విగ్నులై, ప్రపన్నులై, ఆ ఇంద్రియసంయమంతో రూపాలకు జీవితం కైంకర్యంచేయటం, వాటినే సదా ధ్యానించటం. కైంకర్యం అంటే అర్చామూర్తియొక్క సేవ. అది శేషభావంపై ఆధారపడి ఉంటుంది; దానివలన ఆధేయత్వం, విధేయత్వం, సార్థకం అవుతయి. ధ్యానం అంటే ఔపనిషదిక ఉపాసనగాని, పాతంజల ధ్యానంకాని కాదు. శరీరాన్ని కష్టపెట్టుకోవటం, ఆసన ఉపవాసాదులు, పండనిపళ్లు తినటం, తపస్సు, ఇవి అనవసరం; సదా భగవచ్చిం తన కావల్సింది అంతే. ("ఎల్లకాలం తిరుమలలోని ప్రభువుకు సేవచేయాలి" తిరువాయ్‌మొళి III.3-1; VIII. 10-1. "భగవంతుణ్ణి మనస్సులో ఉంచుకో చిత్రకూటానికి పో" పెరియతిరుమొళి III.2-1.2. చూడు: తిరుమంగై, తిరు క్కురుంతాండకం 15,16,17,18,20. పోల్చు: "మా మనుస్మర యుధ్య చ"; అనన్యాః చింతయంతో మాం" – గీత) దేవాలయంలోకి వెళ్లి అద్వితీయ ఆనం దంగా, సౌందర్యరాశిగా, అర్చారూపాన్ననుభవించి ఆళ్వారులు చేసిందేమిటి? పునః పునః దర్శనం, మంగళాశాసనం చేయటం. ఆశించిం దేమిటి? సాయుజ్యం‡. ఆళ్వారులది Personal - Theism and Image Mysticism. కన్నప్ప (తిన్నడు) వగైరా నాయనార్లదికూడా ఇదే. ఇతర మతాలలో ఇట్టిది కానరాదు.

III

ముదలాళ్వారులు ముగ్గురూ ద్విజసంస్కారరహితులు; కాని అయోనిజులట; 4వ ఆయన – తిరుమళిశై – ఆయనే తాను చాతుర్వర్ణ్యబాహ్యుణ్ణని చెప్పుకొన్నాడు. బ్రాహ్మణజాతివాడట గాని మేదరిఇంట పెరిగినవాడు; 5వ ఆళ్వారు (పెరియ) బ్రాహ్మణుడు; 6వ ఆళ్వారు (కులశేఖర) క్షత్రియుడు; 7వ ఆయన – తిరుప్పా

* ఉదా: ఆండాళ్, నమ్మాళ్వారు, తిరుమంగై, కులశేఖరులు.

† ఉదా: పెరియాళ్వార్.

‡ వారు కోరింది పొందింది అర్చారూపంతో సాయుజ్యం. తిరుప్పాణులు, ఆండాళు కలిసిపోయింది శ్రీరంగంలోని రంగనాథునిలోనే అని వారినిగూర్చిన కథలు చెప్పుతయి. అయితే అర్చారూపానికి అభేదమని వారి విశ్వాసం.

ణాళ్వారు – పాణజాతివాడు : తోలుపనులు, మద్దెలవాయించటం, చేపలుపట్టడం, వీథినాటకాలు వేయటం, పాటలుపాడటం – వీరికులవృత్తులు, సంగకాలంతర్వాత వీరిని మాలవారిలోచేర్చారు: సమకాలికులూ, ఆయనా తనను పంచముడని చెప్పుకొన్నా ఈయన అయోనిజుడని తరువాతివారు కొందరు అన్నారు : 8 వ ఆళ్వారు – తొండరడిప్పొడియాళ్వారు : వ్యభిచారానికి అలవాటుపడిన* బ్రాహ్మణుడు. 9 వ ఆళ్వారు తిరుమంగై – కళ్లర్ (= మ్లేచ్ఛ) జాతివాడు†. 10 వ ఆళ్వారు – నమ్మాళ్వారు – వెల్లాలర్ అనే శూద్రజాతివాడు. 11 వ ఆళ్వారు బ్రాహ్మణుడు (మధురకవి). ఒకామె – 12 వ ఆళ్వారు (ఆండాళ్) తులసీవనంలో ఒక బ్రాహ్మణభక్తునికి దొరకినబాలిక. కులగోత్రాలు తెలియనివారిని, పంచముల్ని తర్వాతివారుకొందరు అయోనిజులన్నారా ?.

[తిరుప్పాణాళ్వార్ కాక నందనారు. (ద్రవిడ), ఛోకామేళుడు (మహారాష్ట్ర), హరిదాసు (వంగ), రవిదాసు (కాశీ), రోహిదాసు (మహారాష్ట్ర) అను భక్తులు, హాలీకపావ్ (జాలంధరనాథుడు) అనే సిద్ధుడు హరిజనులు. కబీర్ మహమ్మదీయుల సంతానం. పండరిభక్తులలోను, నాయనార్లలోనుకూడ స్త్రీ శూద్రులున్నారు.]

ఆళ్వారులను దృష్టిలో ఉంచుకునే శ్రీరామానుజులు, జ్ఞాననిష్ఠుడు, విరక్తుడు, అనపేక్షకుడు అగు భక్తుడు, శాస్త్రాల్లో చెప్పబడిన లింగాశ్రమాల్ని త్యజించి "అవిధిగోచరుడు" కావచ్చని "అష్టాదశరహస్యార్థవివరణ"లో ఒక ఉద్ధరణ

---

* భక్తుడై "అపి చేత్సుదురాచారో........క్షిప్రం భవతి ధర్మాత్మా" అనే గీతా వచనాలకు ఉదాహరణైనాడు.

† ఈయన క్రూరుడు, భక్తి కుదిరినాకకూడా క్రౌర్యం తగ్గలేదు. రంతిదేవ, ప్రహ్లాదులు అంతగా చెప్పిన సర్వభూతహిత మీయనకు ఆదర్శం కాలేదు. "ఆర్తింప్రపద్యే అఖిలదేహభాజాం"—ఇది రంతిదేవుని ఆదర్శం. "నైతాన్విహాయ కృపణాన్విముముక్ష ఏకో, నాన్యం త్వదస్య శరణం భ్రమతోఽనుపశ్యే"— ఇది ప్రహ్లాదుని దీక్ష; సర్వభూతదయ ఆయనబోధ. భక్తుడు అందరి దుఃఖాన్ని నివారించాలని "కౌటిల్యవత్సు జంతుషు" కూడ కరుణచూపాలని – నమ్మాళ్వార్ల అభిప్రాయం. తిరుమంగై ఆచరణ దీనికివిరుద్ధం. "సర్వభూతస్థుడైన ఈశు నవజ్ఞ చేసి ప్రతిమార్చనావిడంబనంచేయటం మౌఢ్యం" అని భాగవతం (కపిలగీత) అన్నది.

ఇచ్చినారు. ఈషణత్రయ వినిర్ముక్తుడై భగవన్నిర్హేతుకకటాక్షమే మోక్షోపాం మని నిలచిన అధికారి సకలధర్మాలకు అవశ్యుడవుతాడనికూడా ఆయన అక్క అన్నారు. (ఉద్ధృతం: ఎస్.ఎన్. దాస్‌గుప్త "హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫి 3 వ సం; పుట 88, నోట్ 2) రామానుజుల దీక్షాగురువు పెరియనంబి ఒక హ జనభక్తునికి రోజూ రంగనాథుని నైవేద్యం పెట్టేవారు, రాత్రిళ్లు అతని రాచపుండ కడిగి కట్టుకట్టేవాడు, అతనికి అంత్యక్రియలు చేశాడు. రామానుజుల ఐదుగు గురువుల్లో ఒకరు తిరుక్కచ్చినంబి (కాంచీపూర్ణుడు) చెట్టికులానికి చెందినాతడని ఆయన రామానుజులకు వరదరాజస్వామి తనకు చెప్పిన ఆరు పరమసత్యాల బోధించాడని, రామానుజులశిష్యుడు వటుకనంబి వ్రాశాడు. రామానుజులఔదార్యాన్ని కులాగ్రహరాహిత్యాన్ని చాటే ఇతరఐతిహ్యాలుకూడా ఉన్నవి. కాని శ్రీభాష్య వేదార్థసంగ్రహాదులలో ఆయన వర్ణాశ్రమాలను తూ.చ. తప్పకుండా పాటించాల ఉద్ఘోషించారు. ద్విజులకు మాత్రమే భక్తిలో అధికారం ఉందన్నారు. కాని ప్రపంచంలో ఎవరికైనా దీక్ష నివ్వవచ్చని జయాఖ్యసంహిత (XVI 10a చాటింది. భగవద్గీత (IX 32) పాపయోనులు, స్త్రీశూద్రులుకూడా భగవంతు భజించి పరాంగతిని పొందారన్నది. రాక్షసులు, స్త్రీశూద్రులేకాక, పాపజీవులు ఖగమృగాలుకూడా "అచ్యుతత" (=విష్ణుభావాన్ని) పొందినయ్యని (VII. 8.54) విష్ణుపాదవిముఖుడైన విప్రునికంటే తదర్పితమనోవచనఆచరణాలుకల్గిన శ్వపచుడ వరిష్ఠుడని (VII. 9. 10) భాగవతం ఘోషించింది. అనంతుని కథారసం క వానికి బ్రాహ్మణజన్మ, ఉపనయనం, యజ్ఞదీక్ష ఎందుకనికూడా ఈమహాపురాణ ప్రశ్నించింది. (కిం బ్రహ్మ జన్మభి రనన్తకథారసస్య ? X. 47. 58) జపహో మాధ్యయనాదులు, తపోవ్రతాలు లేని తరుణులు భక్తిచే హరికృపబడిసిరని అవన్నిఉన్న భక్తి సలుపని కాళిందీతీరస్థయాజ్ఞికులైన బ్రాహ్మణులు చపలతను పొందారని భాగవతం చెప్పింది. "వర్ణాశ్రమధర్మంబుల నిర్ణయ కర్మముల జెడక జగత్సంపూర్ణుడు హరి" యని తెలుసుకొమ్మని కూడా భాగవతం బోధించింది (XI. 47) భాగవతం రామానుజులకు ప్రమాణంకాకపోవటానికి ఇట్టిబోధ లౌక కారణం కావచ్చు. నీచజాతిలోపుట్టినా భక్తుడు పూజ్యుడే, అతనికి జ్ఞానంపొందే అర్హత, అన్యులకుబోధించే అర్హత భగవదారాధనాధికారాలు, ఉన్నవని; అతడు భగవత్సమానుడని; ఇతరకులాలకుచెందిన భగవద్భక్తుణ్ణి తిరస్కరించిన వేదవేత్త శాస్త్రవేత్త అయినబ్రాహ్మణుడుకూడా కర్మచండాలుడవుతాడని, తొండరడిప్పొడి ఆళ్వారు చెప్పారు. (తిరుమాల, 42, 43) ఆయన స్వయంగాబ్రాహ్మణుడే. కాని

ఆళ్వారులు అనుసంధించిన అర్థాన్ని పెరియనంబివంటి కొద్దిమంది మహామహులే అనుష్ఠించారు. భక్తులలో జాతివిద్యారూపకులధనక్రియాదిభేదంలేదని నారదభక్తి సూత్రం (72); నిందితమగు చండాలయోనిపర్యంతం అందరికి భక్తికి అధికారం ఉందని, ఎందుకన అందరికి సంసారదుఃఖం పోగొట్టుకోవాలనే కోరిక ఉండవచ్చు కాబట్టి, అని శాండిల్యసూత్రం (78) చెప్పినవి. అయితే; వర్ణాశ్రమవ్యవస్థను బలపరచేవాక్యాలుకూడా ఈగ్రంథాలలో కనపడతవి. కాని, విష్ణుపురాణంమాత్రం వర్ణాశ్రమాచారవంతుడగువానిచేతనే విష్ణువారాధనీయుడని, నిజవర్ణధర్మంనుంచి చలించకపోవటం విష్ణుభక్తుని ప్రథమలక్షణమని నొక్కిచెప్పింది. (III. 8. 9; III. 7. 20) శ్రీరామానుజులకు సర్వధర్మ సర్వతత్త్వవ్యవస్థకు ఈపురాణమే పరమప్రమాణం (వేదార్థసంగ్రహం, 156-8) రామానుజులవలెనే వేదాంత దేశికులుకూడా స్త్రీశూద్రులకు భక్తియందధికారం లేదన్నారు. వారు ప్రపత్తి చేసుకోవచ్చు. జన్మం, జాతి ఉత్కృష్టతకు ప్రయోజకాలుకావని, భగవత్సంబంధమే దానికి ప్రయోజకమని, అదిఉంటే నికృష్టజన్మంగలవాడుకూడా భాగవతుడే, అది లేనివాడు బ్రాహ్మణుడైనా త్యాజ్యుడని, ఇత్యాదిగా చెప్పి భాగవతంనుంచి, కైశిక మాహాత్మ్యంనుంచి ఉద్ధరణలిచ్చి విష్ణుభక్తికల చండాలుడుకూడా పూజ్యుడనిచెప్పిన శ్రీవచనభూషణమే (II. 93, 94, 96) కైంకర్యం రెండువిధాలు (ఇష్టాచారం, అనిష్టవర్జనం) అని విభజించి, వర్ణాశ్రమాలకు ఆత్మస్వరూపానికి అనుగుణమైంది ఇష్టమని, దానికి విరుద్ధాచరణం అనిష్టమని చెప్పి III. 35. 57) ఇష్ట కైంకర్యం శ్రేయస్కరం అని సూచించింది. విష్ణుపురాణం, రామానుజులు చెప్పిందికూడా దాదాపు ఇదే. కాని ఈగ్రంథకర్త "ముముక్షుప్పడి"లో రహస్య త్రయవేత్త వేదాధ్యయనాన్ని, వైదికకర్మలను వదలొచ్చన్నాడు భక్తికి బ్రాహ్మణ్యానికి మధ్యగల టెన్షన్ (ఉద్రిక్తత) శైవంలోవలెనే వైష్ణవంలోకూడా "రిసాల్వ్" (విశ్లేషితం, విచ్ఛిన్నం) కాలేదు.

IV

తిరుప్పాణాళ్వారుల "అమలనాదిపిరాన్" నాలాయిరంలోకెల్లా చిన్నకృతి. అర్చారూపపుసౌందర్యాన్ని ఇంతకంటే బాగావర్ణించేది, ఇంత సరళమైంది

ఇంకోరచనలేదు. వేదాంతదేశికులు దీన్నిగురించి ఇట్లా ప్రశంసించారు: "నాలాయిరసారమంతా ఇందులో ఉంది. ఇదే వేదతాత్పర్యం; వేదాంతులు చెప్పిన దానికంతటికీ బీజం. ఈ ఆళ్వారు శ్రీరంగనాథునిసన్నిధిలో పరమపదానందం అనుభవించి, ఈపదిపాశురాల్లో దాన్ని వ్యక్తీకరించారు. ఇది తిరుమంత్ర వ్యాఖ్యానం. నీతి, జాతి లేని స్వేచ్ఛాచారులందరికి రంగనాథుడే దిక్కని, ఆయనే బ్రాహ్మణోత్తములు తెల్పే వేదరహస్యాలకు మూలం అని తిరుప్పాణాళ్వారు తెలిపారు. ఈఆళ్వారు మనుష్యులకు మంచీచెడ్డా బోధించి చక్కదిద్దగలవాడు; ఆయన శ్రీపాదాల నాశ్రయిస్తాను. ఈయనకృతి ముక్తిఐశ్వర్యరసోపమం". ఇంతగా కవితార్కికసింహునిచే స్తుతించబడిన తిరుప్పాణాళ్వారు ఎంతటిమహనీయుడో తెలుస్తుంది. ఈకృతి ననుకరిస్తూ వేదాంతదేశికులు "భగవద్ధ్యాన సోపానం" వ్రాశారు. ఆయనరచించిన అమలనాదిపిరానుకు "మునివాహనభోగం" అనే వ్యాఖ్యకూడా వ్రాశారు. భగవంతుని పాదాదికేశపర్యంతవర్ణనతప్ప ఇందులో ఇంకేమీ లేదు; పరదూషణగాని, ఇతరులకు బోధగాని లేదు. భగవత్సాక్షాత్కారంచే జనించిన ఆనందం ఒకటే ఇందులో వెల్లివిరిసేది. ఇందులో రామ, కృష్ణ, వామన, నరసింహులను, తిరుమలలోని వేంకటేశ్వరులను, శ్రీరంగంలో తన కెదురుగానున్న భగవంతునితో అభిన్నునిగా స్తుతించారు. భగవంతు డమలుడు, విమలుడు, నిర్మలుడు; పరిశుద్ధులే ఆయనను సందర్శించగలరు; ఆయనభక్తి హృదయంలోకి ప్రవేశిస్తే పాపాలన్నీ నశిస్తయ్యని-ఇందులో చెప్పారు.

శ్రీరామానుజుల దీక్షాగురువగు మహాపూర్ణుడు (పెరియనంబి) ఈ ఆళ్వారుని ఇలా ధ్యానించాడు "శయానుడగుహరిని ఆపాదచూడంగా అనుభవించి, ముదితాంతరాత్ముయై విషయాంతరాలను తనకళ్లతో చూడనని నిశ్చయించుకొనినవాడు". శ్రీరామానుజులకు రామాయణార్థాన్ని బోధించిన ఆయన మేనమామ శ్రీశైలపూర్ణుడు (తిరుమలైనంబి) ఈ ఆళ్వారుని ఇలాస్తుతించాడు "తిరుప్పాణులు మునివాహనులై వచ్చి సౌందర్యం మూర్తీభవించిన శ్రీరంగనాథుల దివ్యమంగళవిగ్రహాన్ని ఏకాంతంలో సేవించి, దానివలనకలిగిన ఆనందాన్ని లోపల ఇముడ్చుకోలేక పదిపాశురాల రూపంగా బయలుపరచారు". అత్యంతసౌలభ్యరూపమైన అర్చావతారానికి గాఢంగా అంకితమైనవానినిగా ఈ ఆళ్వారును అళకియమనవాళపెరుమాళ్‌నాయనార్ (ఆచార్యహృదయకర్త) కీర్తించాడు.

స్వశేషత్వం అన్యశేషత్వం లేక శ్రీరంగనాథునివిషయంలో శేషత్వజ్ఞానం పొందటానికి ఆయన ఈకృతిలో వర్ణించబడినవాడు. 1 వ పాశురంలో భగవత్ శేషత్వం, తక్కిన ఎనిమిదింటిలో అన్యశేషత్వరాహిత్యం, 10 వ దానిలో భగవత్పరత్వం, సౌలభ్యం చెప్పి, ఆయనయొక్క పరమభోగ్యత్వం చూపి, తిరుప్పాణాళ్వారు తాననుభవించింది మనల ననుభవింపజేయ ప్రయత్నించారు. ఇందలి విషయాలివి : 1 వ పాశురం — కల్యాణగుణవర్ణనం. 2 వ పాశురం — త్రివిక్రమావతారవర్ణనం. 3 వ పాశురం — అన్యశేషత్వనిరసనం. 4 వ పాశురం — రామావతారవర్ణనం. 5 వ పాశురం — నారాయణపదవివరణం. 6 వ పాశురం — బ్రహ్మశివులు కర్మబద్ధులని ప్రతిపాదన. 7 వ పాశురం — శేషశేషిభావస్థాపనం. 8 వ పాశురం — నృసింహావతారవర్ణనం. 9 వ పాశురం — దివ్యదేహాఖండవర్ణనం. 10 వ పాశురం — భగవంతుడు పరమభోగ్యుడని వక్కాణించటం. (ఈపేరా టి. లక్ష్మణాచార్యుల 1919 లోని ఉపన్యాసాల ఆధారంగా వ్రాశాను).

V

రహస్యత్రయసారభూతమగు ఇట్టి మహోత్కృష్టశరణాగతిగ్రంథాన్ని ఆంధ్రీకరించి, వివరించి, కర్తృపరిచయాదులువ్రాసి శ్రీమాన్ ఎ.వి. శ్రీనివాసాచార్యులు ధన్యులయ్యారు. వీరు పరిశోధకాగ్రగణ్యులు మహావిద్వాంసులునగు శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారి వద్ద, సాహిత్యమీమాంసకాగ్రేసరులు, సంగీతశాస్త్రమర్మజ్ఞులునగు శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారివద్ద*, చాలాసంవత్సరాలు పనిచేసి, తమ పాండిత్యాన్ని గవేషణాపటిమను అభివృద్ధిచేసుకొన్నవారు; తాళ్లపాకసాహిత్యదుగ్ధాబ్ధిలో చిరకాలం ఈది పారంగతులై చాలాసంపుటాలు ప్రకటించినవారు; కొందరు ఆళ్వారులపై మంచివ్యాసాలు వ్రాసినవారు; కొన్ని ఉత్తమగ్రంథాలను సంపాదించినవారు. ఇంతకంటే అర్హులు ఈకార్యానికి దొరకటం దుర్లభం. వీరిరచన దాక్షిణాత్యవైష్ణవాన్ని తెలుసుకోగోరేవారికి, శ్రీరంగనాథుని

* అప్పటి తిరుమల తిరుపతి దేవస్థానముల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారైన శ్రీ సి. అన్నారావుగారు "మిమ్మల్ని నియమించిన తర్వాత తాళ్లపాక సంకీర్తనల

సౌందర్యసౌలభ్యాలను అవగాహన చేసుకోవాలని ఆకాంక్షించేవారికి, ఉపయోగకరం, ఉపాదేయం అవుతుంది.

కార్యక్రమం సరిగా సాగడంలేదు" అని శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారిని అడుగగా శ్రీశర్మగారు అప్పటి డైరెక్టరుగారికి వ్రాసుకొన్న ఉత్తరం. లోకానికి సత్యం తెలియడానికి ఇది ఇక్కడ ప్రకటిస్తున్నాను.

ఈ గ్రంథ అనువాదకుడు

Tirupati
24-12-51

To

The Director
S.V.O. Institute, Tirupati

May I request you, in continuation of the personal representation I made to you yesterday, kindly instruct Sri A.V. Sreenivasacharyulu, Library pandit, to assist me in the work of editing of Annamacharya's Songs, during the early hours of the working days. His assistance would be of very great help to me in speeding up of the work as he has been connected with it from the beginning.

Yours faithfully,

(Sd.) R. ANANTHAKRISHNA SARMA
Reader in Music

Mr. A.V. Sreenivasachari will assist the Reader in Telugu for editing the songs in the fore noon. He will attend the Library work in the after noon.

R.A.K.
24-12-51
Noted
N.S.S.
25-12-51

CURATOR

(Sd.) P. V. RAMANUJASWAMY
24-12-51

ఒక మాట

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయం తిరుమల తిరుపతి దేవస్థానముల వారి చేతుల్లో ఉండగా దిగ్గంతులవంటి పండితులతో ఎంతో వైభవంగా వెలసింది. 1-11-1956 వ తేదీ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి మారిన తర్వాత ఆ వైభవం తగ్గిందని ఉపాధ్యక్షులు ముగ్గురూ (1) శ్రీ ఎస్. గోవిందరాజులు నాయుడుగారు, (2) శ్రీ వి. సి. వామనరావుగారు, (3) శ్రీ డాక్టర్ డి. జగన్నాథ రెడ్డిగారు భావించి పూర్వపు వైభవాన్ని కలిగించాలని ప్రయత్నించినారు. కాని విధివైపరీత్యంవల్ల ఆ పని సాగలేదు. ప్రొఫెసర్ శ్రీ కొత్త సచ్చిదానందమూర్తి గారు 1975 లో ఉపాధ్యక్షులుగా చేరినతర్వాత ఈ సంస్థ రూపురేఖలు తీర్చితిద్దడానికి ఎంతో ప్రయత్నంచేసి కృతకృత్యులై దీని అభివృద్ధికి కారకులైనారు.

ప్రపంచమంతా గొప్ప గ్రంథమని పూజించేది, తాము అభిమానించిన వేదాంతానికి సంబంధించింది - మొట్టమొదటి వ్యావహారిక తెలుగు వచన రచన - శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల కుమారుడు పెదతిరుమలాచార్యులు రచించిన - భగవద్గీత వచనానువాద గ్రంథాన్ని తాము తీర్చిదిద్దిన సంస్థ ప్రథమ పుష్పంగా శ్రీ సచ్చిదానందమూర్తిగారు సమర్పింపజేసినారు. ఈ గ్రంథం మనదేశంలోని, ఇతరదేశాల్లోని ఉత్తమ పరిశోధనాసంస్థలు ప్రకటించే గ్రంథాలతో సమానంగా ఉండాలని నిర్ణయించి, ఆ విధంగా తయారుచేయించి ప్రకటింపజేసినారు. విష్ణు పారమ్య ప్రాతిపదికంగా మధ్వజయతీర్థ రాఘవేంద్రులు ఋగ్వేదానికి భాష్యాన్ని టీకను రచిస్తే వాటి ఆధారంగా ఋగ్వేదసూక్తాలకు తెలుగు అనువాదం చేయించి, ద్వితీయ కుసుమంగా ప్రకటింపజేసినారు.

నమ్మాళ్వార్లు తమిళంలో రచించిన 1102 పాశురాలకు అభిరామవరదుడు సంస్కృత శ్లోకాలు రచిస్తే దానిని ఆంగ్లానువాదంతో అచ్చుకు సిద్ధంచేయించినారు శ్రీ మూర్తిగారు. కాశ్మీరిదేశీయుడైన అభినవగుప్తులు భగవద్గీతకు ఈశ్వరాద్వయ పరంగా గీతార్థసంగ్రహాన్ని రచిస్తే దానిని ఆంగ్లానువాదంతో అచ్చుకు సిద్ధం చేయించినారు. హయగ్రీవుడనే దేవతను గూర్చి ప్రపంచంలోని అన్నిమతాల వారి సిద్ధాంతాలను సేకరించి, ఆంగ్లంలో గ్రంథాన్ని తయారుచేయించినారు. పక్ష

పాతం లేకుండా ఇట్లా అన్ని మతాలవారి గ్రంథాలు సిద్ధంచేయించి, సంస్థను తీర్చి తిద్దినారు.

అంతేకాకుండా ఈ ప్రాచ్యపరిశోధనాలయానికి విశ్వవిద్యాలయంలో ఒక శాశ్వతభవనమంటూ లేకుండా పిల్లిసంసారంలాగ అక్కడికీ ఇక్కడికీ మారుతూ ఉంటే ఇది సరిగాలేదని శ్రీ సచ్చిదానందమూర్తిగారు దీనికొక శాశ్వత భవనాన్ని నిర్మింపజేసినారు. ఆ భవనానికి "తిరుప్పాణాళ్వార్ భవన్" అనే పేరుపెట్టారు, ఎందుకంటే—

శ్లో॥ విద్యావినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని।
శునిచైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః॥

భగవద్గీత, 5 అ. 18 శ్లో.

అనేది వీరి ఆదర్శం కాబట్టి మన విశ్వవిద్యాలయంలో ఒక హరిజన భక్తుని పేర భవనం వెలయిస్తే మంచిదన్న నమ్మకంతో ఆ పేరు పెట్టారు. దక్షిణభారత దేశానికి చెందిన భక్తునిపేరు పెట్టాలని తోచడంచేతా ఈ భవనం శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో వెలయడంచేతా ఆ స్వామి సొమ్ము ఈ సంస్థకుచెందడంచేతా ఆ స్వామిని కీర్తించిన దక్షిణభారతీయుడు, హరిజనభక్తుడు శ్రీ తిరుప్పాణాళ్వార్లు కావడంచేతా ఆ భవనానికి "తిరుప్పాణాళ్వార్ భవన్" అనే పేరు పెట్టినారు శ్రీ మూర్తిగారు.

ఈ సందర్భంలో శ్రీ తిరుప్పాణాళ్వార్లు రచించిన "అమలనాది పిరాన్" అనే పది పాశురాలకు శ్రీ వేదాంతదేశికులు రచించిన మణిప్రవాళవ్యాఖ్యను అందరికీ తెలిసే సులభమైన భాషలో తెలుగు చేయాలని శ్రీ మూర్తిగారు నాకు సూచించినారు. వారి సూచనను అనుసరించి నాశక్తి వంచన లేకుండా ఆ పాశురాలకూ ఆ వ్యాఖ్యకూ సులభశైలిలో తెలుగు చేసినాను. తప్పులుంటేనావి, ఒప్పులుంటే వేదాంతదేశికులవి, నాకీ అవకాశాన్ని కలిగించిన శ్రీ సచ్చిదానంద మూర్తిగారికి ధన్యవాదాలర్పిస్తున్నాను.

మాకోరికను మన్నించి ఈ గ్రంథాన్ని ప్రకటించడానికి వలసిన ధనాన్ని మంజూరు చేస్తూ ఎంతో ఉత్సాహాన్ని చూపినందుకూ, ఎంతో కార్యభారంతో సత

మత మవుతున్నా. నేను కోరినదే తడవుగా ఉపోద్ఘాతం వ్రాసి యిచ్చినందుకూ మా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు శ్రీ ప్రొఫెసర్. ఎమ్ శాంతప్పగారికి నా ధన్యవాదాలు అర్పిస్తున్నాను.

వలసిన ఉత్తరువులు సకాలంలో ఇస్తూ గ్రంథప్రకటనలో శ్రద్ధా సక్తులు చూపుతున్న యూనివెర్సిటి రిజిస్ట్రార్ శ్రీ ఎమ్,జె. కేశవమూర్తిగారికీ, ప్రెస్ డైరెక్టర్ శ్రీ ప్రొఫెసర్. వి.యమ్. రెడ్డిగారికి నా ధన్యవాదాలు అర్పిస్తున్నాను.

శ్రీ మూర్తిగారి పదవీకాలంలో శ్రీ ప్రొఫెసర్ ఎస్. శంకరనారాయణన్ గారు మాసంస్థకు డైరెక్టరుగా కొత్తగా నియమింపబడినారు. వీరు మాకెంతో ఉత్సాహాన్ని కలిగిస్తూ సర్వవిధాలా మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. వీరి ప్రోత్సాహకారణంగా ఈ గ్రంథాన్ని మూడునెలల్లో పూర్తి చేయగలిగినాను. శ్రీ డైరెక్టరుగారు నాకు చేసిన సహాయానికి ధన్యవాదాలర్పిస్తున్నాను.

నాతో ఈసంస్థలో పనిచేసే న్యాయ శిరోమణి, ద్రావిడవేదవేత్త శ్రీమాన్ కిడాంబి శ్రీనివాస వరదన్ గారు నాకు కలిగిన సందేహాలను తీరుస్తూ నాకు చేదోడు వాదోడుగా ఉంటూ ఈ కార్యంలో సహకరించినారు. వీరికి నా ధన్యవాదాలర్పిస్తున్నాను.

శ్రీ సచ్చిదానందమూర్తిగారు నేను కోరగానే ఈగ్రంథానికి ఉపోద్ఘాతం వ్రాసి ఇచ్చినారు. దీనికి మరొకమారు వీరికి నేను ధన్యవాదాలర్పిస్తున్నాను.

మా గురుదేవులు పూజ్యులు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు ఈ సంస్థలో తెలుగుశాఖాధ్యక్షులుగా ఉండి నాకు విద్యాబుద్ధులు గరపి, పరిశోధన అంటే ఏమో తెలిపి, నన్నింతవాణ్ణిగా చేసినారు. వారి ఆశీర్వాద బలమే ఈ కార్యాన్ని నిర్వహింప జేసింది. వారికి నా నమోవాకములర్పిస్తున్నాను.

ఈ గ్రంథ ముద్రణ విషయంలో అన్నివిధాలా సహాయం చేసిన ప్రెస్ మేనేజర్ శ్రీ ఎమ్. సత్యనారాయణగారికి, వారి సహాయోద్యోగులు శ్రీ కె.వి.యస్. రాజు. శ్రీ వి.ఆర్. సోమశేఖర్ గార్లకు, ఇతర సిబ్బందికి ప్రపంచంలోని అన్ని వస్తువుల్లో ఉంటూ, ఎవరి కంటికీ కనిపించకుండా దాగి ఉండే సర్వవ్యాపియైన ఆ

భగవంతుడు ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధులు కలిగించాలని ఆ భగవంతు
ప్రార్థిస్తున్నాను.

నా తప్పులు మన్నించి పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను. తప్పు
తెలిపితే మరు ముద్రణంలో తిద్దుకొంటాను.

ఎ.వి. శ్రీనివాసాచార్యులు
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ
ప్రాచ్య పరిశోధనాలయము
తిరుపతి.

కాళయుక్తి—విజయదశమి
11-10-1978.

శ్రీ తిరుప్పాణాళ్వార్ల జీవిత చరిత్ర

ప్రాచీనకాలంలో తమిళదేశంలో భక్తులు ఎందరో అవతరించినారు. అందులో శివభక్తులు అరవైముగ్గురు. వీళ్లనే అరువత్తుమూవురనీ నాయన్మార్లనీ అంటారు. శ్రీవైష్ణవ భక్తులు పన్నిద్దరు. వీళ్లను ఆళ్వార్లు అంటారు. వీళ్లంతాభగవంతుని దర్శించి, అనుభవించి, ఆతని గుణగణాలను స్తోత్రంచేస్తూ తమిళభాషలో పాటలురచించి, పాడి, ఆనందించి తరించినారు.

శివాలయాలలో కొన్నిటిలో అరవైముగ్గురిని, విష్ణ్వాలయాలలో కొన్నిటిలో పన్నిద్దరాళ్వార్లను నాటినుండి నేటివరకు పూజిస్తున్నారు. అరవైముగ్గురిలో బ్రాహ్మణులు, శూద్రులు, హరిజనులు, బెస్తలు, ఆదివాసులు, సాలెవారు, కోయవాళ్లు, చాకలివాళ్లు—ఇట్లా అన్నిజాతులవాళ్లూ ఉన్నారు. అట్లాగే శ్రీవైష్ణవ ఆళ్వార్లలో మొదటిముగ్గురు పొయ్‌గైయాళ్వార్లు, పూధత్తాళ్వార్లు, పేయాళ్వార్లు. వీళ్లకులగోత్రాలు తెలియరావు. నాల్గవవాడు తిరుమళిశై ఆళ్వార్లు కురవజాతికి చెందినవాడు. ఐదవవాడు నమ్మాళ్వార్లు. ఈయన శూద్రుడు. ఆరవవాడు కులశేఖరాళ్వార్లు క్షత్రియుడు. ఏడవవాడు పెరియాళ్వార్లు, ఎనిమిదవవాడు తొండరడిపొడియాళ్వార్లు (భక్తాంఘ్రిరేణు)—వీళ్లిద్దరూ బ్రాహ్మణులు. తొమ్మిదవవాడు తిరుప్పాణాళ్వార్లు హరిజనుడు. పదవవాడు తిరుమంగయాళ్వార్లు (కళ్లజాతి) దారిదోపిడిచేసే జాతివాడు. పదకొండవది ఆండాళ్ అనే గోదాదేవి తుళసివనంలో దొరకగా పెరియాళ్వార్లచే పోషింపబడింది. పండ్రెండవవాడు మధురకవియాళ్వార్లు బ్రాహ్మణుడు.

(1) పొయ్‌గైయాళ్వార్లు 100 పాటలు రచించినారు. వీనినే మొదటి తిరువందాది అనీ ఇయర్పా అనీ అంటారు. (2) పూధత్తాళ్వార్లు 100 పాటలు. దీనిని రెండవ తిరువందాది అనీ ఇయర్పా అనీ అంటారు. (3) పేయాళ్వార్లు 100 పాటలు దీనిని మూడవ తిరువందాది అనీ ఇయ

ర్వాఅనీ అంటారు. (4) తిరుమళిశై యాళ్వార్లు 96 పాటలు, దీ
నాన్ముఖం తిరువందాది అనీ ఇయర్పా అనీ అంటారు. ఇవికాక ఇ
120 పాటలు దీన్ని తిరుచ్చందవిరుత్తం అంటారు. (5) నమ్మాళ్వా
100 పాటలు. ఇది ఋగ్వేదానికి అనువాదం. దీన్ని తిరువిరుత్తమంటా
ఇంకా 7 పాటలు ఇది యజుర్వేదానికి అనువాదం. దీన్ని తిరువాశిరి
అంటారు. ఇంకా 87 పాటలు అథర్వవేదానికి అనువాదం. దీన్ని పెరి
తిరువందాది అంటారు. ఈమూడూ ఇయర్పాలోచేరినవే. ఇవికాక 11
పాటలు సామవేదానికి అనువాదం. దీన్నే తిరువాయ్‌మొళి అంటా
(6) కులశేఖరాళ్వార్లు 105 పాటలు, దీన్ని పెరుమాళ్ తిరువె
అంటారు. (7) పెరియాళ్వార్లు 12 పాటలు తిరుప్పల్లాండు అంటా
ఇంకా 461 పాటలు, దీన్ని పెరియాళ్వార్‌తిరుమొళి అంటారు. (8) తొ
డరడిపొడియాళ్వార్లు 45 పాటలు, దీన్ని తిరుమాల అంటారు. ఇవి కా
ఇంకా 10 పాటలు, దీన్ని తిరుప్పళ్లిఎళుచ్చి అంటారు. (9) తిరుప్పా
ళ్వార్లు 10 పాటలు, దీన్ని అమలనాదిపిరాన్ అంటారు. (10) తి
మంగయాళ్వార్లు 1084 పాటలు, దీన్ని పెరియతిరుమొళి అంటారు. ఇవికా
ఇంకా 227 పాటలు, దీన్ని తిరువెళుకూట్రిరుక్కై, శిరియతిరుమడల్
పెరియతిరుమడల్ అని అంటారు. ఇంకా 20 పాటలు. దీన్ని తిరుకు
రుంతాండకం అంటారు; ఇవికాక ఇంకా 30 పాటలు, దీన్ని తిరునెడ
తాండకం అంటారు. (11) ఆండాళ్ 30 పాటలు, దీన్ని తిరుప్పావై
అంటారు ఇవికాక ఇంకా 143 పాటలు, దీన్ని నాచ్చియార్ తిరుమొ
అంటారు. (12) మధురకవి ఆళ్వార్లు 11 పాటలు, దీన్ని కణ్ణినుణ్ శి
ఱ్ఱాంబు అంటారు. మొత్తం పన్నిద్దరాళ్వార్లూ కలిసి నాలుగువేలపాట
తమిళంలో రచించినారు. వీటినే నాలాయిర దివ్యప్రబంధమంటారు.

*శూద్రుడైన నమ్మాళ్వార్లను బ్రాహ్మణుడైన మధురకవి ఆళ్వా

---

* దివ్యసూరి చరిత్రము

గురువుగా స్వీకరించి, ఆయనవద్ద చదువుకొన్నాడు. బ్రాహ్మణుడైన పెరియాళ్వార్లూ, ఆయన పెంపుడు కుమార్తెయైన ఆండాళ్ అనే గోదాదేవీ శూద్రుడైన నమ్మాళ్వార్లకు నమస్కరించినారు. కళ్లజాతి (దారిదోపిడి చేసేజాతి) వాడూ, వయసులో చిన్నవాడూ అయిన తిరుమంగయాళ్వార్లకు ముసలివాడూ, బ్రాహ్మణుడూ అయిన తొండరడిపొడియాళ్వార్లు నమస్కరించినాడు.

ఈభక్తులందరూ ఏజాతిలో జన్మించినా, ఏజాతిలో పెరిగినా అందరూ భక్త కులానికి చెందినవాళ్లే. ఈ భక్తులకు జాతి మత కులభేదాలులేవు. వయస్సుతో నిమిత్తంలేదు. ఈ భక్తకులం ఒకదేశానికీ, ఒకకాలానికీ చెందినవాళ్లని చెప్పడానికి వీల్లేదు. వీళ్లు ప్రపంచానికంతకూ చెందినవాళ్లే దేశమంతా ఒకటే, దేశంలోనివాళ్లంతా ఒకేకులానికి చెందినవాళ్లనేవాళ్లు వీళ్లు. ఈవిషయాలను వీళ్లపాటల్లో అనేకచోట్లల్లో అనేకరకాలుగా చెప్పారు.

శరీరాన్ని లెక్కచేయకుండా భగవంతుని సేవచేయడంలో లీనమైన భక్తులున్నారు. శరీరాన్ని పోషించి, ఎంతోకాలంజీవించి, శరీరమనే దేవాలయంలోనే భగవంతుని దర్శించిన వాళ్లున్నారు. అత్యంత దివ్యసుందర విగ్రహుడైన భగవంతుణ్ణి తల్లిగాను, కుమార్తెగాను, చెలికాడుగాను, ప్రియుడుగాను దర్శించి, అనుభవించి, పాటలుపాడిన భక్తులున్నారు. అందమనే ప్రవాహం ఆనకట్టను తెంచుకొని ప్రవహించేటప్పుడు ఆప్రవాహానికి అడ్డంగావచ్చిన అన్ని అడ్డాలను తొలగించివేస్తుందనే విషయాన్ని ఈ భక్తులు తమపాటల్లో అనుభవపూర్వకంగా తెలిపినారు.

ప్రీతిపాత్రుడైన భగవంతునికి సేవచేసినట్లు ప్రీతిపాత్రులైన భగవద్దాసులకూ, ఇతరులకూ ఆళ్వార్లు సేవచేసినారు. ఈ ఆళ్వార్లు నడిచే దేవాలయాల్లాగ దేశమంతాతిరిగి, భగవంతుడున్నాడని ప్రచారంచేసి, భాగవతసేవ కూడాచేసినారు. ఇందులో మొదలాళ్వార్లూ, నమ్మాళ్వార్లూ మౌనంగా

ఒకేచోటఉంటూ పాటలుపాడుతూ భగవద్భాగవతకైంకర్యముచేసినారు. తిరుమంగయాళ్వార్లు పాటలుపాడుతూ భగవత్ప్రచారంచేస్తూ దేశం తిరుగుతూ కైంకర్యం చేసినారు. ఈ ఆళ్వార్లందరూ కమ్మనికవిత్వంతో భగవంతుని మెప్పించి, అతనికి కైంకర్యంచేస్తూ భాగవతకైంకర్యంకూడా చేస్తూవచ్చిన వాళ్లే.

ఒక అడవిలో ఒకేజాతిచెట్లు పెరిగి పెద్దవికావు అనేవిషయం శాస్త్రజ్ఞులకు తెలిసిన విషయం. అందుకనే అన్నిరకాల చెట్లనూ కలిపి పెంచుతున్నాము. అట్లాగే ఈభక్తవనంకూడా ఒకజాతి, ఒకమతంతో కూడుకోకుండా అన్నిమతాల, అన్నిజాతులవాళ్ల కలయికతో శ్రీవైష్ణవఆళ్వార్ల వనంగా తయారయింది. భక్తి, శ్రద్ధ అనేవిరెండే వీళ్లకుండవలసింది. ఆరెండూ ఈ ఆళ్వార్లకున్నాయి.

పెద్దవెలుగును కలిగించే విద్యుచ్ఛక్తి ఉంది. దాన్ని వెలిగేటట్లు చేయడానికి స్విచ్ఉంది. దాన్నినొక్కితే విద్యుద్దీపం దేదీప్యమానంగా వెలుగుతుంది. కానీ ఆస్విచ్‌నొక్కితే ఆదీపం వెలుగుతుందనే విషయం తెలియకుండా మనం అవస్థపడుతున్నాము. ప్రీతిపాత్రుడైన భగవంతుడే విద్యుచ్ఛక్తి. ఆతణ్ణి ఆశ్రయిస్తే మంచికలిగిస్తాడనే నమ్మకమే ఆతణ్ణి చేరడానికి ఉపయోగపడే స్విచ్చి. దాన్నితెలుసుకొన్నవాళ్లు ఈ ఆళ్వార్లంతా. వాళ్లతెలుసుకొని, తరించి, మనకుమార్గదర్శకులైనారు. వారువెళ్లిన నమ్మకమనే మార్గంలో వెళ్లితే భగవంతుడు తప్పక లభిస్తాడు. ఈవిషయాన్ని ఆళ్వార్లు ఎట్లాతెలిపినారో తిరుప్పాణాళ్వార్ల చరిత్రద్వారా మనం తెలుసుకొందాము.

మనం తిరుప్పాణాళ్వార్లను గురించి తెలుసుకోవడానికిముందు పాణర్ అనే జాతివాళ్లనుగూర్చి ముందుగా కొంత తెలుసుకోవలసివుంది. తమిళదేశంలో అనాదికాలంనుండి బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులతోకూడా

[1]తుడియన్ (వంకరగావుండే కొమ్ము అనే వాద్యాన్ని నోటితో ఊదేవాడు) మాదిగ; పఱైయన్ (గుండ్రంగావుండే పలక అనే వాద్యాన్ని వాయించేవాడు) మాల; కడంబన్ (కదంబచెట్టుదిమ్మెతోచేసిన డోలువంటి వాద్యాన్ని వాయించేవాడు) దొమ్మరి; [2]పాణన్ (పన్ అనే రాగాన్ని చేతితో ఏకతారను మీటుతూ పాటలుపాడేవాడు) పాణుడు అనే నాలుగురకాల జాతులవాళ్లు నివసించేవాళ్లు. ఈనాలుగు జాతులవాళ్లు దేవాలయాల్లో ప్రవేశించి భగవంతుని దర్శించరానివాళ్లని వైదికులైన శ్రీవైష్ణవాచార్యుల నిర్ణయము.

వేదాల్లో, ఉపనిషత్తుల్లో, స్మృతుల్లో, పురాణాల్లో నాలుగుజాతులే ఉన్నట్లు తెలుస్తూంది. పాణర్‌జాతివాళ్లు వలలుతీసుకొనివెళ్లి, చేపలు పట్టినట్లూ, వాటిని ఆజాతిస్త్రీలు అమ్మినట్లూ సంగకాలపుచరిత్ర తెలుపుతూ ఉంది. [3]ఈపాణర్‌జాతి సంగకాలానికి తర్వాతనే మాలవాళ్లుగా పరిగణింపబడింది. [4]పాణర్‌జాతిని మాలవాళ్లుగా తెలిపినవాళ్లు ఇంకాకొందరున్నారు. దీనినిబట్టి ప్రాచీనకాలంలో పాణర్లను మాలవాళ్లుగా పరిగణించేవారుకాదనీ కాలక్రమంలో వీళ్లను మాలవాళ్లుగా చేసినారనీ తెలియవస్తూంది.

మళయాళంలోకూడా పాణర్ అనే జాతివాళ్లు ఉన్నారు. వాళ్లు వీథినాటకాలు వేయడంలో గట్టివాళ్లు. [5]పాణర్‌జాతిస్త్రీని పాణ్చె అంటారు. అంటే నాట్యంచేసే స్త్రీ అని అర్థం. [6]త్రిభువనచక్రవర్తి రాజేంద్రచోడ

---

1. (1) పండిట్ శ్రీ N.M. వెంకటస్వామి నాట్టార్ కుమార్తె శ్రీ శివపార్వతమ్మ అభిప్రాయం. (2) NORTH ARCOT MANUAL. (3) కొండల్లో నివసించేవాడు మాల అని Dr. OPPERT.
2. శ్రీమాన్ పి. శ్రీగారి అభిప్రాయం.
3. కలిత్తొగై అనే గ్రంథం తెలుపుతూఉంది.
4. మాణిక్యవాచకరు, తిరుక్కోవైయారు.
5. Dravidian Comparative Vocabulary Vol. I.
6. No. 187 of 1908 దక్షిణదేశ శాసనాల రిపోర్టు.

దేవుని నాల్గవరాజ్య సంవత్సరంలో పాణన్ ఇరుమడి శోళప్పల్లవరాయన్ అనేవాడూ నాట్యస్త్రీలూ రాజీపడ్డట్టు తంజావూరుజిల్లా పుదుక్కోట తాలూకా కోవిలూర్ శాసనం తెలుపుతూఉంది. వీళ్లను దేశంలో తక్కువకులంలోని వాళ్లనుగానే చూస్తున్నారని తెలుస్తూంది. వీళ్లు నేడు తోళ్లతోచేసేపనులూ, మద్దెల వాయించడం, చేపలుపట్టడం మొదలైనపనులు చేస్తున్నారు. ఇట్లా అనేకరకాలైనవృత్తులు వీళ్లుచేస్తూన్నా వీళ్లముఖ్యవృత్తి పాటలుపాడుతూ జీవించడమే.

పాణర్జాతి పురుషుడిని పాణన్ అనీ స్త్రీని పాడిని అనీ తమిళంలో అంటారు. పాడినికి పాట్టి అనే పేరూఉంది. ఇవన్నీ సంగీతంతో పాటలు పాడేవాళ్లపేర్లు. [7]ప్రాచీనకాలంలో పాణుడు, పాడిని ఇద్దరూకలిసి రాజాస్థానాలకూ, ధనవంతులఇండ్లకూవెళ్లి, పాటలుపాడి, నాట్యంచేసి, వాళ్లను మెప్పించి, వారిచే పాణుడు బంగారుతామరపూవును, పాడిని ముత్యాలహారాలను సన్మానాలు పొందినారు. భార్యాభర్తలకు మనస్తాపాలు కలిగినప్పుడు వాళ్లమనస్తాపాలు పోగొట్టి, వాళ్లకు ఐకమత్యం చేకూర్చేది వీళ్లవృత్తుల్లో ఒకటిగా ఉండేది. ప్రాచీనకాలంనుండి సంగకాలంవరకు ఇట్లాగేనడచినట్లు తెలుస్తూంది. వీళ్లను రాజులు, ధనవంతులు ఆదరించి, వీళ్లకు ధనాన్నిస్తే అదంతా వాళ్లకూ వీళ్లకూ దానంచేసేవాళ్లు వీళ్లు. వీళ్లను ధనవంతులు రాజులు, ఆదరించకపోతే వీళ్లు దరిద్రులే.

[8]పాణర్జాతివాళ్లు చినిగిన పాతగుడ్డలుకట్టేవాళ్లు. చోళరాజైన కరికాళపెరువళత్తాన్ అనేరాజు వీళ్లను సన్మానించి, ఆపాతగుడ్డలుకట్టే ఆచారాన్నిమాన్పించినాడు. వీళ్లకు మద్యాన్ని ఇచ్చి త్రాగించి, వీళ్లను త్రాగుబోతులుగా కూడా చేసినాడు. వీళ్లను నాలుగుగుఱ్ఱాలుకట్టిన రథంలో

---

7. పత్తుపాట్టు, పానాట్రుపడై.

8. పానాట్రుపడై.

ఎక్కించి, ఊరేగించి, వీళ్లస్వస్థానం చేర్పించినాడు. ఇదంతా సంగకాలం వరకు సాగింది.

ఇవన్నీ చూస్తే ఆకాలంలో పాణులు నీచకులానికి చెందినవాళ్లుకారని తెలుస్తూంది. వీళ్లు చాలా అమాయకులు. తమకు రాజాస్థానాల్లో దొరికిన సంపదనంతా పంచిపెట్టేవాళ్లు. అందుచేత వీళ్లు మరలామరలా ధనవం తుల నాశ్రయించవలసివచ్చేది. అందుచేతనే వీళు రాజులను, ధనవంతు లను ఆశ్రయిస్తూవచ్చినారు.

సంగకాలానికి తర్వాతికాలంలో త్రాగడం, మాంసంతినడం మహా దోషమని శైవవైష్ణవ వైదికమతాలవాళ్లు నిర్ణయించినారు. ఈనిర్ణయాన్ని అనుసరించి, బ్రాహ్మణులు అబ్రాహ్మణులు త్రాగడం, మాంసంతినడం మానినారు. వాటిని మానని పాణర్లను వగైరాజాతులను ఊరికిదూరంగా ఉంచినారు. వారు ఊరిలోకి రాకూడనివారని, తాకరానివారని నిషేధించి నారు.

పాణర్లను ఊరికిదూరంగా ఉంచినా, నీచకులంవారని లోకంలో కొందరు చూచినా, దరిద్రమనే మహానరకంలో స్థిరంగాజీవిస్తున్నా, పాణర్లు చాలాకాలంగా తమిళదేశంలో సంగీతాన్ని కాపాడుతూ వస్తున్నారు. సంగీ తాన్ని ప్రధానవిద్యగా వీళ్లు ఉంచుకొన్నా. సంగీతవిద్వాంసులు వీళ్లను సం గీత విద్వాంసుల్లో లెక్కకట్టలేదు; ఆదరించనూ లేదు. వీళ్లుపాడేపాటలు ప్రధానంగా భగవంతుని కీర్తించేవిగాఉన్నా, వీళ్ల వంశస్థులు వన్నెకెక్క లేకపోయినారు. కారణం త్రాగడం, మాంసంతినడం వగైరా దురలవాట్లకు లోనుకాడవమే అయిఉండవచ్చు.

తిరుప్పాణాళ్వార్ల అవతారస్థలం

కావేరీనది చోళుల కులదేవత అనీ, తమిళదేశీయుల కులదేవత అనీ

తమిళకవులు రచించినారు. సంగీతవిద్వాంసులు ఆ పాటలు పాడినారు. కావేరీనది దక్షిణగంగ అనిపేరు పొందింది. చోళదేశఅన్నదాత అనీ కావేరీనదికి పేరుఉంది ఈ కావేరీనదినీళ్ల త్రాగితేనే బుద్ధిమంతులౌతారని తమిళుల నమ్మకము.

ఈనదిగట్టులో చోళరాజులు పాలించేగ్రామాల్లో తలమానికమైన గ్రామం "ఉరయూరు", దీన్ని "కోళి" అని పిలిచేవారు. ఊరు అంటే ఉరయూరు అనే కీర్తిప్రతిష్ఠలు ఆనాడు ఈ ఊరికి కలిగింది. ఆగ్రామంలో నీచకులంగా ఎంచబడిన పాణర్ కులంలో జన్మించినాడు తిరుప్పాణాళ్వార్లు. ఈతని తల్లిదండ్రులపేర్లు తెలియరాలేదు. తల్లిదండ్రులు ఇతనుపుట్టినప్పుడు ఇతనికిపెట్టిన అసలుపేరేమో ఎవరికీ తెలియదు. అయితే పాణర్కులంలో జన్మించినాడుకాబట్టి పాణర్ అనీ, తిరుప్పాణర్ అనీ పిలుస్తున్నారు. తమిళంలో పూజ్యవాచకంగా ''శ్రీ'' అనడానికి బదులు ''తిరు'' అనేపదాన్ని పేరుకు ముందుచేర్చడం పరిపాటి. ఆవిధంగా తిరుచేర్చిన రూపమే తిరుప్పాణర్.

తిరుప్పాణాళ్వార్ల జననం

*ఈతడు క్రీ.శ. 3-11-841 దుర్మతి సంవత్సరం కార్తీకబహుళ

---

*1. కలియుగ సంవత్సరం 3943 దుర్మతికార్తీకనెల 5 వ తేది శుక్లపక్ష విదియ బుధవారం రోహిణీ నక్షత్రమని – శ్రీవైష్ణవగురుపరంపర

2 క్రీ.శ. 8-9 శతాబ్దాలమధ్య తిరుప్పాణాళ్వార్ల జననమని – శివపార్వతమ్మ

3 క్రీ.శ. 8–9 మధ్యనుండనారు. ఆతరువాత తిరుప్పాణాళ్వార్లని పి. శ్రీ

4 క్రీ.శ. 841 సంవత్సరం వృశ్చికమాసం రోహిణీ నక్షత్రమని కె.టి.ఎల్. నరసింహాచార్యులు

5. క్రీ.శ 5–8 మధ్యవాళ్లు ఆళ్వార్లందరని డా॥ వి.ఎన్. హరిరావు

6. శ్రీవైష్ణవగురుపరంపర – దివ్యసూరిచరితం – ఉపదేశరత్నమాల మిగతాగ్రంథాలు కార్తీకనెల రోహిణీనక్షత్రంలో ఉరయూరులో జననమన్నాయి

7. అహోబిలగురుపరంపర – పరకాలకురుపరంపర – ప్రాచీనగురుపరంపర –కోవిల్ ఒళుగు ఇవన్నీ తిరుప్పాణాళ్వార్ల చరిత్రను ఒకేరకంగా తెలుపుతున్నాయి

ప్రతిపత్ గురువారం రోహిణీనక్షత్రంలో జన్మించినాడు. జన్మించింది పాణర్‌కులంలో. ఈతడు పెరిగిపెద్దవాడయ్యేకొద్దీ ఈతనిమనస్సు శ్రీరంగ నాథుని దివ్యశ్రీపాదపద్మాలపై వ్రాలసాగింది. ఇతడు పాణర్ కులానికి దీపంలాగ తయారయినాడు. కాలక్రమంగా సంగీతంతో భగవంతుని ప్రార్థించే పాటలు పాడనారంభించినాడు. గొప్పవాడైనాడు. సంగీతంతోపాడే పాటలు భగవంతునిమీది పాటలేకాని వేరేపాటలుకావు.

తిరుప్పాణాళ్వార్లు

దేవర్షియైన నారదమహర్షిలాగా భక్తిజ్ఞానవైరాగ్యాలతో ఇతడు శ్రీ రంగనాథుని ధ్యానిస్తూ, దండె చేతధరించి, తంత్రిమీటుతూ, పాటలు పాడుతూ ఉండేవాడు. సంగీతమే వేదమని ఇతని నమ్మకము. ఈ ఆళ్వార్లు భగవంతుని తలుస్తూ మనస్సుకరిగి, ఆసమయంలో తన మనస్సులోనుండి వచ్చినభావాలను సంగీతంతో మేళవించి పాడడమే ఇతని నిత్యకృత్యము. [1]ఇతని ఆరాధ్య దైవం శ్రీరంగనాథుడు. ఇతడు శ్రీరంగనాథుని సమీపించ కుండా కావేరికి ఆవలివైపుగట్టునుండేపాటలుపాడినాడు. తిరుప్పాణాళ్వార్లు ఎంతోభక్తుడు అయినా కావేరీనదికి ఆవలిగట్టున ఉండినాడేకాని శ్రీరంగ నాథుని సమీపించడానికి సాహసించలేదు. భగవంతుని దయగలిగినప్పుడే శ్రీరంగనాథుని నేరులోవెళ్లి దర్శించవచ్చునని ఇతని నమ్మకము. అందు కనే దక్షిణపుగట్టునుండే దేవాలయాన్ని దర్శించినాడు. కావేరీనది అలలు దేవాలయానికి రెండువైపులా చేతులుచాచినట్లు ఎగురుతూ ఉంటే ఆ అందా న్నిచూచి, మురిసిపోయి దండెను భుజానికెత్తి, తంత్రులుమీటుతూ, పాటలు

---

1. క్రీ.శ. శ-4 మధ్యగ్రంథమైన అహనానూరు శ్రీరంగాన్ని పేర్కొన్నది. కాబట్టి ఆనాటికే శ్రీరంగం ప్రసిద్ధమైనదని తెలియస్తూంది

సంగకాలపు కడపటిగ్రంథమైన శిలప్పదిగారమ్ వక్షస్థలంలో లక్ష్మితో శ్రీరంగ నాథుడు ప్రకాశిస్తున్నాడు అనింది.

పాడేవాడు. గొంతుతో పాడేపాటా, చేతిలోనితంత్రీనాదమూ రెండూ కలిసేవి. ఆనందపరవశుడయ్యేవాడు. ఇదిచూసేవాళ్లకళ్లూ, వినేవాళ్లచెవులూ, మనస్సూ ఎంతో ఆనందిస్తున్నాయి. మానవులేకాదు గంధర్వులుకూడా విని ఆనందిస్తున్నారు. వీళ్లందరేకాకుండా జగన్నాథుడైన శ్రీరంగనాథుడు కూడా చెవియొగ్గి, ఈపాటలను ఎంతో ఆప్యాయంతో వింటూ యోగనిద్ర పోతున్నాడు

ఈ తిరుప్పాణాళ్వార్లు ప్రతిరోజూ సూర్యోదయానికిముందే అళకియ మణవాళన్ అనే శ్రీరంగనాథుని అందాన్ని మనస్సులో స్మరించి, ఆ స్మరణలో దండెను మీటుతూ పాడుతున్నారు. భగవంతుని అందమనే అమృతాన్ని వర్ణించేకీర్తనల పుష్పాలను పాడుతున్నారు - వెదజల్లుతున్నారు. భక్తులకు అమృతప్రాయమైన శ్రీరంగవైభవాన్నీ అమృతప్రాయుడైన శ్రీరంగనాథుని గొప్పతనాన్నీ, భక్తులహృదయాలు కరిగేటట్లూ, ఒళ్లుమైమరచేటట్లూ పాడుతున్నాడు. కండ్లల్లో ఆనందబాష్పాలు కారుతున్నాయి. ఈవిధంగా అనుదినమూ తెల్లవారుఝామున లేచివచ్చి, భగవత్కైంకర్యం చేస్తున్నాడు.

తిరుప్పాణాళ్వార్లు శ్రీ రంగనాథుని దర్శించడం

భగవంతుడైన శ్రీరంగనాథునికి కరుణకలిగింది. తానే స్వయంగా వచ్చి, తిరుప్పాణాళ్వార్లు కోరకపోయినా తిరుప్పాణాళ్వార్లకు దర్శనమిప్పించినాడు. పాదాలుమొదలు కిరీటందాకా దర్శించినాడు. ఒక్కొక్క అవయవాన్ని దర్శిస్తూ అమలనాతిపిరాన్ అని పాడనారంభించినాడు. పదే పది పాటలు పాడినాడు. తుదిని ఆపాదమస్తకంగా దర్శించి, పాడి పరవశుడై గెంతులు వేస్తున్నాడు. ఆదారినవెళ్లేవాళ్లంతా ఇదిచూచి ''వీడికి పిచ్చిపట్టింది'' అంటూ పెదిమెలు విరుచుకొంటూ పోతున్నారేకాని ''అయ్యో పాపం'' అనేవాళ్లు ఎవరూలేరు. ఇతనికి భగవంతుడు నిజంగా దర్శన

మిచ్చినాడన్న విషయం వీళ్లల్లో ఎవరికీ తెలియదు. అందుకని అతణ్ణి చూస్తూ ఎవరిదారినవాళ్లు వెళ్లతున్నారు. దీనికంతటికీ కారణం నీచకులంలో జన్మించిభక్తుడుకావడం - పాటలుపాడడం. ఇట్లాచాలాకాలం జరిగిపోయింది.

లోకసారంగముని

ఏనాడూ తటస్థించంది ఒకనాడు తటస్థించింది. శ్రీరంగనాథుని అభిషేకానికి లోకసారంగముని బంగారుబిందెతో తీర్థం తెస్తున్నాడు. శ్రీవైష్ణవస్వాములు వేదపఠనంచేస్తూ కూడా వస్తున్నారుకొందరు. ద్రావిడ వేదాన్ని పఠిస్తూవస్తున్నారు కొందరు. వాళ్లువెళ్లేదారికడ్డంగా నిలిచి ఆనాడు తిరుప్పాణాళ్వార్లు మైమరచి పాటలుపాడుకొంటున్నాడు. తాను పరవశుడై ఉండడం మూలాన తిరుప్పాణాళ్వార్లు లోకసారంగమునిరాక గమనించలేదు. లోకసారంగముని దూరంనుండే దారికిఅడ్డంగా ఉండేవానిని చూచినాడు. నుదుట నామంలేదు, మెడలో జంధెంలేదు, కోపంవచ్చింది. ''దూరంగా తొలగిపోరా'' అని అరచినాడు. ఆవాక్యాలు తిరుప్పాణాళ్వార్లచెవుల్లో పడలేదు. ఆతనిధ్యానమే అతనిది, ఆతనిపాటలే ఆతనివి. మరలా రెండుమూడుపర్యాయాలు ''ఏమిరా చెప్పేది నీకే దూరంగా తొలగిపో'' అని గద్దించినాడు లోకసారంగముని. తిరుప్పాణాళ్వార్లు శ్రీరంగనాథునిలో లీనమైపోయి, పాటలుపాడడం మునివరుడు తెలుసుకోలేదు. తెలుసుకోలేడు కూడా. కొన్నివైదికాచారాలతోకూడిన కట్టుబాట్లకులోబడిన వైదికఛాంద సుడు తిరుప్పాణాళ్వార్లభక్తిని ఏవిధంగా తెలుసుకోగలడు ?

ధూర్తబ్రాహ్మణుని దౌష్ట్యం

"నీచకులంలో జన్మించినవీడు శ్రీరంగనాథుని తీర్థపుబిందెకు అడ్డంగా నిలబడడమా?" అని తిరుప్పాణాళ్వార్ల భక్తిని తెలుసుకోలేని లోకసారంగ మునితోకూడా ఉండే ఇంకాకొంతమంది వైదికఛాందసులు ఉరుముతున్నారు.

''వీడు నీచుడు, వీడుతొలగిపోకుండా ఉండడానికి వీడి పిడివాదము, వీడి మూర్ఖత్వము కారణం'' అంటూ ఇంకాకొందరు అంటున్నారు. ఎవరు ఏమన్నా, ఎంతమంది తొలగిపొమ్మంటున్నా స్వామిని అంతర దృష్టితో చూచి, ఆనందిస్తుండే తిరుప్పాణాళ్వార్ల చెవుల్లో ఆమాటలేపడలేదు. తాను పాడుతూ, సంతోషిస్తూ, గెంతులేస్తున్నాడు. వీడు సంగీతాన్ని వెదజల్లే మహర్షో యోగో కాబోలు! అంటూ ప్రక్కగా వెళ్లుతున్నారు కొందరు. ఈ హడావిడిలో జపం లెఖసరిగాసాగలేదని జపంచేస్తూ వ్రేళ్లద్వారా లెఖ వేస్తున్నారు కొందరు శ్రీవైష్ణవస్వాములు. లోకసారంగమునితోకూడా ఉండేవాళ్లల్లో ఘూర్తుడైన శ్రీవైష్ణవుడొకడు ''వీడినిదూరంగా తరమకుండా మనం తీర్థపుబిందెతో లోపలికి వెళ్లడానికి వీల్లేదు. అందుచేత వీడిని తరిమితీరాలి. ఇదిగో నేను తరుముతాను చూడండి'' అని ప్రగల్భాలు పలుకుతూ రొమ్ము చరుచుకొంటూ ఒకరాతినితీసి తిరుప్పాణాళ్వార్లపై విసిరినాడు.

తిరుప్పాణాళ్వార్లకు గాయం తగలడం

ఆరాయి తిరుప్పాణాళ్వార్ల తలపైపడింది. రాయితలపైపడిందికూడా తిరుప్పాణాళ్వార్లకు తెలియలేదు. అయ్యోపాపం! తలపై బలమైనగాయం తగిలింది, నెత్తురుకారుతూంది, ఒళ్లంతా నెత్తురే, ఇట్లావున్నా ఇతని మనస్సు భగవంతుణ్ణే ప్రేమిస్తూంది. అతన్నే పాడుతున్నాడు, తనపైరాయివిసరిన మూర్ఖుడెవడోకూడా ఇతనికి తెలియదు. ఇదంతా చూస్తుండే జాలిగుండెగల వాళ్లు కొందరు ''అయ్యోపాపం అమాయకుణ్ణి అకారణంగా కొట్టినారు'' అని మెల్లమెల్లగా లోలో గొణుగుకొంటూ దూరంగా వెళ్లిపోతున్నారేకాని "అతణ్ణి ఇట్లాఎందుకు కొట్టినారని" ఎవరూ అడగలేదు. ఆ శ్రీవైష్ణవ స్వాములను అడిగేధైర్యం ఆనాడు అక్కడచేరినవాళ్లల్లో ఎవరికీలేదు.

కొంతసేపటికి తిరుప్పాణాళ్వార్లకు ఈలోకజ్ఞానం కలిగింది. కన్నులు

తెరచి చూచినాడు. నెత్తిపైన బలమైనగాయం ఉంది. ఒళ్లంతా రక్తమై ఉంది. దీనికికారణం ఇతనికి తెలియదు. కన్నులుతెరవగానే ఎదుటకనిపించిన శ్రీవైష్ణవ వైదికస్వాముల సమూహాన్ని చూచినాడు. అయ్యో! వీళ్ల మనస్సుకు బాధకలిగే విధంగా దారికి అడ్డంగా ఇక్కడ నిలిచినామే అని వాళ్లకు నమస్కారం చేసి దూరంగా వెళ్లి నిలిచి మునుపటివలెనే దండె మీటుతూ పాడుతున్నాడు.

శ్రీ రంగనాథస్వామికి దెబ్బతగలడం రాజుకు తెలియడం

ధూర్తుడు మూర్ఖుడు అయిన శ్రీవైష్ణవుడు తిరుప్పాణాళ్వార్లపై విసిరివేసిన రాయి ఆతని తలపై తగిలి వెంటనే శ్రీరంగనాథుని తలపై పడ్డట్లుంది. శ్రీరంగనాథుని తలపై గాయం కలిగి, నెత్తురు కారుతూ ఉంది. ఈ విషయాన్ని అర్చకులు గుర్తించినారు. ఏదో అపచారం జరిగి ఈ విధంగా నెత్తురు కారుతూ ఉందని భయపడ్డారు. అధికారులకు విన్నవించినారు. భగవంతునికి దెబ్బతగిలి, నెత్తురు కారే విషయం రాజు గారికి తెలిసింది. కారణం తెలుసుకోవాలని తహతహలాడిపోతున్నాడు రాజు.

లోకసారంగమునికి శ్రీరంగనాథుని ఆజ్ఞ

తిరుప్పాణాళ్వార్లకు తలపై బలమైన గాయం తగిలి నెత్తురు కారడం లోకసారంగముని చూచినాడు. మనస్సులో అయ్యో! పాపం అను కొన్నాడు. లోలో బాధపడ్డాడు. అంతే. పైకి చెప్పలేకపోయాడు. తిరిగి స్నానం చేసి నిత్యానుష్ఠానాలు తీర్చుకొని, బంగారు బిందెలో తీర్థం తీసుకొని, దేవాలయాన్ని ప్రవేశించినాడు. భగవంతుడు ఎప్పటి మాదిరి లోకసారంగమునికి దర్శన మివ్వలేదు. తలపై గాయం నెత్తురు కారుతూ

దర్శనమిచ్చినాడు. ఆ భగవంతుణ్ణి దర్శించగానే మునికి కోపమనేది ఎరుగని భగవంతుని హృదయం ఎంతో కలతచెందడం కనిపించింది "అయ్యో! ఎవరు నా స్వామిని ఇట్లా కొట్టినవారు?" అని అరుస్తు ఏడుస్తున్నాడు. "నా భక్తుణ్ణి నీవు ఇట్లా కొట్టవచ్చా?" అని భగవంతుడు అడుగుతున్నట్లూ, కోపిస్తున్నట్లూ లోకసారంగముని చూచి నాడు. నేనేమీ చేయలేదని ప్రాధేయపడ్డాడు. అక్కడ ఉన్నవారికి ఇదంతా ఏమిటో తెలియక తికమక పడుతున్నారు. లోకసారంగముని ఇంటికి వెళ్లినాడు - ఏమీ తోచలేదు - రాత్రి నిద్రపట్టలేదు - కన్నులు మూసినా - కన్నులు తెరిచినా - ఎటు చూచినా - భగవంతుడు "ఇట్లా కొట్ట వచ్చా?" అనే అడుగుతున్నట్లూ, కసురుకొంటున్నట్లూ కనిపిస్తున్నాడు. లోకసారంగమునికి ఏమీ తోచలేదు. ప్రాధేయపడి లాభం లేదని "మిమ్మల్ని ఇట్లా కొట్టిన మహాపాపి ఎవడు స్వామీ?" అని నిలదీసి గద్దించి అడిగినాడు ముని. "ఏమీ తెలియని నంగనాచిలాగ మాట్లాడు తున్నావే. భాగవతుడవైన నీవే నన్నిట్లా కొట్టింది" అన్నాడు శ్రీరంగ నాథస్వామి. ఆ మాటలు విని మునివరుడు రెండు చేతులతో రెండు చెవులూ మూసుకొని "హరి హరీ! నేనా కొట్టింది మిమ్మల్ను" అంటూ గడ గడ వణకిపోతున్నాడు.

కొంత సేపటికి తెప్పరిల్లి "నేనా? నేనేమీ చేయలేదే?" అన్నాడు ముని. "మూర్ఖుడా మరలా మరలా అదే మాట అంటున్నావా. మీలో ఒకడు విసిరిన రాయేకదా నా నెత్తిమీద పడి, గాయమైంది?" అన్నాడు శ్రీరంగనాథస్వామి. "స్వామీ మేము మీమీద రాయి వేయ లేదే? ఆహా! తెలిసింది. ఓహో! అదా సంగతి. మేము మీ పూజకు బంగారు బిందెలో తీర్థం తెస్తుంటే కడజాతి మూర్ఖుడొకడు దారికి అడ్డంగా నిలిచినాడు. తొలగి దూరంగా పొమ్మంటే పోలేదు. మీ కైం కర్యాలకు ఆలస్యమౌతుందని మాలో ఎవడో వానిపై రాయి విసిరినాడు - అంతేకాని మీ మీద కాదే రాయి వేసింది" అన్నాడు లోకసారంగ

ముని. " మీరు నా ఆంతరంగిక భక్తునిమీద విసిరివేసిన రాయి ఆతని తలపై పడింది. ఆతనికి గాయమైంది. అంతేకాకుండా ఆరాయే తిరిగి వచ్చి నా నెత్తినకూడా పడింది. గాయమైంది" అన్నాడు భగవంతుడు. భగవంతుడూ లోకసారంగమునీ ఇట్లా వాదప్రతివాదాలు చేసుకొంటూండగానే తెల్లవారబోతూంది. భగవంతుడు అంతర్థానం కాబోతూ మునివరుడితో చెప్పిన ఈ మాటలు ఆతని చెవుల్లో హోరున వినిపిస్తున్నాయి. *" నా అంతరంగిక భక్తుడైన పాణ్ పెరుమాళ్లను హీనుడనీ, కడజాతి వాడనీ ఎంచవద్దు. ఆతడు నాకు అత్యంత ప్రియుడు. అగ్రజాతులవారి భక్తి కొంచమైనా దాన్ని గొప్పగా వర్ణిస్తారు. కడజాతివాడు ఆడంబరంలేకుండా ఎంతో భక్తితో ఉన్నా వాణ్ణి నీచుడంటారు. అగ్రజాతులవాళ్లు దేవాలయాలు కట్టి, ఆ దేవాలయ ప్రాకారాలమధ్యా నన్ను బంధిస్తున్నారు భక్తితో ఎవడు నన్ను ప్రేమించి, ఆరాధిస్తాడో వాడికి పరమపదం ఇస్తాను. వాడు ఏ జాతి వాడైనా సరే నాకు ఇష్టమే. కాబట్టి ఆ కడజాతివాడైన తిరుప్పాణన్ని నీ మూపుపై ఎక్కించుకొని నా దగ్గరకు ఇక్కడికి తీసుకొనిరా "* అన్న మాటలు వినీ వినకముందే బావురుమని ఏడుస్తూ సాష్టాంగంగా నమస్కరించి "స్వామీ ! ఈ దాసుడు భాగవత అపచారాన్ని చేసినాడు. క్షమించండి. దీన్ని దాటి కడతేరే మార్గం సెలవివ్వండి " అని అడుగుతుండగనే భగవంతుడు కనుమరుగైనాడు.

" పాణన్ని నా భుజంపై ఎక్కించుకొని రమ్మన్నాడు స్వామి. వాడు నీచుడు - కడజాతివాడు ఎట్లా ఎక్కించుకొని వచ్చేది? నేనా అగ్రజాతివాడిని అందులోనూ శ్రీవైష్ణవ బ్రాహ్మడిని " అనే జాత్యహంకారంతో బాధపడుతున్నాడు ముని. అయినా స్వామికి కోపం వస్తుందని మనసును సమాధాన పరుచుకొన్నాడు. '' ఈ నాటి సూర్యోదయం నాకు జ్ఞానోదయాన్ని కలిగించింది '' అంటూ భగవంతుని ప్రార్థిస్తూ మైమరచి, కావేరీ తీరానికి వెళ్లి స్నానం చేసి, తాను నిత్యానుష్ఠానాలు తీర్చుకొని, పాణడిరాకకై ఎదురుచూస్తూ స్నానానికి వచ్చిన శ్రీవైష్ణవ స్వాముల కంద

రికి స్వామి ఆజ్ఞను తెలిపినాడు లోకసారంగముని. అందరూ గుమికూడి చూస్తున్నారు. శ్రీరంగనాథుని పాడుతూ ఎంతో దూరంలో పాణర్ వస్తున్నాడు.

తిరుప్పాణాళ్వార్లను లోకసారంగముని భుజంపై ఎక్కించుకొనడం

ఆతణ్ణి సమీపించడానికి లోకసారంగమునివరుడూ శ్రీవైష్ణవ స్వాములూ వెళ్లినారు. మైమరచి భగవంతుణ్ణి ఆంతరదృష్టితో దర్శించి పాడే పాణుడికి అందరూ నమస్కరించినారు. ఇది గమనించని పాణుడు "అంతా భగవంతుని దయ" అంటూ అలవాటు ప్రకారం పాడుకొంటూ పోతున్నాడు. "మిమ్మల్ని భుజంపై ఎక్కించుకొని శ్రీరంగనాథస్వామి తమ దేవాలయానికి తెమ్మన్నారు'' అని లోకసారంగముని ప్రాధేయపడి, వెంటాడినాడు. కానీ లాభం లేకపోయింది. వెంటనే లోకసారంగముని అడ్డంగావెళ్లి ఆతని కాళ్లు పట్టుకొని, స్వామి ఆజ్ఞను సవినయంగా విన్నవించినాడు. కాళ్లు రెండూ విదిలించుకొని "అయ్యో! నేను నీచుణ్ణి - నేను శ్రీరంగనాథుని సమీపిస్తానా? - అందులో బ్రాహ్మణోత్తముడవైన నీ భుజంపై ఎక్కిరావడమా? హరి హరీ మహాపాపం'' అంటూ పరుగిడినాడు. ఒకే పరుగులో పాణయ్య మాలపల్లె ప్రవేశించినాడు. పాణయ్యను వెంటాడుతూ లోకసారంగమునీ, శ్రీవైష్ణవ స్వాములూ వెళ్లినారు. మాలలంతా కలిసి ఒకే గోల. "రావద్దండి. రావద్దండి. శ్రీవైష్ణవ స్వాముల్లారా ఇది మాలపల్లె! బ్రాహ్మణులు రాగూడదండి. మీరు మాలపల్లెకొస్తే మా పల్లెకు అనర్థం. రాకండి - రాకండి'' అని. ఎవరెంత చెప్పినా వినిపించుకోకుండా మాలపల్లె ప్రవేశించి, ఎట్లాగో పాణయ్యను పట్టుకొని శ్రీరంగనాథుని ఆజ్ఞను అందరికీ తెలిపి, పాణయ్యను తన భుజం మీద ఎక్కించుకొన్నాడు మునివరుడు. అప్పుడు పాణయ్య "హరి హరీ

ఏమి పాపము చేసినానో, పోనీ భగవంతుని ఇష్టంవచ్చినట్లు చేయనీ '' అంటూ చేతులు రెండూ పైకెత్తి నమస్కరిస్తూ రంగనాథునికే తనను దాసుణ్ణిగా చేసుకొన్నాడు. లోకసారంగముని పాణయ్యను భుజంపై ఎక్కించుకొని, చకచకా శ్రీరంగనాథస్వామి సన్నిధిని సమీపించినాడు. శ్రీవైష్ణవ స్వాములూ, మాలలూ జయ జయ ధ్వానాలుచేస్తూ వెంట వచ్చినారు. పాణయ్య శ్రీరంగనాథుని కన్నులార సేవించినాడు. ఇంతకుముందు అంతరదృష్టితో శ్రీరంగనాథుని సేవించి ''అమలనాతిపిరాన్'' అని పాడిన పాటలు తిరిగీ ఇప్పుడు పాడి, శ్రీరంగనాథుని మనస్సు కొల్లగొన్నాడు. నిత్య దరిద్రుడు నిధిని చూచి, మైమరచినట్లు ఇతడు శ్రీరంగనాథుని నేరులో దర్శించి మైమరచినాడు. లోకసారంగముని పాణయ్యను దేవాలయంలో దించినాడు. పాణయ్య శ్రీరంగనాథుని పాదంనుండి కిరీటం దాకా దర్శించి, ఆనందతాండవం చేస్తున్నాడు.

పాణయ్యకు శ్రీరంగనాథుడు బిరుదు ఇవ్వడం

పాణయ్య కోరకుండా ఏ ప్రయత్నమూ చేయకుండా ఇంతకు పూర్వం కావేరీతీరంలో దర్శనమిచ్చిన శ్రీరంగనాథ రూపమే ఇక్కడ నిలిచి, తిరిగి దర్శన మిస్తుండడం పాణయ్యకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. అతని ఆనందానికి అంతులేదు. అప్పుడు పాడిన పాటలే తిరిగి తిరిగి స్వామి సన్నిధిని గానంచేస్తూ గెంతులేస్తున్నాడు. అప్పుడు పాణయ్య భక్తికీ గానానికీ శ్రీరంగనాథస్వామి మెచ్చి *"ఈ పాణుడు నా భక్తుడు. భక్తుడేకాదు, నా అంతరంగిక భక్తుడు. హీనుడనీ, కడజాతి వాడనీ ఎంచకండి. భక్తితో ఎవడు నన్ను ప్రేమించి, ఆరాధిస్తాడో వాడికి పరమపదం ఇస్తాను. వాడు ఏజాతివాడైనా నాకు ఇష్టమే. కాబట్టి కడజాతి వాడు, నాకు అంతరంగిక భక్తుడు అయిన పాణయ్యను ఇకపై "తిరుప్పాణాళ్వార్లని" పిలవండి. ఈ బిరుదాన్ని ఇతనికి నేను ఇస్తున్నాను. ఇదిగో ఇతన్ని పరమపదానికి తీసుకొని వెళ్లుతున్నాను"*. అని పాణయ్యను తనలో

లీనం చేసుకొన్నారు. అందరూ చూస్తుండగనే ఇదంతా జరిగిపోయింది అచ్చట చేరిన శ్రీవైష్ణవులు తిరుప్పాణాళ్వార్ల భక్తికి దాసోహమన్నారు వెంటనే శిల్పులను రప్పించి, తిరుప్పాణాళ్వార్ల విగ్రహాన్ని చెక్కించి, శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి, పూజింప సాగినారు. పాణుడనీ పాణరనీ పాణయ్య అనీ పిలువబడేవాడు తిరుప్పాణాళ్వారై నేటికీ పూజింపబడుతున్నాడు.

జాతి - మతాలు

ఉత్తమకులంలో జన్మించిన వాళ్ళమనీ సదాచారవంతుళ్ళమనీ ఉత్తమ బ్రాహ్మణులమనీ రొమ్ములు విరుచుకొని తిరిగే చతుర్వేదాధ్యయనం చేసిన బ్రాహ్మణులను చూచి భగవంతుడు ఇట్లా అన్నాడు —

* " ఓ చతుర్వేదులారా ! వంశ పరంపరగా బ్రాహ్మణ వంశంలో జన్మించినవాళ్లూ చతుర్వేదాధ్యయనం చేసినవాళ్లూ మాత్రమే పూజింపతగినవాళ్లనీ మిగతావాళ్లు పూజింపతగినవాళ్లు కాదనీ మీరు తలస్తున్నారు. అట్లా తలచకండి. ఏ జాతిలో పుట్టినవాడైనా నా భక్తుడైతే వాడిని మీరు పూజించవలసిందే. మీలోని జ్ఞానాన్ని వాళ్లకు పంచి పెట్టవలసిందే. వాళ్లనుండి మీరూ తెలుసుకోవలసిన విషయాలుంటే తెలుసుకోవలసిందే. మీరు భగవంతుడైన నన్ను ఏవిధంగా ఆరాధిస్తున్నారో ఆవిధంగానే ఇతర జాతులలోని నా భక్తులను ఆరాధించవలసిందే ''.

ఇంకా —

* " ఋగ్యజుస్సామాథర్వణ వేదాలను నాల్గింటినీ శిక్షావ్యాకరణం ఛందస్సు నిరుక్తం జ్యోతిషం కల్పం అనే వేదాంగాలను ఆరింటినీ నోటికి

---

* తొండరడిపొడి (భక్తాంఘ్రిరేణు) ఆళ్వార్ల తిరుమాల 42 పా
* తొండరడిపొడి (భక్తాంఘ్రిరేణు) ఆళ్వార్ల తిరుమాల 43 పా

వచ్చేటట్లు చదివి వానిలోని అర్థాలను తెలుసుకొని, భగవత్కైంకర్యం చేసేదే ప్రధానంగా పెట్టుకొని, భగవంతుని అంతరంగ భక్తుడుగా ఉన్న అగ్రవర్ణములవాడు నీచకులంలో జన్మించి, పై చెప్పిన చదువులు ఏవీ చదవకుండా నాకు సేవచేయడమే మానవ జన్మ ఎత్తినందుకు ఫలమని నమ్మి నాకు సేవ చేస్తుండే నీచకులం వాణ్ణి గౌరవించకుండా వీడుశూద్రుడు, వీడు మాల, వీడు నీచకులంలో జన్మించినవాడు అని అంటూ వాళ్ల జాతిని దూషించినా వాడిని దూషించినా ఆ దూషించినవాడు అగ్రవర్ణములవాడైనా కర్మచండాలుడౌతాడు ఎప్పుడో రాబోయే జన్మంలో కర్మచండాలుడౌతాడను కొంటారేమో ! కాదు — ఇప్పుడే - ఈ జన్మలోనే - ఆ మాట చెప్పిన క్షణంలోనే ".

అని తిరుప్పాణాళ్వార్లకు ముందువాడూ అగ్రవర్ణమునకు చెందిన వాడూ అయిన తొండరడిపొడి (భక్తాంఘ్రిరేణు) ఆళ్వార్లు చెప్పినారు.

వేదాల్లో ఉపనిషత్తుల్లో భగవద్గీతలో శృతుల్లో స్మృతుల్లో పురాణాల్లో సంస్కృతంలో చెప్పిన విషయాలనే తమిళంలోకి పన్నిద్దరు ఆళ్వార్లు అనువదించినారు

* శ్లో॥ శృతి స్మృతి ర్మమైవాజ్ఞా యస్తాముల్లంఘ్య వర్తతే ।
ఆజ్ఞాచ్ఛేదీ మమ ద్రోహీ మద్భక్తోపి న వైష్ణవః ॥

శృతులు, స్మృతులు చెప్పిందంతా నేనే. వాటిని ఎవడు కాదంటాడో వాడు నా ఆజ్ఞను తిరస్కరించినవాడు. వాడు నాకు ద్రోహము చేసినవాడు. వాడు నా భక్తుడైనా వైష్ణవుడు కాడు.

అన్నాడు భగవంతుడు.

---

* ఈ శ్లోకం ఎక్కడిదో తెలియదు. శ్రీవైష్ణవ సంప్రదాయ గ్రంథాల్లో ఉదాహరింప బడింది.

బృహదారణ్యకోపనిషత్తులోను మహాభారతం శాంతిపర్వం (188 అధ్యా) లోను క్రింది విధంగా చెప్పబడింది.

మొదట బ్రహ్మచేత సృష్టింపబడిన వాళ్లంతా బ్రాహ్మణులే. అందులో బ్రాహ్మణ ధర్మాలను వదలి కామం మీద ఎక్కువ ఆసకల వాళ్లూ క్రూరస్వభావం కలవాళ్లూ సాహసగుణం కలవాళ్లూ అయిన బ్రాహ్మణులే క్షత్రియులని పిలువబడ్డారు. పశువులను మేపేవాళ్లూ వ్యవసాయం చేసేవాళ్లూ అయిన బ్రాహ్మణులే వైశ్యులని పిలువబడ్డారు. హింసతో కూడిన పనులు చేసేవాళ్లూ అబద్ధాలు చెప్పేవాళ్లూ సత్యాన్ని ధర్మాన్నీవదలి, ఎటువంటి పనినైనా చేసేవాళ్లూ నల్లగా ఉండేవాళ్లూ శుచిగా ఉండనివాళ్లూ అయిన బ్రాహ్మణులే శూద్రులని పిలువబడ్డారు. అంతేకాని ప్రత్యేకంగా జాతులు ఉన్నట్లు చెప్పలేదు.

జాతి ఫలానిది అని తెలియనప్పుడు అతడు అనుసరించే గుణాలే అతని జాతిని నిర్ణయిస్తుంది అనీ. సత్యాన్ని చెప్పడం చేతనే సత్యకామ జాబాలి బ్రాహ్మణుడు అయ్యాడనీ ఛాందోగ్యోపనిషత్తు చెప్తూంది.

క్షత్రియుడైన గర్గునికి శిని, అతనికి గార్గ్యుడు పుట్టితే ఆ వంశంలోని వాళ్లంతా బ్రాహ్మణులయ్యారు. మహావీరునికి త్రయ్యారుణి, కవి, పుష్కరారుణి అనే కొడుకులు పుట్టితే వాళ్లు బ్రాహ్మణులయ్యారు. అజామీఢునికి ప్రియమేధాదులయిన కొడుకులు కలిగితే వాళ్లూ బ్రాహ్మణులయ్యారు. (మహాభారతం 9-21-17,20 శ్లో; శాంతి 29 అధ్యా 5వ శ్లోకంలోను ఆపస్తంబ ధర్మసూత్రాల్లో (5-11,11 శ్లో)నూ ఈ విషయం స్పష్టంగా చెప్పబడింది.

ఇంకా

మహాభారతం శాంతిపర్వం 189వ అధ్యాయంలో భృగువు భరద్వాజ మహర్షికి బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర మ్లేచ్ఛ పిశాచ రాక్ష

సాదుల గుణకర్మాలను చెప్పినాడు. అందులోకూడా పైవిధంగానే తెలుపబడిఉంది. ఈ భాగానికి వ్యాఖ్యవ్రాస్తూ నీలకంఠులుకూడా "వారు అనుసరించే ధర్మాలే కారణంగాని జాతి కారణం కాదు" అన్నారు.

మహాభారతం శాంతిపర్వంలో చెప్పిన విషయాలే వాయుపాద్మ గారుడ వామన నారసింహాది పురాణాలలో చెప్పబడ్డాయి.

సర్వసిద్ధాంత సంగ్రహం (47–49 శ్లో)లో శ్రీ శంకరాచార్యులు కూడా వ్యాసుల మతాన్నే అంగీకరించినారు.

కట్టకడపట మహాభారతం అనుశాసనికపర్వం (143 అధ్యా 48, 49 శ్లో)లో శివుడు పార్వతీదేవికి ఈ విషయాన్ని క్రిందివిధంగా స్పష్టంగా వివరించి చెప్పినాడు.

శ్లో॥ న యోని ర్నాఽపి సంస్కారో న శ్రుతం న చ సంతతిః ।
కారణాని ద్విజత్వస్య వృత్తమేవ తు కారణమ్ ॥

"ఎవరి కడుపులో జన్మించినాడు అనేదిగాని - వానికి జరిగిన సంస్కారాలుగాని - చదువుకొన్న చదువుగాని - వంశంగాని - వాడు బ్రాహ్మణుడు అని చెప్పడానికి కారణాలు కాజాలవు. వాని నడవడే వాడు బ్రాహ్మణుడు అనడాన్ని నిరూపిస్తుంది" అని.

పురుషసూక్తంలో విరాట్పురుషుని అంటే భగవంతుని ముఖంనుండి బ్రాహ్మణులు పుట్టారనీ - బాహువుల నుండి రాజులు పుట్టారనీ - తొడల నుండి వైశ్యులు పుట్టారనీ - పాదాలనుండి శూద్రులు పుట్టారనీ చెప్పబడి ఉంది. అంతేకాని అందులోకూడా పంచమజాతి అంటూ ఒకటి ఉన్నట్లు చెప్పలేదు. ఆతర్వాత క్రమంగా స్మృతుల కాలానికీ పురాణాల కాలానికీ పంచములు అంటూ ఒకతెగ ఏర్పడ్డట్టు తెలుస్తూఉంది. కర్మచండాలు

రైన బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులంతా జాతిచండాలురుగా పరిగణింప బడ్డారు.

పైన చెప్పిన విషయాలను బట్టి చూస్తే భగవద్భక్తులు ఏ జాతి వారైనా ఏ మతంవారైనా పూజింప తగినవారనే విషయం స్పష్టంగా తెలుస్తూఉంది.

మన తిరుప్పాణాళ్వార్లు ఎక్కడ జన్మించినా - ఏ వైదిక సంస్కారమూ అతనికి జరగక పోయినా - అతడు ఎక్కడా విద్యా నేర్వాకపోయినా - అతని వంశం గొప్పది కాకపోయినా - ఆతని భగవద్భక్తి ఆతని నడవడి అతన్ని ఇన్నివందల ఏండ్లుగా ఉత్తమ బ్రాహ్మణునిగా పరిగణింపజేసినాయి. ఇతడే ఉత్తమ బ్రాహ్మణుడు. ఇతడు ధన్యుడు.

శ్రీవేంకటేశ్వరుని ఘంటావతారుడు - వైదిక సదాచారసంపన్నుడు - సద్బ్రాహ్మణుడు - మహాపండితుడు - కవితార్కిక కేసరి - శ్రీ విశిష్టాద్వైత మత స్థాపనాచార్యుడు అయిన శ్రీ వేదాంతదేశికులచేత తన అమలనాతి పిరాన్ అన్న పదిపాశురాలకు మునివాహనభోగమనే విపులమైన వ్యాఖ్యను రచింపించుకొన్న ధన్యజీవి - ఉత్తమ బ్రాహ్మణుడు తిరుప్పాణాళ్వార్లు.

<u>తిరుప్పాణాళ్వార్ల గొప్పతనం - విగ్రహప్రతిష్ఠ - మర్యాదలు.</u>

ఇంత మహనీయుడు కాబట్టి శ్రీరంగంలో తిరుప్పాణాళ్వార్ల కీర్తి ప్రతిష్ఠలు ఆచంద్రార్కంగా ఉండేటట్లు క్రింది విధంగా మన ప్రాచీనులు ఇతన్ని సత్కరించినారు. నేటికీ ఈ మర్యాదలు శ్రీరంగంలో ఇతనికి నడుస్తున్నాయి.

1. శ్రీరంగంలో దీపావళి పండుగరోజు అందరి ఆళ్వార్లతో పాటు తిరుప్పాణాళ్వార్లనుకూడా మహామండపముందుండే కిళిమండపం లోనికి వేంచేపుచేసి, వస్త్ర బహుమానము, చందన బహుమానము, శఠారి బహుమానము చేసి సన్మానిస్తున్నారు.

2. చాంద్రమానం ప్రకారం కార్తీకమాసం, సౌరమానం ప్రకారం తులామాసం - ఈ నెలలో కావేరినుండి బంగారు బిందెతో శ్రీరంగనాథునికి తీర్థం తెస్తున్నారు. బంగారు గిన్నెలతో స్వామిని పూజిస్తున్నారు. ఇది ఆనాటినుండి నేటివరకు తిరుప్పాణాళ్వార్ల జ్ఞాపకార్థము జరుగుతూఉంది. లోకసారంగముని బంగారుబిందెతో తీర్థం తెస్తూనేకదా ఈయన్ను చూచింది.

3. తిరుప్పాణాళ్వార్ల విగ్రహాన్ని A.D. 1432 కు తర్వాత సాత్తాద నరసింహదాసన్ అనేవాడు ప్రతిష్ఠించినాడని కోవిల్ ఒఴుగు చెప్తూంది.

4. విజయనగర ప్రభువైన సాళువ గుండభూపతి A.D. 1490 లో తిరుప్పాణాళ్వార్ల విగ్రహాన్ని మొట్టమొదటి సారిగా ప్రతిష్ఠింప జేసినట్లు శ్రీరంగంలోని శాసన సంపద తెలుపుతూంది.

5. నాచ్చియార్ ప్రాకారమండపంలో (శ్రీరంగంలో) మధుర నాయకరాజు చొక్కనాథనాయకుడు 17వ శతాబ్దంలో పన్నిద్దరాళ్వార్లను స్తంభాలపై చెక్కించినాడు. అందులో తిరుప్పాణాళ్వార్లూ ఉన్నారు.

6. శ్రీరంగంలో నాచ్చియార్ కల్యాణమండపంలో పన్నిద్ద రాళ్వార్ల బొమ్మలు గంధరించి ఉన్నారు. అందులోనూ తిరుప్పాణాళ్వా రున్నారు.

7. తిరుప్పాణాళ్వార్ల ఉత్సవ విగ్రహం రెండుచేతుల్లో చిటితాళాలు పట్టిఉన్నట్లు శ్రీరంగంలో మలచబడి ఉంది.

మానవులంతా ఒకటే అనీ — జాతి మత కుల భేదాలు పాటించకూడదనీ ఇందువల్ల మనం తెలుసుకోవలసిఉంది.

శ్రీ వేదాంతదేశిక చరిత్ర

అమలనాతిపిరాన్ రచించిన శ్రీ తిరుప్పాణాళ్వార్లను గూర్చి తెలుసుకొన్నాము. దానికి "మునివాహనభోగ" మనే విపులమైన వ్యాఖ్యను రచించిన శ్రీ వేదాంతదేశికులను గూర్చి తెలుసుకొందాము.

తల్లిదండ్రులు – జననం

అనంతసూరి భార్య తోతారంభ. ఈమె కడాంబిఆచ్చాన్ వంశస్థురాలు. తోతారంభ ఒకనాడు స్వప్నంలో స్వామివారి ఘంటను మ్రింగినట్లు కలగన్నది. వెంటనే ఆమె గర్భం ధరించింది. ఆ గర్భంనుండి ఒకపిల్లవాడు జన్మించినాడు. జన్మించింది కంచిలో. విశ్వామిత్ర గోత్రం వీళ్లది. ఇతడు జన్మించింది క్రీ.శ. 21-8-1268, విభవ సంవత్సరం భాద్రపదమాసం శ్రవణానక్షత్రంలో. శ్రవణానక్షత్రం శ్రీవేంకటేశ్వర స్వామి జన్మించిన నక్షత్రం కావడంచేతా - శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవపు ఆఖరునాటి అవభృథోత్సవం కావడంచేతా తల్లిదండ్రులకు శ్రీ వేంకటేశ్వరుడే తమ కుమారుడుగా జన్మించినారనే నమ్మకం కలగడంచేతా పిల్లవానికి వెంకటనాథన్ అనే పేరు పెట్టినారు. ఈయన వడగల సంప్రదాయానికి చెందిన శ్రీవైష్ణవుడు. శ్రీ వేంకటేశ్వరుని ఘంటావతారమే వేదాంతదేశికులని శ్రీవైష్ణవుల అభిప్రాయం.

* శ్రీవేంకటేశ్వరుడే వెంకటనాథుడుగా జన్మించినాడనీ ఆతని ఘంటావతారుడే వెంకటనాథుడనీ — శ్రీభాష్యకారులే వేంకటనాథుడుగా జన్మించినాడనీ ఈతని కుమారుడు వరదగురుడు తెలిపినాడు.

---

* వేదాంతదేశిక మంగళాశాసనమ్

850 – 4

విద్యాభ్యాసం

తాత పుండరీకాక్షయజ్వ. మేనమామ కడాంబి అప్పుళ్లాన్. ఆత్రేయగోత్రుడు ఆత్రేయ రామానుజుడనికూడా ఇతనికి పేరు. ఇతడు నడాదూరు అమ్మాళ్ (వాత్స్యవరదగురుడు) వద్ద విద్యాభ్యాసం చేసినాడు. వేదాంతదేశికులు (వెంకటనాథుడు) 5 సంవత్సరముల బాలుడుగా ఉండగా మేనమామ అయిన ఆత్రేయ రామానుజునితో కలిసి, నడాదూరు అమ్మాళ్ వద్దకు ఒకనాడు వెళ్లినాడు. వెంకటనాథుని ముఖవర్చస్సును చూచి అమ్మాళ్ క్రిందివిధంగా ఆశీర్వదించినాడు.

* శ్లో॥ ప్రతిష్ఠాపిత వేదాంతః ప్రతిక్షిప్త బహిర్మతః ।
భూయాస్త్రైవిద్య మాన్య స్త్వం భూరికల్యాణ భాజనమ్॥

నీవు వేదాంతాన్ని నిలిపేవాడుగా ఉండాలి – ఇతర మతాలను ఖండించేవాడుగా ఉండాలి – వేదమార్గాన్ని అనుష్ఠించే వేదాంతులచేత గౌరవింపబడేవాడుగా ఉండాలి. ఎల్లప్పుడూ నీకు సర్వసంపదలు కలిగేటట్లు ఉండాలి.

ఽ ఈ విషయాన్ని వేదాంతదేశికులూ తమగ్రంథాల్లో తెలిపినారు.

ప్రసిద్ధ విద్వాంసులైన నడాదూరు అమ్మాళ్ అనుగ్రహంచేతా – మేనమామగారైన కడాంబి అప్పుళ్లర్ వద్ద సకలశాస్త్రాలూ కళలూ అభ్యసించడంచేతా అన్నివిద్యల్లో మేటి అయినాడు. ఇదంతా 20 సంవత్సరాల వయస్సులోనే జరిగింది † శ్రీరామానుజులు రచించిన తొమ్మిది గ్రంథాలకు నవనిధులని పేరు. అన్ని గ్రంథాలకంటే ఈ తొమ్మిది గ్రంథాలపై ఈయనకు అభిమానము మెండు.

---

* నడాదూరుఅమ్మాళ్ సూక్తమ్.

ఽ అధికరణసారావళి. తత్త్వముక్తాకలాపమ్. సంకల్పసూర్యోదయమ్.

† వేదార్థసంగ్రహము – వేదాంతసారము – వేదాంతదీపము – శ్రీభాష్యము – గీతాభాష్యము – శరణాగతిగద్యము – శ్రీరంగగద్యము – శ్రీవైకుంఠ గద్యము – నిత్యము అనేవి నవనిధులు.

గరుడమంత్రోపదేశం

కడాంబి అప్పుళ్లర్ ఇతనికి వేదస్వరూపమైన గరుడమంత్రాన్ని ఉపదేశించినారు. ఈ ఉపదేశాన్ని పొంది, తిరువహీంద్రపురం (దక్షిణ ఆర్కాడు జిల్లా) వెళ్లి, ఔషధాద్రిలో నివసించి - గరుడమంత్రం ద్వారా గరుడుని సాక్షాత్కారం పొంది - గరుడునివల్ల హయగ్రీవమంత్రాన్ని ఉపదేశం పొంది - హయగ్రీవ కటాక్షాన్ని పొంది - పదునైదు సంవత్సరాలు అక్కడ నివసించి గరుడపంచాశత్, హయగ్రీవస్తోత్రమ్, దేవనాయక పంచాశత్, అచ్యుత శతకమ్ (ప్రాకృతం) మొదలైన గ్రంథాలు రచించినారు ఆ తర్వాత తిరిగి కాంచీపురం ప్రవేశించినారు.

వివాహం

తిరుమంగ అనే ఆమెను వివాహమాడినాడు.

శ్రీభాష్య కాలక్షేపం

కంచి చేరిన తర్వాత వరదరాజ పంచాశత్, యథోక్తకారిస్తోత్రమ్, అష్టభుజాష్టకమ్, వేగాసేతు స్తోత్రమ్, కామాసికాష్టకమ్ - మొదలైన గ్రంథాలు రచించినారు. శ్రీభాష్యాన్ని సచ్ఛిష్యులకు ఉపదేశిస్తూ కాలం గడపినారు. * ముప్పైపర్యాయాలు శ్రీభాష్యం సచ్ఛిష్యులకు ఉపదేశించినారు. ఇంకా ఎన్ని పర్యాయాలు ఎంతమంది శిష్యులకు ఉపదేశించినారో తెలియదు.

ఉత్తరదేశయాత్ర

ముప్పైయైదు సంవత్సరాల వయస్సులో వెంకటనాథుడు ఉత్తరదేశ యాత్ర వెళ్లినాడు. మొదట చోళింగపురం - ఆతర్వాత తిరుమల - బదరి

---

* సంకల్పసూర్యోదయమ్.

కాశ్మీరం - మథుర - బృందావనం - మొదలైన శ్రీవైష్ణవ దివ్యదేశాలను, అయోధ్య - కాశి మొదలైన పురాణప్రసిద్ధక్షేత్రాలను దర్శించినాడు.

విజయనగరసామ్రాజ్యంలో అద్వైతియైన విద్యారణ్యునికి ద్వైతియైన అక్షోభ్యమునికి వివాదం కలిగింది. చాలా తీవ్రంగా వాదించుకొన్నారు. ఈ వివాదాన్ని తీర్చడానికి ఎవరు సమర్థులని ఆలోచించి, రాజు వేదాంతదేశికులు సమర్థులని ఆయన్ను రమ్మన్నాడు. నేను రాను. వాద ప్రతివాదాలు వ్రాసి పంపితే ఎవరివాదం సరియైనదో తెలుపుతానన్నాడు. రాజుగారు సరేనని వ్రాసిపంపినారు, అది చూచి మధ్యవర్తియైన వేదాంత దేశికులు ఈ శ్లోకం రచించి వ్రాసిపంపినారు.

* శ్లో॥ అసినా తత్త్వమసినా పరజీవప్రభేదినా ।
విద్యారణ్య మహారణ్యం అక్షోభ్యముని రచ్ఛినత్ ॥

పరమాత్మ జీవాత్మ అని చెప్పబడే తత్త్వమసి అనే కత్తితో విద్యారణ్యమనే మహారణ్యాన్ని అక్షోభ్యముని ఖండించినాడు. అంటే అక్షోభ్యముని వాదం సరియైనదని తీర్పుచెప్పినాడు.

ఇతని తీర్పునకు మెచ్చి రాజు ఇతన్ని తన ఆస్థానకవిగా - పండితుడుగా ఉండమని ప్రార్థిస్తే -

† శ్లో॥ నాస్తి పిత్రార్జితం కించిత్ న మయా కించి దార్జితమ్ ।
అస్తి మే హస్తిశైలాగ్రే వస్తు పైతామహం ధనమ్ ॥

" తండ్రి సంపాదించిన ఆస్తి కొంచెంకూడాలేదు. నేనూ ఏమీ సంపాదించలేదు. అయితే నాకొక ఆస్తి ఉంది. అదేదంటే? కరిగిరిలో (కంచిలో) మా తాతలు సంపాదించిన ధనం ఉంది. ఆ ధనం

* వడగల గురుపరంపర.

† వైరాగ్యపంచకస్తోత్రమ్, వడగల గురుపరంపర.

వరదరాజస్వామి. ఈ వరదరాజస్వామిని బ్రహ్మ ఆరాధించినాడు" అని బదులు వ్రాసి పంపినాడు. ఈ సందర్భంలోనే వైరాగ్యపంచక స్తోత్రాన్ని రచించినారు.

* శ్రీపెరుంబూదూరు వెళ్లి శ్రీరామానుజుల విగ్రహాన్ని దర్శించి, యతిరాజవింశతి గ్రంథాన్ని రచించినాడు.

ప్రతివాదులను జయించడం

‡ శ్రీరంగంలో ఆరోజుల్లో అద్వైతులు చాలా బలవంతులుగా ఉండేవాళ్లు. తెంగల సంప్రదాయజ్ఞులు, వాళ్లను జయించడం ఎట్లా అనే ఆలోచనలో పడ్డారు. వాళ్లను జయించడానికి వేదాంతదేశికులే సమర్థుడని శ్రీరంగనాథస్వామి వేదాంతదేశికులను శ్రీరంగం రమ్మని ఆజ్ఞాపించినారు. శ్రీరంగనాథుని ఆజ్ఞను శిరసావహించి, వేదాంతదేశికులు శ్రీరంగం చేరినారు. స్వామివారి ఆజ్ఞమేరకు క్రీ.శ. 1310లో అద్వైతులతో ఎనిమిదిరోజులు ఎడతెరపిలేకుండా హోరాహోరిగా వాదించి, వాళ్లను జయించి, శతదూషిణి అనే గ్రంథాన్ని రచించినాడు.

శ్రీవైష్ణవమతం నేటికీ సజీవంగా ఉందంటే వేదాంతదేశికుల భిక్ష అని వడగల — తెంగల శ్రీవైష్ణవుల నమ్మకము.

బిరుదులు

† శ్రీరంగనాథస్వామి ఈయన వైదుష్యానికి మెచ్చి అనుగ్రహించి "ఉభయవేదాంతాచార్య" బిరుదాన్నీ, శ్రీరంగనాయకి అమ్మవారు "సర్వ

---

* వడగల గురుపరంపర, VEDANTADESIKA HIS LIFE-SKETCH.

‡ శతదూషిణి, SRIRANGAM TEMPLE.

† వడగల గురుపరంపర

తంత్ర స్వతంత్ర" బిరుదాన్ని ప్రసాదించినారు. ‡ సుదర్శనభట్టరు మొదలైన ప్రసిద్ధ విద్వాంసుల సమూహం "కవితార్కికకేసరి" బిరుదాన్ని ఇచ్చి గౌరవించింది. * ఆ తర్వాత కొంతకాలానికి తిరుమలకు వెళ్లినప్పుడు శ్రీవేంకటేశ్వరస్వామి "వేదాంతదేశిక" బిరుదాన్ని ప్రసాదించినారు. ఈయన శిష్యుడు ప్రతివాదిభయంకరం అణ్ణన్ ఈయన్ను గూర్చిన విశేషాలన్నీ ఏర్చి కూర్చి "సప్తతిరత్నమాలిక" అనే గ్రంథాన్ని రచించినాడు.

అద్భుతకార్యాలు

ఇతడు జ్ఞాన వైరాగ్య అనుష్ఠానాల్లో పేరుపొందినవాడని దేశమంతా వ్యాపించింది. ఇతనిపై ద్వేషము, అసూయ కొంతమందికి కలిగి ఈయన్ను హింసింపసాగినారు. అదంతా వ్యర్థమైపోయింది. అన్నిటిలో ఇతనికే జయం కలుగుతూంది. అందులోకొన్ని -

+ ఒకనాడు మంత్రవేత్త ఒకడు నీవు సర్వతంత్ర స్వతంత్రుడవు కదా నాతో మంత్రవిద్యలో వాదానికి రమ్మన్నాడు. సరేనన్నాడు దేశికుడు. వాడు నూతిలో దిగి ఏదో మంత్రం జపిస్తే ఆ నూతిలోని నీళ్లంతా దేశికుల కడుపులోకి వస్తున్నాయి. ఇది చూచి తన దగ్గరేఉన్న రాతిస్తంభాన్ని గోటితో గీరినారు దేశికులు. వెంటనే కడుపులోకి వచ్చే నీళ్లంతా ఆస్తంభం లోని గోటిగీతగుండా వస్తున్నాయి. అదిచూచి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఎంతసేపటికీ ఏమీ కాలేదు దేశికులకు. మంత్రవాది ఓడిపోయినట్లు అంగీకరించి నమస్కారంచేసి వెళ్లినాడు.

† మరొకపర్యాయం తాపీవాడు మీకు అన్ని విద్యలు వచ్చును కదా నుయ్యికట్టు చూద్దాం అన్నాడు. వెంటనేవాని చేతిలోని తాపీని తీసి

---

‡ సహ్రసరిత

* వడగల గురుపరంపర

† వడగల గురుపరంపర, తెంగల గురుపరంపర, ఆచార్యవైభవ ప్రకాశిక.

నూయికట్టినారు. వాడూ దాసోహమని వెళ్లినాడు. ఈ నూయి తిరువహీంద్రపురంలో ఉంది నేటికీ. వెళ్లి చూడవచ్చు.

† ఒక రోజు మాదిగవాడొకడు దూరంగా నిలిచి మీరు అన్ని విద్యల్లో సమర్థులుకదా చెప్పులు కుట్టండి చూద్దాము అన్నాడు. సరేనని వానిచేతిలోని చెప్పులు కుట్టే దబ్బణాన్ని తీసుకొని, ముక్కుకు రెండు వైపులా రాచినాడు. చెప్పులు కుట్టేవాళ్లు ముందు చేసేపని ఇది. ఇది చేసేటప్పటికి వాడు ఆశ్చర్యపోయి ఈయనకు చెప్పులు కుట్టడానికి వచ్చునని అంగీకరించి, తాను ఓడిపోయినానని నమస్కారం చేసి వెళ్లినాడు.

† ఇంకొకప్పుడు బ్రహ్మచారి ఒకడు ఒకనాడు ఈయన్ను సమీపించి, వివాహం చేసుకోవడానికి పైకం కావాలన్నాడు. దేశికులు శ్రీస్తుతి చేసినారు. వెంటనే కనకవర్షం (బంగారు నాణేల వర్షం) కురిసింది. ఆ బ్రహ్మచారి అవన్నీ ఏరుకొని వెళ్లినాడు. ఇటువంటివి ఎన్నో అద్భుత కార్యాలు చేసినారు.

రచనలు

వేదాంతదేశికులు స్తోత్రాలు ముప్పైరెండు, కావ్యాలు ఎనిమిది, అనుష్ఠానాది శాస్త్రాలు ఇరవైనాలుగు, ద్రవిడవేద రహస్యాలు ముప్పైరెండు, ద్రవిడ ప్రబంధాలు ఇరవైనాలుగు, భగవద్విషయం (ఎళువత్తు నాలాయిరప్పడి) మొత్తం 121 గ్రంథాలు రచించినారు. ఇందులో ‡భగవద్విషయం లభ్యంకాలేదు.

ఇందులో సర్వజ్ఞ సింగభూపాలుని కోరికపై సుభాషిత నీవి, రహస్య సందేశమ్, రహస్య సందేశ వివరణమ్ అనే గ్రంథాలు రచించి రాజుకు పంపినారు.

---

† వడగల గురుపరంపర, తెంగల గురుపరంపర, ఆచార్య వైభవ ప్రకాశిక.
‡ ఈ గ్రంథం రచించలేదని తెంగలసంప్రదాయజ్ఞుల అభిప్రాయం.

కాళిదాసు రచించిన రఘువంశానికి పోటీగా యాదవాభ్యుదయాన్నీ, కృష్ణమిశ్రుడు రచించిన ప్రబోధ చంద్రోదయానికి ప్రతిగా సంకల్ప సూర్యోదయాన్నీ రచించినారు. నేటికీ కొందరు శ్రీవైష్ణవవైదికులు రఘువంశాన్నీ ప్రబోధచంద్రోదయాన్నీ పఠించడంలేదు. యాదవాభ్యుదయాన్నీ సంకల్పసూర్యోదయాన్ని మాత్రమే పఠిస్తున్నారు. కొందరు అసూయాగ్రస్తులు అద్వైతులూ తెంగలవాళ్లూ ఇతని పాండిత్యాన్ని పరీక్షించడానికి శ్రీరంగంలో పూనుకొన్నారు. అప్పుడు వారిని జయించి, ఒక యామంలో పాదుకాసహస్రమ్ అనే వేయి శ్లోకాలుగల గ్రంథాన్ని రచించి తమ ప్రజ్ఞను నిరూపించినారు.

క్రీ.శ. 1320లో మైసూరు రాజ్యానికి చేరిన తిరునారాయణపురం అనే దివ్యదేశంలో కొన్నిరోజులు నివసించినారు.

పుత్రజననం

క్రీ.శ. 11–8–1316 నలనామ సంవత్సరం ఆవణినెల. రోహిణీ నక్షత్రయుక్త శుభదినంలో ఇతనికి కుమారుడు జన్మించినాడు. బిడ్డకు వరదాచార్య, నైనారాచార్యర్ అని పేర్లు పెట్టినారు. దేశికులకు అప్పటికి 48 సంవత్సరాలు.

శిష్యులు

తిరునారాయణపురంనుండి సత్యమంగళం అనే గ్రామం చేరినారు. అక్కడ చాలా ఏండ్లు నివాసం చేసినారు. సత్యమంగళంలో ఉండగానే కుమారుడు వరదాచార్యులూ, పరకాలమఠ మూలపురుషుడైన బ్రహ్మతంత్ర స్వతంత్రస్వామీ శిష్యులుగాచేరి. శ్రీభాష్యాది గ్రంథాలు అధ్యయనం చేసినారు. సత్యమంగళంలో ఉంటూ అప్పుడప్పుడూ శ్రీరంగం వెళ్లి వచ్చేవారు దేశికులు.

తురుష్కుల దండయాత్ర

*క్రీ.శ. 1327లో తురుష్కుల దౌర్జన్యానికి శ్రీరంగం బలి అయింది. శ్రీరంగదేవాలయం బలికాకుండా దేవాలయ మహద్వారానికి రాతిగోడ నిర్మించినారు అక్కడి వారంతా. ‡నడాదూరు అమ్మాళ్ శిష్యుడైన సుదర్శనభట్టర్ శ్రీభాష్యానికి శ్రుతప్రకాశిక అనే వ్యాఖ్యను రచించినారు. ఆవ్యాఖ్యానగ్రంథాన్ని తమ కుమారులైన వేదాచార్య భట్టరునూ పరాంకుశ భట్టరునూ ఏ విధంగానైనా ఈ ఆపదనుండి కాపాడమని దేశికులకు తెల్పినారు పీనుగులపెంటలమధ్య ఆ గ్రంథాన్ని ఆతని కుమాళ్లనూ దాచి కాపాడినారు. సత్యమంగళం చేరి శిష్యులకు శ్రీభాష్యాన్ని ఉపదేశించినారు. ఈ తురుష్కులు దండయాత్రచేసి నప్పుడే అభీతి స్తవాన్ని రచించినారు. ఉపద్రవం తగ్గింది. ఆ తర్వాత యథాప్రకారం శ్రీరంగనాథునికి పూజలు ఉత్సవాలు జరుప నారంభించినారు. అప్పుడే దేశికులు శ్రీరంగం వెళ్లి అక్కడ అన్నీ సేవించినారు. తిరిగి ప్రతిపక్షులు వాదానికి సిద్ధపడగా వాళ్లను జయించి, శ్రీరంగనాథునికి †అధ్యయనోత్సవాన్ని జరిపించినారు.

§వడగల సంప్రదాయానికి చెందిన వేదాంతదేశికులకూ శ్రీరంగం లోని తెంగల సంప్రదాయానికి చెందినవారికీ తగాయిదా వచ్చింది.

ద్రవిడవేదమన్నా భగవద్విషయమన్నా తెంగల శ్రీవైష్ణవుల సొమ్మని తెంగలివారి అభిప్రాయం. ఆ అభిప్రాయంతోనే వడగలవారిని వారు తక్కువగా చూస్తుంటారు. అది సరియైనది కాదని నిరూపించ

---

* A.D. 1323 లో అని శ్రీరంగం కొంపుల్ అనే గ్రంథం చెప్పింది.

‡ వడగల గురుపరంపర, తెంగలి గురుపరంపర.

† A.D. 1532 లో అచ్యుతరాయలు ప్రారంభించెనని శ్రీరంగం కొంపుల్ చెప్తూంది.

§ శ్రీరంగం కొంపుల్.

డానికని వేదాంతదేశికులు నాలాయిర దివ్యప్రబంధాన్ని కరతలామలకంగా నేర్చినాడు. భగవద్విషయాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొన్నాడు. దీన్ని చూచిన తెంగల సంప్రదాయం వాళ్లు ఈతనిపై పగసాధింప సాగినారు. కానీ వాళ్లఆటలు ఈయన వద్ద సాగలేదు. ఈయనవద్ద ఓడి దాసోహ మన్నారు. వీళ్లేకాదు ఆనాడు విజృంభించిన అద్వైతులు చిత్తుచిత్తుగా ఓడి పారిపోయినారు. అన్నివిధాలా ప్రసిద్ధవిద్వాంసుడని పేరుపొందిన తర్వాత శ్రీరంగాన్ని వదలి తన స్వగ్రామమైన కంచికి తిరిగివచ్చినారు. ఈయన శ్రీ వైష్ణవసంప్రదాయరహస్యగ్రంథాలకు ముప్పైరెండింటికి మణిప్రవాళవ్యాఖ్య – ఇరవైనాలుగు ద్రవిడప్రబంధాలు రచించినారు. రెండు భాషల్లో రచించి సవ్యసాచి అనిపించుకొన్నాడు.

వార్ధక్యం

వేదాంతదేశికులు సుమారు నూరుసంవత్సరాలు జీవించినారు. ఈయన రచించిన కడపటి గ్రంథం రహస్యత్రయసారము. ఇది గొప్ప గ్రంథం. ఇందు అనేకవిషయాలు చెప్పబడ్డాయి.

నిర్యాణము

క్రీ.శ. 14–11–1369 వ తేది సౌమ్యనామ సంవత్సర కార్తీక నెల కృత్తికా నక్షత్రం రోజున ఈయన వైకుంఠాన్ని చేరినారు.

గొప్పతనం - విగ్రహప్రతిష్ఠ

ఈ వేదాంతదేశికుల రాతివిగ్రహాన్ని తూప్పిల్ అగ్రహారంలో ప్రతిష్ఠించి ఆరాధిస్తున్నారు అక్కడే కాకుండా అన్ని దివ్యదేశాల్లోని శ్రీవైష్ణవాలయాల్లోను ప్రతిష్ఠించి తెంగల వడగల అనే భేదం లేకుండా ఆరాధిస్తున్నారు. ఇటువంటి ప్రసిద్ధపండితుడు, శ్రీవైష్ణవవైదిక

బ్రాహ్మణుడు, శ్రీతిరుప్పాణాళ్వార్లు రచించిన అమలనాతిపిరాన్ అనే పదిపాశురాలకు 'మునివాహనభోగ' మనే విపులమైన వ్యాఖ్యను రచించినారు. వీరిరువురు ధన్యులైనారు.

మునివాహన భోగము*

‡ శ్లో॥ శ్రీమాన్ వేంకటనాథార్యః కవితార్కికకేసరీ ।
వేదాంతాచార్యవర్యో మే సన్నిధత్తాం సదా హృది ॥

[తాత్పర్యం - శ్రీమంతుడూ వేదాంతాచార్యుడూ కవితార్కిక కేసరీ అయిన వేంకటనాథుడు నా హృదయంలో ఎల్లప్పుడూ నివసించుగాక.]

---

*ఇది శ్రీనిగమాంత మహాదేశికులు అనుగ్రహించిన రహస్యాలలో ఇరువది ఎనిమిదవది. శ్రీతిరుప్పాణాళ్వార్ల పాశురాలకు పెరియవాచ్చాంపిళ్లై అనేవారూ, అళగియమణవాళ పెరుమాళ్ నాయనార్ అనేవారూ రచించిన మణిప్రవాళ వ్యాఖ్యలు ఉన్నాయి. వీళ్లిద్దరూ తెంగల సంప్రదాయానికి చెందినవాళ్లు. ఈ వేదాంతదేశికులు వడగల సంప్రదాయానికి చెందినవాడు. వీళ్లు ముగ్గురూ సమకాలికులు, మొదటిరెండు వ్యాఖ్యలూ రహస్యగ్రంథాలు అని పేరుపొందిన గ్రంథాలలో లేవు. ఈ వేదాంతదేశికుల వ్యాఖ్యమాత్రం రహస్యగ్రంథం అనిపించుకొనింది. నేటికీ కాలక్షేపం చేసేటప్పుడు వడగల తెంగల శ్రీవైష్ణవాచార్యులచే పఠింపబడుతూంది. వంశపరంపరగా గోప్యంగా ఉంచబడిన విషయాలు ఆచార్యుని ప్రార్థించి ఆ ఆచార్యుడు చెప్పగా విని తెలుసుకొనే వేదాంత విషయాలకు శ్రీవైష్ణవ సంప్రదాయం వాళ్లు రహస్యం అంటారు. దానికి సంబంధించిన గ్రంథాలు రహస్య గ్రంథాలు. ప్రాయికంగా రహస్యగ్రంథాలన్నీ మణిప్రవాళభాషలో ఉంటాయి. మణిప్రవాళమంటే సంస్కృతము తమిళము రెండూ కలిపి వ్రాసేభాష.

‡ వేదాంతదేశికుల కుమారుడూ శిష్యుడూ అయిన వరదాచార్యులు రచించిన శ్లోకమిది.

[ ] ఈ గ్రంథంలో ఈ గుర్తులమధ్యగల తాత్పర్యభాగమంతా పాఠకుల తెలివిడికై నేను రచించినది. వేదాంత దేశికులు తమవ్యాఖ్యలో శ్లోకాల, పాశురాల ప్రారంభాలు మాత్రమే ఇచ్చినారు. ఇది రహస్యగ్రంథ రచనాసంప్రదాయం. గురువువద్ద శిష్యులు సంప్రదాయ విషయాలు పఠించేటప్పుడు ఆ గురువు ఆ శ్లోకాలు, ఆ పాశురాలు పూర్తిగా శిష్యులకు వినిపించి, అక్కడ దానికున్న సంబంధాన్ని వివరిస్తాడు. అదే విధంగా నేనూ ఆ శ్లోకాలు పూర్తిగా ఇచ్చి, పాశురాలు ఎక్కడివి, ఎవరు రచించినారనే విషయాలను తెలిపి, తెలుగు తాత్పర్యాన్ని రచించినాను. అంటే తెలుగులో ఇది శ్రీవైష్ణవసంప్రదాయ విషయానికి సంబంధించిన సమగ్ర రహస్య గ్రంథమన్నమాట.

‡ శ్లో॥ రామానుజదయాపాత్రం జ్ఞానవైరాగ్యభూషణమ్ ।
శ్రీమద్వేంకటనాథార్యం వందే వేదాంతదేశికమ్ ॥

[తా॥ శ్రీరామానుజుల దయకు పాత్రుడైనవాడూ జ్ఞానమూ వైరాగ్యమూ భూషణాలుగా కలవాడూ శ్రీమద్వేంకటనాథుడు అనబడే వేదాంతదేశికులకు నమస్కరిస్తున్నాను.]

* శ్లో॥ వ్యాచిఖ్యాసతి భక్త్యా విరక్తతోషాయ వేంకటేశకవిః ।
ముదిత ముకుందవిలోకన మునివాహనసుకవిసూక్తి మిమామ్ ॥

[తా॥ శ్రీరంగనాథుని దర్శించడంచేత సంతసించిన మునివాహనుడు (తిరుప్పాణాళ్వార్) చక్కనికవి రచించిన మధురాతిమధురాలైన ఈ పాశురాలకు, భగవంతుని దర్శించాలనీ ఆతని సాన్నిధ్యం పొందాలనీ తహతహలాడేవారికి సంతోషం కలగడానికి వేదాంతదేశికులు అనే నేను భక్తితో వ్యాఖ్య రచింపగోరుతున్నాను.]

పాశురము

† పావళరుమ్దమిళ్ మఱైయిన్ పయన్ కొణ్డపాణ్ -
పెరుమాళ్ పాడియతోర్ పాడల్ పత్తిల్,
కావలనుమ్ కణవనుమాయ్ క్కళన్దు నిన్ఱ -
కారణనై క్కరుత్తుఱనాయ్ కణ్డుపిన్న,

‡ బ్రహ్మతంత్రపరతంత్రపరకాలమఠానికి చెందిన మొదటి జీయ్యరు రచించిన శ్లోకమిది.

* వేదాంతదేశికులు రచించిన శ్లోకమిది.

† వేదాంతదేశికులు రచించిన తనియన్ ఇవి. భగవంతునిగాని గురువునుగాని స్తోత్రం చేస్తూ రచించే శ్లోకాన్ని, తమిళ పాశురాన్ని తమిళంలో 'తనియన్' అంటారు.

కోవలనుమ్ కోమాను మానపన్నాళ్-
కురవై పుణర్ కోవియర్ తమ్ కుటిప్పే కొణ్డు,
శేవలుడన్ పిరియాత పెడై రై త్చేర్న్దు-
తీవినై యోర్ తనిమై యెల్లామ్ తీర్న్దోమ్ నామే.

తా॥ తిరుప్పాణాళ్వార్లకు భగవత్కటాక్షం అప్రయత్నంగా లభించింది. ప్రయత్నం ఏమీ చేయకనే ఇతనికి భగవత్కటాక్షం లభించడానికి కారణం ఇది అని నిశ్చయించడం చాలాకష్టం. భగవత్స్వరూపాన్నీ — పరతత్వాన్నీ — ఆత్మజ్ఞానాన్నీ — భగవంతుడేశరణ్యు డనే విషయాన్నీ — జ్ఞానాన్నీ — పరహితపరమపురుషార్థ వివేకాన్నీ గూర్చిన విజ్ఞానంకూడా ఇతనికి లభించింది.

ఈ విజ్ఞానం ఎట్లాకలిగింది అంటే అనేకజన్మపరంపరలనుండి వస్తూవున్న క్షుద్రపురుషార్థాలైన రాగద్వేషాలకూ—క్షుద్రపురుషస్తోత్రాలకూ—క్షుద్రపురుషార్థాలైన ధనసంపత్తికీ లోనుకాకుండా ఉండడంవల్లాను — భగవంతుని యెడభక్తిగలిగి ఉండడం అన్నదే పరమధ్యేయంగా భావించి, ఇతర ప్రయోజనాల యెడ విరక్తుడై ఉండడంవల్లాను - ఇతనికి లభించిన ఆత్మజ్ఞానంతో మనోవాక్కాయకర్మలచేత భగవంతుని దర్శించడం - కీర్తించడం - ఆనందించడం వంటి సత్కార్యాలు చేయడంవల్లాను ఇతనికి భగవత్కటాక్షం లభించింది. లభించడమేకాదు ఆ భగవత్కటాక్షం దినదినాభివృద్ధి పొందింది.

ఈ భౌతికదేహాన్ని - వదలి అర్చిరాదిమార్గంద్వారా పరమపదంలో పొందవలసిన మహోన్నతపదాన్ని ఈ లోకంలోనే ఈ శరీరంతోనే పెరియ పెరుమాళ్ శ్రీరంగనాథుని కృపాకటాక్షంచేత తిరుప్పాణాళ్వార్లు పొందినారు. తాను ఆ మహోన్నతపదాన్ని పొంది, అచ్చట తాను పొందిన అనుభవాలను మన అందరికీ తెలుపడానికై శ్రీరంగనాథుని ''ఆపాదమస్తకాన్ని'' పాదాలనుండి శిరస్సువరకు "అమలనాతి పిరాన్" అన్న

పాశురంతో ప్రారంభించి, పదిపాశురాలతో పాడి, తాను భగవంతుని దర్శించి - అనుభవించి - తరించి మనమూ చదివి, తరించాలని మనకు ప్రసాదించినారు.

ఇతరులు రచించిన అధ్యాత్మరచనలలో కొన్ని మరీపెద్దవికావడం వల్ల అతివిస్తరమనే దోషాన్నీ - మరికొన్ని మరీచిన్నవికావడంవల్ల అతిసంకోచమనే దోషాన్నీ - ఇంకా కొన్ని బ్రాహ్మణులు క్షత్రియులు తప్ప ఇతరజాతులవారు చదువరాదనే నిషేధం ఉండడంవల్ల అధికృతాధికారిత్వమనే దోషాన్నీ - ఇంకాకొన్ని, ఎన్నిమార్లు చదివినా తెలియరాని విధంగా ఉండడంవల్ల దుర్గ్రహత్వమనే దోషాన్నీ - మరికొన్ని ఎన్ని రకాల తెలియచెప్పినా అందలి అర్థం బోధపడక పోవడంవల్ల దురవబోధార్థత్వమనే దోషాన్నీ - మరికొన్ని చదువగానే సందేహాలు కలిగించేవిగా ఉండడంవల్ల సంశయాదిజనకత్వమనే దోషాన్నీ - మరికొన్ని రచనలు విరహాన్నీ కొన్నిరచనలు క్లేశాన్నీ కలిగించేవి కావడంవల్ల విరహక్లేశమనే దోషాన్నీ - మరికొన్ని రచనలు దూతల పంపినట్లూ వారి ద్వారా కార్యాలు సాధించినట్లూ ఉండడంవల్ల దూతప్రేషణమనే దోషాన్నీ - మరికొన్ని రచనలు ఇతరులకు ఉపదేశించేవిగా ఉండడంవల్ల పరోపదేశమనే దోషాన్నీ - మరికొన్ని రచనలు ఇతరమతాలను నిందించేవిగా ఉండడంవల పరమతనిరసనమనే దోషాన్నీ కలిగిఉన్నాయి తిరుప్పాణాళ్వార్ల రచనల్లో పైన పేర్కొన్న పదిదోషాలలో ఏ దోషమూ లేదు. ఇతని రచనలన్నీ భగవదనుభవరసపూరితాలు కావడంవల్ల గొప్పరచనలు అయినాయి.

‡ శ్లో॥ ఆపాదచూడ మనుభూయ హరిం శయానమ్
మధ్యే కవేరదుహితుః ముదితాంతరాత్మా ।

‡ తిరుప్పాణాళ్వార్లను గూర్చిన ఈ ధ్యాన శ్లోకం పెరియనంబి రచించినదని ప్రతీతి ఇందులోనికి ఎట్లాగో చోటుచేసుకొని చేరింది.

అద్రష్ట్రతాం నయనయోః విషయాంతరాణామ్
యో నిశ్చికాయ మనవై మునివాహనమ్ తమ్ ॥

[తా॥ ఉభయకావేరిమధ్యప్రదేశంలో శేషశయనంపై పవ్వళించిన శ్రీరంగనాథస్వామిని పాదాలనుండి శిరస్సుదాకా దర్శించిన కన్నులతో- సంతసించిన మనస్సుతో – దేవతాంతరాలను చూడననీ, ఇతరవిషయాలను విననని, శపథంచేసిన మునివాహనుని (తిరుప్పాణాళ్వార్లను) ధ్యానిస్తున్నాను.]

పాశురము :

‡ కాట్టవే కణ్డపాదమ్ కమలనల్లాడ యుంది
తేట్టరువుమ్ ఉదరబంధం తిరుమార్వు కణ్డం శెవ్వాయ్ ।
వాట్టమిల్ కణ్గల్ మేని కుడియేరి తని పుగున్దు
పాట్టినాల్ కణ్డువాళుమ్ పాణర్ తాళ్ పరవినోమే ॥

[తా॥ ఎన్నోజన్మాలనుండి భగవంతుని దర్శించాలనే తహతహతో తపస్సుచేస్తున్నాను. ఏ జన్మలోను నాకు భగవంతుని దర్శనభాగ్యం లభించలేదు. నేను ఎన్నోజన్మాలనుండి చేస్తూవస్తూఉన్న పుణ్యఫలం వల్ల నాకు ఈ జన్మ లో భూలోకంలో ఇక్కడే కావేరీతీరంలో వెలసియున్న శ్రీరంగనాథస్వామి శ్రీవేంకటేశ్వరస్వామి రూపంలో దర్శనమిచ్చిన తిరు

‡ వడగలై సంప్రదాయానికి చెందిన వేదాంతదేశికులు తిరుప్పాణాళ్వార్లపై 'పావళర్' అన్న తమిళతనియన్ను రచించినారు, ఆ తమిళతనియన్ను తెంగలసంప్రదాయంవాళ్లు పఠించడం ఇష్టంలేక ఆపాదచూడ అన్న శ్లోకతనియన్ను, కాట్టవే అన్న ఈ తమిళపాశురతనియన్ను రచించి పఠిస్తున్నారు. ఈ రెండూ వేదాంతదేశికులకు తర్వాతకాలంలో ఎవరో రచించి ఇందు చేర్చినారని తెలుస్తున్నది.

ఈ పాశురం శ్రీశైలపూర్ణులు (తిరుమలనంబి) రచించినదని కొందరి సిద్ధాంతము. సత్యమెంతో తెలియరాదు.

ఇట్లావుంది. మొదట నా కన్నులకు దర్శనమిచ్చింది శ్రీస్వామి రెండు పాదాలు. ఆ తర్వాత పై పైనఉన్న అంగాలు ఒకటొకటే వరుసగా వచ్చి నేను దర్శించడానికి నిలిచినాయి. పాదాలతర్వాత పట్టుపీతాంబరం - తర్వాత నాభి - తర్వాత బంగారుఒడ్డాణము - ఆ తర్వాత వక్షస్థలము - ఆ తర్వాత కంఠము - ఆ తర్వాత నోరు - ఇవన్నీ అయిన తర్వాత కట్ట కడపట నిగనిగ మెరిసే కన్నులు. ఇవన్నీ ఒకటొకటిగా నా కన్నుల ఎదుటవచ్చి నిలచి, నేను దర్శించునట్లు అనుగ్రహించినాయి కదా! అని వాటిని దర్శించి, మురిసిపోతున్న తిరుప్పాణాళ్వార్లకు నీలమేఘచ్ఛాయగల ఆ భగవంతుడు ఆపాదమస్తకంగా ఒకే పర్యాయం దర్శన మిచ్చినాడు. అంతే తిరుప్పాణాళ్వార్లు పరవశుడై శ్రీరంగనాథుని దర్శించిన నా కన్నులు ఇతరము చూడనొల్లవు అని పాడినాడు. అట్టి పాశురాలు రచించి, పాడి, ప్రసిద్ధిని పొందిన తిరుప్పాణాళ్వార్లను స్తుతిస్తున్నాను.]

మొదటి పాశురం

అమలనాతిపిరా నడియార్ క్కెన్నై యాట్పడుత్త
విమలన్ *విణ్ణవర్కోన్విరైయార్ పొళిల్ వేజ్గడవన్*
నిమలన్ నిన్మలన్ నీతివానవన్ నీళ్మతిళరజ్గత్తమ్మాన్* తిరు
క్కమల పాతమ్ వన్దెన్ కణ్ణినుళ్ళన వొక్కిన్టతే ॥

[తా॥ పరమపదవాసి - దోషరహితుడు - నిత్యనిర్దోషి - ఆశ్రిత పక్షపాతి - బ్రహ్మరుద్రాదులకుకూడ దర్శింపరానివాడు భగవంతుడు. అట్టి భగవంతుడు భూలోకంలో తిరుమలపై శ్రీ వేంకటేశ్వరస్వామి రూపం తోను, కావేరీమధ్య సప్తప్రాకారమధ్యంలో శ్రీరంగనాథస్వామి రూపం గాను దర్శనమిస్తున్నాడు. ఆ భగవంతుని దివ్యశ్రీపాదపద్మాలు నన్ను వెదకివచ్చి, నా కన్నుల యెదుట నిలిచి నా దృష్టిని శ్రీపాదముల వైపుకు మరల్చినవి.

ఈ పాశురంలో భగవంతుని దివ్యశ్రీపాదపద్మాలు వర్ణన చేయబడ్డాయి.]

అమలన్ – మొదటిపాటైన "అమలనాతిపిరాన్" మొదలు ''కొణ్డల్ వణ్ణనై'' అనే తుదిపాటవరకూ ఉన్న పదిపాశురాలూ తలమానికాలైనవి. మొదటి మూడుపాటల్లోని మొదటిఅక్షరాలు మూడూ అతిముఖ్యాలు, మొదటిపాశురం ''అమల'' లోని మొదటి అక్షరం ''అ'' - రెండవ పాశురం ''ఉవంద" లోని మొదటి అక్షరం ''ఉ'' - మూడవ పాశురం ''మందిపాయ్'' లోని మొదటి అక్షరం "మ" మొత్తం ''అ-ఉ-మ''లు కలిసి, ''ఓం'' అనే వేదమూలప్రణవాన్ని సూచిస్తున్నాయి. ఈ పాశురంలో "ఓం నమో నారాయణాయ" అనబడే మంత్రరాజమూ "శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే, శ్రీమతే నారాయణాయ నమః" అనబడే

మంత్రరత్నమూ సూచింప బడ్డాయి. ఈ రెండూ మోక్షం అర్థించే ముముక్షువులు అవశ్యం మననం చేయదగిన అతిముఖ్యవిషయాలు.

అమలన్ - అంటే మాలిన్యం లేనివాడు అనిభావం. ఇందుచేత మోక్షం ఇచ్చేవాడు అనే మోక్ష ప్రదత్వాన్ని చెప్పడం అయింది. మోక్ష ప్రదత్వం ప్రపంచాన్ని రక్షించడానికి అతిప్రధానమైందికావడంచేత ఇందు ప్రత్యేకించి చెప్పబడింది.

అతి --

‡శ్లో॥ ఏష కర్తా న క్రియతే కారణం చాపి పౌరుషే ।
యో హ్యేనం పురుషం వేత్తి దేవా అపి న తం విదుః ॥

[తా॥ ఇతడే సృష్టికర్త - ఇతని పుట్టుకకు కారణం ఎవరూ లేరు. ఈ పరమపురుషుణ్ణి దేవతలుకూడా తెలుసుకోలేకుండా ఉన్నారు.]

అని చెప్పబడినరీతిగా ఇతడొకడే సర్వప్రపంచానికి సృష్టికర్త. ఇతడు ఇతరులచే సృజింపబడేవాడు కాడు. సకలజగత్సృష్టికి మూల కారణం ఈతడే. ఇందువల్ల జగత్సృష్టికి కారణభూతుడైన ఈతడే ముముక్షువుకు అంటే మోక్షంకోరేవారికి శరణ్యుడు అంటే ఆశ్రయింప దగినవాడు అన్నది నిశ్చయింపబడింది. ఇందు కారణత్వం చెప్పబడింది. సర్వలోకశరణ్యుడైన భగవంతునికి ఛత్రం, చామరం ఏ విధంగా ముఖ్యాలో ఆ విధంగానే కారణత్వం, మోక్షప్రదత్వం అనేవి రెండూ అతి ముఖ్యాలు-

పిరాణ్ --

కరుణా క్వాపి పురుషే --

---

‡ భారతం, 3-186-16 (a).

* ఎక్కడిదో తెలియరాలేదు,

[జాతిమతభేదాలు పాటించకుండా గొప్పవాడైనా నీచుడైనా ఎటువంటి వానిమీదనైనా నా కరుణ చూపగలను.]

అన్నట్లు ఇక్కడ అందరికీ భగవంతుడు ఉపకారకుడు అన్నభావం సూచింపబడింది.

సంసారసాగరంలో కొట్టుకలాడే జీవాత్మలకు వాళ్ల స్వరూపం భగవంతుడు తెలిపినాడు. జీవాత్మలు తమ ఆత్మస్వరూపం తెలుసుకోగానే భగవంతుడు తనకు సేవచేయడమేముఖ్యము అనే బుద్ధిని కలిగించినాడు. జీవాత్మలకు ఈ బుద్ధికలిగించినందులకు ప్రత్యుపకారాన్ని దేన్నీ భగవంతుడు ఆశించలేదు. అయితే ఎందుకు జీవాత్మలకు సహాయంచేయడం అంటే జీవాత్మలమీదఉండే దయతో జీవాత్మలకు ఉపకారాన్నిచేసినాడు. ఈ విషయం సామాన్యంగా చెప్పబడింది.

మొదటి అక్షరమైన 'అ'లోన మోక్షప్రదత్వమనే అర్థం సూచింపబడింది. ఇవన్నీ భగవంతునియెడ కలవని తాత్పర్యం. అమలన్ - ఆతి - పిరాన్ అనే మూడు పదాలకు తాత్పర్యం ఇకరాబోయే పాశురాల్లో చూడవచ్చు.

అడియార్కెన్నైయాళ్‌పడుత్త - "ఓం" అనే ప్రణవంలో మూడవ అక్షరమైన 'మ' జీవాత్మల సమూహాన్నీ - జీవాత్మలు ఈశ్వరునికంటే వేరైనవనీ - జీవాత్మలకంటే పరమాత్ముడు వేరు అనే భావాన్నీ అడియార్ అన్నది సూచిస్తుంది.

జీవులు నాలుగురకాలు, అందు మొదటివాడు నేనే స్వతంత్రుడను అనే స్వాతంత్ర్యాంధుడు - రెండవవాడు నేనింకొకనికి దాసుడనుగాను అనే ఇతరశేషత్వధీ - మూడవవాడు దేహమేఆత్మ అనే దేహాసక్తాత్మబుద్ధీ - నాల్గవవాడు శబ్దాదివిషయభోగాలందు చపలుడు అనే విషయచపలధీ. పైన

పేర్కొన్న నల్గురిలో నాల్గవవాడైన విషయచపలధీని 'అడియార్' అన్న పదం తెలుపుతూంది –

శబ్దాదివిషయభోగాసక్తునికి అడియార్ అన్న అర్థం ఉన్నప్పటికీ ఇక్కడ చెప్పబడిన అడియార్ అన్నపదం.

*శ్లో॥ యోహ్యేనం పురుషం వేత్తి దేవా అపి నతం విదుః.

[ఎవడు భక్తితో భగవంతుని తెలుసుకొని ఉన్నాడో అట్టి భగవంతుని దేవతలుకూడా తెలుసుకోలేక ఉన్నారు.]

అన్నట్లు భక్తితో పొందతగినవాడు భగవంతుడు అన్న మాహాత్మ్యన్ని పొందిన భగవంతునికి నేను దాసుడను అనే జ్ఞానంగల శ్రేష్ఠుని తెలుపుతూంది.

"ఓం" అనే ప్రణవంలోని మధ్యమాక్షరమైన 'ఉ' కారం నేను ఇంకొకరికి దాసుడనుకాను. నేను నీకే దాసుడను అనే అర్థాన్ని తెలుపుతూంది. అడియార్ అని ప్రత్యేకంగా పేర్కొనడం ఈ అర్థాన్ని సూచిస్తూంది.

భగవంతుడు తనకేమీ సహాయం చేయకపోయినా భగవంతుడే తనస్వామి అనిచెప్పే నిరుపాధికుణ్ణీ - భగవంతుడు తనకేమి సహాయం చేసినాడు అనిచెప్పే కర్మోపాధికుణ్ణీ ఈ ఇద్దరినీ 'అడియార్' అన్నపదం సూచిస్తూంది.

ప్రపంచానికంతటికీ స్వామి కావడంవల్ల ఎవరేమి కోరినా ఎంత కోరినా ఇచ్చేదానికి సమర్థుడు భగవంతుడు. ఇంకా ఎటువంటివాడంటే ఇంతెందు కిచ్చినావు ? అంతెందు కిచ్చినావు ? అని అడిగే ధైర్యం

---

* భా: తం: 3-156 16 (a)

ఎవరికీ లేకపోవటం చేత నిరంకుశుడు, ఈ నిరంకుశత్వంచేత స్వతంత్రుడు, కోరినదానికన్నా ఎక్కువకూడా ఇవ్వడానికి స్వతంత్రత కలవాడు. అటు వంటివాడు ఏ ప్రయోజనాన్నీ ఆశించకుండా తన్ను శరణుపొందే భాగ వతులకు తన సర్వస్వాన్నీ ఇవ్వడం నిశ్చయమైతే నేను నీ దాసాను దాసుడుగా ఉంటాను. నిన్ను ఆశ్రయించి నందుకు ఫలం ఏంది అంటే నిన్నూ భాగవతులనూ తప్ప ఇంకొకరిని ఆశ్రయించకుండా చేసినావు అదేఫలం. భగవద్భక్తులైన భాగవతుల నాశ్రయిస్తే ఆ భాగవతుల ద్వారా భగవంతుడు కోరినఫలాన్ని యిస్తాడేకాని, భగవంతుణ్ణి నేరుగా ఆశ్రయిస్తే ఫలాన్ని ఇవ్వడనే శ్రీవైష్ణవమత పరమసిద్ధాంతాన్ని బాగాతెలిసినవాడు కాబట్టి తిరుప్పాణాళ్వార్లకు భగవత్కైంకర్యం కలగనంచేత ఏ ప్రయో జనాన్నీ ఆశించకుండా భగవత్కైంకర్యం చేసే భాగవతులకే నన్ను దాసుడుగా చేసినాడు భగవంతుడు అన్న నిశ్చయార్థాన్ని 'అడియార్క్కే' అన్న పదంలోని ఏవకారంద్వారా తెలిపినారు.

*మట్రుమోర్ తెయ్వ ముళతెన్రిరుప్పారోడుట్రిల్లేన్ —

[ఆశ్రయించడానికి నీవు తప్ప ఇంకొక దైవం ఉన్నాడు అని తలచేవారితో స్నేహం చేయను. వారిని నా మనస్సులోకూడా తలచను. నీ నామమైన "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరి అన్ని విద్యలను తెలిపినా, నేను ఆ మంత్రార్థాన్ని చదివి తెలుసుకొన్నా, ఆ అష్టాక్షరి మహా మంత్రంలోని సారమైన అర్థవిశేషమేమంటే భగవంతుని దాసులకు దాసుడుగా ఉండడమనేదే.]

పై గోష్ఠిలో చేరినవారేకదా తిరుప్పాణాళ్వార్లు కూడా. అందుకే (అడియార్క్కే) "నన్ను నీ దాసులకు దాసుడుగా చేసినావు" అన్నారు తిరుప్పాణాళ్వార్లు.

† యూాయమిన్ద్రియకింకరాః —

---

* తిరుమంగయాళ్వార్ల పెరియతిరుమొళి, 8-10-3.

† ఎక్కడిదో తెలియరాలేదు.

[మేమంతా పంచేంద్రియాలకు దాసులం.]

అన్నట్లు ఆ పంచేంద్రియాలకు దాసులైన వాళ్ళల్లోను —

‡శ్లో॥ ....
ఈశ్వరోఽహ మహం భోగీ సిద్ధోహం బలవాన్ సుఖీ ॥

[సర్వస్వతంత్రుడైన భగవంతునిలాగా నేనూ సర్వతంత్రస్వతంత్రుడనైన ఈశ్వరుణ్ణి - అన్నిటికి నేనే నాయకుణ్ణి - ఈ భూమండలానికి నాయకుణ్ణి - ముందుజన్మల్లోను ఈ జన్మలోను భోగిని - అందరికంటే అధికమైన జ్ఞానం కలవాణ్ణి - అందరికంటే బలవంతుణ్ణి - అన్నదమ్ములు, కుమార్తెలుండడం చేత సుఖిని.]

అని విఱ్ఱవీగే వాళ్ళల్లోను —

* శ్లో॥ దాసభూతా స్స్వత స్సర్వే హ్యాత్మానః పరమాత్మనః ।
అతోఽహ మపి తే దాస ఇతి మత్వా నమామ్యహమ్ ॥

[పరమాత్ముడైన ఆ భగవంతుడికి స్వయంగా అందరూ దాసుని వంటివాళ్ళే. అందుచేత నేనూ నీ దాసుడను అని తలస్తూ నీకు నమస్కరిస్తున్నాను. అందరూ నీ దాసు లంటున్నారు కాబట్టి నేనూ అంటున్నానే కాని, నా మనస్ఫూర్తిగా అనడంలేదు]

ఇట్లా నా మనస్ఫూర్తిగా నీ దాసుడు అనడంలేదు అనే వాళ్ళల్లోను వీళ్ళల్లో ఎవరిలోను నన్ను చేర్చక నీ దాసానుదాసుడుగా చేసినావు. ఇట్లా నీవు నాకు చేసిన ఉపకారాని కన్నా —

† ఉఱ్రతు మున్నడియార్క్కడిమై —

---

‡ భగవద్గీత 16–14.

* రుద్రకృత మంత్రరాజస్తోత్రం.

† తిరుమంగయాళ్వార్ల పెరియతిరుమొళి 8–10–3

[తెలుసుకోవలసిన అన్నివిద్యలను తెలుసుకొన్నా - ఓం నమో నారాయణాయ అనే అష్టాక్షరీమహామంత్రాన్ని తెలుసుకొన్నా అందులోని సారం భగవద్దాసులకు దాసుడుగా ఉండడమే.]

అనేటట్లు నన్ను నీ దాసానుదాసుడుగా చేసిన ఉపకారానికి నేను నీకు చేసిన మహోపకారం ఏమైనా ఉందా అంటే ఏమీలేదు అని అంటూ భగవంతుడు ఆయన దాసులకు దాసుడుగా చేసిన మహోపకారాన్ని కీర్తించినాడు.

ఇది "నమః" శబ్దార్థ తాత్పర్యం. అంటే "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరిలో ఉన్న నమశ్శబ్దార్థమని తాత్పర్యం.

ముందుచెప్పిన నేనే అన్నీ చేయగలను అనే వాళ్లల్లో —

‡ఎరుత్తుక్కొడియుడై యోర్ —

[వృషభధ్వజుడైన రుద్రుడూ - బ్రహ్మదేవుడూ - దేవేంద్రుడూ - మిగతా దేవుళ్లూ - వీళ్లల్లో ఎవరూ ఈ సంసారసాగరంలో కొట్టుకలాడడం అనే వ్యాధికి మందు తెలుసుకో లేకుండా ఉన్నారు. ఈ జన్మించడం అనే మహావ్యాధికి మందును తెలుసుకొన్న వైద్యుడా! నల్లనిమేనివాడా! నాకు ఇంకొక జన్మలేకుండేటట్లు నన్ను శిక్షించి, తీర్చిదిద్ది, నీ దేవాలయ గోపురద్వారంముందు పడిఉండి జీవించేటట్లు అనుగ్రహించవలెను.]

అని అనడం చేత —

సృష్టికర్తల్లో వృషభధ్వజుడైన శివుడూ - చతుర్ముఖుడైన బ్రహ్మ మిగతా ప్రాకృతశరీరధారుల్లాగ అజ్ఞానాది దోషాలతో కూడినవారు కావడం వల్ల, తానుచెప్పే భగవంతుడు మాత్రం మోక్షాన్ని ఇవ్వగలడా లేడా అన్న సందేహం తీరడానికై "విమలన్" అన్న పదాన్ని ప్రయోగించినాడు.

---

‡ పెరియాళ్వార్ల తిరుమొళి. 5–3–6.

విమలన్ - నిత్యనిర్దోషి - అంటే ఎల్లప్పుడూ ఏ విధమైన దోషాలు లేకుండా ఉండేవాడు. బద్ధుడు అంటే ఎల్లప్పుడూ సంసారసాగరంలో తిరుగులాడేవాడు. ఇంటికి రమ్మని పిలువబడిన వానిని అతిథి అంటాము. ఆ అతిథి రాకకై ఎదురుచూచే వానివలె తాను చేయవలసిన మంచికార్యాలన్నీ పూర్తిచేసుకొని, ఇక చేయవలసిన దేమీ లేదనే తృప్తితో సంతోషంగా మృత్యువును ఎదురుచూచేవాడు ముక్తుడు. భగవంతుడు బద్ధుడు కాదనీ - ముక్తుడు కాదనీ తెలిసింది. అయితే ఎటువంటివాడు అంటే ఈ రెండింటికి విలక్షణమైనవాడని తేలింది. ఏ విధంగా విలక్షణమైన వాడంటే సంసారసాగరంలో ఈ భగవంతుడు తిరుగాడడు - మోక్షాన్ని కోరడు. పరమపదంలోఉంటూ దాసులకు పరమపదాన్ని ఇచ్చేవాడు అని తేలింది. ఈ నిత్యనిర్దోషిత్వము - బద్ధముక్త వైలక్షణ్యము నిత్యసూరులకు కూడా ఉందికదా అంటే —

విణ్ణవర్కోన్ - భగవంతుని ఆజ్ఞకులోబడి నడవడంవల్ల పరిశుద్ధమైనమనస్సుగలవాళ్లు నిత్యసూరులు. భగవంతుడు తాను స్వయంగా పరిశుద్ధమైనవాడు. ఇంకొకరిచేత పరిశుద్ధి పొందేవాడుకాడు. కాబట్టి భగవంతుడు నిత్యసూరులకంటే పైవాడనే విషయం తేలింది. ఇందువల్ల నిత్యసూరులచేత సేవింపబడుతూఉండే పరాత్పరస్వరూపం తెలుపబడింది.

ఎక్కడో అందరాని పరమపదంలో - దర్శింపరాని రూపంతో ఉన్న ఆ భగవంతుడు భూలోకంలో నివసించే మానవులకు పొందడానికి శక్యుడా అంటే —

విరైయూర్ పొళిల్ వేంగడవన్ - పరిమళాలు కుప్పలుగా పోసి నట్లున్న వృక్షసమూహాలతో నిండిన తిరుమలలో భగవంతుని దర్శించడం శక్యమంటున్నారు.

† కణ్ణావాన్ఎన్రుమ్ —

---

† నమ్మాళ్వార్ల తిరువాయ్ మొళి 1-8-3.

[భూలోకంలో నివసించే మాకూ పై లోకాలలో నివసించే బ్రహ్మ రుద్రాది దేవతలకూ కన్నులాంటివాడు భగవంతుడు. ఎప్పుడూ మమ్మల్ని కాపాడేవాడు. నిత్యసూరులకు స్థిరనివాసమైంది - ఎప్పుడూ చల్లదనంతో కూడింది అయిన తిరువేంకటమనే తిరుమలలో మానవులూ దేవతలూ ఆశ్రయించడానికీ - అనుభవించడానికీ అన్నట్లు - అంధకారమయమైన ఈ ప్రపంచంలో కొండపై పెట్టిన దీపంలాగ ప్రకాశిస్తూ నిలిచిఉన్నాడు.]

అన్నట్లూ - ఇంకా –

‡ అన్దమిల్ –

[ఆ భగవంతుడూ శ్రీమహాలక్ష్మి కలిసివచ్చి పెండ్లి మండపంలో ఉన్నారు. ఆ మహానందం అంతులేంది. దర్శించడానికి ఈ రెండు కళ్లూ చాలవు. వారిద్దరేకాదు - వారిద్దరితో పరమభాగవతులూ కూడా ఉన్నారు.]

అటువంటి పరమపదంలో నివసించాలనే సంతోషానికన్నా–

* ఎమ్బెరుమాన్ –

[నరనారాయణులు బదరికాశ్రమంలో తపస్సుచేస్తుండగా దేవేంద్రుడు తన పదవికి కదలిక కలుగుతుందన్న భయంతో, అసూయతో వారితపస్సు చెరచడానికి అప్సరస్త్రీలను పంపినాడు. ఆ అప్సరస్త్రీలు తమ అందమైన శరీరాలను చూపుతూ తమ నాట్యజ్ఞానాన్నీ సంగీతజ్ఞానాన్నీ చూపుతూ నరనారాయణుల తపస్సు చెరచడానికి ప్రయత్నించినారు. దానికి నరనారాయణులిద్దరూ కలతచెందలేదు. ఉగ్రుడై నారాయణుడు ఆ అప్సరస్త్రీలను అవమానించడానికని తనతొడను గోటితో గీరినాడు. వెంటనే ఆతని

---

‡ నమ్మాళ్వార్ల తిరువాయ్‌మొళి 10-9-11.

* కులశేఖరాళ్వార్ల పెరుమాళ్ తిరుమొళి 4-10.

తొడనుండి ఆ అప్సరస్త్రీలకంటె చాలాఅందమైన ఒక స్త్రీ వచ్చి నిలిచింది. ఆ స్త్రీని చూడగనే సిగ్గుతో అప్సరసలు తలవంచుకొని ఆ స్త్రీనే తమకు నాయకురాలినిగా ఎన్నుకొని దేవలోకానికి వెళ్లినారు.

నారాయణుని తొడనుండి పుట్టిందే ఊర్వశి. ఈ ఊర్వశి అన్ని లోకాలను ఒక త్రాటికిందికి తీసుకొనివచ్చి, ఆడించే అందాన్ని కలిగింది. ఈమె తన అందాన్ని ఇనుమడింపజేసే పట్టుపీతాంబరాన్ని కట్టుకొని, నన్ను పొందడానికి వచ్చినా ఆ ఊర్వశిని కోరను. ఇంక దేనిని నేను కోరుతానంటే పగడమువలె ఎఱ్ఱనైన నోరుకలిగిన నా స్వామి శ్రీవేంకటేశ్వరుడు వెలసిన తిరువేంకటమనే అందమైన తిరుమలకొండమీద మనిషిగానో - జంతువుగానో - చెట్టుగానో - ఏదైనా ఒకవస్తువుగా జన్మించాలను కొంటున్నాను.]

ఇట్లా భగవద్భక్తులంతా తలస్తూ ఈ తిరుమలలో అన్నిరూపాల్లో జన్మించినట్లున్నారు. వీళ్లతో ఎంతో అందంగా ప్రకాశిస్తూంది తిరుమల. అచ్చట నివసించేస్వామి అందరికీ సులభుడుగా ఉన్నా —

† అవ్వణ్ణత్తవర్ -

[నీలమేఘమువంటి శరీరచ్ఛాయ - వెనుక నిగనిగ మెరసే అందమైన వెంట్రుకలు వ్రేలాడుచుండగా - రెండుచెవులలో మకరకుండలాలు తళతళ మెరయగా - ఒకచేతిలో ధనుస్సూ - ఇంకొక చేతిలో బాణమూ - వెనుక అంబులపొది కలిగి - తానూ తనతమ్ముడు లక్ష్మణస్వామీ ఇద్దరూ కలిసి, నా యెదుట ప్రత్యక్షమై నిలుస్తున్నారు. వారి చేతులు ఎఱ్ఱని తామరపూలలాగ ఉన్నాయి. నోరు పగడంలాగ ఎఱ్ఱగాఉంది - కన్నులు వికసించిన తామరల్లాగ ఉన్నాయి. తామరలలాంటి పాదపద్మాలు - అంతా తామరమయం. ఇంత అందగాడు తానేవచ్చి నా కన్నులకు దర్శనమిచ్చి

---

† తిరుమంగయాళ్వార్ల తిరునెడుంతాండకం. 21 పా.

నాడు. ఇంత సులభంగా దర్శన మివ్వడంచేత మనం ఇతడేదో పరదేవత అనే భ్రాంతిలో పడ్డాము. ఇతడు పరదైవము కాదు. సాక్షాత్తు పరమ పదంలో స్వామే ఈతడు.]

ఆ మాదిరి నిలుస్తున్నాడు భగవంతుడు –

ఇంకా ఎట్లాంటి వాడంటే–

నిమలన్ - బ్రహ్మరుద్రాదులు సమీపించాలన్నా భయపడేటట్లు దర్పంగా ఉండేవాడూ - ఎవరైనా తన్ను దర్శించాలంటే ముందు అను మతిపొంది, ఆ తర్వాత లోనికివెళ్లి దర్శింపదగిన స్థితిలో ఉండేవాడూ భగవంతుడు. ఆ భగవంతునికి స్వతస్సిద్ధంగా ఒకదోషం ఉంది. అదే దంటే తన్ను ఆశ్రయించాలని ఎవరైనా సమీపిస్తే వారికి ఆశ్రయ మివ్వక పోవడం. అదే ఆశ్రయణవిరోధిత్వదోషమనేది. దాన్నివిడిచి ఏ విధమైన సంకోచం లేకుండా 'కురువనంబి' అనే పేరుకల కుమ్మరి భక్తుడు ఎల్ల వేళలా తన్ను దర్శించడానికి అవకాశం కలిగించి, ఆశ్రయణవిరోధిత్వం లేనివాడు భగవంతుడు అనిపించుకొన్నాడు.

ఇంకా –

† శ్లో॥ ఆస్తాం తే గుణరాశివ ద్గుణపరీవాహాత్మనాం జన్మనామ్
సంఖ్యా భౌమనికేతనేష్వపి కుటీకుంజేషు రంగేశ్వర ।
అర్చ్య స్సర్వ సహిష్ణు రర్చకపరాధీనాఖిలాత్మస్థితిః
ప్రీణీషే హృదయాళుభి స్తవ తత శ్శీలా జ్జడీభూయతే ॥

[కోరిక కలిగి, మంచిగుణాలు కలిగిన రామకృష్ణాది విభవావతారాలు లెక్కలేనన్ని ఎత్తినావు నీవు. ఆ అవతారాల్లో ఎంతో స్వాతంత్ర్యాన్ని చూపినావు నీవు. అవన్నీ అట్లా ఉండనీ. ధనవంతులు నివసించే

† పరాశరభట్టర్ శ్రీరంగరాజ స్తవమ్ - ఉత్తరశతకమ్. 74 శ్లో.

మహాప్రాసాదాల్లో - మధ్యతరగతి వాళ్ల నివసించే మేడల్లో - పేదలు నివసించే గుడిసెల్లో - ఆటవికులు నివసించే పొదరిండ్లల్లో - ఇక్కడ, అక్కడ అని కాకుండా ప్రపంచంలో అన్నిచోట్లల్లో - అన్నివస్తువుల్లో ఉంటున్నావు. ఎట్లా ఉన్నావంటే అందరూ నిన్ను పూజింప తగినట్లూ - ఎవరేవిధంగా నిన్ను పూజిస్తే ఆ విధంగా వారి పూజను సహించేటట్లూ ఉండడానికని విగ్రహరూపంతో ఉన్నావు. విగ్రహరూపంతో ఉంటూ, నిన్ను పూజించే అర్చకులు ఏ విధంగా అలంకరిస్తే ఆ విధంగా అలంకారం చేయించుకొంటూ, ఇంతకు పూర్వపు విభవావతారాల్లోని స్వాతంత్ర్యాన్ని వదలి, అర్చకులకు పరాధీనుడైనావు. స్వామిని దర్శించాలనీ - వారిని పూజించాలనీ తహతహలాడే మంచిహృదయాలుగలవాళ్లు ఇటువంటి నీ అర్చారూపాన్ని దర్శించి సంతోషిస్తున్నారు.]

దీనివల్ల సర్వస్వతంత్రుడైన భగవంతుడు అర్చారూపాన్ని పొంది, ఆశ్రితుల చేతిలోని కీలుబొమ్మై, ఆశ్రితపరతంత్రుడైన విధాన్ని ప్రకాశింపజేసినట్లయింది.

తాను భగవంతుడై ఉండిన్ని సులభంగా సేవింపతగిఉండడం, గొప్పవాడననే అహంకారాన్ని వదలి. తనకంటే తక్కువవారైన గుహుడు - సుగ్రీవుడు - శబరి - కుచేలుడు - కుబ్జ - గొల్లెతలు - మాల్యవంతుడు మొదలైనవారితో కలసిమెలసి ఉండడం, సౌలభ్యాన్ని సూచిస్తుంది. తక్కువ కులంలో చేరినవారని తలచకుండా ఆ నీచులయెడకూడా అతిప్రీతికలిగి ఉండడం, సౌశీల్యాన్ని సూచిస్తుంది. భగవంతుడు సౌలభ్య సౌశీల్యాది గుణాలుకలిగిఉన్నా ఆశ్రయించిన వారిలోని దోషాలను చూస్తాడేమోనని సమీపించడానికి సందేహిస్తున్నారా అంటే —

నిమలన్ - అవిజ్ఞాత. ఆశ్రయించిన వారిలోని దోషాలను లెక్కించని వాడు.

‡ ఎన్నడియాారతు —

[భగవంతుని శ్రీపాదాల నాశ్రయించిన దాసుల విషయంలోను - దాసానుదాసుల విషయంలోను ఏకాంత సమయంలో స్వామికిచెప్పి, ఉప కారం చేయదగిన శ్రీ మహాలక్ష్మి తానుగా దాసులలోని దోషాలను వెదకి లెక్కించి స్వామికి చూపి నేరాలు చెప్పనారంభించినా ''నా పాదాల నాశ్ర యించిన దాసులు - దాసానుదాసులు నీవు చెప్పినటువంటి దోషాలు చేయరు. కొన్ని తప్పులు చేసినా ఆ తప్పులు సహించడానికి భగవంతుడున్నాడు అని వారు స్వతస్సిద్ధంగా చేసే దోషాలే చేసినారు'' అంటూ శ్రీ మహాలక్ష్మికి బదులు పలికేవాడూ,— ఐశ్వర్యవంతుడైన విభీషణుని కోరిక మన్నించి, లంకానగరంపై తమ కృపాకటాక్ష వీక్షణాలు ఎల్లప్పుడూ ఉంచడానికో అన్నట్లు, దక్షిణపు దిక్కుచూస్తూ శేషశయనంపై పవ్వళించినవాడూ - నాకు స్వామీ అయిన శ్రీరంగనాథుడు తనకు తప్ప ఇతరులకు మనలను దాసులుగా చేయడమంటూ ఉంటుందా ? ఇంకొకరికి మనలను దాసులుగా చేయరు చేయరు ముమ్మాటికీ చేయరు. తనకే దాసులుగా చేసుకొంటారు.]

భగవంతునికే దాసులుగా చేసుకొంటారు అని చెప్పడం చేత ఆశ్రితులు దోషాలుచేసినా అవి తనకు హితమైనవని తలస్తూ ఆ దోషాలను చూడక పోవడంచేత శరణ్యదోషరహితుడు భగవంతుడు అనే విషయం తేలింది.

భగవంతుడు సర్వజ్ఞుడు అంటే అన్నీ తెలిసినవాడు. మరి ఆ భగ వంతుడు ఆశ్రితులలోని దోషాలను చూడడన్నారు కదా ! అప్పుడు భగ వంతునికి ఉండే సర్వజ్ఞత్వం తప్పిపోవడం లేదా అని ప్రశ్నించుకొని, ఆశ్రితులలోని దోషాలను చూడకుండా ఉంటా డనడం నిజమే. ఒకవేళ చూచినాడు అనుకొన్నా దాసులలోని దోషాలను తొలగించడానికి చూచినాడు అనుకోవచ్చు

‡ పెరియాళ్వార్ల తిరుమొళి 4-9-2.

నారాయణాయపదంలోని "నా" అనే అక్షరం పరమాత్మ స్వరూపాన్నీ – "రా" అనే అక్షరం జీవాత్మ స్వరూపాన్నీ - "య" అనే అక్షరం భగవంతునిపొందే ఉపాయాన్నీ - "ణా" అనే అక్షరం భగవంతుని పొందటం వల్ల కలిగే ఫలాన్నీ - "య" అనే అక్షరం భగవంతుని పొందడానికి విరోధి ఏది అనే విషయాన్నీ - ఎట్లా సూచిస్తున్నా యో అట్లాగే (1) విమలన్ (2) విణ్ణవర్కోన్ (3) విరైయార్పొళిల్ వేంగడవన్ (4) నిమలన్ (5) నిన్మలన్ అనే అయిదు విశేషణ పదాలూ సూచిస్తున్నాయి

భగవంతుడి స్వరూపాన్ని దర్శించడం, భగవంతునికి కైంకర్యాలు చేయడం అనే సెన్నిధిలో మునిగి తేలేవారు నిత్యసూరులు. అట్లాంటి నిత్యసూరులకు ఎల్లప్పుడూ భగవంతుడు సేవించడానికి ఏ విధంగా సర్వ సులభుడుగా ఉన్నాడో అట్లాగే భగవంతుని దాసానుదాసులమైన మనకూ సులభంగా సేవింపతగిన వాడుగా ఉన్నాడు అని 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరిలో చతుర్థీవిభక్తి ఉపయోగించడంచేత తెలుస్తూంది. ఇంకా భగవంతుడూ అతనికి సేవచేయడమూ అనే విషయాల్ని చెప్పడంచేత భగవంతుడూ దాసుడూ వాళ్లిద్దరిమధ్యా ఒకరికొకరికుండే కైంకర్యం చేయడం అనే ప్రతిసంబంధిత్వాన్ని తెలిపినట్లయింది.

నీతివానవన్ - (నీతి + వాన్ + అవన్) ఇక్కడ వాన్ అన్న శబ్దం పరమపదాన్ని సూచిస్తుంది. పరమపదమంటే ఉత్త పరమపదంగాక నిత్యసూరులతో ప్రకాశించే పరమపదం అని అర్థం. సత్యాన్నీ ధర్మాన్నీ పాలిస్తూ నీతిగానడచేస్థలం పరమపదం. అక్కడ నివసించేవాడు భగవంతుడు అని.

† శ్లో॥ తేన వంచయతేలోకా న్మాయాయోగేన కేశవః ।
యే తమేవ ప్రపద్యంతే న తే ముహ్యంతి మానవాః ॥

† భారతమ్. 5-66-15.

[చిత్రవిచిత్రాలైన కార్యాలు చేయడాన్ని మాయ అంటాము. ఆ మాయాకృత్యాలు చేసేవాడు కేశవుడు. ఆతని మాయచేత ఈ లోకాలూ ఈ లోకాల్లోని మానవులూ వంచింప బడుతున్నారు. కేశవుడుతప్ప ఇంకొకరు దిక్కులేరు. ఇంకొకరిని శరణు వేడను అని ఆ మాయకు లోబడని బుద్ధిమంతులు మాత్రం ఆ మాయలో మునగడంలేదు. మిగతావారంతా భగవంతుని మాయకు లోబడిపోతున్నారు.]

అని కలతచెందేవారూ –

*శ్లో॥ అవజానంతి మాం మూఢా మానుషీం తను మాశ్రితమ్ ।
పరంభావ మజానంతో మమ భూతమహేశ్వరమ్ ॥

[దేవాదిదేవుణ్ణి - సర్వజ్ఞుణ్ణి - సత్యసంకల్పుణ్ణి - అన్నిలోకాలపుట్టుకకు కారకుణ్ణి - ఇటువంటి నేను మానవలోకంమీద కరుణకలిగి, ఔదార్యాన్నీ - సౌశీల్యాన్నీ - వాత్సల్యాన్నీ చూపడానికనీ - అందరూ నన్ను ఆశ్రయించడానికనీ నేను మనుష్యరూపం ధరించినాను. పాపకర్మాలతోకూడిన మూఢులైన ఈమనుష్యులు నన్ను అందరిమనుష్యులతో సమానంగానూ అందరిలో ఒకడిగానూ తలుస్తున్నారు. మనుష్యరూపం ధరించినంతమాత్రంచేత నాగొప్పతనాన్ని తెలియనివారై ఇతరులతోసమానంగా తలుస్తూ నన్ను అవమానంచేస్తున్నారు.]

ఇట్లా భగవంతుని అవమానంచేసేవారూ - భగవంతుని అవమానం చేస్తున్నారని కలతచెందేవారూ లేనిప్రదేశం పరమపదం కావడంచేత –

† శ్లో॥ దాస్య మైశ్వర్యయోగేన జ్ఞాతీనాం చ కరోమ్యహమ్ ।
అర్ధభోక్తా చ భోగానాం వాగ్దురుక్తాని చ క్షమే ॥

* భగవద్గీత, 9–11.
† భారతమ్. 12–82–5

[పరమపదంలో నివసిస్తూ సర్వైశ్వర్యాలకు నాయకుడైన నేను నాసంకల్పంతో నాముచ్చటతీరడానికని వ్రేపల్లెలో శ్రీకృష్ణుడుగా పుట్టాను - పుట్టడమేకాదు గోవుల కాచినాను - సాందీపని పుత్రుణ్ణి యమలోకంలోనుండి తెచ్చి ఇమ్మంటే ఇచ్చాను. రుక్మిణీస్వయంవరానికి రమ్మంటే వెళ్లినాను - పాండవధార్తరాష్ట్రులకుసంధిచేయడానికి మధ్యవర్తిగా వెళ్లమంటేవెళ్లినాను - అర్జునునిరథసారథ్యం చేసినాను - రథాన్ని నిలుపు అంటే నిలిపినాను - రథాన్ని నడుపు అంటే నడిపినాను - ఇంకా వాళ్లుచెప్పినపనులన్నీచేస్తూ వాళ్లకు దాస్యం చేశాను. నాజ్ఞాతులైన యాదవులకు ఐశ్వర్యాన్నీ రాజ్యాన్నీ ఇచ్చినాను. నాకు ఏమంచికలిగినా అది అందరికీ పంచిఇచ్చినాను. నా ఐశ్వర్యంలో ఒకఅంశంగలవాళ్లూ అంతోఇంతో తినితిరిగేవాళ్లూ నేను గోవుల మేపినందుకు 'గోవిందా'అనీ 'గోపాలా'అనీ అన్నారు నన్ను. మాతల్లి నానడుముకు దారంకట్టిందని 'దామోదరు' డన్నారు. శ్యమంతకమణి హరించిన దొంగవు అన్నారు. శిశుపాలునిచే వినరానిమాటలు విన్నాను. ఉదంకుడు తిడితే తిట్లుతిన్నాను. దుర్వాసునిచే పరాభవాన్నిపొందినాను. ఈ కృష్ణావతారం ధరించి అన్నిటినీ అందరినీ క్షమించినాను.]

అనే భగవంతుడినీ -

‡ శ్లో॥ పరమేశ్వరసంజ్ఞోఽజ్ఞ కి మన్యో మయ్యవస్థితే ।
తథాఽద్య మర్త్య కామ స్త్వం ప్రబ్రవీషి పునఃపునః ॥

[అందరికీ నాయకుడైన నేనుండగా తెలివి తక్కువ వాడివి నీవెవడివిరా? అందరికీ నాయకుడనని చెప్పడానికి. చావడానికే మరలా మరలా నాయకుడనని చెప్తున్నావు అన్నాడు స్తంభంనుండి వెలువడిన నరసింహస్వామి.]

అని అంటూ పరమపదంలో నివసించే భగవంతుణ్ణి నీతివానవన్ అన్నపదం సూచిస్తుంది.

‡ విష్ణుపురాణమ్ 1-17-23.

ఈ భూలోకంలోనే ఒకప్పుడు నేను అందరికీ నాయకుడను ఈశుడను అనేదీ - ఇంకొకప్పుడు నేను అందరికీ దాసుడను ఈశితవ్యుడను అనేదీ - ఇటువంటి తార్మారు మాటలు పలికేదీన్ని - ఆ పరమపదంలో ఆ తార్మారు మాటలు లేవు. ఆ పరమపదంలో నివసించేవాడు భగవంతుడు. వాడే నీతివానవన్ అన్నపదంచేత చెప్పబడినవాడు.

పైనచెప్పినవిధంగా అందరిచేతా సేవింపదగినవాడూ - అందరికీ ప్రభువైనవాడూ -

* విభీడణఱ్కు వేఱాన నల్లాన్ -

[పెద్దపెద్దరాళ్లతో పెద్దపెద్దకొండలతో కోటకట్టి - శత్రుదుర్భేద్యమైన నగరాన్ని నిర్మించి - లంకానగరమనే పేరుపెట్టి - అందు నివసిస్తూ అహంకారంతో విఱ్ఱవీగే నీచుడు - రాక్షసుడు - రావణుడు ఎదిరిస్తే - పదునైన బాణాలతో చంపినాడు. అదే నీచకులంలో జన్మించిన రాక్షసుడు రావణుని తమ్ముడు విభీషణుడు తనరాజ్యాన్ని - తనసంపదనూ సర్వస్వాన్నీ వదలి భగవత్కైంకర్యం చేయాలని ఆశ్రయిస్తే, రక్షిస్తానని అభయమిచ్చినాడు. అప్పుడు అక్కడఉన్న కపులంతా "స్వామీ! వీడు రావణుని తమ్ముడు - దొంగ - వీడికి ఆశ్రయమిస్తే మనకు గొప్ప ఆపద కలుగుతుంది" అన్నారు. ఎవరేమిచెప్పినా శ్రీరామచంద్రుడు వినలేదు. కడపటికి కపులు మేమంతా కిష్కింధకు వెళ్లిపోతామన్నారు. అప్పుడు శ్రీరాముడు "మీఇష్టం, నేనితనిని రక్షిస్తానని అభయహస్తం ఇచ్చాను, నామాటకు తిరుగు లేదు" అన్నాడు]

అటువంటి ఆశ్రితరక్షకుడు ఈతడు. నీచకులంలో జన్మించిన విభీషణునికి భగవంతుడు లభించినట్లు, నీచకులంలో జన్మించిన నాకు ఇప్పుడు

---

* పెరియతిరుమొళి 6-8-5.

ఈ లోకంలో, ఈ శరీరంతో సేవించడానికీ, కీర్తించడానికీ భగవంతుడు లభించినాడు. ఇంతా ఎటువంటివాడు భగవంతుడు అంటే -

నీళ్ మతిళరజ్ఞత్తమ్మాన్ - యుద్ధంచేసి జయించడానికి వీలులేనిది అయోధ్య అనీ - ఇతరులచేత జయించడానికి వీలులేనిది అపరాజిత అనీ చెప్పబడే మహానగరానికి నాయకుడు -

† కొడియణినెడుమతిళ్ -

[ముక్తిని అపేక్షించి, భగవద్దాస్యంచేసి, ఈ సంసారబంధాన్ని వీడి, ప్రకృతిమండలాన్ని దాట, పరమపదాన్ని సమీపించడానికి ముక్తులు వెళ్లినారు. ఈ ముక్తులు భగవంతునికి తరతరాలుగా దాసులు అని తెలియడానికని ధరించే కిరీటాలు ధరించి ఉన్నారు. ముక్తులు వస్తున్నారని తోరణాలతో గోపురాలు అలంకరించినారు. ఆ గోపురాలు ముక్తులు సమీపించినారు. అంటే ఇంతకుపూర్వం అక్కడ అలంకారాలు లేవనికాదు. "ముక్తుల రాక కోసరం - ముక్తుల్ని గౌరవించడం కోసరం - పరమపదవాసులమైన మాసంతోషాన్ని తెలుపడం కోసరం అలంకరించినాము. అంతేకాదు శ్రీకృష్ణావతారం పూర్తి అయినతర్వాత మాధవుడు తిరిగి పరమపదానికి వచ్చినందుకూ - మహాలక్ష్మి కోసరమూ అలంకరించినాము" అంటూ నిత్యసూరులు ముక్తులకు ఎదుర్కోలు పలికినారు. నిత్యసూరులు ముక్తులతో ఇట్లా అన్నారు. "మాకు నాయకుడుగాఉండే భగవంతుడు పరమపదంలో ఉండడం కొరతగా భావించి, భూలోకంలో గొల్లల ఇంట శ్రీకృష్ణుడుగా జన్మించి, పసులకాపరితనాన్ని చేస్తూ ఇదే తనకు గొప్పకార్యం అని తలచినాడు. దర్శింపరానివాడు, సమీపింపరానివాడు అని భయపడి, పారిపోయే భక్తులను వెంటాడి, సమీపించి ఇదిగో నేనిక్కడున్నాను - రాండి - దర్శించండి అని దర్శనమిస్తూ సర్వసులభుడుగాఉంటూ, సౌలభ్యగుణంతో

---

† తిరువాయ్ మొళి. 10-6-8.

మెలగినాడు. ఆతనిదాసానుదాసులు మీరు" అన్నారు. అప్పుడు ముక్తులు నిత్యసూరులతో ఇట్లా అన్నారు. "మాకంటేముందే మీరు వీరిని సేవించి నిత్యసూరులయినారు" అని.]

సురక్షితమై నిత్యసూరులతో విలసిల్లే పరమపదంలో భగవంతుడు -

‡ అయర్వఱు మమరర్ కళుక్కు -

[తనకంటే గొప్పవాడు లేనివాడెవడో వాడూ - ఆనందం మొదలైన కల్యాణగుణాలు కలవాడెవడోవాడూ - జ్ఞానాన్నీ భక్తినీ నాకు దయచేసి అజ్ఞానాన్ని నశింపజేసిన వాడెవడోవాడూ - మరుపు ఎటువంటిదో తెలియని నిత్యసూరులకు స్వామియైన వాడెవడోవాడూ అయిన ఆ భగవంతుని జ్యోతిర్మయాలైన శ్రీపాదాలకు నమస్కరిస్తే దుఃఖాలు తొలగి, ఓమనసా! నీవు కడతేరగలవు.]

అనే శ్రీపాదాలు కలిగి, దేవతలకు కూడా నేనే అధిపతి అనే దర్పాన్ని కలిగి —

* శెఙ్గోలుడైయ -

[ఎక్కడో ఉంటూ ఎవరిచేతా సులభంగా అందరాక ఉండే పరమపదాన్నీ - సముద్రాలచేత చుట్టబడిన ఈభూమండలాన్నీ - ఈరెండింటినీ రెండుసంపదలుగా భావించి, ఏకొదవా రాకుండా నిర్వహిస్తూ వాటిని రక్షించే వాడు! నన్ను మూడవ సంపదగా భావించి, కాపాడుతూ శ్రీరంగంలో శేషశయనంలో పవ్వళించి చేతిలో దండాన్ని ధరించి ఉన్నాడు. "అవాప్త సమస్తకాముడు" కోరినదే తడవుగా అన్ని కోరికలూ పొందుస్వామి ఉన్న కీర్తిగలిగిన ఈ రంగనాథస్వామి ఇంకా సంపద కావాలని నాచేతిలోని

‡ నమ్మాళ్వార్ల తిరువాయ్మొళి. 1-1-1
* నాచ్చియార్ తిరుమొళి. 11-3.

బంగారుగాజును కొల్లగొని పోతున్నాడు - పోనీ. ఈవిధంగా నాచేతి బంగారు గాజు కొల్లగొనడంచేత అతనికి కలిగినకొరవ తీరనీ !]

ఈ లోకాలను రక్షించడానికీ - శిక్షించడానికీ దండాన్ని చేతధరించి, శ్రీరంగంలో దర్పాన్ని చూపుతూ దేవతలకు కూడా నేనే అధిపతిని - నాకు అధిపతి ఎవరూలేరు అనేఠీవితో ప్రకాశించే స్వామి ! మహోన్నతపదంలో తానుంటూ - దాసానుదాసుడుగా నన్ను నిలిపినాడు. ఇతడే నాస్వామిన్నీ - స్వాస్వతంత్రుడూన్నూ.

అరజ్గత్తమ్మాన్ - భూలోకానికీ పరమపదానికీ ఎల్లవంటివాడు. అంటే ఈ అర్చావతారంలో శ్రీరంగంలో ఉంటూ, పరమపదంలో శాశ్వతంగా నివసించే నాయకుడు అని.

జీవాత్మ భగవంతుని చేరేది శ్రీపాదాల మూలంగానే. జీవాత్మకు మంచిమార్గంచూపేది శ్రీపాదాలే. అందుకని శ్రీపాదాలను తిరుప్పాణాళ్వార్లు వర్ణిస్తున్నారు.

తిరుక్కమలపాదమ్ - ఆ శ్రీపాదాలు ఎటువంటివి అంటే పావనా లైనవి - అనుభవించడానికి తగినవి - శుభాలు కలిగించేవి ఇంకా లక్ష్మీదేవి చేతిలోని లీలాకమలాలు ఎట్లా ఎఱ్ఱగా ఉంటాయో అట్లా ఉండేవి; శ్రీరంగనాథస్వామి దివ్య శ్రీపాదపద్మాలు అనికూడా అనుకోవచ్చు.

వన్దు - వచ్చి. లోకసారంగముని తిరుప్పాణాళ్వార్ల నివాసానికి వచ్చి " శ్రీరంగనాథస్వామి నిన్ను (తిరుప్పాణాళ్వార్లను) మూపుపై ఎక్కించుకొని, తోడ్కొని రమ్మనినారని చెప్పగా - " "అయ్యో ! ఈ బ్రాహ్మణోత్తముని మూపుపై నేనెక్కిపోవుటా" అనే భయంతో అతడు వరుగిడగా ఆముని ఆతన్ని వెంటాడి వచ్చి పట్టుకొని, ఆతన్ని మూపుపైన ఎక్కించుకొని, శ్రీరంగనాథుని సన్నిధికి కొనివచ్చిన సన్నివేశాన్ని -

''నేను ఏ ప్రయత్నమూ చేయకుండానే నేను కోరకుండానే నాకన్నులకు ప్రత్యక్షమై లభించినాయి శ్రీపాదాలు" అని తిరుప్పాణాళ్వార్లు చెప్పే విషయాన్నీ ''వన్దు" అన్న శబ్దం సూచిస్తూంది.

శ్రీపాదాలపై నిలిపినచూపు మరల్పరాని విధంగా ఉంది. సేవించడానికి తగిన అందాన్ని కలిగి ఉన్నాయి ఆ శ్రీపాదాలు అని ఆ శ్రీపాదాల ఆధిక్యాన్ని ఉత్ప్రేక్ష చేస్తున్నారు.

ఎన్ కణ్ణినుళ్ళన వొక్కిన్రవే - ''దేవతలకు అధిపతియైన బ్రహ్మాదుల దివ్యచక్షుస్సులకూ - మహాయోగిపుంగవులైన సనకాది యోగిపుంగవుల దివ్య చక్షుస్సులకూ కానరాక దూరంగా ఉన్న ఆ దివ్యశ్రీపాదాలు, మనుష్య మాత్రుడను - నాకన్నులు మాంసపు ముద్దలు - ఈ మాంసపుముద్దలు కన్నులుగాగల నేను దర్శించడానికి వీలై నన్ను సమీపించి, నా ఎదుట నిలిచి, నాకు దర్శనమిచ్చినవిగదా!" అని ఆశ్చర్యపడుతున్నారు తిరుప్పాణాళ్వార్లు.

''శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే - శ్రీమతే నారాయణాయనమః" అనే రెంటినీ '' ద్వయం " అంటారు. ఈ ద్వయంలో ముందూ వెనకా ఉండే రెండు ''నారాయణ" శబ్దాల అర్థాన్నీ - మొదట ఉండే " చరణ " శబ్దార్థాన్నీ " నీళ్ మతిళరఙ్గత్తమ్మాన్, తిరుక్కమల పాదమ్'' అనే రెండుపదాలూ తెలుపుతున్నాయి

ఎవరికీలేని కొన్ని ఉత్తమగుణాలు భగవంతుని కున్నాయి. ఈ పాశురంలో అంతులేని భగవంతుని ఆ ఉత్కృష్టగుణాలను తిరుప్పాణాళ్వార్లు తెలిపినారు. శ్రేష్ఠమైన ఆగుణాలు ఏవి అంటే (1) మోక్షం ఇవ్వడాన్ని "మోక్షప్రదత్వ''మనీ (2) ప్రపంచానికంతకూ తానే కారణభూతుడనడాన్ని "జగత్కారణత్వ''మనీ - (3) అందరూ తన్ను శరణు పొందదగిన వాడననడాన్ని "శరణ్యత్వ"మనీ - (4) అందరికీ అన్ని రకాలైన ఉపకారాలు చేయడాన్ని "సర్వోపకారత్వ''మనీ - (5) అందరి

యెడ దయగలిగి ఉండడాన్ని "కృపావిశేష"మనీ - (6) తాను సర్వ స్వతంత్రుడై ఉండడాన్ని "స్వాతంత్ర్య"మనీ ఈ గుణాలు కలిగినవాడు భగవంతుడనీ అంటారు. ఇంకా ఆ భగవంతుని గుణాల్లో అతిముఖ్యాలు (7) తాను స్వతంత్రుడుగా ఉండడంవల్ల ఇతరులకు ఉపకారం చేయవలసిన బాధ్యత తనకు ఏమీలేదు. అయినా భగవంతుడు ఇతరులకు ఉపకారం చేయడమనే "ఉపకారవిశేషాన్నీ" - (8) సర్వస్వతంత్రుడు కావడంవల్ల దోషాలు ఏమైనా ఇతనిలో ఉన్నాయో ఏమో అంటే సర్వకాలసర్వావస్థ ల్లోను దోషాలు లేనివాడుగా ఉండడం అనే "నిత్యనిర్దోషిత్వాన్నీ" - (9) తాను స్వతంత్రుడు కాబట్టి అంతటిసీ తనఇచ్ఛవచ్చినట్లు నడపవచ్చుకదా అంటే అట్లావీలులేదు; ఎందుకంటే ఈ భగవంతుడు నిత్యసూరులతో కలసిఉన్నాడు కాబట్టి తాను తప్పుదారిలో నడిస్తే, నిత్యసూరులూ తప్పు దారిలో నడుస్తారు కాబట్టి తాను చెడకుండా ఇతరులను చెడగొట్టకుండా తన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం అనే "నిత్యసూరినిర్వాహకత్వాన్నీ" - (10) తాను సర్వస్వతంత్రుడు కాబట్టి తన సంకల్పమాత్రం చేతనే సర్వ ప్రపంచాన్నీ, అందలి దుష్టుల సమూహాన్నీ నాశం చేయడానికి తగినంత శక్తిఉన్నా ఆవిధంగా చేయకుండా ధర్మాన్ని స్థాపించడం, తన్నుగూర్చి పరితపించే భక్తులను కాపాడడానికి ఆయాయా యుగాలకు తగినవిధంగా శరీరాలు ధరించి, తనభక్తులను కాపాడుతూ తన స్వాతంత్ర్యాన్ని కాపాడు కోవడం అనే "నిత్యవిగ్రహత్వాన్నీ" - (11) తాను స్వతంత్రుడు కాబట్టి ఎవరికీ సులభుడుగా కానరావలసిన పనిలేదు. స్వాతంత్ర్యాన్నీ దర్పాన్నీ చూపుతూ అందరియెడా నిర్దాక్షిణ్యంగా ఉండవలసినవాడు భగ వంతుడు - కానీ ఆ భగవంతుడు జాతిమత స్త్రీపురుష విభేదాలు పాటించ కుండా ఎవరైనా ఎప్పుడైనా తన్ను దర్శించడానికీ సేవించడానికీ అన్ని విధాల సర్వసులభుడుగా ఉంటూ, భక్తులకు సర్వసులభుడు అనే భావాన్ని కలిగిస్తూ, తనస్వాతంత్ర్యాన్ని తాను కాపాడుకోవడం అనే "సర్వసుల భత్వాన్నీ" - (12) పెద్దా చిన్నా అనేభేదం లేకుండా ఉండడం, నీచు నితో, మహాత్మునితో-బుద్ధిమంతునితో, బుద్ధిహీనునితో - వీరితో ఎవరితో

కలిసిఉన్నా తనస్వాతంత్ర్యాన్ని పోగొట్టుకోకుండా తన సౌశీల్యాన్ని కాపాడుకోవడం అనే "సౌశీల్యాన్నీ - (13) తాను స్వతంత్రుడై ఆశ్రితుల దోషాలు చూడకపోవడం, చూచినా ఆశ్రితుల దోషాలు తనకు ప్రియతమా లైనవని భావిస్తూ వారియెడల వాత్సల్యాన్ని చూపుతూ తనస్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం అనే "వాత్సల్యాన్నీ" - (14) తనకు ఎవరైనా సేవ చేస్తే ఆసేవను స్వీకరించే సంకల్పాన్ని కలిగిఉండడం అనే "కైంకర్యో ద్దేశ్యత్వాన్నీ'' - (15) కోరినవారికందరికీ దాస్యం చేయడానికి తగిన రూపాన్నీ శరీరాన్నీ ధరించిఉండడం అనే "కైంకర్యస్థాన విశేషత్వాన్నీ - (16) బ్రహ్మరుద్రేంద్రాది దేవతల కందరికీ స్వామిగా ఉండడం అనే ''సర్వస్వామిత్వాన్నీ'' - (17) భగవంతుని శ్రీపాదాలు ఏఏప్రదేశాల్లో సోకిందో ఎవరెవరిమీద సోకిందో ఆప్రదేశమంతా పావనమైంది అనే ''శ్రీపాదపావనత్వాన్నీ - (18) అనుభవించడానికీ సేవించడానికీ తగిన వస్తువుగా ఉండడం అనే '' భోగ్యత్వాన్నీ '' - కలిగిన ఆ భగవంతుని శ్రీపాదాలు కష్టపడని - ఏప్రయత్నమూ చేయని తన ఎదుటవచ్చి తనకన్ను లకు దర్శనమివ్వడాన్నీ - తనకు శ్రీపాదాలు దర్శనమిస్తున్నట్లు ఇంకెవరికీ తెలియకుండా తనకుమాత్రమే దర్శనమివ్వడాన్నీ తలచి, తలచి, మైమరస్తూ శ్రియఃపతియైన ఆ భగవంతుని అంతులేని గుణగణాలను వర్ణిస్తున్నారు తిరుప్పాణాళ్వార్లు ఈ పాశురంలో.

భగవంతునికి ఉత్కృష్టగుణాలు ఇంకా కొన్ని ఉన్నాయి. వాటిలో —

1. సంసారనివర్తకత్వం — ఏవిధమైన ప్రతిబంధకమూ లేకుండా ఈ సంసారబంధాన్నుండి తప్పించి భగవత్కైంకర్యం చేయడానికి శక్తి నివ్వడం.

2. కారణత్వం — ప్రపంచమంతా తన చెప్పుచేతల్లో నడిచేది కాబట్టి తనకుగానీ తన జ్ఞానశక్తులకుగానీ అంతా లొంగిఉండేటట్లు చేయడం. అంటే నేనే జగత్సృష్టికి కారణమనడం.

3. శరణ్యత్వం — తన్ను ఆశ్రయించినవారు తన్నుతప్ప ఇంకొక దేవతాంతరాన్ని ఆశ్రయించకుండా చేయడం.

4. ఉపకారత్వం — ఈ లోకంలోని పరమపదంలోని సంపదకు నాయకుడైనతాను వీడు నన్నాశ్రయించినాడు, వీడికి తప్పక సహాయం చేయాలి అనే క్షుద్రమైన సాకుతో అన్నిసంపదలను ఆశ్రయించినవానికిచ్చి, అన్ని సంపదలకు మూలమైన తన్నే అర్పిస్తున్నాడు. అట్లా తనను అర్పిం చడమేగాక అయ్యో! నేను ఇంకా వీనికి ఋణపడి ఉన్నాను అనడం. అంటే భక్తులు కోరినదానికన్నా ఎక్కువగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని తెలుపడం.

5. కృప — శత్రువులూ ఆతని బంధువులూ దగ్గరచేర్చతగనివారని ఆప్తులు తెలిపినా, లెక్కచేయకుండా నన్నాశ్రయిస్తే శత్రువునూ ఆతని బంధువులనూ నాదయకు పాత్రులుగా చేస్తాను అన్న భావాన్ని కలిగి ఉండడం. కలిగి ఉండడమేగాదు, వారికి ఆశ్రయమివ్వడం. (విభీషణ శరణాగతి దీనికి దృష్టాంతము)

6. స్వాతంత్ర్యం — తాను తలచిన దేవతాస్వరూపంతోను మనుష్య రూపంతోను తననూ ఇతరులనూ నిలుపడం. నిలిపినప్పుడు తోసివేయరాని స్వరూపంతో తానుండి, తనస్వాతంత్ర్యాన్ని చూపడం. (బలిచక్రవర్తి కథ దీనికి దృష్టాంతము)

7. నిర్దోషిత్వం — దోషయుక్తాలైన పదార్థాల సంపర్కంవల్ల ఇత రులకు అజ్ఞానాన్నీ దుఃఖాన్నీ కలిగించే పనులు తానుచేసినా, దానివల్ల తనకు ఏవిధమైన అజ్ఞానంగానీ దుఃఖంగానీ రాకఉండడం. (రామాయణంలో వాలిరావణవధలో రాముడు చూపిన దుఃఖం ప్రపంచానికేకాని, రామునికి లేకపోవడం దీనికి దృష్టాంతము.)

8. స్వామిత్వం — నవగ్రహాలూ బ్రహ్మరుద్రేంద్రాదులూ కొన్ని సంపదలు మాత్రమే ఇవ్వగలరు - ఇస్తారు. ఆ నవగ్రహాలూ బ్రహ్మ రుద్రేంద్రాదులూ అంతా నా దాసులు, నేనయితే అంతులేని సంపదలు ఇస్తాను. నవగ్రహాలకూ బ్రహ్మరుద్రేంద్రాది దేవతలకూ నేను అధిపతి అని తెలుపడం.

9. సౌలభ్యం — సమీపింపరానివాడు, దర్శింపరానివాడు అని భయపడి తొలగి దూరంగాపోయే భక్తులను వెంటాడి, సమీపించి ఇదిగో నేనిక్కడున్నాను, రాండి దర్శించండి అని చెప్తూ సర్వసులభుడుగా ఉండడం. (తిరుప్పాణాళ్వార్ల కథ దీనికి దృష్టాంతము.)

10. సౌశీల్యం — తాను ఈశ్వరుడా కాదా అని సందేహించే వారికి నేనే ఈశ్వరుడని తెలియజేయడం. తన్ను ఈశ్వరుడని చాటేవారికి మాయమాటలు చెప్పడం. మరలా తాను ఉచ్చస్థితిలో ఉన్న ఈశ్వరుడనే ననీ, తన ఈశ్వరతను చాటేవారు నీచులనీ అనుకోకుండా ఆ నీచులతో కలిసిమెలిసి ఉండడం. (గుహుడు-శబరి-సుగ్రీవుడు-కుచేలుడు వీరితో కలిసి మెలిసి ఉండడం దీనికి దృష్టాంతము)

11. వాత్సల్యం — అత్యంత ఆంతరంగికులు కోటానుకోట్ల దోషాలు చేసినారని తెలుసుకొన్నా ఆ దోషాలను లెక్కచేయకుండా వారి యెడ అత్యంత ఆదరంతో ఉండడం. (కాకాసురుని కథ దీనికి దృష్టాంతము)

12. ప్రాప్యత్వం — తానుంతగా ప్రపంచంలో మరెవరూ ఆశ్రయించతగినవారు లేరు అన్నభావం కలిగేటట్లు ప్రవర్తించడం.

13. ఆశ్రితపక్షపాతిత్వం — సర్వసముద్రైన తాను - తన సంకల్ప బలంతోనే తానున్న చోటినుండే అన్నికార్యాలు చేయగల శక్తిఉన్నా, అట్టి

శక్తిని చూపకుండా తన్నాశ్రయించి, తన్ను శరణువేడినవారికి స్వయంగా తానే ప్రత్యక్షమై, తన దివ్యదర్శనాన్ని ఆశ్రితులకు కలిగించడం. (గజేంద్రమోక్షం, గోవర్ధనోద్ధరణం దీనికి దృష్టాంతాలు)

14. భోగ్యత్వం – స్వరూప రూప గుణ విభవ ఐశ్వర్య శీలాది చేష్టలుగల తన దివ్యస్వరూపాన్ని మాత్రమే దర్శించవలెననే వారికి, స్వరూపశీలాదిచేష్టల వరకుగల అన్నిరూపాలతో దర్శనమివ్వడం. ఎంత దర్శించినా తనివి తీరని నిత్యనూత్నతను వెలయించడం.

15. అయత్నభోగ్యత్వం - భగవంతుని దర్శించడానికి కన్నులూ - భగవద్వాక్యాలు వినడానికి చెవులూ అవసరం అన్నది సామాన్య విషయం. అట్లా కాకుండా ఒకమూల మౌనంగా కూర్చొని, భక్తితో భగవంతుని ధ్యానంచేసే భక్తులకు వసంతర్తులో సువాసనలు వెదచల్లుతూ మలయమారుతం దక్షిణంనుండి ఎలావస్తుందో అలా భగవంతుడు తానే ప్రత్యక్షమై అనుభవించండి అని చెప్పడం.

తిరుప్పాణాళ్వార్లు భగవంతుని ఏవిధంగా దర్శించిందీ, అనుభవించిందీ ఈ పాశురంలోని పదాల పొందికద్వారా తెలిపినారు.

రెండవ పాశురం

ఉవన్ద ఉళ్లత్తనా యులకమళన్దముడి ।
నివల్న్ద నీళ్ ముడియన్ అన్ఱు నేర్న్ద నిశాశరరై ।
కవర్న్ద వెఙ్గణై క్కాకుత్తన్ కడియార్పొళిలరఙ్గత్తమ్మాన్ । అరై
చ్చివన్దవాడైయిన్ మేల్చెన్ఱతామెనశిన్దనయే ॥

[తా॥ మనోహరమైన రూపాన్ని ధరించి ఎవరికీ అపకారం చేయ రాదనే తలపుగలిగి, ముల్లోకాలు మూడడుగులతో కొలిచిన త్రివిక్రమ రూపంతోను - ఆజానుబాహుడు ఎత్తైన కిరీటము ధరించినవాడు అలనాడు యుద్ధానికి వచ్చిన రాక్షసులను కోదండంతో సంహరించినవాడు, కకుస్థ వంశంలో జన్మించినవాడు అయిన శ్రీరామచంద్రుని రూపంతో అవ తరించిన ఆ భగవంతుడు భూలోకంలో శ్రీరంగనాథస్వామి రూపంతో మనకు దర్శనమిస్తున్నాడు. ఈయన ధరించిన పట్టుపీతాంబరము నా కన్నుల యెదుట ప్రత్యక్షమై, నా దృష్టిని తనవైపుకు మరల్చుకొన్నది.

మొదటి పాశురంలో పాదాలూ, ఈ పాశురంలో పాదాలకు పైన ఉండే పీతాంబరం వర్ణన చేయబడింది.]

ఈ పాశురంలో రంగనాథుని దివ్యశ్రీపాదపద్మాల్లోని ఎఱ్ఱదనానికి దీటువచ్చే స్వామిపీతాంబరం తన ఆలోచనలకు కారణమైందంటున్నారు తిరుప్పాణాళ్వార్లు.

ఉవన్దఉళ్లత్తనాయ్ - మహాబలిచేత అపహరింపబడిన తమరాజ్యాలు తమకు తిరిగి ఇప్పించమని ఇంద్రాదిదేవతలు భగవంతుని ప్రార్థించినారు.

*శ్లో॥ ఉదారాస్సర్వ ఏవైతే జ్ఞానీత్వాత్మైవ మే మతమ్ ।
ఆస్థితస్సహి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ ॥

[ఐశ్వర్యాన్ని పోగొట్టుకొని పోయిన ఐశ్వర్యం తిరిగి రావాలనే కోరికగల ఆర్తుడూ - ప్రకృతికంటే వేరైన ఆత్మస్వరూపాన్ని ఎరుగడానికి నిశ్చయించిన జిజ్ఞాసువున్నూ - దరిద్రుడై వుండి, ధనాన్ని కోరే అర్థార్థిన్నీ - నన్నే శరణుజొచ్చి నా ఆత్మస్వరూపాన్ని ఎరిగిన జ్ఞానీన్నీ ఈ నాలుగు విధాల ఉపాసకులు మహాఘనులు. వీళ్లు కోరినదానికంటే నేను ఎక్కువ ఇవ్వగలననే విషయం తెలిసే వీళ్లు నన్నాశ్రయించినారు. వీళ్లంతా నన్నాశ్రయించినారు. వీళ్లంతా జ్ఞానులని నా మనస్సులో ఉంది. వీళ్లు నన్ను వదలి ఉండలేరు - వీళ్లను వదలి నేనుండలేను - ఐశ్వర్యాన్ని కోరేవాళ్లంతా నా స్వరూపాన్ని తెలుసుకొన్నవాళ్లే]

పోయిన ఐశ్వర్యం కావాలంటున్నారు కాబట్టి వీళ్లకు తప్పక సహాయం చేయాలి అనే సంకల్పం భగవంతుడికి కలిగింది.

మహాబలిరాక్షసుడు - అయితేనేమి జన్మతః రాక్షసుడైన ప్రహ్లాదుడు కూడా రాక్షసుడే కదా! అయితేనేమి? ప్రహ్లాదుడు తనకు భక్తుడు - ప్రియుడు. ప్రహ్లాదునితో కలిగిన పరిచయాన్ని తలచినాడు. భక్తుడైన ప్రహ్లాదుని తలిస్తే తనకు మహాబలీ అనుకూలుడే. ఇంద్రాది దేవతల రాజ్యాలు అపహరించడంచేత తనకు ప్రతికూలుడు. ఇట్లా అనుకూల ప్రతికూలాలు కలిసిన స్వభావం కలిగిన మహాబలిని చంపడం ఎట్లా అనుకొన్నాడు - భగవంతుడు. మహాబలి మహా ఔదార్యం కలవాడు. ఆ ఔదార్యాన్ని మెచ్చి, బ్రాహ్మణరూపం ధరించి, యాచకుడుగా మహాబలిని సమీపించినాడు. మూడడుగుల భూమి నిమ్మని ఆతనిని యాచించినాడు. ఎవరెన్ని చెప్పినా ఆతడు వినకుండా, మూడడుగుల భూమి ఇస్తానన్నాడు.

---

* భగవద్గీ. 7–18

బ్రాహ్మణుడు సంతోషించినాడు. అంతే మహాబలి చూస్తుండగానే విజృం భించినాడు. ఎవరితలమీదా తనపాదాలు పెట్టాలనే అపేక్ష కలుగదు - కలిగినా ఎప్పుడూ ఎవరి తలమీదా తన పాదాలు పెట్టనివాడు - ఎవరైనా తలపై పాదాలు పెట్టమని కోరినా అపేక్ష లేకపోవడంచేత ఇతరుల తలపై తనపాదాలు పెట్టనివాడు మహాబలి విషయం ఆలోచించి ప్రహ్లాదుడు జ్ఞాపకం రాగా సంతోషించిన మనస్సు కలవాడైనాడు. వెంటనే భూమ్యా కాశాలను కొలవ నారంభించినాడు. ఒక అడుగుతో భూమినీ - ఇంకొక అడుగుతో ఆకాశాన్నీ కొలిచినాడు. 'నీవిచ్చిన దానంలో ఇంకొక అడుగు మిగిలింది ఏమి చేయమంటావు' అని మహాబలిని అడిగినాడు. ఇంకొక అడుగు నా తలపై పెట్టమంటూ తలవంచినాడు మహాబలి. అతని తలపై ఇంకొక అడుగుపెట్టి, మహాబలిని చంపకుండా సుతల లోకానికి అణగ ద్రొక్కినాడు తన శ్రీపాదాలతో. ఆ శ్రీపాదాలే ఈ శ్రీపాదాలు.

అణ్డముఱ నివర్న్ద నీణ్ ముడియన్ - భూమ్యాకాశాలు అంటే ఎత్తైన ఆకారం. ఆ పైన పెద్దకిరీటం. ఆ కిరీటంపైన పట్టుకోబడిన గొడుగులాగా ఉంది ఆకాశం. అది బ్రహ్మాండాలను తాకేటట్లు ఉంది. ఈ విరాట్పురు షుణ్ణి చూడ్డానికి రుద్రుడు వచ్చినాడు. అతడూ ఇంతగొప్పవాడే. అయితే అతని వేషం ఇట్లా ఉంది. వెనుక జడలు వ్రేలాడుతున్నాయి. ఈ జడలు చూస్తే - ఇంకా ఇతడు అనుభవింపవలసిన కర్మ ఎంతో ఉందని తెలు స్తూంది. ఈ జడలు ఆ విషయాన్ని తోపజేస్తున్నాయి. ఇంతేకాక చేతిలో కపాలాన్ని పట్టుకొన్నాడు. ఇతడు బ్రహ్మహత్య చేయడంవల్ల ఇతనికి ఈగతి పట్టిందని తెలుస్తూంది. ఇట్లాంటి వేషాన్ని ధరించి, తన కర్మవిశేషాన్ని పోగొట్టేవాళ్లు ఎవళ్లా అని వెదుకుతూ తిరిగే రుద్రుడు భగవంతుణ్ణి చూచి సమీపించి నిలిచినాడు, నమస్కరించినాడు. రుద్రుడు నమస్కరించడానికి తగినంత పెద్దకిరీటాన్ని ధరించి, నిలువడంచేత (ఉభయ విభూతి) ఈ లోకంలోను పరమపదంలోను కావలసిన ఐశ్వర్యం ఇచ్చేశక్తి ఇతని కున్నట్లు స్పష్టంగా కానవస్తూంది. ఈ త్రివిక్రమావతారాన్ని

పేర్కొనడంచేత భగవంతుడున్నాడో లేడో సహాయం చేస్తాడో చేయడో అని ఇంద్రాది దిక్పాలకులు సందేహించినతీరు తెలుపబడింది. ఇంద్రాది దిక్పాలకులు ఎవరిని సందేహించినారో సందేహించిన ఆ భగవంతుణ్ణే తిరిగీ ఒప్పుకొన్న తీరు స్పష్టంగా తెలుపబడింది.

ఇంకా -

† కుఱై కొణ్డునాన్ముకన్ -

[కోరవహించిన చతుర్ముఖబ్రహ్మ తన కమండలంలోని నీటిని భగవంతునిపై కుమ్మరించి, వేదాల్లోని పురుషసూక్తం మొదలైన మంత్రాలతో అతణ్ణి స్తుతిస్తూ, వామనావతారం ధరించి, మూడడుగుల్లో ముల్లోకాలు కొలిచిన అతని పాదాలకు అభిషేకం చేసినాడు. హాలాహలాన్ని మ్రింగడంచేత నల్లనైన కంఠంగల శివుని తలపై ఆ భగవంతుని పాద తీర్థాన్ని చల్లినాడు.]

అని భగవంతుని పాదాలకు బ్రహ్మ అభిషేకం చేసిన విషయం చెప్పడంచేత బ్రహ్మాది దేవతలు భగవంతుణ్ణి ఆరాధన చేసినతీరూ - విష్ణు పాదాల్లో పుట్టిన గంగను శివుడు తనతలపై ధరించినాడని చెప్పడంచేత, రుద్రుడు భగవంతుని తీర్థప్రసాదాలు స్వీకరించి, పూతుడైన తీరూ చెప్పబడింది.

ఇందుచేత కోరినదాన్ని భగవంతుడు ఇస్తాడు అని ముందుపాటలో చెప్పిన "ఇష్టప్రాపకత్వాన్ని" ఉదహరించడం అయింది. ఇక మనకు కలిగిన కష్టాలను పోగొట్టగలడు అనే "అనిష్టనివర్తకత్వాన్ని" ఉదహరిస్తున్నారు.

అన్దు నేర్న్ద నిశాశరర్ై క్కావర్న్ద వెజ్ఞై క్కాకుత్తన్ - దేవతలూ ఋషులూ నివసించడానికి వీలులేని విధంగా మహాసంక్షోభం ముల్లోకాలకు

† తిరుమళిశై ఆళ్వార్, నాన్ముగన్ తిరువందాది. 9 పా,

ఏర్పడింది. దేవతలంతా శరణాగతులై భగవంతుని ప్రార్థిస్తే, దశరథ మహారాజుకు శ్రీరామచంద్రుడనే పుత్రుడుగా జన్మించినాడు. చిన్ననాటనే తాటక మారీచ సుబాహు విరాధ కబంధ ఖరదూషణాదు లనే రాక్షసులను చంపినాడు. లంకకు అగడ్తలాగ చుట్టూ ఉండే లవణ సముద్రానికి పర్వతాలతో రాళ్లతో వారధి నిర్మింపజేసినాడు. ఒక కొమ్మనుండి ఇంకొక కొమ్మకు ఎగిరి, అడవుల్లో నివసించే వానరాలను సైన్యంగా తీసుకొని వెళ్లినాడు. లంకను నేలమట్టం చేసినాడు. ఇన్ని అతిమానుష కార్యాలు చేస్తున్నా భగవంతుని ప్రభావాన్ని తెలియనివారై, ఎదిరి బలాన్ని తెలియని రాక్షస సమూహమంతా, నిప్పుపైపడే శలభాల్లాగ నేను ముందు, నేను ముందు అని యుద్ధానికి వచ్చినారు. పదునైన - అత్యంతమాహాత్మ్యాన్ని కలిగిన శ్రీరామచంద్రుని దివ్యాయుధాలు వచ్చినవారిని వచ్చినట్లు బలిగొన్నాయి.

ఇటువంటి శ్రీరామచంద్రుడు -

‡ వెఙ్గతిరోన్ కులత్తుక్కోర్ విళక్కాయ్ నిన్రవన్ -

[అందమైంది, నాల్గువైపుల ఎత్తైనగోడలు గలది అయోధ్య. సకల లోకాలలోనివారు నమస్కరించే భగవంతుడు తన అంశాల్లో ఒకఅంశంతో ఆ మహానగరంలో సూర్యవంశానికి ప్రసిద్ధి కలగాలని ఆ వంశంలో శ్రీరామచంద్రుడుగా అవతరించినాడు. రాక్షసుల సంహరించినాడు. దేవతలందరి కష్టాలు తీరి, వాళ్లంతా వర్ధిల్లేటట్లు చేసినాడు. ఈతడు మహావీరుడు - సూర్యవంశానికి దీపమువంటివాడు - ఎఱ్ఱతామరలవంటి కన్నులు కలవాడు - నీలమేఘమువంటి శరీరచ్ఛాయవాడు - శ్రీరామచంద్రుడనే పేరుగలవాడు. ఆ శ్రీరామచంద్రుడే చిత్రకూటంలో మనకు అర్చారూపంతో దర్శనమిస్తున్నాడు. మనకు నాయకుడైన ఆ పరమపురుషుణ్ణి కన్నులు చల్లబడేటట్లు దర్శించడం, సేవించడం ఎప్పుడో ?]

---

‡ కులశేఖర ఆళ్వార్ల పెరుమాళ్ తిరుమొళి, 10-1.

అర్చావతారంలో నిలిచిఉన్నాడు అని తెలిపినారు తిరుప్పాణాళ్వార్లు.

కాకుత్తన్ - రాక్షసులు మాయావులు. ఏ వేషాన్ని కావాలన్నా వేస్తారు. ఆ మాయావులైన రాక్షసులుకూడా మోహించడానికి తగిన మనుష్యరూపం ధరించి నిలిచినవాడు.

కడియార్ పొలిలరజ్ఞత్తమ్మాన్ - నిత్యసూరులు మొదలైన వాళ్లంతా పూలమొక్కలు, తులసిమొక్కలు మొదలైన స్థావరరూపాలు ధరించినారు. ఈ రూపాలన్నీ భగవంతునికి ఆమోద యోగ్యాలైనాయి. ఆ మొక్కలతో కూడిన తోటలు చుట్టూ ఉన్నాయి దేవాలయానికి. ఆ దేవాలయం లోపల కన్నుల కింపుగా పవ్వళించి ఉన్నాడు శ్రీరంగనాథస్వామి. బ్రహ్మాది దేవతలు నిత్యమూ ఇతనిని ఆరాధిస్తున్నారు. ఇందుచేత అందరికంటే గొప్పవాడు స్వామి అన్న విషయం తెలుస్తూంది.

అరైచ్చివన్ద వాడైయిన్‌మేల్ -

*పడిచ్చోతియాడై యొడుమ్ పల్‌కలనాయ్ నిన్‌పైమ్పొన్ కడి చ్చోతి కలన్దతువో -

[శ్రియఃపతియైన ఓస్వామీ! నీ ముఖం ఎంతోకాంతితో ప్రకాశిస్తూందే. అభిషేకం అయినతర్వాత ఇంకా అధికంగా ప్రకాశిస్తూందే. నీ పాదపద్మాలకాంతి నీచుట్టూ పద్మంలాగా వికసించి, చుట్టూ వ్యాపించి, నీకు ఆసనంగా ఉందా అనేటట్లు నాలుగు దిక్కులకూ కాంతిని వెదజల్లు తూందే! నీ విశాలమైన వక్షస్థలం కాంతి చెప్పడానికి వీల్లేకుండా ఉందే! వీటి నన్నిటినీ మించినకాంతిని కలిగిఉందే నీ ఈ పీతాంబరం. ఈ పీతాంబరపుకాంతి నీవు ధరించిన ఆభరణాల మీదికి వ్యాపించిందా స్వామీ! మీరు ధరించిన ఆభరణాలన్నీ అలా ప్రకాశిస్తున్నాయే మీరే చెప్పాలి. ఈ కాంతి తెలుసుకోవడానికి నేను తగినవాడను గాను.]

---

* పెరియాళ్వార్ తిరువాయ్ మొళి. 3-1-1.

అనేటట్లు నీటుగా, అందంగా పవ్వళించిఉన్న స్వామి దివ్యశరీరం క్రిందిభాగంలో కట్టుకొన్న పట్టుపీతాంబరం ఎఱ్ఱగా ప్రకాశిస్తూంది. ఈ ఎఱ్ఱదనం రావడానికి కారణాలు ఇవి కావచ్చు. భగవంతుడు మధుకైటభు లనే రాక్షసులను తన తొడలపై పెట్టుకొని చంపినాడు. వాళ్ల నెత్తురులో తడియడం చేత ఎఱ్ఱగా వుంది ఈ పట్టుపీతాంబరం. ఇంకా మరకతపర్వతం పైన ఉదయసూర్యుని కిరణాలు పడితే ఎట్లా మరకతం జాజ్వల్యమానంగా ఎఱ్ఱగా ప్రకాశిస్తుందో అట్లా ఎఱ్ఱగా ఉంది భగవంతుడు ధరించిన పట్టు పీతాంబరం. ఆ పట్టుపీతాంబరం ఎఱ్ఱగా ఉండడానికి కారణం -

శెన్ఱతామెన శిన్దనై యే - ఎన్నో జన్మాలనుండి చేయరాని కార్యాలు చేస్తూ అనుచితవిషయాల మీదికి మనస్సు పోనిచ్చే వాళ్లను అనుచితవిష యాల మీదికి మనస్సు పోకుండా మరల్చడానికి వేసిన బాణాలు వాళ్లకళ్లల్లో గుచ్చుకొని, అనుచితవిషయాల మీదికి వాళ్లకళ్లు పోకుండాచేసి, ఆ నెత్తు టితో తిరిగివచ్చి స్వామిని చేరడంచేత స్వామిపీతాంబరం ఎఱ్ఱనై ఉండ వచ్చు. ఆ ఎఱుపు తొలగించినా తొలగిపోకుండా ఎఱ్ఱఎనాన్నై కలిగి ఉంది.

ఎన శిన్దనై శెన్ఱదామ్ - ఎన్ అనడంచేత ఆశ్చర్యం సూచింప బడింది.

శేన్ఱదు - నేను ప్రయత్నం చేసికాదు - నేను ఏప్రయత్నమూ చేయ కనే నా కన్నుల యెదుట ప్రత్యక్ష మయినాడు భగవంతుడు. భగవద్దర్శన విషయం అతివిలక్షణమైంది కాబట్టి ఆ భగవంతుడే అప్రయత్నంగా నా కన్నులను ఆకర్షించినాడు.

మూడవ పాశురం

†మన్దిపాయ్ వడవేజ్గడమామలై । వానవర్కళ్
సన్దిశెయ్య నిన్ఱా నరజ్గత్తరవినజ్ఞైయాన్ ।
అన్దిపోల్ నిఱత్తాడైయు మతన్ మేలయనైప్పడైత్తతోరెళిల్ ।
ఉన్దిమేలతన్ఱోవడియే నుళ్ళత్తిన్నుయిరే ॥

[దేవతలు సాయంసంధ్యచేసేస్థలం - వానర సమూహం వసించేది - అత్యంత మాహాత్మ్యం కలిగింది తిరుమల. ఆ తిరుమలలో వెలసినస్వామి శ్రీవెంకటేశ్వరస్వామి. ఆ దేవుడు ఎఱ్ఱని పట్టుపీతాంబరం ధరించి నిలుచున్నాడు. అతని నాభీకమలంలో సృష్టికర్తయైన బ్రహ్మ ఉన్నాడు. అలాంటి పొక్కిలి మీదికి నాదృష్టి మరల్చినాడు భగవంతుడు.

మొదటి పాశురంలో పాదాలు. రెండవ పాశురంలో పీతాంబరం. ఈ పాశురంలో ఆపైన ఉన్న (నాభి) పొక్కిలి వరుసగా వర్ణన చేయబడ్డాయి.]

మొదటి రెండు పాశురాల్లో భగవంతుడికి దాసుడనే విషయాన్ని - నేనింకొక దేవతాంతరానికి దాసుడు కాదు అనే విషయాన్నీ చెప్పినారు. "ఓం" అనే ప్రణవంలో "అ-ఉ-మ" అనే మూడక్షరాలు ఉన్నాయి. ఇందులో "మ" అనే అక్షరం దాసభూతాలైన చేతనాచేతనాలను సూచిస్తూందన్నారు. అందుకే "మన్దిపాయ్" అని మకారంతో ఈ పాశురం ప్రారంభించినారు.

భగవద్దాసులు కావాల అనే జ్ఞానమే లేని జీవులు కొన్ని - ఎల్లప్పుడూ భగవద్దాస్య నిమగ్నులై ఉండాలనే జీవులు కొన్ని - ఒకప్పుడు దాసులుగా

† అన్ని దివ్యదేశాల్లోని ఇండ్లల్లో మఠాల్లో దేవాలయాల్లో అన్ని చోట్లా ఈ పాశురం రెండు పర్యాయాలు పారాయణ చేయబడుతూంది.

ఉండడం, ఇంకొకప్పుడు దాసులుగా ఉండకపోయే జీవులు కొన్ని. ఈ జీవులన్నీ తమతమ పూర్వపుణ్యవిశేషంచేత కలిగిన జ్ఞానానికి తగినట్లూ - తమతమ పూర్వజన్మపాపఫలంచేత కలిగిన జ్ఞానానికి తగినట్లూ ప్రవర్తిస్తుంటాయి. ప్రపంచమందలి జీవులంతా ఇట్లా అనుకూల ప్రతికూలాల కలయిక స్వభావంతో ఉన్నాయి. ఇటువంటి స్థితిలో తన పూర్వపుణ్య విశేషంచేత ఇప్పుడు దొరికిన భగవదనుభవమహాభాగ్యాన్ని వర్ణిస్తూ సంతోషిస్తున్నారు తిరుప్పాణాళ్వారు.

మన్దిపాయ్ వడవేఙ్గడమామలై - అడవుల్లోఉండే చెట్లల్లోకాచే క్షుద్రమైన కాయలూ పండ్లూ తింటూ మనస్థిమితంలేని కోతులు ఒక కొమ్మనుండి ఇంకొక కొమ్మకు ఎగురుతూ ఎట్లా తిరుగుతాయో అట్లాగే చపలులైన మనుష్యులుకూడా సంసారసాగరంలో కొట్టుకలాడుతూ -

÷ శ్లో॥ తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం
క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి।
ఏవం త్రయీధర్మ మనుప్రపన్నా
గతాగతం కామకామా లభంతే॥

[ఆత్మజ్ఞాన నిష్ఠులైన వేదాంతులు వేదవేద్యుడైన నన్ను ఆత్మజ్ఞానంతో తెలుసుకోవడం - కీర్తించడం చేస్తూ నన్నే ఉపాసన చేస్తున్నారు. శాశ్వతమైన పరమపదాన్ని పొందుతున్నారు. ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాలలో మూడవదైన కామాన్ని అంటే కోరికను మనస్సులో పెట్టుకొని, ఋగ్యజుస్సామవేదాల్లో చెప్పబడిన అగ్నిష్టోమాది యజ్ఞాలుచేసి- సోమపానంచేసి, పుణ్యాన్నిపొంది, స్వర్గలోకం ప్రవేశించి, అక్కడ కొన్నిభోగాలు అనుభవించి, చేసుకొన్న పుణ్యం తీరిపోతే, తిరిగి ఈ భూలోకం ప్రవేశిస్తున్నారు. కామాన్ని ప్రధానంగాపెట్టుకొని, కోరికలతో

÷ భగవద్గీత. 9–21.

యజ్ఞాలు చేసేవాళ్లు నా నిజస్వరూపాన్ని తెలుసుకోకుండా యజ్ఞాలు చేసి పుణ్యం చేయడం, స్వర్గానికి వెళ్లడం, ఆ పుణ్యం తీరిన తర్వాత తిరిగి భూలోకంలో జన్మించడం ఇట్లా తిరిగి తిరిగి చేస్తున్నారు.]

భూలోకంలో దీన్ని చూద్దాము, దాన్ని చూద్దాము అని ఆశ కలిగించేది - చూచినదే మరలా మరలా చూడ్డానికి తగిన అందాన్ని కలిగి ఉండేది - తామ్రపర్ణి నదికి పాలారునదికీ మధ్య ఉండే దక్షిణదేశం- కలియుగంలో దక్షిణదేశంలో నారాయణభక్తులు జన్మిస్తారని పురాణాల్లో ఉంది. తమిళభాషను అగస్త్యుడు కల్పించినాడు. తమిళం మాట్లాడే దేశం తమిళదేశం ఆ తమిళదేశానికి ఉత్తరపు ఎల్లఅని పురాణాల్లో ప్రసిద్ధి పొందిందీ - ఏ వస్తువు చూచినా ఏ చెట్టు చూచినా అన్నీ ఆకారంలో గాని, పోలికలోగాని, గుణంలోగాని, ప్రకాశించడంలోగాని అన్నీ భగవత్స్వరూపాలుగా ఉండడం అనే మాహాత్మ్యాన్ని కలిగింది ఈ తిరుమల.

వానవర్కళ్ శన్దిశెయ్యనిన్టాన్ - పరమపదంలో తానుంటే ముక్తులూ నిత్యులూ ఎల్లవేళలా తనకు కైంకర్యాలు చేస్తూ సేవిస్తున్నారు. తాను భూలోకవాసులను తరింపజేయాలని ఈ భూలోకంలో అవతరించినాడు. పరమపదంలోని ముక్తులూ. నిత్యులూ నిత్యంవచ్చి- ఆరాధనచేసి, తన్ను ఆశ్రయించి, సేవించడానికి తగినట్లు రూపాన్ని ధరించివచ్చి ఈ తిరుమలలో ప్రత్యక్షమై ఉన్నాడు-

అరఙ్గత్తర వినణై యాఙ్ — ఇక ఎక్కవలసిన పనిలేదు అనేటంత ఎత్తు ఎక్కవలసింది ఈ తిరుమల. ఈ తిరుమల పరమపదంతో సమానమైనదనీ - ఈ స్వామి సులభంగా దర్శింప తగిన స్వామి అనీ అంటారు. ఈ —

†ఒళివిల్ కాలమెల్లా ముడనాయ్ -

† తిరువాయ్మొళి. 3-3-1.

[తిరుమలలో గంభీరంగా శబ్దంచేస్తూ సెలయేళ్లు ప్రవహిస్తున్నాయి. ఇక్కడ మహాతేజస్సుకల స్వామి ఉన్నాడు, ఆతడే శ్రీ వేంకటేశ్వరుడు ఆతడే అందరికీ కులదైవము. ఆతని దాసులమైన మనం ఎడబాటు లేకుండా ఎప్పుడూ ఆతనితోనే ఉండి, సర్వకాల సర్వావస్థల్లోను ఆతనికి కైంకర్యాలు చేయడానికి పూనుకొందాము.]

అనేటంత అందమైన దివ్యదేవాలయంలో ప్రకాశించే శ్రీ వేంకటేశ్వరస్వామిగా కొంతసేపూ, శ్రీరంగనాథుడుగా కొంతసేపూ నాకు దర్శనమిస్తున్నాడు.

శ్రీరంగనాథుడు జ్ఞానాన్నీ బలాన్నీ సువాసననూ మెత్తదనాన్నీ చల్లదనాన్నీ కలిగిన శేషశయనంపై కన్నులకింపుగా పవళించి ఉన్నాడు. ఆ శ్రీరంగనాథుడు ఎటువంటివాడంటే పరమపదంలోని నిత్యసూరులు ఎల్లవేళా సేవచేయడానికి తగినవాడూ - సమస్త ప్రపంచానికి ఆధారమైనవాడూ - సమస్త ప్రపంచానికి గురువైనవాడూ, ఆతడు ధరించిన ఎఱ్ఱటి పట్టుపీతాంబరం ఎటువంటిదంటే –

అన్దిపోల్ నిఱత్తాడైయుమ్ - ఆశ్రితుల అజ్ఞానాంధకారాన్నంతటినీ పోగొట్టడానికి - జ్ఞానాన్ని కలిగించడానికి ఉదయించిన ఉదయపు సూర్యుని వెలుగువలె - ఆశ్రితుల తాపత్రయాన్ని పోగొట్టడానికి వచ్చిన సాయంకాలపు సూర్యుని వెలుగువలె ప్రకాశిస్తూ ఉండేది ఎఱ్ఱటి పట్టుపీతాంబరం. ఎఱ్ఱటి పట్టుపీతాంబరాన్ని పేర్కొనడంవల్ల ఆ తర్వాత అనుభవింపవలసింది - అవలంబించవలసింది ఏదో ఉన్నట్లు అయింది. ఇకపై దర్శించి అనుభవింపవలసింది ఏది అంటే -

అతన్మేల్ అయనైప్పడైత్తతోరెళిలున్ది - ఇప్పుడు దర్శించిందీ అనుభవించిందీ స్వామి ధరించిన ఎఱ్ఱనైన పట్టుపీతాంబరం. ఆ పైన ఎఱ్ఱటి పట్టుపీతాంబరపు వన్నెను పోలిన ఎఱ్ఱటి బొడ్డుతామర. ఆ తామర

పూవు కొసను సృష్టికర్త అయోనిజుడు అయిన చతుర్ముఖబ్రహ్మ. ఆ చతుర్ముఖ బ్రహ్మను సృష్టించిన అందమైన నాభి ప్రకాశిస్తూంది. నాభీ కమలాన్నీ - నాభీకమలంలోని బ్రహ్మను పేర్కొనడంచేత బ్రహ్మాదుల సృష్టికి మూలం ఇతడని చెప్పబడింది- ఇక కైముతికన్యాయం వల్ల రుద్రుడు ఇంద్రాదులైన ఇతర దేవతల సృష్టికి కూడా మూలం ఇతడే అన్న విషయం చెప్పబడినట్టే. ఇందువల్ల అన్యదేవతారాధకులైన ప్రతిపక్షులకు కూడా శ్రియఃపతి తప్ప ఇంకొకరు శరణు చొరడానికి లేరనీ - పొంద దగింది ఇంకొకటి లేదనీ నిర్ణయమైంది. ఇక్కడ బ్రహ్మను ముముక్షువు లను సృష్టించిన ఉపకారానికి ఉదాహరణంగా పేర్కొన్నాడని తెలుస్తుంది.

మేలతన్నో — ఈ పొక్కులి దర్శించి, అనుభవించడానికి కలిగిం చేమో అనిపిస్తూంది. ఈ బొడ్డుతామరను దర్శించడంవల్ల ఇది చెప్పినట్లు వినేవాడుగానూ ఇది చేయమన్నట్లు చేసేవాడుగానూ ఈ బొడ్డుతామర అందంగా ఉన్నది అనికూడా అర్థం కావచ్చు.

అడియేన్ —

† శ్లో॥ ఆత్మదాస్యం హరేస్స్వామ్యం స్వభావం చ సదాస్మర ।

[పరమాత్మనకు నేను దాసుడను. హరి నాకు స్వామి అనే విష యాన్నీ, పరమాత్మకు జీవాత్మకు ఉండే సంబంధాన్నీ ఎల్లప్పుడూ తలుస్తూ ఉండు.]

అని చెప్పినట్లు భగవంతుని కరుణాకటాక్షం వల్ల ఎవరి ప్రోత్సా హమూ లేకుండా భగవంతునికి దాస్యం చేయాలని నాకేతోచి భగవద్దాస్యం చేస్తున్నాను. నా అవయవాలన్నింటిలోకి శ్రేష్ఠమైన నా మనస్సులో ప్రకా శిస్తున్నాడు భగవంతుడు. ఎందుకు నా ఆత్మలో ప్రకాశిస్తున్నాడంటే

† ఇది ఎక్కడిదో గుర్తింప వీలుకాలేదు.

నా ఆత్మ ఆ భగవంతునికి మిక్కిలి ఇష్టమైన ప్రదేశము కావడంచేత ఇక్కడ తానేవచ్చి ప్రకాశిస్తున్నాడు అనే విషయాన్ని - "అడియేన్" అనే పదం సూచిస్తూంది.

ఉళ్లత్తిన్ - ఉళ్లమనేది హృదయప్రదేశాన్ని చాటుతూఉంది అనుకోవచ్చు.

ఇన్నుయిరే - భగవంతుని దర్శించడానికీ అనుభవించడానికీ తీవ్రమైన ప్రాణాలు అవసరమైనవి అనే విషయం "ఇన్నుయిరే" అనే పదంవల్ల చెప్పబడింది.

ఈ క్రింది రెండు శ్లోకాల్లోని కథలనూ ఇక్కడ చదువుకోవలసింది.

* శ్లో॥ జ్ఞానీతు పరమైకాంతీ తదాయత్తాత్మ జీవనః ।
తత్సంశ్లేష వియోగైక సుఖదుఃఖ స్తదేకధీః ॥

[భక్తులు మూడు విధాలు. వాళ్లూ ఫలాన్ని కోరేవాళ్లే. వాళ్లంతా మోక్షాన్ని పొందలేక కొంతదూరం ఎక్కి క్రిందపడేవాళ్లే. అందుచేత సాటి లేనిది - అనుష్ఠించడంచేత ఫలాన్ని పొందేటట్లు చేసేది అయిన సులభమైన మార్గాన్ని పైన చెప్పినదానికి భిన్నమైనదాన్ని నాలుగు విధాలుగా ఆళవందార్లు చెప్పుతున్నారు.

భగవంతుణ్ణే నమ్మి ఆతణ్ణే ఆశ్రయించి ఆతనియందే మనస్సు నిలిపేవాడు జ్ఞాని. ఏకాంతమైన ప్రదేశంలో కూర్చుని ఏ ప్రయోజనాన్నీ ఆశించకుండా - ఇంకొక దేవతాంతరాన్ని తలచకుండా పరమపురుషుడైన నారాయణుణ్ణే తలచేవాడు పరమైకాంతి. భగవంతుణ్ణే నమ్మి ఆతనియందే మనస్సు నిలిపేవాడు తదాయత్త జీవనుడు. శాస్త్రాలలో చేయదగినవి అని చెప్పిన కార్యాలు మనసులో తలచడం - నోటితో పలకడం - శరీరంతో

---

* నాథమునుల గీతార్థసంగ్రహం, 29 శ్లో.

చేయడం - ఒక్క క్షణంకూడా వాసుదేవుణ్ణి తలచకుండా ఉండలేకపోవడం. ఆతన్ని తలచకపోతే గొప్ప ఆపద కలుగుతుందనీ ఏవో చీకాకులు కలుగుతాయనీ తలుస్తూ శత్రురాజులచేత రాజ్యం పోగొట్టుకొన్నవాడు ఏడ్చే నట్లు ఒక్క క్షణం భగవద్ధ్యానం చేయలేకపోతే ఏడుస్తూ ఎల్లప్పుడూ ఆ పరమ పురుషుడైన నారాయణుని యందే మనస్సు నిలిపేవాడు తదేకధీ. ఇతణ్ణే ప్రతిబద్ధుడంటారు. ఇతడే మోక్షానికి అర్హుడు.]

ఇంకా

‡ శ్లో॥ మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్ ।
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ ॥

[భక్తిచేత పరిపక్వమైన మనసు నాయందే లగ్నంచేసేవాళ్లూ - నన్ను విడిచి క్షణమాత్రం ప్రాణం నిలుపలేనివాళ్లూ - వాళ్లువాళ్లు స్వయంగా అనుభవించి, ఆనందించిన నా కల్యాణగుణగుణాలను ఒకళ్లకొకళ్లు చెప్పు కొంటున్నారు. రాముడుగా కృష్ణుడుగా జన్మించి, మనుష్యరూపంలో చూపిన దివ్యాలైన అద్భుతకార్యాలనూ రమణీయాలైన భగవత్కార్యాలనూ తలుస్తూ చెప్తూ సంతోషిస్తూ తిరుగుతున్నారు. చెప్పేవాళ్లు ఏ ప్రయోజనాన్నీ ఆశించకుండా నన్ను కీర్తించే కథలనేతప్ప ఇంకొకరి కథలను చెప్పడం లేదు. వినేవాళ్లూ వాళ్లుచెప్పే నా కథలనే వింటూ మిక్కిలి సంతోషంతో తిరుగుతున్నారు.]

‡ భగవద్గీత 10—9.

నాల్గవ పాశురం

శతిరమామతిళ్ శూళిలఙ్గైక్కిఱైవన్ తలైపత్తు
ఉతిరవోట్టి* ఓర్ వెఙ్గణైయుయ్ త్తవనోదవణ్ణన్*
మదురమావణ్డుపాడ మామయిలాడరఙ్గత్తమ్మాన్*
తిరువయిట్ ఉదరబన్ద మెన్నుళ్ళత్తుళ్ నిన్ఱులాకిన్ఱతే ॥

[లంకాధిపతి రావణుని పది తలలనూ ఒకే బాణంతో ఖండించడానికై భగవంతుడు శ్రీరాముడుగా భూమిపై అవతరించినాడు. ఆ శ్రీరాముడే శ్రీరంగంలో శ్రీరంగనాథస్వామిగా అవతరించినట్లున్నాడు. తుమ్మెదలు మధురంగా గానంచేసేచోటూ - నెమళ్లు నాట్యంచేసేచోటూ శ్రీరంగం. శ్రీరంగనాథుని ఉదరంపై ఉండే ఒడ్డాణం నా దృష్టినాకర్షించి, నా హృదయంలో నిలిచి- నన్ను ఊగిసలాడిస్తూఉంది.

క్రమంగా పాదాదికేశాంతం వర్ణిస్తున్నాడు. పాదాలు - పీతాంబరం - నాభి - ఆపైన ఈ పాశురంలో భగవంతుని ఉదరంపై తళతళ మెరిసే ఒడ్డాణం వర్ణించినాడు.]

రెండవపాశురంలోను మూడవపాశురంలోను బ్రహ్మరుద్రాదులు కర్మలు చేయవలసినవాళ్లనీ - ఆ కర్మాలు చేయడం మూలంగా జన్మాలు ఎత్తడమూ చెప్పడమయింది. నాల్గవపాశురంలో బ్రహ్మరుద్రాదులు రావణునికి వరాలిచ్చి పెద్దవాణ్ణిగా చేస్తే శ్రీరాముడు ఆ రావణుణ్ణి చంపినాడు. రావణుణ్ణి చంపినకథ పేర్కొనడంవల్ల దేవతాంతరాలు -

† శ్లో॥ బ్రహ్మాస్వయంభూ శ్చతురాననో వా
రుద్రస్త్రినేత్రస్త్రిపురాంతకో వా ।

† రామాయణమ్ – సుందర. 51–45.

ఇంద్రో మహేంద్ర స్సురనాయకో వా
త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్ ॥

[అయోనిజుడూ నాలుగుముఖాలుగలవాడూ అయిన బ్రహ్మ - మూడు నేత్రాలు కలవాడూ అయిన రుద్రుడూ - పరబ్రహ్మాన్ని చూచినవాడూ దేవతలకందరికీ నాయకుడూ అయిన ఇంద్రుడూ - వీళ్లందరూ యుద్ధంలో రావణుణ్ణి రాముడు చంపకుండా కాపాడడానికి శక్తిలేనివాళ్లే.]

అని చెప్పడంవల్ల బ్రహ్మరుద్ర ఇంద్రాదుల అల్పశక్తిత్వాన్ని తెలిపినట్లయింది. ఇంకా స్వామి ఒడ్డాణం తన కన్నుల ఎదుట ప్రత్యక్షమైందంటున్నారు అది భగవంతుని కడుపుపై ప్రకాశిస్తూందట. ఆ కడుపు ఎటువంటిదంటే ప్రళయకాలంలో బ్రహ్మరుద్రేంద్రాది దేవతలనూ - చరాచర ప్రపంచాన్నీ - అంతటినీ ఒకేకాలంలో దాచి, కాపాడిన గొప్పతనం గల కడుపట. ఇతరులు చేయలేని కార్యాలు చేసే శక్తిగల కడుపది. ఈ అఘటఘటనాశక్తి గలిగిన భగవంతుని కడుపూ - దానిపై నిగనిగమెరిసే రత్నాల ఒడ్డాణమూ - సంసారసాగరంలో కొట్టుకలాడే నీచమైన నా హృదయమే దర్శన మివ్వడానికి తగిన ప్రదేశమని నిశ్చయించుకొనివచ్చి, నా కన్నుల ఎదుట నిలిచింది. ఇది ఒక ఆశ్చర్యమంటున్నారు తిరుప్పాణాళ్వార్లు.

ముందు మూడు పాశురాల్లోను ఓం అనే ప్రణవం చక్కగా నిరూపింపబడింది. ఈ నాల్గవ పాశురంలో -

* శ్లో॥ ద్విధా భజ్యేయ మప్యేవం ననమేయంతు కస్యచిత్ ।
ఏషమే సహజో దోషః స్వభావో దురతిక్రమః ॥

[నన్ను రెండుముక్కలుగా చీల్చినా నేను ఇంకొకనికి తలవంచను. ఇది నేను పుట్టగా పుట్టిన దోషం. ఈ దోషం దాటరానిది.]

---

* రామాయణమ్. యుద్ధ. 36-11.

ఇంకొకనికి తలవంచనన్న రావణుని పదితలలు త్రుంచి -

† శ్లో॥ దశేంద్రియాననం ఘోరం యో మనోరజనీచరమ్ ।
వివేకశరజాలేన శమం నయతి యోగినామ్ ॥

[రాత్రిళ్లు తిరిగే రాక్షసుడూ - పదితలలవాడూ - భయంకరుడూ అయిన రావణాసురుణ్ణి పదునైన బాణాలతో చంపి. యోగుల మనస్సుకు శాంతిని ఎవడు కలిగిస్తున్నాడో,]

అని చెప్పినట్లు మోక్షార్థులైన యోగుల మనస్సు "నేను" అనే అహంకారములోగాని, "నాది" అనే మమకారంలోగాని పడకుండా చేసిన దశరథమహారాజు కుమారుడైన శ్రీరాముని చరితాన్ని తనకు ఒజ్జబంతిగా చేసుకొన్నాడు. "నమః" అనే పదంలో "నేను - నాది - నాకు సంబంధించింది ఏమీ లేదు" అనే అర్థాలు ఉన్నాయనీ - ఆ అర్థాలు దాచిన ధనమనీ చెప్పుతున్నట్లున్నారు తిరుప్పాణాళ్వార్లు.

శతిరమామతిళ్ శూళిలజ్గైక్కొత్తైవన్ తలైపత్తుఉదిర - కులపర్వతాలను పేర్చి, అమర్చి కట్టినట్లు ఎత్తుగా బలంగా ఎనిమిది దిక్కులలోని దిక్పాలకులుకూడ తేరిచూడ రాకుండే మహాప్రాకారాలతో కూడిందీ - ఏ ప్రక్క చూచినా హెచ్చుతక్కువలు లేకుండా ఒకేవిధంగా ఉంటూ శత్రువులు ప్రవేశించడానికి దుర్భేద్యంగా ఉండేదీ - జలదుర్గ, గిరిదుర్గ. వనదుర్గాలన్నిటినీ కలిగిందీ లంక. లంక అని ప్రసిద్ధమైన పేరుగలిగిన ఈ మహానగరానికి అధిపతి రావణుడు.

దుర్గబల, వరబల, భుజబల, సైన్యబలాలచేత బలవంతులం అనే గర్వంతో విఱ్ఱవీగే మాల్యవంతుడు, అకంపనుడు, మారీచుడు, మొదలైన తామసప్రకృతులైన రాక్షసులతోనూ. హనుమంతుడు, విభీషణుడు మొదలైన సాత్విక ప్రకృతులతోనూ అందరితో ఒకేరకంగా మెలగుతున్నాడు

† సాత్త్వతసంహిత.

భగవంతుడు. ఆ భగవంతునికి తామసప్రకృతులనిగానీ సాత్వికప్రకృతులనిగానీ భేదంలేదు. ఆ భగవంతుని గొప్పతనాన్ని చెవులార విన్నాడు - తెలుసుకొన్నాడు - కన్నులార చూచినాడు రావణుడు అయినా బుద్ధి చెడినవాడై -

† శ్లో॥ విదితస్సహి ధర్మజ్ఞ శ్శరణాగతవత్సలః ।
తేనమైత్రీ భవతు తే యది జీవితు మిచ్ఛసి ॥

[శ్రీరాముడు ధర్మాన్ని చక్కగా ఎరిగినవాడనీ - తన్ను శరణు పొందినవారిలోని దోషాలను గుర్తించేవాడు కాదనీ - కరుణించేవాడనీ ప్రపంచమంతా ఎరిగిన విషయం. నీవు జీవించాలని ఆశిస్తూఉంటే ఆ శ్రీరామునితో స్నేహం చేసుకో.]

అని తన ఆప్తులు నోటితో చెప్తే ఆ మాటలు వినలేదు.

* శ్లో॥ అరాక్షస మిమం లోకం కర్తాస్మి నిశితైశ్శరైః ।
నచేచ్ఛరణ మభ్యేషి మాముపాదాయ మైథిలీమ్ ॥

[సీతను నాకప్పగించి నీవు నన్ను శరణు పొందకపోతివా నా పదునైన బాణాలతో ఈ లోకంలో రాక్షసుడు ఒక్కడుకూడా లేకుండా చేయడానికి నేను సమర్థుడను.]

అని శ్రీరాముడే రావణునికి అత్యంతం హితమైన మాటలను చెప్తే, ఆ మాటలనూ పెడచెవిని పెట్టి - యుద్ధానికి సిద్ధపడ్డాడు రావణుడు. యుద్ధానికి పంపడానికి తగిన మహాపరాక్రమవంతులైన ఆప్తులను నాయకులుగా ఎన్నుకొన్నాడు. వారినందరినీ యుద్ధానికి పంపినాడు. వారికి సహాయంగా మహాబలపరాక్రమాలు కలిగిన సైన్యాన్నిచ్చి పంపినాడు. యుద్ధనాయకుడుగా తాను ముందు నిలిచి -

---

† రామాయణమ్. సుం. 21-21.
★ రామాయణమ్. యుద్ధ. 31-61.

‡ శ్లో॥ దేవకల్పమృజుం దాన్తం రిపూణామపి వత్సలమ్ ।

[దేవునివంటివాడూ - ముక్కుకు సూటిగా వెళ్లేవాడూ - శాంతగుణం కలవాడూ - శత్రువులయెడకూడ అత్యంత ఆదరంతో ఉండేవాడు -]

అయిన శ్రీరామచంద్రుణ్ణి నాకు అంగబలం ఉంది - ధనబలం ఉంది - ఇదిగో ధనుస్సు ఉంది అనే అహంకారంతో విఱ్ఱవీగుతూ ఎదిరించి నాడు రావణుడు. రావణుని రథాన్నీ - ధనుస్సునూ విఱగగొట్టి, యుద్ధంలో వాడి గర్వాన్ని పోగొట్టి - నిలువు - లంకకు పో - ఈ రోజు విశ్రాంతి తీసుకో - తిరిగి రేపు యుద్ధానికి రా అని శ్రీరాముడు విడిస్తే రావణుడు లంకకు పరుగెత్తి వెళ్లినాడు. కొంచెంకూడా సిగ్గులేకుండా అంతఃపురానికి వెళ్లి, మండోదరి మొదలైన స్త్రీలముఖాల్ని చూచినాడు. మరునాడు కుంభ కర్ణుణ్ణి ఇంద్రజిత్తునూ సైన్యాన్నిచ్చి. యుద్ధానికి పంపినాడు. తిరిగీ తాను కొత్తరథాన్నీ ధనుస్సునూ తీసుకొని, యుద్ధానికి వచ్చినాడు. నాటి యుద్ధంలో అందరూ చచ్చినారు. రథం విరిగింది - ధనుస్సూ విరిగింది - కూలబడ్డాడు - అయినా వీడి అహంకారం మాత్రం తగ్గలేదు, ఆర్భాటం చేస్తున్నాడు. ఇక వీని పదితలలు నరకడం తప్ప ఇంకొకమార్గం లేదని శ్రీరామునికి తోచింది. ఒక్కొక్క తలనే నరకనారంభించినాడు. ఒక తల నరికితే ఇంకొక తల మొలుస్తూఉంది. ఇట్లా ఎంతోసేపు చిత్రవధ చేసినాడు. కాని లాభం లేకపోయింది. ఒకే కాలంలో ఒకే బాణంతో రావణుని పదితలలూ తెగి నేల రాలిపడే దానికి -

ఓట్టియోర్ వెజ్గళై యుయ్త్తవణ - నేను వెళ్లి రావణుని పదితలలు తెస్తాను - నేను వెళ్లి తెస్తాను అని శ్రీరాముని అంబులపొదిలోని బాణాలన్నీ నేను ముందు, నేను ముందు అని ముందుకు వస్తున్నాయి. అన్ని బాణాలూ చాలా కోపంతో ఉన్నాయి. అందులో ఒక బాణాన్ని ధనుస్సులో సంధించి, విడిచినాడు. రావణుని పదితలలు ఏకకాలంలో క్రిందరాలడమే శ్రీరాముని

‡ రామాయణమ్ : అయోధ్య. 21-6.

లక్ష్యం. ఆ బాణం వెళ్లి లక్ష్యాన్ని చేరింది. ఆ బాణానికి ఎట దొరికింది. రావణుని పదితలలు నేలపై బడ్డాయి. శ్రీరాముని లక్ష్యమూ నెరవేరింది. బాణానికి ఎట దొరికింది. తనపని తానుచేసి- ఆ బాణం శ్రీరాముని అంబుల పొదిలో వచ్చి చేరింది అటువంటి మాహాత్మ్యం కల బాణాలు కలవాడు శ్రీరాముడు.

శ్రీరాముని బాణం ఒకక్షణంలో రావణుని పదితలలు నరకడంవల్లా-రావణుని ధైర్యంవల్లా పదితలలు తెగిన తర్వాతకూడ రావణుని మొండెం తలవిరిగిన తాటిచెట్టులాగ కొంచెంసేపు నిలబడి ఉండింది.

తలైపత్తుఉతిరఓట్టి – అనేది శ్రీరాముడు యుద్ధంలో రావణుని పది తలలు నరికినాడు. కాని అవి మరలా మొలుస్తున్నాయి. నా అనేవాడు దగ్గరలేకుండా రావణుడు మాత్రం ఒంటరిగా నేలపై నిలిచినాడు అనడాన్ని-

*శ్లో॥ గచ్ఛాను జానామి రణార్దిత స్త్వమ్ ప్రవిశ్య రాత్రించర రాజలంకామ్ ।

ఆశ్వాస్య నిర్యాహి రథీ సధన్వీ తదా బలం ద్రక్ష్యసి మే రథస్థః ॥

[రాత్రిళ్ల తిరిగే రాక్షసులకు రాజైన రావణుడా! ఈనాటి యుద్ధంలో నీ రథమూ - అస్త్రాలూ - అన్నీ విరిగిపోయాయి. అయినా నీవే జయించి నావు అని అనుకొంటానులే పో. లంకకు పోవడానికి అనుమతిస్తున్నాను. లంకకు పోయి ఈరోజు విశ్రాంతి తీసుకో, రేపు యుద్ధానికి తిరిగిరా. యుద్ధానికి వచ్చేటప్పుడు రథాన్ని - ధనుస్సునూ తెచ్చుకో. రథంలో ఉండే టప్పుడు నా బలం చూస్తువుగాని.]

అని పరిహాసంగా చెప్పి, రావణుని పంపడాన్ని - ఓర్ వెజ్ఞ్జై యుయ్ త్తవన్ అనే పదం రావణుని వధకుగాను సాటిలేని అస్త్రాన్ని వదిలి నాడు అనడాన్ని తెలుపుతూ ఉంది అనికూడా అనుకోవచ్చు.

* రామాయణమ్ యుద్ధ. 59-143.

ఓతవణ్ణన్ — సముద్రం నీలంగా ఉంటుంది. సముద్రాన్ని చూస్తే పాపాలన్నీ పోతాయి. సముద్రంలాగ నీలమైన శరీరం కలవాడు శ్రీరాముడు. ఈతణ్ణి చూస్తే చూచినవాళ్ల పాపాలూ తాపాలూ పోతాయి. అటువంటి నీలమేఘచ్ఛాయ గల శ్రీరాముడు .

మతురమా వణ్ణుపాడ మామయిలాటరజ్గత్తమ్మాన్ - రావణుని చంపి, వీరలక్ష్మితో ప్రకాశిస్తూ నిలుచున్న శివిని చూచి, బ్రహ్మరుద్రేంద్రాదులు స్తోత్రం చేస్తున్నారు అప్సరసలు మంగళగీతాలు పాడుతూ నాట్యం చేస్తున్నారు. అప్పుడు శ్రీరాముడు -

‡ శ్లో॥ ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్ ।
యోఽహం యస్య యతశ్చాహం భగవాన్ స్తద్బ్రవీతుమే ॥

[దశరథ మహారాజు కుమారుడైన శ్రీరాముణ్ణి నేను. నన్ను మానవుడుగానే తలస్తున్నాను నేను, నన్ను ఎందువల్ల భగవంతు డంటున్నారో నాకు చెప్పండి.]

అన్నాడు. ఈ విధంగా పలకడంచేత పరమపదంలో భగవంతునితో ఎల్లప్పుడూ ఉంటూ ఆతని సేవచేసే ముక్తులూ నిత్యులూ ఒక క్షణం కూడా భగవంతుని విడిచి ఉండలేక ఆయన కైంకర్యం ఇక్కడ చేయాలని తుమ్మెదల రూపంలో కొందరు - నెమళ్ల రూపంలో కొందరు - వేరే మారు రూపాలు ధరించి వచ్చినారో ఏమో అనేటట్లున్నాయి తుమ్మెదలు, నెమళ్లు. ఆ తుమ్మెదలు జ్ఞానాది గుణమాహాత్మ్యాలు కలిగి ఉన్నాయి. ఆ తుమ్మెదలు ఏ సమయానికి తగిన రాగాలు ఆ సమయంలో అతిమధురంగా పాడుతున్నాయి. ఇక్కడి నెమళ్లూ జ్ఞానాది గుణమహాత్మ్యాలు కలిగినవే. అందుచేత ఆ తుమ్మెదల పాటలకు తగినట్లు ఆ నెమళ్లు నాట్యం చేస్తు

‡ రామాయణమ్ యుద్ధ. 120-11.

న్నాయి. ఇవన్నీ ఎక్కడున్నాయంటే శ్రీరంగంలో. ఆ శ్రీరంగంలో దేవాలయాంతరంలో శేషునిపై పవ్వళించి తాను సర్వాధిపతియైన తీరునుతోప జేస్తూ కన్నులకింపు కలిగించే విధంగా ప్రకాశించే శ్రీరంగనాథుని —

తిరువయిట్ ఉదర బంధమెన్నుళ్ళత్తుళ్ నిన్దులాకిన్దతే —

† దామోదరం బంధగతమ్ —

[యశోద కృష్ణుని నడుముకు దారంకట్టి, ఆ దారాన్ని రోటికి కట్టింది. నలకూబర మణిగ్రీవులనే వాళ్లు నారదుని శాపంతో రెండు మద్దిచెట్లుగా ఉండేవాళ్లు. ఆ చెట్ల మధ్య కృష్ణుడు రోటిని ఈడ్చినాడు. అప్పుడు నలకూబర మణిగ్రీవులు శాపవిముక్తులైనారు.]

అట్లాగే ఈ సంసారబంధంలో చిక్కుకొని కొట్టుకలాడేవారు భగవంతుని దర్శిస్తే వారికి మోక్షం కలుగుతుంది. ఈ విషయాన్ని తెలుపడానికే భగవంతుడు ఇక్కడ అవతరించినాడు. ఆతడు తన కడుపుపై రత్నాలు చెక్కిన ఒడ్డాణమనే ఆభరణాన్ని ధరించి ఉన్నాడు. ఇంత మాహాత్మ్యాన్ని కలిగిన ఆభరణం ఇది. నేనా అతి క్షుద్రుణ్ణి. నా హృదయమా అనురాగమూ ద్వేషమూ వీటితో కలుషితమైంది. ఇందులో అంటే అనురాగమూ ద్వేషమూ వీటితో కలుషితమైన నా హృదయంలో దర్శనమిస్తున్నాడు. ఈ అనురాగ దూషితమైన నా హృదయమే తను దర్శనం ఇవ్వడానికి తగిన ప్రదేశం అని ఆ భగవంతుడు అనుకొన్నట్లున్నాడు. ఈ ఒడ్డాణం దర్శించి అనుభవించడానికి మాహాత్మ్యాన్ని ప్రకాశింప జేయడానికి తగినదిగానే ఉంది.

ఈ పాశురం "ఓం నమో నారాయణాయ" అనే తిరుమంత్రార్థం (అష్టాక్షరి) మధ్య ఉండే నమః అనే పదాన్ని సూచిస్తుంది. ఈ జీవాత్మలు

---

† ఎక్కడిదో తెలియరాలేదు.

ఉండేది భగవంతుని దర్శించి అనుభవించడానికే అన్న విషయం "నమః" పదం సూచిస్తూంది

భగవంతుని ఆపాదమస్తకంలో మధ్యభాగం కడుపు. దానిపై ఉండేది ఒడ్డాణం. కాబట్టి శరీరమధ్యభాగాన్ని దర్శించినట్లు అనికూడా అర్థం.

ఐదవ పాశురం

పారమాయ పళవినై పట్ఱఱుత్తు* ఎన్నైత్తన్
వారమాక్కి వైత్తాన్ వైత్తతన్ఱి యెన్నుళ్ పుకున్దాన్*
కోరమాతవమ్ శెయ్తనన్గొలఱియే నరఙ్గత్తమాన్* తిరు
వారమార్పతన్ఱో వడియేనై యాట్కొణ్డతే ॥

[అయోధ్యానగరాన్నీ వదలి - ఆశ్రితులకు నిలయమైన లంకానగరాన్నీ వదలి - గంగకన్న పవిత్రమైనదన్న కీర్తి కలిగిన కావేరీ తీరంలో, శ్రీరంగనాథస్వామి రూపంలో ప్రత్యక్షమయినాడు భగవంతుడు. ఈ కావేరీతీరంలో వెలసి నాకు దర్శనమిచ్చి, నన్ను తరింపచేయడానికి ఎంతో కాలం తపస్సు చేసినట్లున్నాడు. అనేక జన్మపరంపరలనుండి, నన్నంటి వస్తున్న పాపపుంజాన్ని పోగొట్టి, లక్ష్మీసమేతమైన వక్షస్థలము నా హృదయంలో ప్రవేశించి నా దృష్టి నాకర్షించి, నన్ను రక్షించింది.

ఈ పాశురంలో ఒడ్డాణముపైనున్న వక్షస్థలము వర్ణింపబడింది]

ఈ పాశురంలోను రాబోయే పాశురంలోను నారాయణ శబ్ద మాహాత్మ్యాన్ని చెప్పుతున్నారు. ప్రాణం పోయేటప్పుడు ఎవడు నారాయణ అని నోటితో చెప్తాడో వాడు పరమపదాన్ని పొందుతాడు. అయితే ప్రాణం పోయేటప్పుడు కఫవాతపిత్తాలు విజృంభించి, నోట మాటరాకుండా చేస్తాయి. కాబట్టి అప్పుడు నారాయణ అని నోటితో చెప్పడం ఎట్లా ? అంటే అర్చారూపంలోని భగవంతుని వక్షస్థలాన్నీ కంఠాన్నీ దర్శిస్తే పరమపదం కలుగుతుంది అంటున్నారు. నారాయణ శబ్దాన్ని ఉచ్చరిస్తే ఏ ఫలం కలుగుతుందో ఆ ఫలాన్ని ఇచ్చేదీ - లక్ష్మీదేవి నివసించడంచేత అందమయిందీ అయిన వక్షస్థలాన్నీ - కంఠాన్నీ దర్శించి, ఆనందించినతీరు వర్ణిస్తున్నారు.

పారమాయపళవిన్సై పట్అఱత్తు — ఎన్నో జన్మాలనుండి సంసార బంధాలు నన్ను వెంటాడి వస్తున్నాయి. వీటిని ఎంతో ఆప్యాయంగా అనుసరిస్తున్నాను. కాలం అనేది ఒకటి ఉంటే ఆ కాలం ఉండేంత వరకూ ప్రాయశ్చిత్తాలు చేసినా నేను చేసిన పాపాలు తీరవు. అటువంటి నేను —

ఎన్నైత్తన్ వారమాక్కి వైత్తాన్ - కర్మాలు చేయడంలో ఆసక్తుణ్ణి- పంచేంద్రియాలకు దాసుణ్ణి - కర్మ పరవశులైన ఇంద్రాది దేవతలను ఆరాధించి, తనివి తీరనివాణ్ణి - సంసారబంధాలు మోస్తూ తనివి తీరకుండా రంగులరాట్నంలో తిరిగినట్లు సంసారబంధాల్లో తిరిగేవాణ్ణి అయిన నన్ను ఆ సంసారబంధాల వాసన కొంచెంకూడా లేనివాణ్ణిగాచేసి, ఏ పాపమూ లేని వాణ్ణిగా నన్ను చేసినాడు. అట్లా చేసినవాడెవడంటే సర్వప్రపంచానికి అధిపతి అయినవాడూ నిత్యసూరులచేత సేవింపబడేవాడూ అయిన భగవంతుడు. అంతఃపురస్త్రీలలో ఇతరులకు భాగంలేకుండా తానే ఎట్లా అనుభవిస్తున్నాడో అట్లాగే నన్నూ అనుభవిస్తున్నాడు. నన్ను అనుభవిస్తూ ఎవ్వరికీ ఇవ్వని తన కైంకర్యరసానుభవాన్ని నాకు ఇచ్చి, నేను ఇతర దేవతలను తలచకుండా దర్శించకుండా చేసినాడు. ఇప్పుడేకాదు ఇకముందు రాబోయే కాలంలో ఏ కాలంలోను తన్నుతప్ప ఇతరదేవతలను ఆశ్రయించకుండా ఉండేటట్టు తన దాసానుదాసునిగా చేసినాడు నన్ను.

వైత్తతన్ని యెన్నుళ్ పుకున్దాన్ — ఎప్పుడూ ఏ పని చేసినా ఏదో గొప్పలాభాన్ని పొందాలనే ఆశతో పనులు చేస్తూ ఉండేది నా హృదయం. నానుండి భగవంతుడు ఏ ప్రయోజనాన్నీ ఆశించకుండా నేను ఏ ప్రయత్నమూ చేయకుండా నా హృదయంలో ప్రవేశించినాడు. శత్రురాజులచేత ఆక్రమింపబడిన తన రాజ్యాన్ని వాళ్లను తరిమి, తిరిగీ తనరాజ్యంలో తాను ప్రవేశించినట్లు నా హృదయంలో ప్రవేశించినాడు. ముందు జన్మల్లో ఇతర దేవతల నారాధించిన నా హృదయం తనది అని తానే వచ్చి, నాకు దర్శనమిచ్చి, అన్యదేవతా విముఖుణ్ణిగా చేసినాడు నన్ను.

కోరమా తవమ్ శెయ్ తనన్గాలజియేన్ — కర్మాలకు వశుడు కాని భగవంతుడు తనకుతానే కోరుకొని, అయోధ్యా నగరంలో సూర్యవంశంలో శ్రీరామచంద్రుడుగా అవతరించినాడు. తాను అవతరించిన అయోధ్యా నగరాన్ని - తన్నాశ్రయించిన విభీషణుడూ మొదలైన వాళ్లుండే లంకా నగరాన్నీ వదలి ఈ రెండు చోట్లకు పోకుండా —

† గంగైయిల్ పునితమాన కావిరి నడువుపాట్టిల్ —

[గంగానది విష్ణుపాదాల్లో పుట్టడం చేత పవిత్రమైందే. అయినా శివుని తలపైనిలిచి, అక్కడనుండి భూమిపైకి ప్రవహించడంచేత అపవిత్రమైపోయింది. అటువంటి అపవిత్రతలేందీ పవిత్రమైందీ ఈ కావేరీనది. ఈ కావేరీనది రెండుపాయలుగా ఉంది. ఎప్పుడూ పారుతూ ఉంటుంది.]

ఈ కావేరీనది రెండుపాయల మధ్యా అందమైన పూలతోటలున్నాయి. ఆ మధ్య దేవాలయంలో దాసులమీద దయగలవాడూ సర్వస్వానికి స్వామియైనవాడూ సర్వాన్ని తన ఇచ్ఛవచ్చినరీతిగా నడిపేవాడూ అయిన శ్రీరంగనాథస్వామి ఆదిశేషునిపై పవ్వళించి ఉన్నాడు. ఇతని అందాన్ని చూచిన తర్వాత ఆ అందాన్ని మరచి ఎవరు ఉండగలరు ?

భగవంతుడు ఈ కావేరిమధ్యలో శ్రీరంగంలో అవతరించాలని అతి ఘోరంగా ఏదో గొప్పతపస్సుచేసి అవతరించినాడో ఏమో నేను తెలుసుకోలేకుండా ఉన్నాను. ఈ మాట శ్రీరంగానికి గొప్పతనాన్ని తేవడానికి చెప్పింది అనుకోండి.

శ్రియః పతి -

‡ శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥

† తొండరడిపొడి యాళ్వార్, తిరుమాల, 23 పా.
‡ భగవద్గీత. 18-66.

[ఎన్నో జన్మాలనుండి సంపాదించిన పాపాలు ఎన్నో రకాలు. ఆయా పాపాలకు తగినట్లు ప్రాయశ్చిత్తాలు అనేకవిధాలు. అవి ఏవి అంటే, మొదటి మూడురోజులు మధ్యాహ్నం మాత్రం భోజనం చేయడం, ఆ తర్వాత మూడురోజులు రాత్రిళ్లు మాత్రం భోజనం చేయడం, ఆ తర్వాత మూడురోజులు రెండు పూటలా భోజనం లేకుండా ఉపవాసం చేయడం అనే కృఛ్రాన్ని - శుక్లప్రతిపత్తున చంద్రుని కళ ఒకటి, ద్వితీయ రోజున కళలు రెండు - ఇట్లా పెరుగుతూ పౌర్ణిమకు పదునైదు కళలతో పెరిగి. కృష్ణప్రతిపత్తునుండి రోజుకు ఒక్కొక్క కళగా తగ్గుతూ అమావాస్యకు పూర్తిగా అన్ని కళలు ఎట్లా తగ్గుతాయో అట్లాగే శుక్ల ప్రతిపత్తున ఒక పిడచ అన్నంతో ప్రారంభించి, పౌర్ణమికి పదునైదు పిడచలు తింటూ, ఆ తర్వాత మరలా ఒకటొకటే తగ్గిస్తూ అమావాస్యనాడు ఏమీ లేకుండా ఉపవాసం ఉండడం అనే చాంద్రాయణాన్ని - తల బోడిగొట్టుకొని, ముసుగు వేసుకొని, పవిత్రమైన నదిలో స్నానం చేసి. మొదట ఆజ్యభాగాలను ఆ తర్వాత వెన్నను "యద్దేవా దేవహేడనం" అనే మంత్రాన్ని చెప్తూ హోమంచేసి, ఆ తర్వాత అగ్నిని "వైశ్వానరాయ ప్రతిపాదయామి" అనే మంత్రంతో పూజించి, "యదర్థీవయం" అనే మంత్రాన్ని చెప్తూ సమిధలతో హోమం చేసి. "జయాది" మంత్రాలను జపం చేస్తూ బ్రహ్మచర్యాన్ని అనుసరించి, పాలు తాగుతూ దీక్షతో ఉండడం అనే కూష్మాండాన్ని - సంవత్సరారంభమైన చైత్రమాసం నుండి ఆషాఢం వరకు నాలుగు మాసాలూ చేసే వ్రాతపతినీ మార్గశిరమాసం నుండి ఫాల్గుణం వరకు నాలుగు మాసాలు పవిత్ర అనే మంత్రాన్ని చెప్తూ చేసే పవిత్రేష్టినీ - నీళ్ల అర్ధభాగం. నాల్గవభాగం మట్టి, నాల్గవభాగం అగ్నిని - ఈ మూటిని భోజనం చేసే త్రివృత్తునూ, వరుసగా ఐదురోజులు అగ్నిదేవునికి అనేక రకాలైన నైవేద్యాలతో హోమాలు చేయడం అనే అగ్నిష్టోమాన్నీ చేయడానికి ఎంతోకాలం పట్టుతుంది. పరిమితమైన కాలం జీవించేవాడివి నీవు. నీవు ఇవన్నీ అనుష్ఠించడం కష్టం. కాబట్టి వీటి

నన్నిటినీ వదిలిపెట్టి మిక్కిలి కరుణకలిగినవాడూ చంపతగిన శత్రువు శరణు పొందినా చంపకుండా వాణ్ణికూడా తన కృపకు పాత్రుడుగా చేసేవాడూ ఆశ్రితవాత్సల్యజలధీ అయిన నన్ను ఒక్కణ్ణే భక్తితో ఆశ్రయించు. నీవు పైన చెప్పిన ప్రాయశ్చిత్తాలు చేయకుండా నీ పాపాలన్నిటినీ పోగొట్టి, నీవు మోక్షం పొందేటట్లు చేస్తాను నేను, నీవు దుఃఖించవద్దు.]

అదీకాకుండా ఆ భగవంతుని దయకు పాత్రుడు కావడానికీ ఈ శ్రీరంగనాథుని దర్శించే మహాభాగ్యాన్ని పొందడానికీ తగినవాడను కానటు వంటి నేను భగవంతుని దయకు పాత్రుడు కావడం - నేను కోరకుండా - ఏ ప్రయత్నమూ చేయకుండా శ్రీరంగనాథస్వామి నాకు దర్శనం ఇవ్వడం చూస్తే నేను ఏదో గొప్ప తపస్సు చేయడంచేత ఈ భాగ్యం నాకు కలిగిందో ఏమో తెలియలేకుండా ఉన్నాను కదా! అని ఆశ్చర్యపోతూ -

* శ్లో॥ ప్రియ మితర దథాపి వా యద్యథా వితరసి వరదప్రభో
త్వం హి మే ।
తదనుభవనమేవ యుక్తంతు మే త్వయి నిహిత భరోస్మి
సోఽహం యతః ॥

[ఓ వరదరాజస్వామీ! నా భారాన్నంతా నీపై మోపి, నేను నీకు దాసుణ్ణయ్యాను. మంచిచేసినా చెడ్డచేసినా సరే, నీవు ఎట్లాచేస్తే అట్లా చేయి. నీవు ఆడించినట్లు నేను ఆడేవాణ్ణే, ఎందుకంటే నా భారాన్నంతా నీపై మోపి, నీవే రక్షకుడవని నీకు దాసుణ్ణయ్యాను గనుక.]

అనీ

† శ్లో॥ తవ భరోఽహ మకారిషి ధార్మికై
శ్శరణ మిత్యపి వాచముదైరిరమ్ ।

---

* కూరత్తాళ్వార్ల వరదరాజస్తవమ్. 91 శ్లో.

† పరాశరభట్టర్ శ్రీరంగరాజస్తవమ్. 102 శ్లో.

ఇతి ససాక్షికయ న్నిద మద్య మాం
కురు భరం తవ రంగధురంధర ॥

[శ్రీరంగనాథా! భగవద్భక్తి పరాయణులైన ధార్మికులు నన్ను నీకు దాసుణ్ణిగా చేసినారు. నేనూ నిన్ను శరణు పొందినానని సంతోషంతో చెప్పినాను. నేను చెప్పిన మాటకు సాక్షిగా ఇప్పుడు నన్ను చేయి. నీ దాసుడుగా నన్ను చేసుకో.]

అని చెప్పినట్లు ఇప్పుడు ఇతరులూ నేనూ తెలుసుకోవడానికి నేనేదైనా తపస్సు చేసినానో ఏమో తెలుసుకోలేకుండా ఉన్నాను. ఇది శ్రియఃపతి ప్రధానమైన సంకల్పాలలో ఒకటేమో! నేను ఏ తపస్సూ చేయకుండా నాకు దర్శనమివ్వాలనేది భగవంతుని ప్రధానమైన సంకల్పం అనికూడా అనుకోవచ్చు.

క్షుద్రమైన నా మనస్సులో తానేవచ్చి, ప్రత్యక్షమై నిలిచిన వాడెవడంటే –

‡ తెరువిల్లాత్తేవరై –

[లంకానగరంలోని రాక్షసులు చెడ్డనడవడికలచేత తమ తెలివి తక్కువను చాటుకొన్నారు. దుష్టులైన రాక్షసులను జయించిన శ్రీరామచంద్రుణ్ణితప్ప ఇంకొకరిని నేను దైవంగా అంగీకరించను.]

అందరిని జయించినవాడు భగవంతుడు. మిగతావాళ్లెటువంటివారంటే.

[స్మశానంలో నివసించడం, మెడలో ఎముకలహారాలు ధరించి తిరగడం, మూడవకన్ను కలిగి ఉండడం – ఇవన్నీ అమంగళకరమైన విషయాలు. ఇవి కలిగినవాణ్ణి కంటితోకూడ చూడరాదు. కాబట్టి పై అమంగళకరమైనవన్నీ ఉన్న శివుణ్ణీ – ప్రపంచంలో ఉండే అమంగళాలన్నీ

‡ తిరుమళిశై ఆళ్వార్ల నాన్ముకం తిరువందాది, 53 పా.

సహిస్తూ ఎవరైనా తన్నాశ్రయించినా స్వతంత్రంగా వాళ్లకోరికలు తీర్చలేని దేవుళ్లనూ — లక్ష్మీదేవితో సంబంధంలేని కొంతమంది చిల్లరదేవుళ్లనూ — దేవుళ్లని మీరు తలచకండి. వీళ్లంతా తాము తరించలేనివాళ్లు. ఇక మిమ్మల్నేమి తరింపజేస్తారు. అయితే ఎవరిని తలచాలంటే లక్ష్మీదేవితో కూడి ఉండే శ్రియఃపతినే సేవించండి. ఆతడే దేవుడు.]

అనే పాశురాన్ని —

† అకలకిల్లే నిఱైయుమెన్ఱలర్ మేల్ మజ్గైయుఱై మార్పన్ —

[వికసించిన తామరపూవులో పుట్టి, అలమేలుమంగ అనే పేరు ధరించి, ఒక్కక్షణంకూడా ఇతనిని వీడిఉండలేనని చెప్పే అలమేలుమంగ ఎల్లప్పుడూ వక్షస్థలంలో నివాసంచేసే ఓ వక్షస్థలమా ! వాత్సల్యగుణుడా ! చేతనాచేతనాలకు స్వామియైనవాడా ! నీచుని నన్ను దాసునిగా తీసుకొన్న వాడా ! దేవతలూ మహర్షిసమూహాలూ కోరివచ్చి, ఆశ్రయించే తిరుమలలో ప్రకాశిస్తున్న స్వామీ ! ఇంకొకరు రక్షించేవారు లేరు. నీవే రక్షించేవాడవు. అని నిన్ను శరణుపొందిన నేను నీకొండక్రిందిభాగంలో ఎంతో పొందికగా నిలిచిఉన్నాను.]

అనే ఈ పాశురాన్ని తలుస్తూ — భగవంతునికి కైంకర్యం చేయడమే దాసానుదాసుడైన నాకూ భగవంతునికీ ఉండే సంబంధం అనే విషయాన్ని స్పష్టంగా చెప్పుతున్నారు.

అరజ్గత్తమ్మాన్ తిరువారమార్ పతన్తో వడియేన్నై యాట్కొణ్డతే — అందరూ అనుభవించడానికి తగినట్లున్నవాడూ అన్నితప్పులను సహించేవాడూ దేవాలయాంతరంలో కన్నుల కింపుకలిగించేటట్లు పవ్వళించి దర్శనమిచ్చేవాడూ శ్రీరంగనాథుడు. ఇతడు నన్ను దర్శించండి అని నిలిచే సౌలభ్యంతో

---

† నమ్మాళ్వార్ల తిరువాయ్ మొ॥ 6-10-10.

పాటు, సౌలభ్యానికి విరుద్ధంగా అన్నిటికీ నేనే కర్తను అనే స్వామిత్వ దర్పాన్ని చూపుతూ ఉన్నాడు. ఇతడు స్వామి అనడానికి తగినట్లు లక్ష్మీ దేవిని ధరించి ఉన్నాడు. అందమనే ప్రవాహానికి అడ్డంగాకట్టిన ఆనకట్ట లాగఉన్న ముత్యాలహారాలూ బంగారు ఆభరణాలూ ధరించిఉన్నాడు. వీటన్నిటితో ప్రకాశించే వక్షస్థలంకదా అది !

స్వభావంచేతనే భగవంతుని దర్శించడంలో మహారసికశిఖామణి తిరుప్పాణాళ్వార్లు. ఇంత అందగాడైన భగవంతుని దర్శించి, వర్ణించడంలో ఆశ్చర్యమేముంది. దర్శించి, ఆ తర్వాత భగవంతుని మంచిగుణాలచేత ఆకర్షింపబడినవాడై –

† శ్లో॥ అహమస్యావరో భ్రాతా గుణైర్దాస్య ముపాగతః ।
కృతజ్ఞస్య బహుజ్ఞస్య లక్ష్మణో నామ నామతః ॥

[చేసిన ఉపకారాన్ని ఎన్నడూ మరువనివాడూ అన్నిధర్మసూక్ష్మలనూ ఎరిగినవాడూ అయిన శ్రీరామచంద్రుని తమ్ముణ్ణి నేను. నాపేరు లక్ష్మణుడంటారు. నేను ఈ శ్రీరామచంద్రుని మంచిగుణాలకు ముగ్ధుణ్ణై ఇతనికి దాసుడయినాను.]

భగవంతుని స్తోత్రంచేయడమే ప్రధానంగాపెట్టుకొన్న నన్ను స్తోత్రం చేయడమనే దాస్యంలో దింపి, నేను స్తోత్రంచేయడానికి వస్తువుగా శ్రీరంగ నాథుని వక్షస్థలం వచ్చి, నా ఎదుట నిలిచింది అంటున్నారు.

ఈ పాశురంలోని పదాలవరుసవల్ల నారాయణ శబ్దాన్ని నోటితో పలికితే అనిష్టాలను పోగొట్టుతుం దనడాన్నీ - ఇష్టాలను పొందిస్తుందన డాన్నీ - భగవంతుడు మనసులోపలాను బయట శరీరాన్నంతటినీ వ్యాపించి ఉన్నాడనడాన్నీ - భగవంతుడు ఎల్లప్పుడూ కృపగలిగి ఉంటాడనడాన్నీ -

† రామాయణమ్. కిష్కిం. 4-12.

భగవంతుని పొందినందుకు ప్రధానమైన స్వామిత్వాన్నీ - వీటన్నిటినీ మిం చిన శ్రియః పతిత్వాన్నీ - పదునాల్గు భువనాలే కిరీటాద్యాభరణాలుగా, శంఖ చక్ర గదాద్యాయుధాలుగా ధరించిన అందాన్నీ - ఆ అందంతో సేవింపదగిన విగ్రహాన్నీ నారశబ్దార్థమైన ప్రపంచంలోని అన్ని ప్రాణులు ఇతనికి దాసాను దాసులనే స్వరూపాన్నీ - ప్రపంచంలోని ప్రాణులలో ఒకడైన తిరుప్పాణా ళ్వార్లు భగవంతుని దాసుడైనందుకు ఫలమైన స్తోత్రంచేసే కైంకర్యాన్నీ చెప్పినట్లు తలచవలసి ఉంది.

[ఈపాశురంలో –

శ్లో ॥ ప్రాప్యస్య బ్రహ్మణో రూపం ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః ।
ప్రాప్త్యుపాయం ఫలం ప్రాప్తే స్తథాప్రాప్తి విరోధి చ ॥
(హారీతసంహిత)

పొందదగిన భగవత్స్వరూపాన్నీ - జీవాత్మ స్వరూపాన్నీ - భగ వంతుని పొందే ఉపాయాన్నీ - భగవంతుని పొందడంవల్ల కలిగే ఫలాన్నీ - భగవంతుని పొందడానికి విరోధాలైన విషయాలేవి అనే విషయాన్నీ ఈ అయిదింటిని అర్థపంచక మంటారు, ఈ అర్థపంచకాన్ని ఈ పాశురంలో చక్కగా వివరించినారు.]

ఆరవ పాశురం

తుణ్డవెణ్పిఱైయన్ తుయర్ తీర్త్తవన్ *
అఞ్జిఱైయవణ్డువాళ్ పొళిల్ శూళరఙ్గనకర్ మేయ వప్పన్ *
అణ్డరణ్డ పకిరణ్డత్తొరు మానిలమేళుమాల్ వరై *
ముట్రుమ్ ఉణ్డకణ్డమ్ కణ్డీరడియేనై యుయ్యక్కొణ్డతే ॥

[చిన్నచిన్న తోటలతో కూడినది - సమస్త జీవరాసులకు నిలయమైనది - సప్తప్రాకారములు కలిగినది శ్రీరంగము. చంద్రశేఖరుడైన ఈశ్వరుని శాపవిముక్తిని చేసినవాడు - కులపర్వతాలను, చరాచర ప్రపంచాన్ని మింగిన భగవంతుడు శ్రీరంగనాథస్వామి రూపంలో శేషశయనంలో ఆ శ్రీరంగంలో ఉన్నాడు. ఇతని కంఠంమీదికి నాదృష్టిని మరల్చి నన్ను జీవింపచేస్తూంది ఈకంఠము.

ఈ పాశురంలో వక్షస్థలానికి పైనఉండే కంఠము వర్ణింపబడింది.]

ముందు పాశురంలో భగవత్కైంకర్యం చేయాలనే వారికి అహంకారం విరోధి అనీ ఆ అహంకారానికి మూలకారణాల నన్నిటినీ యేవిధంగా ఖండించాలనేదీ తెలిపినారు. ఈ పాటలో నేనే ధనవంతుడను, నేనే ఈశ్వరుడను అనే వాళ్ల భిక్షమెత్తడాన్ని శ్రియఃపతి ఏవిధంగా పోగొట్టింది వివరిస్తున్నారు.

తుణ్డవెణ్పిఱైయన్ తుయర్ తీర్త్తవన్ - ఈశ్వరుడనే పేరు ధరించిన ఈశ్వరుడుకూడ పరిపూర్ణుడుకాడు. ఎందుకంటే పదహారుకళలతో పరిపూర్ణుడైన చంద్రున్నికాకుండా చంద్రునికళలలో ఒకకళనే రుద్రుడు తలపై ధరించినాడు. కాబట్టి అతడు పరిపూర్ణుడు కాడని తెలుస్తూంది. ఈ రుద్రుడు కూడా బ్రహ్మపుత్రుడే. ఐదుముఖాలుకలిగిన బ్రహ్మముఖాలలో ఒక ముఖాన్ని రుద్రుడు ఖండించి, తండ్రికే ద్రోహంచేసినాడు. తండ్రికి ద్రోహం చేసి, మహాపాపాన్ని పొందినాడు. ఆ మహాపాతకాన్ని ఎవరు తీరుస్తారా?

అని చేతిని అంటిపెట్టుకొన్న బ్రహ్మకపాలం కలవాడై, దేశమంతా తిరుగుతూన్నాడు. సముద్రమధ్యంలో పగిలిననావ ఏదోవిధంగా తీరంచేరుకొన్నట్లు ఈశ్వరుడు తిరిగి తిరిగి, అత్యంత కరుణాసముద్రుడైన శ్రియఃపతిని సమీపించి చూచి –

† ఎన్నైన్దాయ్ శాపమ్ తీరెన్న –

[మెడలో చచ్చిన పీనుగుల ఎముకల దండలూ - ఒళ్లంతా బూడిద ధరిస్తూ - చిల్లులతోనిండిన పుఱ్ఱెను చేతధరిస్తూ, ప్రపంచమంతా తిరుగుతూ, పరమశివుడు శ్రియఃపతిని సమీపించి, ఓస్వామీ ! నాకు కలిగిన శాపాన్ని తొలగించి కాపాడండి అని ప్రార్థిస్తే తన వక్షస్థలంలోఉండే అమృతాన్ని ఇచ్చి, పరమేశ్వరుని పాపాన్ని పోగొట్టిన శ్రియఃపతి నేపాలదేశంలో, గండకీ నదీతీరంలో ఉండే సాలగ్రామక్షేత్రంలో, చందనపుచెట్లతో నిండి ఉండే ఉద్యానవనంలో ఎల్లప్పుడూ నివసిస్తున్నాడు. ఓ మనసా ! ఆతణ్ణి ఆశ్రయించు.]

అని ప్రార్థించినాడు. దీనివల్ల పరమశివుని మహాపాపాన్ని పోగొట్ట తగినవాడు శ్రియఃపతి అని తేలింది. ఇంకా ఈశ్వరుడు అనే పేరుపెట్టుకొన్న రుద్రుడుకూడా కర్మాలకు వశుడు అనే విషయాన్ని - తన్నుతాను రక్షించుకోలేని ఈ రుద్రుడు ఇంకొకరు అపేక్షించినా అపేక్షించకపోయినా రక్షకుడు కాడు అనే విషయాన్ని తెలిపినట్లయింది. కరుణామయుడైన సర్వేశ్వరుడే అన్ని అనిష్టాలను పోగొట్టేవాడు అనే విషయాన్ని చెప్పినట్లయింది.

అఞ్జిఱైయవణ్డువాళ్ పొళిల్ కూళరఙ్ఞనగర్ మేయవప్పన్ – కష్టాలను పొంది తన్ను ఆశ్రయించినవారికి అవసరమైతే దూతగా పనిచేయడానికి –

† తిరుమంగయాళ్వార్ల పెరియ తిరుమొళి 1-5-3.

† మాశిల్ మలరడి —

[రేపల్లెలో గొల్లలఇండ్లల్లోని నేతిని చేతితోజొరుకొని, కడుపార ఆరగించినానని కొందరు నన్ను పరిహాసం చేస్తారు. మరికొందరు ఇటువంటి కార్యాలు చేయడానికి పూనుకొనిన మన నాయకుడు పరమపదంలో నివసించే వారికి నాయకుడైన భగవంతు డంటారు. మరికొందరు వికసించిన ఎఱ్ఱ తామరపూలవంటి పాదాల్లో దాస్యంచేసే గండుతుమ్మెదల్లారా ! మమ్మల్నీ దాస్యంచేసేటట్లు చేయించండి అంటారు. ఓ గండు తుమ్మెదల్లారా ! మీరు వేగంగా వీచే మీరెక్కలతో ఎగిరివెళ్లండి. ఆయన నివసించే పరమపదం మీకు సులభంగా చేరతగింది. నాతరఫున మీరు ఆయనవద్దకు రాయబారా నికి వెళ్లండి. మీరు నాతరఫున ఆయనతో చెప్పతగిన మాటలను ముందు నాకుచెప్పి, ఆ తర్వాత ఆయనవద్దకువెళ్లి, ఆయనకు విన్నవించండి అంటారు మరికొందరు.]

పనికివచ్చే గండుతుమ్మెదలు మక్కువతో అతిపవిత్రాలైన సర్వే శ్వరుని దివ్య శ్రీపాదపద్మాలపై వ్రాలుతున్నాయి. మనమూ ఆ సర్వేశ్వ రుని దివ్య శ్రీపాదపద్మాలను ఆశ్రయించి, జీవించాలని సూచించడానికే వ్రాలినట్లున్నాయి. వ్రాలడమే కాదు, తమ చిన్నరెక్కలతో ఎగిరి ఇష్ట మొచ్చినరీతిగా పాటలు పాడుతున్నాయి. ఆ పాటలు విని, ఆనందిస్తూ ఉద్యానవనాలుకూడా పెరుగుతున్నాయి. ఆ ఉద్యానవనాలతోకూడిన శ్రీరంగ నగరంలో, సర్వలోకానికి తండ్రివంటివాడైన శ్రీరంగనాథుడు ఎల్లప్పుడూ నివసిస్తున్నాడు.

అని చెప్పడంచేత ఈ శరీరంకలగడానికి కారణభూతుడై, చేతులు కాళ్లు మొదలైన అవయవాలను ఇచ్చి ఉపకారంచేసిన శ్రియఃపతి కన్నుల కింపుగా వచ్చి, నా కన్నులఎదుట నిలిచి, నా కన్నులు ఇంకొక దేవతాంత రంపై పోకుండా కావలికాస్తూ ఉండే ఉపకారాన్ని ఉదాహరించినట్లయింది.

† నమ్మాళ్వార్ల తిరువిరుత్తం 54.

ఇక్కడ

† శ్లో॥ నరాజ్జాతాని తత్త్వాని నారాణీతి తతో విదుః ।
తాన్యేవ చాయనం తస్య తేన నారాయణ స్మృతః ॥

[శబ్ద స్పర్శ రూప రస గంధాలనే శబ్దాది విషయాలైదూ - త్వక్ చక్షుశ్శ్రోత్ర జిహ్వానాసికాలనే జ్ఞానేంద్రియాలైదూ - వాక్పాణిపాదపాయూపస్థాలనే కర్మేంద్రియాలైదూ - పృథివ్యప్తేజో వాయురాకాశాలనే మహాభూతాలైదూ - సంసారదశలో జీవునితో అతిసన్నిహితంగాఉండే మూలప్రకృతీ - ఇచ్ఛ అనే మహత్తూ - అభిమానహేతువైన అహంకారమూ - సంకల్పాలకు హేతువైన మనస్సూ మొత్తం ఇరవైనాలుగు తత్త్వాలు "నారాలు" అనిపించుకొంటాయి. భగవంతుడు వ్యాపించిఉండేచోటు ఈ ఇరవైనాలుగు తత్త్వాలే. అందుచేతనే "నారాయణు" డనిపించుకొంటాడు. మహోపనిషత్తు మొదలైనవాటిల్లో చెప్పినట్లు బ్రహ్మరుద్రేంద్రాదుల నందరిని సృష్టించకలిగిన నారాయణుని కారణత్వమూ ఈ ఇరవైనాలుగు తత్త్వాలలోను వ్యాపించి ఉండడంచేత కలిగిన సర్వవ్యాపకత్వమూ - ఈ తత్త్వాలన్నీ భగవంతునికి ఉపయోగపడేవి అనే అతిసూక్ష్మమైన విషయమూ నారాయణశబ్దంలో ఇమిడిఉన్నాయి.]

పై విషయాన్ని ఇక్కడ కలుపుకొనేది.

తానే సర్వాన్ని సృష్టింపడానికి కారణభూతుడు అనే విషయాన్ని తెలుపడంకోసరం సర్వాన్ని తనలోనికి వెనక్కు తీసుకొని, తిరిగి ఇదిగో సృష్టిస్తున్నాను అనడానికి ఉదాహరణంగా —

‡ వెట్ట్రిప్పోర్క్కడలరైయన్ విళుజ్గామల్తాన్ —

[నెత్తిని మూడవకన్ను కలిగి త్రిలోచనుడనే పేరుపొందిన రుద్రుడూ

† భారతమ్ 13-124-6,7 శ్లో.

‡ తిరుమంగయాళ్వార్ల పెరియ తిరుమొళి 11-6-3.

- ఎడతెగక ఎప్పుడూ వేదాన్ని పఠిస్తుండే చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడూ- ఐరావతమనే ఏనుగునెక్కి తిరిగే దేవేంద్రుడూ - ఇతర దేవతలూ ప్రళయ కాలంలో మహార్ణవంలో కలిసిపోకుండా వీళ్లనూ - పద్నాలుగు లోకాలనూ మింగి, తనకడుపులో దాచి కాపాడినాడు. ఆతడు యుద్ధాల్లో జయాలుపొందే సుదర్శన మనే చక్రాన్ని ధరించిన స్వామి. ఆతని గుణగణాలను సంకీ ర్తనం చేసేది ప్రాప్తమైఉండగా ఆ పని చేయకుండాఉండే నీచులనుచూచి ఆశ్చర్యపోతున్నారు.]

భగవంతుడు తానేవచ్చి, దర్శనమిచ్చి, సంకీర్తనచేసే భాగ్యాన్ని కలిగించిన ఉపకారాన్ని తెలుపుతూ -

* ఎమ్బెరుమానుణ్ణు మిళ్దవెచ్చిల్ తేవరల్లాతార్ తాముళరే —

[ప్రళయకాలంలో ఒకచోట నిలువకుండా పరుగులువారుతూ జల ప్రవాహం ఆకాశానికి విజృంభించినకాలంలో అతిబలిష్ఠాలైన తన వీరబాహు వులతో అండపిండబ్రహ్మాండాల నన్నిటిని ఈడ్చిపట్టి, ఈ ప్రళయకాల ప్రవాహంలో కలిసిపోకుండా తన కడుపులోదాచిన సమయంలో, బ్రహ్మ రుద్రుడు ఇంద్రాదిదేవతలందరు భగవంతుని కడుపులోప్రవేశించి, తిరిగి ఆతని నోటిగుండా వెలికివచ్చిన ఎంగిలిబ్రతుకు కలవారే అని మీరు తెలు సుకో లేకుండా ఉన్నారా ? అట్లా ఎంగిలిబ్రతుకులేని దేవుళ్లు ఎవరైనా ఉన్నారా ? ఎవరూ లేరే ? లోకమనేది నిలిచిఉండేది ఆ భగవంతుని కృప వల్లనే అనేది తెలుసుకొంటున్నారా ? ఇప్పుడైన మీరు.]

అనే విషయాన్ని నోటితో చెప్పుకొంటూ తనను ఇప్పుడు సంసారా ర్ణవంలో పడకుండా భగవంతుడు కాపాడిన తీరును వర్ణిస్తున్నారు తిరుప్పా ణాళ్వార్లు.

అణ్డర్ణపకిరణ్డత్తొరు మానిలమెళుమాల్ వరై ముట్రుముణ్డ కణ్డజ్జో రడియేనై ఉయ్యక్కొణ్డతే - అండపిండ బ్రహ్మాండాలలో తిరిగే దేవతలు

---

* తిరుమంగయాళ్వార్ల పెరియ తిరుమొళి 11-6-2.

మొదలైనవాళ్లనూ - అండాలనూ - అండాలను చుట్టిఉండే ప్రదేశాలనూ, ఏడుకులపర్వతాలనూ - అండాలలో ఉండే యాభైకోట్ల యోజనాలవిస్తీర్ణం కలిగిన భూమినీ - ఈ సర్వాన్నీ కడుపులో దాచి, రక్షించడానికి పూను కొన్న శ్రియఃపతి కంఠాన్ని దర్శించి, సంతోషించింది నా హృదయం. స్వయంగా తానేవచ్చి ఇవన్నీ నాకుచూపి - నన్ను బతికేటట్లు చేసింది ఈ కంఠం.

అండాలను మింగినాడని చెప్పినతర్వాత ఏడుకుల పర్వతాలనుకూడా మింగినాడని చెప్పడంలో ఆశ్చర్యం ఏమీలేదనితోస్తుంది.

ఏడవ పాశురం

కైయినార్ శురిశఙ్గన లాళియర్ నీళ్‌వరై పోల్
మెయ్యనార్ * తుళపవిరై యార్ కమళ్ నీళ్ముడియెమ్
ఐయ్యనార్ * అణియరఙ్గనారరవినణై మిశైమేయమాయనార్
శెయ్యవాయయ్యో వెన్నైచ్చిన్దై కవర్న్దదువే ॥

[శంఖచక్రగదాఖడ్గాద్యాయుధధరుడు - కిరీటంలో దివ్యతులసీదామ ధరుడు - శేషశాయి అయిన శ్రీరంగనాథస్వామి పగడమువలె ఎఱ్ఱనైన నోరు నాదృష్టి నాకర్షించి నా మనస్సులోని చింతను పోగొట్టింది.

ఈ పాశురంలో కంఠానికి పైనఉన్న నోరు వర్ణింపబడింది.]

భగవత్కైంకర్యం చేయడానికి పూనుకొన్న తిరుప్పాణాళ్వార్లను భగవత్కైంకర్యరసానుభవంలో పరవశునిగా చేసింది ఏది అంటే - "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరిలోని "నారాయణాయ" అనే పదంలోని చతుర్థీవిభక్తి ప్రత్యయమైన "ఆయ" అనేది అని. అది రాబోయే నాలుగు పాశురాల్లో తెలుపబడుతూంది. ఈ పాశురంలో ఆళ్వార్లతో ఆడుతా పాడుతా అట్టె ముద్దుగునుసుతా ఉండిన భగవంతుని హస్తాన్ని ఆధారంగాచేసుకొన్న నాకు మెరుపులాగా తానేవచ్చి కనిపించి, కంఠంవరకు చూపినాడు. కంఠాన్ని చూపినప్పుడు నేను శిరస్సువరకు చూచినాను. చూచింది మొదలు తలకు మించిన ఆలోచనలను కలిగించిన —

† తూముఴువల్ తొణ్డై వాయ్ పిరాన్ —

[ఆశ్రయించినవారిని రక్షించడమనేది భగవంతుని గుణాలలో ఒకటి. అది ఇప్పుడు వచ్చింది కాదు. ఆయనకు ఎన్నో అవతారాలనుండి స్వభావసిద్ధంగా వచ్చిన గుణమది. పూతనచనుపాలు త్రాగి, పూతనను చంపి, ఆమె

† నమ్మాళ్వార్ల తిరువాయ్ మొళి ౬-౨-౩.

వల్లవచ్చిన ఆపదను పోగొట్టినాడు. శకటాసురుని చంపి, అతనివల్లవచ్చిన అనర్థాన్ని తొలగించినాడు. మద్దిమాకులరెంటిని కూల్చినాడు. బకాసురుని చంపి, ఆతనివల్ల వచ్చినబాధను పోగొట్టినాడు. కువలయాపీడుడనే రాక్షసుడు మదించిన ఏనుగరూపంలో వచ్చి, బాధలు కలిగిస్తే వాణ్ణిచంపి, ఆ బాధలు పోగొట్టినాడు. ఆశ్రితులకు ఉపకారం చెయ్యడమే పనిగాపెట్టుకొని "రాండి నన్ను సేవించండి" అని ఇక్కడ నిలిచిన ఆ భగవంతుని ఆశ్రయించి, సేవించి, తరించేదెప్పుడో ! ఇన్ని భయంకరమైన పనులుచేసినా అవి ఆశ్రితులను రక్షించడానికే చేసినట్లు ముసిముసినవ్వులు నవ్వుతూఉండే దొండపండులాగ ఎఱ్ఱగాఉండే పెదిమెలుగల స్వామి.]

ఆతని —

‡ కోలన్దిరళ్ పవళక్కొఴున్దుణ్డఙ్గలో —

[ప్రపంచంలో ఎన్నోరకాల పండ్లున్నాయి. అవన్నీ పూలై, పిందెలై, కాయలై, పండ్లవుతున్నాయి. ఆ పండ్లల్లో దేనిలోనుచేరదే ఈ పండు. అన్నీ పండ్లకంటే విలక్షణంగా ఉందే ఈ పండు. ఈ పండును నేనిప్పుడే అనుభవిద్దామంటే వీలుకాలేదే ! ఎందుకంటే నేను ఎన్నోజన్మాలనుండి చేస్తూ వస్తూఉన్న పాపాలన్నీ పండి, కరువునపోసిన కడ్డీముక్కలాగ తయారయి, ఆ స్వామి ముఖంలో చేరిందా అనేటట్లుగా ఉందేఇది. సౌందర్యం, సౌకుమార్యం - ఇవన్నీకలిపి ముద్దచేయబడిందా అనేటట్లుగా ఉందేఇది. ఇదిఏదో నేను తెలుసుకోలేకుండా ఉన్నానే. నీలమేఘశ్యాముడైన ఆ భగవంతుని దొండపండువంటి ఎఱ్ఱని పెదిమెలు నిగనిగమెరిసే అందాన్నిచూపినాయి. నేను ఆ పెదిమెల అందాన్ని చూడలేకుండా ముఖం పక్కకు తిప్పుకొంటే, నేను ముఖం ఏవైపుకుతిప్పుకొంటానో ఆవైపుకే వచ్చి, మరలా మరలా నాకంటికి కనిపిస్తూ ఈ దొండపండువంటి పెదిమెలు నాప్రాణాలు తీస్తున్నాయి.]

‡ నమ్మాళ్వార్ల తిరువాయ్ మొళి 7-7-3.

పగడపువంటి పెదిమెలఅందం తన్ను వశముచేసుకొనింది అంటు న్నారు తిరుప్పాణాళ్వార్లు.

కైయినార్ శురిశజ్గనలాశియర్ — శ్రీస్వామి దివ్యహస్తాలకు ఆయు ధాలుగానూ అభరణాలుగానూ శంఖచక్రాలు ప్రకాశిస్తూ ఉన్నాయి. ప్రణవ మైన "ఓం" అనే నాదాన్నిచ్చేదీ, శబ్దబ్రహ్మమయమైందీ, ఎల్లప్పుడూ ఆనందాన్ని కలిగించేదీ అయిన పాంచజన్యమనే దక్షిణావర్తమైన శంఖాన్నీ -రాక్షసులు అనే అడవికి కారుచిచ్చైంది, భగవంతుడు ఈ కార్యం చేయాలని మనస్సులో తలుస్తాడో లేదో అప్పుడే దానిని గ్రహించి, వెంటనే నెరవేర్చే స్వభావంగల సుదర్శనమనే చక్రాన్నీ ధరించినవాడు. ఈ విధంగా శంఖాన్నీ చక్రాన్నీ పేర్కొనడంచేత "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరీ మంత్రాన్నీ - భగవంతుని మనస్సునూ-దర్శించడానికీ, సేవచేయడానికీ తగిన శరీరావయవాలు కలిగినవాడు భగవంతుడు అనీ చెప్పబడినట్లు తెలుస్తూంది.

ఈ దివ్యమైన ఆయుధాలు శ్రీరంగనాథుని హస్తాలవెనుక ఒదిగిఉండి, ఇవి భగవంతుని శరీరంలోని భాగాలుగానే ప్రకాశిస్తున్నాయి.

నీళ్వరై పోల్ మెయ్యనార్ — జ్ఞానులు యోగనిష్ఠలో సూక్ష్మమైన దృష్టితో భగవంతుని దర్శిస్తున్నారు. నేనానీచుణ్ణి - నా కన్నులా మాంసపు ముద్దలు. ఈ నా కన్నులు సూక్ష్మదృష్టితో భగవంతుణ్ణి దర్శించలేవు! కాబట్టి నా కన్నులు దర్శించడంకోసరం భగవంతుడు పెద్ద పర్వతాకారంగా గంభీరమైన శరీరాన్ని ధరించినట్లున్నాడు.

ఇంకా ఈ భగవంతుడు —

తుళపవిరై యార్కమళ్ నీణ్ముడియెమ్మైయనార్ — ఇతడు అన్ని లోకాలకు తండ్రివంటివాడు. ఈ లోకానికీ, దివ్యసూరులు నివసించే పరమ పదానికీ తానే రాజు అని తెలుపడంకోసరం కిరీటం ధరించినాడు. ఆ కిరీ టంలో తులసిదండను ధరించినాడు. ఎందుకు తులసిదండను ధరించినాడంటే

అన్ని పూలవాసనలను తలదన్నే వాసనకలిగిన తులసిని భగవంతుడు కిరీటంలో ధరించి దానికి ఇంకా మంచివాసన, గౌరవము కలిగించడానికని ధరించినాడు అంటున్నారు.

అణియరఙ్గనార్ — పరమపదంలో నివసించడంకన్నా, పాలసముద్రంలో పవ్వళించడంకన్నా. శ్రీరంగంలో నివసించడం భగవంతునికి ఇష్టమేమో ! గొప్పగుణాలు కలిగిందీ - సులభంగా ఆశ్రయించతగిందీ - ఆశ్రయించినవారి మనస్సుకు సంతోషాన్ని కలిగించేదీ - ఈ లోకంలోని ఐశ్వర్యమూ పరమపదంలోని ఐశ్వర్యమూ అయిందీ అయిన శ్రీరంగ విమానాన్ని పడకటిల్లుగా కలిగినవాడు భగవంతుడు. మనం సేవించి తరించడానికి పరమపదంనుండి వచ్చి, శ్రీరంగంలో అవతరించిందేమో ఈ విమానం అంటున్నారు తిరుప్పాణాళ్వార్లు.

తిరుప్పాణాళ్వార్లు నివసించే గ్రామానికి కూతవేటు దూరంలో శ్రీరంగ దేవాలయం ఉండడంచేత "అణియ రంగనార్ - దగ్గరి స్వామి" అన్నాడేమో!

అరవిన్దైమిశైమేయ మాయనార్ - జ్ఞానమూ, బలమూ, ఐశ్వర్యమూ, వీర్యమూ, శక్తీ, తేజస్సూ - ఈ ఆరుగుణాలతో నిండినవాడు భగవంతుడు. భగవంతుని ఆరుగుణాలలో అతిముఖ్యాలైన జ్ఞానమూ, బలమూ, ఈ రెండూ కరువునపోసిన బొమ్మలాగా ఇక్కడ ఆదిశేషుని అవతారం తీసుకొన్నాయి. జ్ఞానబలాల ప్రతిరూపమైన ఆదిశేషుడు చక్కని పాన్పుకాగా ఆపాన్పుపై భగవంతుడు పవ్వళించినాడు. ఈ భగవంతుడు నల్లనిమేనివాడు. హృదయం అమృతమయం. ఇతడు చూడడానికి ఎట్లా ఉన్నాడంటే చాలా లోతైన అమృతతటాకం ఎంత ప్రశాంతంగా గంభీరంగా నల్లగా ఉంటుందో అట్లా ఉన్నాడు. తటాకానికి చుట్టూఉండే కరకట్టలాగా ఆదిశేషుడు చుట్టగా చుట్టుకొని, పడకగా ఉన్నాడు. తటాకాన్ని ఆశ్రయించినవాళ్లు తటాకంలోని నీళ్లుత్రాగి, ఎట్లా ఆనందాన్ని పొందుతున్నారో అట్లాగే ఈ స్వామిని సేవించినవాళ్లూ అనుభవించి, ఆనందాన్ని పొందుతున్నారు.

‡ శ్లో॥ శ్రీస్తనాభరణం తేజః శ్రీరంగేశయ మాశ్రయే ।
చింతామణి మివోద్వాన్త ముత్సంగేఽనంత భోగినః ॥

[శ్రీరంగనాథుని ఆశ్రయిస్తాను. ఎందుకంటే ఈయన వక్షస్థలంలో లక్ష్మీదేవి ఎల్లప్పుడూ నివసిస్తూ ప్రకాశిస్తూంది. లక్ష్మీదేవిని వక్షస్థలంలో కలిగిన భగవంతుడు ఎట్లా ఉన్నాడంటే ఆదిశేషుని తలపై చింతామణి ధగద్ధగాయమానంగా ఎట్లా ప్రకాశిస్తూందో అట్లా ప్రకాశిస్తున్నాడు. ప్రకాశిస్తూ ఎక్కడున్నాడంటే ఆదిశేషుని ఒడిలో లక్ష్మీసమేతంగా పవ్వళించి ఉన్నాడు.]

ఇట్లా అత్యాశ్చర్యరూపాన్ని ధరించిన ఆ భగవంతుని —

శెయ్యవాయయ్యో వెన్నైచ్చిన్దై కవర్న్దదువే -

† వాలియతోర్కనికొల్ —

[ప్రపంచంలో ఎన్నోపండ్లున్నాయి. ఆ పండ్లలో దేనిలోను చేరకుండా అన్నిటికంటే విలక్షణంగాఉండే పండు ఇది. ఎందుకంటే ఈ పండుకుండే అందమైన ఎరుపురంగు ఏ పండుకూ లేదు. అంతేకాదు —]

* వైయ్యుమేఴమ్ —

[చిన్నబిడ్డ స్నానానికని యశోదాదేవి రాగిచెరవంలో వేణ్ణీళ్లుకాచింది. సుగంధద్రవ్యాలన్నీ దంచి, పొడిచేసి, ఆ నీళ్లల్లో కలిపింది - ఒళ్లంతా నూనె పూసింది. కస్తూరిపసుపువగైరాలతో నలుగుపెట్టింది - నలుగుపెట్టేటప్పుడు బిడ్డ కాళ్లూచేతులూ చాపింది, ముడిచింది, నిమిరింది - కాచిన వేణ్ణీళ్లతో జలకమాడించింది. ఇక నాలుకపైఉండే తెమడంతా తీసి, నాలుక శుభ్రం

‡ పరాశరభట్టర్ శ్రీరంగరాజస్తవమ్. పూర్వశతకమ్ 8-శ్లో.
† నమ్మాళ్వార్ల తిరువాయి మొళి. 7-7-3.
* పెరియాళ్వార్ల తిరుమొళి. 1-1-9

చేయాలని నాలుక చేత్తోపట్టుకొని శుభ్రం చేస్తూంది. ఇంతలో అసాధ్యుడైన బిడ్డడు నీళ్లాడిస్తున్న యశోదకు ఎఱ్ఱగాఉండే తననోటిలో పదునాల్గులోకాలను చూపినాడు. యశోద ఆశ్చర్యంతోచూసింది.]

నా మనస్సును ధ్యానంనుండి ఆకర్షించింది ఏదంటే వర్ణమాధుర్యం కలిగిందీ, కడుపులోని ఏడులోకాలనూ నోటిలోచూపిందీ, ఎఱ్ఱనైందీ అయిన భగవంతుని ఈనోరే.

"అయ్యో" అనేది ఆశ్చర్యాన్ని సూచిస్తుంది. లేదా భగవంతుని నోటిని దర్శించి అనుభవించి మనస్సు ఊరటపడిన విధాన్ని సూచిస్తుంది. లేదా భగవదనుభవరసాన్ని సూచిస్తుంది అని ఊహించవచ్చు.

ఎనిమిదవ పాశురం

పరియనాకి వన్ద వవుణనుడల్ కీణ్డ * అమరర్
క్కరియవాతిప్పిరా నరఙ్గత్తమలన్ ముకత్తు *
కరియవాకిప్పుడై పరన్దు మిళిర్న్దు శెవ్వరియోడి * నీణ్డవ
ప్పెరియవాయ కణ్గళెన్నై ప్పేదైమై శెయ్‌తనవే॥

[భయంకరమైన నరసింహావతారాన్ని ఎత్తి, లోకకంటకుడైన హిరణ్యకశిపుని సంహరించిన నరసింహస్వామి - భయంకరమైన తన స్వరూపాన్ని చూస్తున్న దేవతలకుకూడ కానరాకుండా ప్రసన్నవదనుడై ప్రహ్లాదునికి భక్తవాత్సల్యాన్ని చూపుతూ దర్శనమిచ్చిన భగవంతుడు — శ్రీరంగనాథుడుగా శ్రీరంగంలో అవతరించి ప్రకాశిస్తున్నాడు. ఆతని ముఖపద్మంలో విరాజిల్లుతూన్న విశాలనేత్రాలమీదికి నాదృష్టి నాకర్షించి, ఆకన్నులు నన్ను పిచ్చివానినిగా జేసినవి.

ఈపాశురంలో నోటికిపైనఉన్న కన్నులు వర్ణింపబడ్డాయి.]

† శ్లో॥ జితంతే పుండరీకాక్ష నమస్తే విశ్వభావన ।
నమస్తేఽస్తు హృషీకేశ మహాపురుష పూర్వజ ॥

[తెల్లతామరలవంటి కన్నులుగలవాడా! నీకు జయము. ప్రపంచాన్నంతా ధరించేవాడా! బ్రహ్మరుద్రేంద్రాది దేవతలందరికి మూలమైనవాడా ఓ! హృషీకేశుడా! నీకు నమస్కారము]

అని చతుర్ముఖబ్రహ్మ ధ్యానంచేసిన నీ కన్నులను తోపజేసి, నీ పాదకమలాల్లో ఆతనిని వ్రాలేటట్లుచేసి, పైపై అనుభవాలు ఆతనికి కలిగించి, తామరపూలవంటి నీకన్నులకు దాసుడయ్యేటట్లు చేసినావు. భగవంతుని ఆ

† చతుర్ముఖబ్రహ్మకృతజితంతాస్తోత్రమ్ 1 శ్లో.

యించినవారు నీచులైనా భగవంతుడు ఆశ్రయమిచ్చి, రక్షిస్తాడని తెలిపే కథలు చెపుతూ, భగవంతుని కన్నుల గొప్పతనాన్ని దర్శించి, అనుభవించి ఆనందిస్తున్నారు తిరుప్పాణాళ్వార్లు.

పరియనాకివన్ద వవుణనుడల్ కీణ్డ – అన్ని లోకాల్లోని చీకటంతా కలిసి ఒకముద్దగా తయారయి ఒకచోట నిలిచిందా ! అనేటట్లు నల్లగాఉండే శరీరం. అంతేకాకుండా మేరుపర్వతమే నడిచివచ్చిందా అనేటట్లు అతిభయంకరమైన శరీరాన్ని ధరించి ఎదిరించి వచ్చిన –

‡ తిరణ్డ తోశిరణియన్ శినక్గౌశాక మొన్తై యుమ్ –

[దేవతలు, మనుష్యులు, మృగాలు మొదలైన ప్రాణులచేతా - పగటిలో - రాత్రిలో - భూమిలో - ఆకాశంలో - ఇంటా - బయటా - ఆయుధాలతో తనకు చావులేకుండేటట్లు వరంపొంది, వరంపొందిన గర్వంతో భుజాలుబలిసి, ప్రపంచంలోని మాత్సర్యమంతా కడుపుగట్టి, వీడివద్ద చేరిందేమో ననేటంత మాత్సర్యంతో మదించి, దేవుడేలేడని రొమ్ము చరుచుకొంటూ తిరుగుతున్నాడు హిరణ్యకశిపుడు. అటువంటి హిరణ్యకశిపుని రొమ్మును రెండుగా చీల్చిచెండాడి, సంతోషించిన నరసింహమూర్తివి నీవేనా? అతిసుకుమారమూర్తియైన నిన్నేనా అతిభయంకరమూర్తియైన నరసింహమూర్తి అనేది ?]

హిరణ్యకశిపుని రొమ్మును లేతఅరటిఆకును గోళ్లతో చీల్చినట్లు రెండుగాచీల్చి చెండాడినాడు.

అమరర్క్కరియపాతిప్పిరాన్ – భక్తితో ప్రహ్లాదుడు ప్రార్థిస్తే వెంటనే స్తంభంలో ప్రత్యక్షమై భగవంతుడున్నాడని నిరూపించుకొన్నాడు. అప్పుడు ప్రహ్లాదుడు సమీపించి - దర్శించి - అనుభవించి - స్తోత్రంచేసి

---

‡ తిరుమఙ్గై ఆళ్వార్ల తిరుచ్చందవిరుత్తమ్. 62 పా.

నారు. భగవంతునిచేత సృష్టింపబడి, ఆతనిచేత ఉపకారాలు పొందిన దేవతలు మొదలైనవాళ్లు భగవంతుడే ప్రపంచసృష్టికి కారణభూతుడనే విషయాన్ని, ఉపకారకుడనే విషయాన్ని తెలుసుకోలేకుండా ఉన్నారు. ఆ దేవతలకు తెలియడంకోసరం –

అరజ్గ త్తమలన్ ముక త్తు – పరమపదంలో నిత్యసూరులతో ముక్తులతో ప్రకాశించే భగవంతుడు, నీచమైన సంసారసాగరంలో కొట్టుకలాడే మానవలోకానికి పరమపదంలోని దివ్యదేవాలయంతోకూడా దిగివచ్చి –

† అణియార్ పొళిల్ శూళరజ్గనకరప్పా –

[అందమైన ఉద్యానవనాలతో చుట్టబడిన శ్రీరంగంలో వేంచేసిఉన్న ఓతండ్రీ! ఇకపైనీ కరుణతప్ప నాకు పొందదగింది వేరే ఏమీలేదు. ఇంద్రనీలమువంటి శరీరచ్ఛాయ కలిగినవాడా! మాణిక్యమువలె అతివిలువైనవాడా! సూర్యచంద్రాగ్నులన్నా ప్రకాశం కలిగినవాడా! సంసారబంధాలనుండి నేను విముక్తి పొంది, పరమపదాన్ని పొంది, జీవించేదానికి ఒక మంచిమాట నాకుసెలవివ్వండి. ఎప్పుడో ఒకప్పుడు పరమపదం ఇస్తావు. అయినా "పరమపదం నీకు ఇస్తాను" అని ఇప్పుడు చెప్తే అదేనాకు చాలు.]

భక్తులు భగవంతుని పాదపద్మాలను శరణుపొంది, శ్రీపాదాలను శ్రీశఠకోపరూపంగా తలపై ధరించి, పాపాలను పోగొట్టుకొని బ్రతుకుతున్నారు. భగవంతుని దర్శిస్తేచాలు దర్శించినవాళ్లకుగలిగే నీచాతినీచమైన సందేహాలన్నీ తీరిపోతున్నాయి. అటువంటి అందమైన రూపాన్ని ధరించి.

‡ కోళిశై త్తామరై –

---

† తిరుమంగయాళ్వార్ పెరియ తిరుమొళి 1'–8–1.

‡ నమ్మాళ్వార్ తిరువాయ్ మొళి 7–7–5.

[కరుణాకటాక్ష వీక్షణాలనే పదునైన బాణాలను వెలికి విరజిమ్మే అందమైన తామర పూలవంటి కన్నులు - కల్పలతవంటి ముక్కు - పవడము వంటి పెదవులు - విండ్లవంటి కనుబొమలు - అందమైన పండ్లవరుస - లేతఆకులవంటి చెవులు - చంద్రునివలె దర్శించతగిన చల్లనైన వెడల్పైన నుదురు - వీటితో నిండుకొన్న పరిపూర్ణ జ్యోతిర్మండలమో అనేటట్లున్న శ్రీకృష్ణునిముఖం. ముఖాన్ని నాకు చూపడమనే నెపాన్ని పెట్టి, పాపినైన నా ప్రాణాల్ని తీస్తూంది ఈ ముఖం.]

అందమైన శరీరానికి తగిన అందాన్ని కలిగిన ముఖం. ఆ ముఖం పదహారు కళలతో నిండిన పూర్ణిమచంద్రునిలాగా ప్రకాశిస్తూంది. అందులో వికసించిన తామరపూవుల్లాగా కన్నులురెండూ మెరుస్తున్నాయి. చంద్రునివంటి ఆ ముఖమండలంలో ఉండే కళ్లు ఇంకా ఎట్లా ఉన్నాయంటే.

కరియ వాకిప్పుడై పరన్దు మిళిర్న్దు శెవ్వరియోడి నీణ్డవప్పెరియ వాయకణ్గళ్ — మాలిన్యం లేని నీలంలాగ నిగనిగ మెరుస్తూ నల్లకలువల్లాగా ఉన్నాయి. ఇంకా తన్నెవరైనా ఆశ్రయిస్తే ఎంతో ప్రీతితో వారిని చూడ్డంచేత వికసించిన తామరపూలలాగా చక్కగా విప్పారి ఉన్నాయి. ఇంకా తన్ను దర్శించడానికి సమీపించినవారిని అన్నిదిక్కులా ప్రీతితో చూడ్డంచేతా సంతోషం కలగడంచేతా ఎంతో ఉల్లాసాన్ని కలిగి ఉన్నాయి భగవంతుని కన్నులు. ఆశ్రితులమీద ఇంత ఆదరాన్నీ ప్రేమనూ చూపే ఆ కన్నులే ఇతర దేవతాదర్శనానికి ఎవరైనా ఎదురుచూస్తే వారిని అన్య దేవతా విముఖులయ్యేటట్లు ఆ కన్నుల్లో ఉండే ఎఱ్ఱనైన గీతలనే బాణాలను వేసి, మందలిస్తున్నాయి. భగవంతుని ఆ కన్నులు సహజంగానే పొడ వైనవి, వెడల్పైనవి.

అప్పెరియ - ఆ పెద్ద అనడానికి ఇప్పుడు మనకు కనిపించే ఈ కండ్లే ఎప్పుడూ ఏ కొరతాలేకుండా దర్శించి, అనుభవించడానికి తగిన

గొప్పతనాన్నీ మాహాత్మ్యాన్నీ కలిగిఉన్నాయని శాస్త్రాల్లో చెప్పబడి ఉన్నాయేమో! అని కూడా అనుకోవచ్చు.

ఎన్నైన్నెప్పేత్తెమై శెయ్‌తనవే - నాకు అప్రయత్నంగా దర్శనమిచ్చే ఈ భగవంతుని కన్నులు ఈ భగవద్దర్శన రసానుభవంలో నిమగ్నమై ఈ భగవంతుని దర్శించడం తప్ప ఇంకొకపని చేయడానికి ఇష్టంలేనివాణ్ణిగా నన్ను చేసినాయి.

తొమ్మిదవ పాశురం

ఆలమామర త్తినిలై మేలొరు పాలకనాయ్ *
ఞాలమేళుముణ్డానరఙ్గత్తర విననైయాఙ *
కోలమామణియారముమ్ ముత్తుత్తామముమ్ ముడివిల్ల తోరెళిల్
నీలమేని యైయో నిఱై కొణ్డ తెన్నెఞ్జినై యే ॥

[తల్లీ లేక - తండ్రీలేక - తోడూ లేక - ఒంటరిగా పసిబాలుడై, ప్రళయకాలంలో అండపిండ బ్రహ్మాండాల నన్నిటినీ తన కడుపులో పెట్టుకొని - సముద్ర మధ్యంలోనా - ఆకాశంలోనా - ఎక్కడున్నాడో తెలియ రాని విధంగా మఱ్ఱాకుపై పవ్వళించిన భగవంతుడు పామరులను ఉద్ధరించ డానికి శ్రీరంగంలో శ్రీరంగనాథస్వామిరూపంలో దర్శనమిస్తున్నాడు. నవరత్నహారాలూ - ముత్యాలహారాలు ధరించిన ఆ స్వామి నీలమేఘ శరీరము ఆపాదమస్తకంగా నా హృదయంలో నిలిచి, నా కన్నులకు దర్శన మిస్తున్నాడు.

ఈ పాశురంలో భగవంతుని పరిపూర్ణ నీలమేఘదివ్యదేహస్వరూపం వర్ణింపబడింది.]

భగవంతుని పాదాలనూ పీతాంబరాన్నీ నాభినీ ఒడ్డాణాన్నీ వక్ష స్థలాన్నీ కంఠాన్నీ నోటినీ కన్నులనూ విడివిడిగా దర్శించి, ఆ అవయవాల లోతును చవిచూచిన తిరుప్పాణాళ్వార్ల మనస్సుపై అవయవాలన్నిటితో పోతపోసినట్లున్న స్వామిని ఆపాదమస్తకంగా ఒక్కసారిగా దర్శించినాడు. ముందటి జన్మల్లో నిత్యమూ స్వామిని దర్శించి, అనుభవించవలెనని కలిగిన సంకల్పం ఈ జన్మలో ఫలించి, మహావృక్షమై శ్రీరంగనాథుని దర్శించడం వల్ల పూర్తి అయింది అంటున్నారు.

అప్రయత్నంగా తన కన్నుల ఎదుట ప్రత్యక్షమై ఒక్కొక్క అవయవాన్ని దర్శింపజేసిన భగవంతుని దర్శించినాడు అప్పుడు

దర్శించింది ఒక్కొక్క అంగంగానే. ఆపాదమస్తకంగా ఉండేస్వామిని ఇప్పుడు దర్శిస్తున్నాడు. ఒక్కొక్క అవయవంగా దర్శనమిచ్చినందుకే ఎంతో సంతోషించినాడు. ఆపాదమస్తకంగా ఏకకాలంలో ఇప్పుడు స్వామి దర్శనం లభించడంచేత ఒక్కొక్క అంగాన్ని దర్శించింది మరిచి, పరమానందంతో ఉబ్బితబ్బిబ్బైపోతున్నాడు.

ఆలమామరత్తినిలై మే లోరుపాలకనాయ్ - ఒకానొక ప్రళయ కాలంలో-

‡ ఆంన్ఱువేలై నీరుళ్ళతో విణ్ణతో మణ్ణతో-

[కృష్ణావతారం ధరించినస్వామీ ! బాలుని రూపంధరించి, సమస్తలోకాలు నీ కడుపులో దాచి - ఒక లేత మఱ్ఱాకుపై ప్రళయకాలంలో పవ్వళించి, కన్నుల పండువుగా దర్శనమిచ్చిన నీ రూపం వైదికులందరూ సత్యమైందంటున్నారు. అంతా నశించి ఏకార్ణవంగా ఉండే ఆ కాలంలో పొంగిపొరలివచ్చే ప్రళయకాల సముద్రమధ్యంలో ఆ మఱ్ఱాకు ఉందా ? లేకుంటే ఏ ఆధారమూ లేని ఆకాశంలో ఉందా ? లేక ప్రళయకాలంలో సముద్రంలో కలిసిపోయిన భూమిమీద ఉందా ? అఘటఘటనా సమర్థుడు, అతిమానుషచేష్టలు గల నిన్ను కుతర్కవాదాలచేత చూపడం నా తెలివి తక్కువ. ఈ ఆశ్చర్యాన్ని నీవే తీర్చవలె.]

అఘటఘటనా సమర్థుడుగా తెలియవచ్చినావు. లెక్కించడానికి వీలులేని కొమ్మలూ - ఆ కొమ్మల్లో ఒక ఆకులో తల్లీలేక తండ్రీలేక ఒంటరివాడుగా ఉన్నావు.

శాలమేళముఙ్డాన్ - మార్కండేయుణ్ణి యముడు మృత్యుపాశాలతో లాగసాగినాడు. మార్కండేయుడు మృత్యువుకు భయపడకుండా మహా

---

‡ పొయ్‌గై యాళ్వార్ల మొదల్ తిరువందాది. 69 పా.

భయంకరమైన తపస్సు చేసినాడు. ఇంద్రుడు భయపడి ఇతని తపస్సు చెరచడానికి అప్సరసలను పంపినాడు కాని ఇతడు చలింపలేదు. శ్రియఃపతి ప్రత్యక్షమైనాడు. మార్కండేయుడు ఈ శరీరంతోనే ఎన్నో యుగాలు బ్రతికేటట్లు వరమడిగినాడు. శ్రియఃపతి వరమిచ్చినాడు. ప్రళయం సంభవించింది. మార్కండేయునితో సహా సర్వాన్ని మింగినాడు శ్రియఃపతి. శ్రియఃపతి కడుపులో మార్కండేయుడు బతికే ఉన్నాడు. ఈ అల్లకల్లోలానికి తబ్బిబ్బైపోతున్నాడు. ఇంతలో వటపత్రశాయియైన శ్రియఃపతి మార్కండేయునికి అతల వితల సుతల తలాతల రసాతల మహాతల పాతాళలోకాలనే అధోలోకాలను ఏడింటినీ, భూలోక భువర్లోక స్వర్లోక మహర్లోక జనలోక తపోలోక సత్యలోకాలనే ఊర్ధ్వలోకాలను ఏడింటినీ మింగినవానిని మింగినట్లే చెక్కుచెదరకుండా, వాని ఉనికికి ఏ భంగమూ కలుగకుండాకాపాడిన పద్నాలుగు లోకాలను దర్శింపజేసినాడు.

అరఙ్గత్తర వినవై యానా - ప్రళయకాలంలో బాలుడుగా ఉంటూ మఱ్ఱాకుపై పవ్వళించి. నవ్వుతూ కన్నులకింపుగా దర్శనమిచ్చినాడు భగవంతుడు. సర్వకాలసర్వావస్థల్లోను శ్రీరంగదివ్యవిమానంతోకూడిన దేవాలయాంతరంలో నిత్యసూరులలో తలమానికమైన శేషునిపై అర్చారూపంలో పవ్వళించి ఉన్నాడు.

† ఉలకుక్కోర్ తనియప్పనా —

[చరాచర ప్రపంచానికి ప్రపంచంలోని జీవులకూ - వీళ్లందరికంటే గొప్పవాడూ, ప్రపంచాన్నంతా సృష్టిచేసే చతుర్ముఖ బ్రహ్మనే సృష్టించినవాడూ, సంహారానికి నాథుడైన రుద్రునికీ నాయకుడూ, సనకసనందనాది మహర్షులకు ఆశ్రయుడూ.]

ఇతడు అందుకనే తనచే సృష్టింపబడిన బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రాది దేవతలు భూలోకానికి వచ్చి ఆరాధించడానికని ఇక్కడ అర్చారూపంలో

---

† నమ్మాళ్వార్ తిరువాయిమొళి, 8-1-11.

అవతరించినాడు. నవ్వుతూ కన్నులకింపుగా పవ్వళించినాడు. తానే సర్వజగత్సృష్టికి కర్తననే గర్వంగాని, తానే సర్వానికి రక్షకుడననే అహంకారంగాని లేకుండా, వీడు నీచుడు, వీడు గొప్పవాడు అనే వ్యత్యాసం లేకుండా అందరికీ ఒకే తీరుగా శ్రీరంగనాథస్వామిరూపంలో దర్శనమిస్తున్నాడు.

కోలమామణియారముమ్ - శ్రీ మహాలక్ష్మి ఈతని వక్షస్థలంలో ఎల్లప్పుడూ నివాసం చేస్తూ ఉంది. శ్రీస్వామికి దేవాలయం నిర్మించినట్లు లక్ష్మిదేవికికూడా ఈతని వక్షస్థలంలోనే ఒక దేవాలయం నిర్మించినారు. ప్రాకారాలు నిర్మించినారు. దేనితోనంటే అతివిలువైన రత్నాలతో, అతివిలువైన ముత్యాలతో, ఇతనికి అలంకరించిన రత్నాలదండ లక్ష్మిదేవికి రత్నాలతో ప్రాకారం నిర్మించినట్లుంది. సన్నని ముత్యాలదండలూ, పెద్దముత్యాల ఒంటిపేటదండా - మూడుపేటలదండా - ఐదుపేటలదండా ధరించడం చేత రత్నాలదండకూ శ్రీమహాలక్ష్మికీ వీటి నన్నింటిని ధరించిన ఆ స్వామి వక్షస్థలానికీ ఎంతో అందం కలిగింది.

ముడివిల్లతోరేల్ నీలమేని - ఈ స్వామి ధరించిన ఆభరణాలు ఇతనికి ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. ఎందుకంటే ఈ ఆభరణాల అందానికి అంతులేదు. ఒక్కొక్క ఆభరణమూ ఎంతో అందాన్ని కలిగి ఉంది. ఈ ఆభరణాలు అందంగా ఉంటే ఏమిలాభం? ఇవి ధరించే స్వామి అందంగా ఉంటేకదా! ఇవి ధరించినస్వామి అల్లోనేరేడుపంటి మేని చాయవాడు. నిగనిగ మెరిసే ఆ నల్లని శరీరచ్ఛాయపై ఈ బంగారు ఆభరణాలు ధరిస్తే ఇతన్ని దర్శించాలని ఉంటుందేకాని, విడిచిరా బుద్ధికాదు. నల్లనిమేఘం ఎక్కువగా వర్షించి, ఎట్లా అందరి శ్రమనూ పోగొట్టుతుందో అట్లాగే ఈతన్ని దర్శిస్తే పరమపదాన్ని పొందిస్తాడు

ఐయోనిత్తై కొణ్డతెన్నెఙ్జైయే — దివ్యాభరణాలను ధరించిన ఒక్కొక్క దివ్యావయవాన్ని దర్శించి, సంతసించిన నా హృదయం ఇప్పుడు

సర్వాలంకార శోభితుడైన ఈ స్వామిని దర్శించి మరీమరీ సంతసిస్తూంది. సర్వపరిపూర్ణుడుగా ముందు దర్శించినాను అనుకొన్నాను కాని నిజంగా ఇప్పుడే గంభీరుడైన ఇతన్ని దర్శిస్తున్నాను. ఇప్పుడు సర్వపరిపూర్ణుడుగా నా ఎదుటనిలిచి నాకు దర్శనమిస్తున్న ఈ అనుభవానికి ఏదైనా భంగం కలిగితే నేనేమి చేసేది? నేనెట్లా జీవించేది? అని సందేహించి, ఏ విధమైన భంగమూ కలుగకుండుగాక అని అనుకొంటూ—

† పిరివిన్ఱియాయిరమ్ పల్లాణ్డు—

["నీకు దాసులై నిన్ను శరణువేడిన మేమూ, బ్రహ్మరుద్రేంద్రాదులకూ మాకూ స్వామియైన మీరూ మనం ఒకరికొకరు ఎడబాటులేకుండా శాశ్వతంగా ఎన్నో ఏండ్లు వర్ధిల్లాలి! నీ కుడివక్షస్థలంలో సదా నివసించే మహాలక్ష్మి మీరూ కలసిమెలసి ఉంటూ సర్వమంగళాలతో ఎల్లప్పుడూ వర్ధిల్లాలి! మీ చేతుల దివ్యాయుధాలైన శంఖమూ, చక్రమూ ఏ కొదువా లేకుండా ఎల్లప్పుడూ వర్ధిల్లాలి!" అని ఇక్కడ సంపదతో పరమపద సంపదతో ప్రకాశించే భగవంతుని ఆశీర్వదిస్తున్నాను.]

ఇట్లా ప్రకాశించే భగవంతుని ఆ దివ్యస్వరూపం ఎల్లప్పుడూ దర్శించతగిందిగా ఉంది.

---

† పెరియాళ్వార్ల తిరుప్పల్లాండు. 2 పా.

పదవ పాశురం

కొణ్డల్ వణ్ణనై కోవలనాయ్ వెణ్ణెయుణ్డవాయన్ *
ఎన్నుళ్లమ్ కవర్న్దానై *
అణ్డర్ కోనణియరఙ్గనెన్నముదినైక్కణ్డ కణ్గళ్ *
మట్రొన్ఱినైక్కాణావే ॥

[నీలమేఘశ్యాముడు - మాయమర్మము లెరుగని గొల్లల కడుపులో పుట్టి పెరిగినవాడు - గోవులగాచినవాడు - గొల్లెతలు చిలికి తీసిన వెన్న ముద్దలు తిన్న నోరుకలవాడు - బ్రహ్మరుద్రాదులకు ప్రభువైనవాడు - నా మనస్సు దోచుకొన్నాడు - ఎవడాతడంటే శ్రీకృష్ణుడు. ఆ శ్రీకృష్ణుడే శ్రీరంగంలో ఉభయకావేరీ మధ్యంలో శేషశయనంపై పవ్వళించి, శ్రీరంగ నాథస్వామి రూపంలో దర్శనమిస్తున్నాడు. ఆతడు అమృతస్వరూపుడు. ఆతని చూచిన నా కన్నులు ఇతరము చూడనొల్లవు.

ఈ పాశురంలో శ్రీస్వామిని దర్శించిన కన్నులు ఇతరము చూడ నొల్లవన్నారు తిరుప్పాణాళ్వార్లు.]

ఈ తిరుప్పాణాళ్వార్లు రచించిన పదిపాశురాల్లోను "దాసుడు" అనడం తప్ప ఇతడు తన ఊరూ - పేరూ ఎక్కడా చెప్పలేదు. ముఖ్యమైన ఈ విషయం చెప్పడానికికూడా మరచినాడు. శ్రీరంగనాథుని దర్శించడం - కీర్తించడం - అనుభవించడం వంటి సత్కార్యాలకు ఏ విధమైన ప్రతిబంధకమూ ఇకపై రాకుండా భగవంతుడు తనకు చేసిన ఉపకారాన్ని మైమరచి తలచినాడు. తాను జన్మించి నందుకు ఫలం ఇతరులు చేరలేని శ్రీరంగం చేరడం - దేవతలు సహితం దర్శించలేని శ్రీరంగనాథుని దర్శించడం - శ్రీరంగనాథుని దర్శించడంచేత సంసారబంధాలనుండి ముక్తుడు కావడం జరిగిందని సంతోషించినాడు. ముక్తులు పరమపదం చేరిన తర్వాత సంగీతంతో సామవేదాన్ని ఏ విధంగా గానం చేస్తారో ఆ విధంగా

ఈ తిరుప్పాణాళ్వార్లూ సంగీతంతో పాశురాలు పాడుతున్నారు. ఎన్నో జన్మల్లో భగవంతుని దర్శించలేక ఇతర లౌకికప్రపంచాన్ని చూస్తూ సంసారసాగరంలో మునిగితేలిన ఈయన ఇప్పుడు ఈ జన్మలో శ్రీరంగ నాథుని దర్శించడంచేత తన కష్టాలూ దుఃఖాలూ తొలగిపోయాయని సంతోషిస్తున్నారు.

కొణ్డల్‌వణ్ణనై - శ్రీరంగనాథస్వామి నల్లగా నిగనిగ మెరుస్తూ ఉభయకావేరీ మధ్యంలో శ్రీరంగంలో దర్శనమిస్తున్నాడు. చూడ్డానికి ఇతడు ఎట్లాఉన్నాడంటే ఏడుసముద్రాల్లోని నీటిని త్రాగిన పెద్దమేఘం మాదిరిగా నల్లగా ఉన్నాడు. ఇతణ్ణి దర్శించినవాళ్ల శ్రమను పోగొట్టు తున్నాడు. మనుష్యులు, పశువులు, పక్షులు, పర్వతాలు, వృక్షాలు ఇవి అవి అని ఏమి ! సర్వప్రపంచమూ జీవించేటట్లు కొండల్లో - సముద్రాల్లో - గ్రామాల్లో - పట్టణాల్లో మేఘం ఎట్లా వర్షిస్తుందో అట్లాగే ఈ రంగనాథ స్వామి కటికిదరిద్రునిమీదా ధనవంతునిమీదా నీచునిమీదా అగ్రజాతివాని మీదా అందరిమీదా సమానంగా తన కరుణరసాన్ని వెదజల్లుతున్నాడు. అందుకనే మేఘంలాగా నల్లని శరీరచ్ఛాయతో ఉన్నాడని చెప్పినాడేమో !

కోవలనాయ్ వెణ్ణయుణ్డవాయన్ - ఎనిమిదంటే ఏమో రెండంటే ఏమో తెలియని - మాయమర్మాలెరుగని గొల్లలను గొల్లెతలను రక్షించి, తన లోకరక్షకత్వాన్ని తెలియజేసినాడు. ఆ గొల్లలఇంట శ్రీకృష్ణుడుగా అవతరించినాడు. ఆ గొల్లలంతా తన్నాశ్రయిస్తే వాళ్లందరినీ ప్రీతితో కాపాడినాడు. తన్నాశ్రయించినవారి ద్రవ్యమంతా తనదేనని తెలియడం కోసరం గొల్లెతలు—

† ఈట్టియ వెణ్ణెయ్ తొట్టుణ్ణ మాలై —

[పరమపదంలో నిత్యసూరులు భగవంతునికి తిరుమంజనంచేసి,

---

† నమ్మాళ్వార్ల తిరువిరుత్తమ్, 21 పా.

వసివాడని పుష్పాలను స్వయంగా ఏరి మాలలుకట్టి ఆతడు ధరించడానికి తగినవిధంగా వానిని శుభ్రపరచి, తమ చేతుల్లో ధరించి నిలిచినారు. మంచి వాసన కలిగిన దశాంగం సాంబ్రాణులతో ధూపం సమర్పించినారు. ఆ ధూపపు పొగలో భగవంతుని ముఖపద్మం కప్పబడింది. ఆక్షణంలో నిత్యసూరులకు భగవంతుడు -

గొల్లెతలు చిలికి వెలికి తీసినవెన్న తినాలని ఆశకలిగి భూలోకంలో శ్రీకృష్ణుడుగా అవతరించి గొల్లెతలు చిలికితీసిన వెన్న భగవంతుడు తింటున్నట్లూ - భగవంతుని మాయచేత మహాలక్ష్మి కళలలో ఒక కళను కుంభుని కుమార్తె నీళగా జన్మింపజేసి, శ్రీకృష్ణావతారమెత్తి ఆమెను ప్రేమించి, పెండ్లాడినట్లూ - బలిష్ఠాలైన ఏడువృషభాల మదమడచి ఆమధ్య నాట్యం చేసినట్లూ దర్శన మిచ్చినాడు.

ఈ రూపాన్ని దర్శించి, పరమపదంలోని భగవంతుడేనా ఇవన్నీ చేసింది ! భగవంతుడైన నీ శక్తి సామర్థ్యాలు తెలుసుకోవడానికి మేమెంత వారము స్వామీ ! అన్నారు నిత్యసూరులు.]

ఇట్లా అప్రాకృత భోగాలను అనుభవించిన భగవంతుడు ఇప్పుడూ--

* కుణుఙ్గునారి -

[నన్ను విడిచివెళ్ళి, నన్ను దుఃఖించేటట్లుచేసి. రేపల్లెనుచేరి, అచ్చట సర్వభోగాలు అనుభవిస్తూ వెన్నతింటూ నీచువాసన కొట్టుకొంటూ అందమైన వృషభంలాగ రేపల్లెలో తిరిగే శ్రీకృష్ణుని చూచినారా ! నీల మేఘశ్యాముడైన శ్రీకృష్ణుని వక్షస్థలం వనమాలాద్యాభరణాలు ధరించడం చేత మెరుపులు, మేఘాలు కలిసి ఒకటిగా ఉండే ఆకాశం ఎట్లా అందంగా ఉంటుందో అట్లా అందంగా ఉంది. ఆ అందంతో నీటుగా నిలుచున్నాడు.]

---

* నాచ్చియార్ తిరుమొళి. 14–2 పా

ఇటువంటి ముఖంతో ప్రకాశిస్తున్నాడు.

ఎన్నుళ్లమ్ కవర్న్దానై – గొల్లెతలు చిలికి వెలికితీసి పెట్టినవెన్న శ్రీకృష్ణావతారంలో ఏ విధంగా భగవంతునికి అత్యంతం ప్రియంగా ఉండిందో అట్లాగే శ్రీరంగనాథస్వామికి ఇప్పుడు తిరుప్పాణాళ్వార్ల హృదయం ఆ వెన్నకంటే అత్యంతం ప్రియమైందిగా ఉంది. తిరుప్పాణాళ్వార్లకు భగవంతునిమీది జ్ఞానం కలిగింది. అయినా ఆతని హృదయం నేను అనే అహంకారానికీ, నాది అనే మమకారానికీ దూరం కాలేదు. అహంకార మమకారాల కోసరమే ఈతని హృదయం ఏర్పడిందా అనేటట్లుండింది. అటువంటి మనస్సును తన అందంచేతా దానంచేతా సౌలభ్య సౌశీల్య వాత్సల్యాది గుణాలచేతా శ్రియఃపతి వశం చేసుకొన్నాడు. వశం చేసుకొని, తిరుప్పాణాళ్వార్లకు నేను అనే అహకారం, నాది అనే మమకారం లేకుండా చేసినాడు. అంతా భగవంతునిదిగానే భావించేటట్లు చేసినాడు. చేయూతనిచ్చి కాపాడినాడు. ఆ భగవంతుడైన శ్రియఃపతి–

అణ్డర్కోన్ - శ్రీకృష్ణుడుగా అవతరించి, గొల్లలు గోవులకాయమంటే గోవుల కాచినాడు. గొల్లలు చెప్పినట్లంతా చేసినాడు. ఆడమన్నట్లు ఆడినాడు. ఇది భగవంతునికి సామాన్యగుణం. అటువంటి భగవంతుడే అండాధిపతియైన బ్రహ్మమొదలైన వాళ్లనూ అండాంతర్వర్తులైన ఇంద్రాది దేవతల నందరినీ తనకు భృత్యాను భృత్యులుగా చేసుకొని, వారికందరికీ తాను స్వామిననీ వాళ్లందరికంటే తాను స్వతంత్రుడననీ తెలుపుతూ ఉన్నాడు.

† కణ్ణిక్కుఱుఙయిట్రాల్ కట్టుణ్డానాకిలుమ్–

[వెన్న దొంగిలిస్తున్న తన్ను యశోదాదేవి అప్పుడప్పుడు దారాలతో కట్టివేస్తూందని, శ్రీకృష్ణుడు ఇంటిలో ఉండే దారాలన్నిటినీ తుంటలు

---

† తిరుమంగయాళ్వార్ల పెరియతిరుమొళి. 11–5–5.

తుంటలుగా తెగ గొట్టి, వెన్న దొంగిలడానికి వెళ్లినాడు. యశోదకు ఎట్లాగో దొరికిపోయినాడు. యశోద శ్రీకృష్ణుణ్ణి కొట్టి, ఒకచేత్తో శ్రీకృష్ణుని పట్టి లాక్కొనివెళ్లి, దారంకోసం వెతుకుతూఉంది. ఎక్కడచూచినా అన్నీ తుంటదారాలే. ఒకటికూడా పెద్దదారంలేదు. ఆ తుంటలనే ఒకదానితో ఇంకొకటిముడివేసి, పెద్దదారంగాచేసి శ్రీ కృష్ణుణ్ణి కట్టబోయింది ఆ దారం కట్టడానికి పొడవుచాలని విధంగా బలిసి, పెరగడానికి భగవదవతారమైన శ్రీ కృష్ణునికి శక్తిసామర్థ్యాలు ఉన్నా భగవంతుని గుణాలను వదలి, మానవుడుగా అవతరించినాడు కాబట్టి అట్లా పెరగకుండా తన సౌశీల్యం, సౌలభ్యం ఆశ్రితపారతంత్ర్యం మొదలైనగుణాలు తెలుపడానికని దారంచేత కట్టుబడ్డాడు. తన భగవదవతారగుణాలను వదులుకొన్నాడు. ఒకే ఒక చుట్టుకు కూడా చాలని దారం - రెండు మూడు చుట్లకు సరిపోయేటట్లు శరీరాన్ని తగ్గించి నాడు. ప్రపంచానికంతా స్వామియైనా తల్లికి బిడ్డేకదా! అందువల్ల యశోదచేతిదారాలతో కట్టివేయబడ్డాడు. అటువంటి భగవంతుడు దేవతలు మనసులోకూడా తలచడానికి వీలులేని విధంగా ప్రకాశిస్తూ ఉన్నాడు.)

ఆ భగవంతుణ్ణి —

అణియరజ్ఞ - దివ్యసూరులు సేవిస్తూ పరమపదంలో ఎల్లప్పుడూ ఆతనితోనేఉంటారు. అటువంటి దివ్యసూరులుకూడా ఆ పరమపదాన్ని వదలి భూలోకానికి వచ్చి సేవించడానికి తగిన అందాన్ని కలిగిన - స్థల మహాత్మ్యాన్ని కలిగిన ఈ శ్రీరంగంలో శ్రీరంగనాథస్వామిగా అవత రించినాడు. ఆ భగవంతుడు ఉన్నా దర్శించిన తిరుప్పాణాళ్వార్లను పరవశునిగా చేసినాడు.

ఎన్నముతినై - పరమపదంలో శ్రియఃపతిగా ఉండి, నిత్యులూ ముక్తులూ దర్శించి. ఆనుభవించడానికి తగినట్లుండినావు. క్షీరసాగరంలో మోహినిరూపాన్ని ధరించి, దేవతలు రాక్షసులు దర్శించి, అనుభవించేటట్లుండి నావు. సూర్యమండలంలో శ్రీమన్నారాయణరూపుడు ఒకడే అయినా దేశ

కాలక్రియాభేదాలతో [చైత్రమాసంలో ధాత అనీ, వైశాఖంలో అర్యముడనీ, జ్యేష్ఠంలో మిత్రుడనీ, ఆషాఢంలో వరుణుడనీ, శ్రావణంలో ఇంద్రుడనీ, భాద్రపదంలో వివస్వంతుడనీ, ఆశ్వీజంలో త్వష్ట అనీ, కార్తికంలో విష్ణువనీ, మార్గశిరంలో తర్యముడనీ, పుష్యంలో భగుడనీ, మాఘంలో పూషుడనీ. ఫాల్గుణంలో క్రతువనీ పేర్కొనబడి] ఆయా దేశకాలాల్లో ఆయా స్థానాల్లో ఉండేవాళ్లు దర్శించి అనుభవించేటట్లు ఉండినావు. ఇట్లా అందరికీ అమృతప్రాయంగా ఉండడమే కాకుండా -

† నీశనేన్నిళైవొన్రుమిల్లేన్ .

[నేను అతినీచుణ్ణి. నన్ను చక్కదిద్ది నాకు పరమపదం ఇవ్వాలని నా మీద ఎంతో ఆశపెట్టుకొని, భగవంతుడు నాకు ప్రత్యక్షమయినాడు. అతడెవరంటే? పెద్ద జ్యోతిలాగా ప్రకాశించేవాడూ - అందమైన విగ్రహ రూపాన్ని ధరించినవాడూ - తిరువేంకటనాథుడూ అయిన శ్రీ వేంకటేశ్వర స్వామి. అతినీచుడు గుణహీనుడు అయిన నేను ఇంతగొప్పస్వామిని పరమపదంలో నివసించే నిత్యసూరులకు నాయకుడంటే ఈ స్వామికి గొప్పతనం కలుగుతుందా ?.]

అతినీచులను గుణహీనులను రక్షించే భగవంతుణ్ణి నేనూ దర్శించేటట్లు ప్రత్యక్షమైనాడు. నాకు ముదిమీ చావూ మొదలైనవి ఏమాత్రమూ లేకుండాచేసి ఆశ్చర్యాన్ని కలిగించినాడు. ముదిమీ చావూ లేకుండాచేసి, నేను ఎల్లప్పుడూ ఈ స్వామిని దర్శించి, అనుభవించే విధంగా నిలిచినాడు.

కామంమీదా కాంచనంమీదా ఆశకలిగిన ఇంద్రాది దేవతలు ఎన్నో ఏండ్లూ ఎన్నో తపస్సులు చేసి, ఎంతోకష్టపడి కట్టకడపట భగవంతుణ్ణి ఆశ్రయించి, దర్శించి, అనుభవించేమాదిరి కాకుండా ఏ ప్రయోజనాన్నీ ఆశించని తిరుప్పాణాళ్వార్లైన నేనూ ఏ ప్రయత్నమూలేక అమృతస్వరూపు

---

† నమ్మాళ్వార్ల తిరువాయ్ మొళి ౭-౩-4.

డైన భగవంతుణ్ణి దర్శించి, అనుభవించే అమృతస్వరూపమంటున్నాను.

ఇంకా —

తిరుప్పాణాళ్వార్లను ఏ ప్రయోజనాన్నీ ఆశించనివానినిగా భగవంతుడేచేసి, అతడుకోరకుండానే అతనికి దర్శనమిచ్చినవాడు —

‡ ఆసం పరమనై —

[రక్షించే పరమపురుషుడనీ — శ్రీ కృష్ణుడనీ — సుదర్శనధారియనీ - ఉపకారకుడనీ - నాలుగుభుజాలు కలిగినవాడనీ - నీలమువంటి శరీరకాంతి కలిగినవాడనీ - ప్రసిద్ధిగన్న భగవంతునికి సాష్టాంగంగా భూమిపైబడి నమస్కరించే భగవద్దాసులు ప్రతిజన్మలోనూ ప్రతినిత్యమూ మాకు గురువులవుతారు.]

అతనికేకాదు మన అందరికీ కూడా పరమపురుషుడని అనుకోవచ్చు.

కణ్డకణ్గళ్ - అన్నీపాటల్లోను నా కన్నులు దర్శించినవి అనిచెప్పిన తిరుప్పాణాళ్వార్లు, ఈ పాసురంలో నా కన్నులు అని అనకపోవడం వల్ల అతనికి అహంకారమూ మమకారమూ తొలగిపోయినాయని తెలుస్తోంది. భగవంతుని ధ్యానించాలనేదీ దర్శించాలనేదీ కీర్తించాలనేదీ భగవంతుని తెలుసుకోవాలనేవారికి ముఖ్యాలు. ఈ వేదాంతతత్త్వజ్ఞానాన్ని పొంది, అన్ని విషయాల్లోను అహంకార మమకారాల్లేకుండా ఉండే తిరుప్పాణాళ్వార్లు నా కన్నులనీ నా ఆలోచనలనీ దాసునిహృదయమనీ నా హృదయమనీ అన్న మాటలు అహంకార మమకారాలు వెంటాడగా మాట్లాడిన మాటలేకదా? అని అంటే -

అన్నిటికీ తాను కర్తయైనస్వామి ఈశ్వరుడు. ఆ ఈశ్వరుడు తనకు వశమైన మనుష్య పశు పక్ష్యాదులు మొదలైన చేతనాలవిషయంలోను

‡ నమ్మాళ్వార్ల తిరువాయ్ మొళి 8-7-2.

పర్వతాలు చెట్లు మొదలైన అచేతనాల విషయంలోను తనస్వార్థాన్ని ఈశ్వరుడు అపేక్షించి, ఒకదానికొకటి వశమయ్యేటట్లుచేస్తున్నాడు. ఈ విధంగా భగవంతుడు చేస్తున్నాడు అనే విషయం తెలిసి మాట్లాడే తిరుప్పాణాళ్వార్ల వంటి భక్తులకు ఉండే అహంకారమూ మమకారమూ దోషమైందికాదు. మరి ఎటువంటివారి అహంకారమమకారాలు దోషాలౌతాయి ? అని అంటే భగవంతుడు లేడు పరతత్వంలేదు అంతానేనే అనే జ్ఞానశూన్యుల అహంకార మమకారాలు దోషాలవుతాయి. అంతేకాని భగవంతుని, భగవంతునిశక్తిని తెలిసి మాట్లాడేవారి అహంకారమమకారాలు దోషాలుకావు.

ఇంతకుముందంతా బాహ్యవిషయాల్లో మునిగితేలుతూ అవి చూచినప్పుడు సంతోషాన్నీ చూడనప్పుడు దుఃఖాన్నీ పొందిన నా కన్నులు ఇప్పుడు నిత్యదరిద్రుడు నిధిచూచినట్లు అంతులేని గుణాలతో, ఐశ్వర్యాలతో శ్రేష్ఠుడైన మహానిధివంటి శ్రీరంగనాథుని దర్శించిన నా కన్నులు .

మట్ట్రొన్ఱినైక్కాణావే - తననూ ఇతరులనూ ఇతరాన్నీ -

‡ అవిభాగేన దృష్టత్వాత్ —

[అందరినీ సమానంగా ఉన్నది ఉన్నట్లు చూడడంచేత స్వతంత్రంగా అనుభవించడానికి, చూడడానికి భగవంతుడు నన్ను ఒక సాధనంగా పెట్టుకొన్నాడు.]

అందరినీ సమానంగా చూసే స్వామిని నా కన్నులు దర్శిస్తున్నాయి.

ఇంకా —

భగవంతుడు మనకీ జన్మఇచ్చాడు. మనం భగవంతుని సేవించడానికి జన్మించినాము అని భగవంతుని సేవచేయడానికి వచ్చి, ఆయనబొడ్డు

---

‡ బ్రహ్మసూత్రాలు 4-4-4

తామరలో జన్మించి, ఆయన ప్రక్కనే నివసించే బ్రహ్మ మొదలైనవారిని నా కన్నులు చూడనోల్లవు.

ఇంకా —

† శ్లో॥ పురుషాణాం సహస్రేషు యేషు వై శుద్ధయోనిషు ।
అస్మాన్నకశ్చిన్మనసా చక్షుషా వాప్యపూజయత్ ॥

[భగవద్భక్తిగల మంచికుటుంబంలో పుట్టిన వేయిమంది పురుషులలో ఒక్కడు కూడా నన్ను అంతరదృష్టితో మనస్సులో చూడడంగాని, మాంసపు ముద్దలైన కన్నులతో చూడడంగాని జరగలేదు.]

అని భగవంతుడే చెప్పినాడు. అంతరదృష్టితోగాని కన్నులతోగాని ఇతరులెవ్వరు దర్శించలేని ఆ భగవంతుణ్ణి నా కన్నులు చూస్తున్నాయి.

ఇంకా —

బ్రహ్మపుత్రులై ఉండికూడా భగవంతుణ్ణి తెలుసుకోలేని బ్రహ్మపుత్రులు —

‡ శ్లో॥ యూయం జిజ్ఞాసవో భక్తాః కథం ద్రక్ష్యథ తం ప్రభుమ్ ।
క్షీరోదధేరుత్తరతః శ్వేతద్వీపో మహాప్రభః ॥

[క్షీరసాగరానికి ఉత్తరంగా శ్వేతద్వీపంలో అత్యంత ప్రకాశవంతుడైన భగవంతుడున్నాడు. ఆ భగవంతుని తెలుసుకోవలెననే ఆశకల భక్తులైన మీరు ఆ భగవంతుని ఏ విధంగా తెలుసుకో గలరు ?]

అంటున్నారు. శ్వేతద్వీపవాసులు తెలుసుకోలేని ఆ భగవంతుణ్ణి ఈ నా కన్నులు చూస్తున్నాయి.

† మహాభారతమ్ 12–328–44.
‡ మహాభారతమ్ 12–328–28

ఆ శ్వేతద్వీపంలోని వాళ్లెటువంటి వాళ్లంటే –

† శ్లో॥ ప్రాప్య శ్వేతం మహాద్వీపం నారదో భగవానృషిః ।
దదర్శ తానేవ నరాన్ శ్వేతాం శ్చంద్రప్రభాన్ శుభాన్ ॥

శ్లో॥ పూజయామాస శిరసా మనసా తైస్సుపూజితః ।

[తెల్లనిశరీరాలు కలవాళ్లూ - చంద్రునివలె ప్రకాశించేవాళ్లూ - ఎల్లప్పుడూ భగవన్నామ సంకీర్తనచేసేవాళ్లూ అయిన మానవులను నారద మహర్షి శ్వేతద్వీపంలో చూచాడు. వాళ్లను సమీపించి, వాళ్లకు మనస్సుతో నమస్కారం, తలవంచీ నమస్కారం చేసినాడు, పూజించినాడు. అట్లాగే వాళ్లూ నారదుణ్ణి పూజించి, నమస్కరించినారు.]

శ్వేతద్వీపవాసులకు నారదుడు, నారదునికి శ్వేతద్వీపవాసులు నమస్కారాలు చేయడం చూస్తే శ్వేతద్వీపవాసులు నారదునితో సమానులని తలచినట్లు తెలుస్తూంది. అటువంటి నారదునికి -

‡ శ్లో॥ ఉవాచ మధురం భూయో గచ్ఛ నారద మాచిరమ్ ।
ఇమేహ్యనింద్రియాహారా మద్భక్తాశ్చంద్ర వర్చసః ॥
ఏకాగ్రా శ్చింతయేయు ర్మాం నైషాం విఘ్నోభవేదితి ।

[భగవంతుడు నారదునికి దర్శనమిచ్చి నారదా ! నీవు ఇక్కడినుండి త్వరగావెళ్లు. ఎందుకంటే ఇక్కడ ఉండేవాళ్లంతా వాళ్లశరీరాలను లెక్క చేయకుండా ఆహారపానీయాలు వదలి, నాయందే భక్తికలవాళ్లు - చంద్రుని వంటి వర్చస్సు కలవాళ్లు - నాయందే మనస్సు కలవాళ్లు - నన్నే చింతించే వాళ్లు. కాబట్టి వీళ్లభక్తికి భంగంకలగకుండడానికని నీవు త్వరగావెళ్లు.]

† మహాభారతమ్ 12-325-1,2.
‡ మహాభారతమ్ 12-326-18.

అని నారదునికి చెప్పిన విషయాన్ని ఇక్కడ జ్ఞాపకం చేసుకొనేది. అట్టి భగవంతుని దర్శించినాయి నా కన్నులు.

అంటే ఆంతరంగిక భక్తులకు భగవంతుడు సులభుడని భగవంతుని చేతనే తెలుపబడింది.

ఇంకా —

‡ కణ్ణుకేట్టుట్రుమోన్దుణ్డుళలుమైజరువికణ్డవిన్నమే —

[మహాలక్ష్మి రెండుచేతుల్లోను అందమైనగాజులు ప్రకాశిస్తున్నాయి. శ్రీ మహాలక్ష్మి ఆమెభర్తయైన నీవూ కలిసిమెలిసి ఉండే అందాన్ని చూస్తున్నాను. కంటితో చూడడం - నోటితో అడగడం - చేతులతో తాకడం - ముక్కుతో మూచూడడం - నోటితో తినడం అనే పనులుచేస్తూ తిరుగుతున్నాను. ఇటువంటినేను నిన్ను దర్శించడంచేత పంచేంద్రియాలకు గోచరమైన విషయసుఖాలను విడిచినాను. కైవల్యసుఖాన్ని పొందడానికి అర్హుడయ్యాను. ప్రపంచంలోని అన్నిటినీ వదలి, అన్నిటికంటే గొప్పవైన నీ శ్రీపాదపద్మాలను సేవించడానికి అర్హుణ్ణయినాను.]

అనడంచేత భగవంతుని ఐశ్వర్యాలను అనుభవించడంలోను ఆత్మను మాత్రమే తెలుసుకొనే దానిలోను తిరుప్పాణాళ్వార్లకు మిక్కిలి శ్రద్ధ కలిగింది అనేవిషయం తెలుస్తూంది.

అంతేకాకుండా ప్రధానమైన భగవదనుభవంలోకలిసి, లీనమై పోవడం వల్ల శ్రియఃపతిని తలచడం - కీర్తించడం తప్ప ఇంకొక మార్గాన్ని దేనినీ తిరుప్పాణాళ్వార్లు అనుసరించరు అనికూడ తాత్పర్యం కావచ్చు.

‡ నమ్మాళ్వార్ల తిరువాయ్మొళి 4-9-10.

తిరుమల మొదలైన నూటయెనిమిది దివ్యదేశ దేవాలయాల్లోని అర్చావతారాలలో ఉండే అందాన్నీ - రామకృష్ణవామన వటపత్రశాయి మొదలైన అవతారాలలో ఉండే అందాన్నీ - అనుభవించవలసిన భోగాల నన్నిటినీచేర్చి, ఒక్కటిగా శ్రీ రంగనాథుని దివ్యశరీరంలోనే దర్శించి, అనుభవించి తనివి చెందినాడు. శ్రీ రంగనాథుని దర్శించి, అనుభవించి, ఆనందించే కార్యంలో మునిగితేలియాడుతున్న తిరుప్పాణాళ్వార్ల కన్నులకు భగవంతుడు ఇంతకు ముందు తాను కోరి ఎత్తిన మత్స్య కూర్మవరాహాది అవతారాలను మరలా దర్శింపజేసినా తల్లిపాలు రుచిమరిగిన బిడ్డడు మరొకదానిని రుచి గొననట్లు ఆ అవతారాల నన్నిటినీ చూడనన్నాడు తిరుప్పాణాళ్వార్లు.

ఇంకా —

† శ్లో॥ స్నేహో మే పరమో రాజన్ త్వయి నిత్యం ప్రతిష్ఠితః ।
భక్తిశ్చ నియతా వీర భావో నాన్యత్ర గచ్ఛతి ॥

[ఓ రామచంద్రా! నీ యెడల స్నేహం కలిగి ఉన్నాను. ఆ స్నేహం ఎల్లప్పుడూ నీయందే ఉంచబడిఉంది. దీనికి తిరుగులేదు. ఓ వీరుడా! నీయందలి భక్తికూడా తిరుగులేనిది. నా మనస్సులోని భావం ఇంకొక చోటికి వెళ్లదు.]

అని రామాయణంలో చెప్పినట్లు ఎన్ని అవతారాలు చూపినా ఆ అవతారాలలో ఒక అవతారమూ తిరుప్పాణాళ్వార్లకు రుచించదని చెప్పినట్లు కూడా అర్థం కావచ్చు.

వీటినన్నిటినీ చూస్తే —

తిరుప్పాణాళ్వార్లకు ఇతరులను నేను తలచను - దర్శించను - కీర్తించను అనే నియమమూ నిశ్చయమూ ఉన్నట్లు తెలుస్తూఉంది.

---

† రామాయణం. ఉత్తరకాండ. 40—15.

‡ ఆదిమఱై యెన వోఙ్గు మరఙ్గత్తుళ్ళే యరుళారు
ఙ్గడలైక్కణ్డవన్ నమ్ పాణన్,
ఓతియతోరిరు నాఙ్గు మిరణ్డు మాన
వొరుపత్తుమ్ పత్తాక వుణర్న్దురైత్తోమ్,
నీతియఱియాతనిలై యఱివార్క్కెల్లామ్
నిలై యిదువే యెన్ఱు నిలైనాడి నిన్ఱోమ్,
వేతియర్ తామ్ విరిత్తురైక్కుమ్ విళైవుక్కెల్లామ్
విత్తై యాకుమిదువెన్ఱు విళమ్బినోమే ॥

[ప్రాచీనమైనది. వేద స్వరూపమైనది శ్రీరంగం. ఆ శ్రీరంగంలో కృపాసముద్రుడైన భగవంతుని దర్శించినవాడూ - పదేపది పాశురాలు రచించినవాడూ - నీతి జాతులులేక ఇచ్చవచ్చినట్లు తిరిగేవారికెల్లా శ్రీరంగనాథుడే దిక్కని తెల్పినవాడూ - బ్రాహ్మణోత్తములు తెల్పే వేదరహస్యాలకు మూల మితడే అని తెల్పిన వాడూ మన తిరుప్పాణాళ్వార్లు అని నేను మీకు తెలుపుతున్నాను.]

కాణ్బనవు ముఱైప్పనవు మట్రొన్ఱిన్ఱి
కణ్ణనైయే కణ్డురైత్త కడియ కాతల్,
పాణ్ పెరుమాళరుళ్ శెయ్త పాడల్ పత్తుమ్
పళమఱైయిన్ పొరుళెన్ఱు పరవుకిన్ఱోమ్,
వేణ్ పెరియ విరితిరై నీర్వైయత్తుళ్ళే
వేదాంతవాశియనెన్ఱి యన్బ నిన్ఱోమ్,
నాణ్ పెరియోమల్లోమ్ నామ్ నన్ఱుమ్ తీతుమ్
నమక్కురైప్పారుళరెన్ఱు నాడువోమే ॥

[ఈ తిరుప్పాణాళ్వార్ల పది పాశురాలు శ్రీ కృష్ణావతారాన్ని మనస్సు నందుంచుకొని రచించినవే ననీ - అపౌరుషేయాలైన చతుర్వేదసారాలనీ

‡ ఇక్కడినుండి వేదాంత దేశికులు రచించిన పాశురాలు, శ్లోకాలు.

నేను చెప్పుతున్నాను. నేను చతుస్సాగరపరివేష్టిత భూవలయంలో వేదాంతా చార్య బిరుదాంకితుడను. ఈ మాట అహంకారంతో చెప్పడంలేదు. మనకు మంచీ చెడ్డా తెల్పి మనలను చక్కతిద్దేవాళ్లు ఇక్కడ ఉన్నారని చెప్పగలను. వారెవరంటే? తిరుప్పాణ్ పెరుమాళ్. వారి శ్రీపాదాలను నేను ఆశ్రయిస్తాను.]

శ్లో॥ ఇతి కవితార్కికసింహస్సమ్యగ్వ్యాచష్టసాత్వికప్రీత్యై ।
మునిమహిత సుకవిగాథా దశక మిదం దేశికో పజ్ఞమ్ ॥

[సుకవియైన (తిరుప్పాణాళ్వార్లు) మునివాహనుడు రచించిన పది పాశురాలకు అధ్యాత్మపరులు ఆనందించే విధంగా కవితార్కికసింహ బిరుదు కల వేదాంతదేశికులు అనే నేను చక్కగా వ్యాఖ్య రచించినాను.]

శ్లో॥ మునివాహనభోగోఽయం ముక్త్యైశ్వర్య రసోపమః ।
కృపయా రంగనాథస్య కృతార్థయతు న స్సదా ॥

[ముక్తినీ ఐశ్వర్యాన్నీ కలిగించే మునివాహనభోగమనే తియ్యనైన ఈ వ్యాఖ్య శ్రీరంగనాథుని కృపాకటాక్షవీక్షణాలు వెదజల్లి మనలను ఎల్లప్పుడు కృతార్థులను చేయుగాక.]

గద్య ॥

ఇతి కవితార్కిక సింహస్య సర్వతన్త్రస్వతన్త్రస్య శ్రీమద్వేంకటనాథస్య
వేదాంతాచార్యస్య కృతిషు మునివాహనభోగ స్సమాప్తః

[కవితార్కిక సింహుడు, సర్వతంత్రస్వతంత్రుడు
శ్రీమద్వేంకటనాథుడు అయిన వేదాంతదేశికుల
రచనల్లో మునివాహనభోగం పూర్తిఅయింది.]

శ్రీమతే నిగమాంతదేశికాయనమః

ఈ గ్రంథరచనలో సంప్రదించిన గ్రంథాలు –

ఆంగ్లము

North Arcot Manual
South Indian Inscriptions
The Sri Rangam Temple
Vedantadesika His Life – Sketch
Dravidian Comparative Vocabulary Vol. I.
Vedantadesika 7th Centenary Vol. 1968.
Life of Sri Ramanuja.

సంస్కృతం

దివ్యసూరిచరితమ్
ప్రపన్నామృతమ్
ద్రావిడవేదాంతప్రమాణతిరట్టు
వేదాంతదేశికమంగళాశాసనమ్
నడాదూర్ అమ్మాళ్ ముక్తకమ్
అధికరణసారావళి
తత్త్వముక్తావళి
సంకల్పసూర్యోదయమ్
రహస్యత్రయసారమ్
వైరాగ్యపంచకమ్
శతదూషిణి
సహస్రరక్ష
సప్తతిరత్నమాలిక
ఆచార్యవైభవప్రకాశిక

తమిళం

వడగల గురుపరంపర
తెంగల గురుపరంపర
పెరియ తిరుముడి అడైవు
పన్నిరు తింగళనుభవమ్
ఆళ్వార్కల్ కాలఆరాక్షి
అళ్వార్కల్ వరలారు
ఉపదేశరత్నమాల
కలిత్తొగై
పత్తుపాట్టు
పానాట్రుపడై
కోవిల్ ఒళుగు
నాలాయిరదివ్యప్రబంధము దివ్యార్థదీపికతో
శివపార్వతమ్మరచనలు
మాణిక్యవాచకర్
తిరుక్కోవై యార్
శ్రీ దేశిక ప్రబంధం - ఉరై
సౌమ్యనారాయణస్వామి శతాబ్దిమలర్
సంప్రదాయచంద్రికై

తెలుగు

పరమయోగివిలాసము (ద్విపద)
పరమయోగివిలాసము (పద్య)
ద్వాదశసూరిచరిత్ర
వల్లీవాచకము 1951.

S.V. UNIVERSITY ORIENTAL SERIES — No. 9

General Editor : DR. S. SANKARANARAYANAN

AMALANĀDIPIRĀN HYMN

BY

SRI

TIRUPPĀNĀLVĀR

(HARIJAN VAIṢṆAVA SAINT)

With Commentary

MUNIVĀHANA BHOGAM

BY

SRI VEDANTADESIKA

A TELUGU TRANSLATION

With

INTRODUCTION

BY

Prof. M. SANTAPPA

Vice-Chancellor, S.V. University

ĀRAMBHAVĀKYĀLU

BY

Prof. KOTTA SATCHIDANANDA MURTY

TRANSLATOR

A. V. SRINIVASACHARYULU

SRI VENKATESWARA UNIVERSITY

ORIENTAL RESEARCH INSTITUTE, TIRUPATI